
# మహాభారతం

## ద్రౌపది 17




రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716


**(గత సంచిక తరువాయి)**

**'ద్రౌపది'** మహాభారతంలోని ముఖ్యమైన స్త్రీ పాత్రలన్నింటిలోను మహోన్నతమైన వ్యక్తిత్వంతో, మేరునగ ధీరత్వంతో విరాజిల్లే అపూర్వ, అసాధారణ, ఆదర్శస్త్రీమూర్తి ద్రౌపది. ఆమె ద్రుపదుని యజ్ఞంలో వేదీమధ్యం నుండి 'అయోనిజ'గా జన్మించింది. సర్వావయనిరుపమాన సౌందర్యంతో, శరీరంనుండి క్రోశపర్యంతం నలుదెసల వ్యాపించే సుగంధ సువాసనలతో, సాక్షాత్ స్వర్గలక్ష్మియే అనదగిన సాధ్వీశిరోమణి ద్రౌపది. అంతకుముందు జన్మలో ఋషికన్యగా పరమేశ్వరునికై ఘోర తపమాచరించి, ఆ పరమేశ్వరుని ప్రత్యక్షం గావించుకొన్న తపశ్శక్తి సంపన్నురాలు. పరమేశ్వరునిచే పంచపాండవులకు పత్నిగా నిర్దేశించబడినపుడు, ప్రత్యేకపతిసాంగత్యంతో కన్యాత్వాన్ని వరంగా పొందిన ధీశాలి. పంచపాండవులకు పత్ని అయినప్పటికీ ధర్మం, బలం, పరాక్రమం, అందం, పాండిత్యం అనే ప్రత్యేక విశేషాలు వరుసగాగల వీరాధివీరులైన పాండవులను భర్తలుగా ఎంతో అణకువతో, అనురాగంతో సేవించి వారియొక్క అనురాగాన్ని, ప్రేమను చూరగొన్న మహా పతివ్రత. రాజసూయయాగ సమయంలో సామ్రాజ్యపట్టమహిషిగా నానాదేశాధీశులైన రాజులచేతను; పురోహిత మంత్రి సామంత జానపదులచేతను; బ్రాహ్మణుల చేతను; పౌరులచేతను; సమస్త మానవులచేతను గౌరవించబడి, వారి అభిమానాన్ని, వాత్సల్యాన్ని చూరగొన్న కార్యదక్షతగల మహా ప్రాజ్ఞురాలు. ఎటువంటి క్లిష్ట పరిస్థితులలోనైనా, ధర్మాన్ని తప్పని ధర్మజ్ఞురాలు. నిండుసభలో వస్త్రాపహరణం జరిగి, అక్షయ వస్త్రప్రదానంతో సభ ఆశ్చర్యంతో తలమునకలైనప్పుడు; అపశకునా లకు భయపడిన ధృతరాష్ట్రుడు వరాలు కోరుకోమని ద్రౌపదిని ప్రోత్సహించినా భర్తలను దాస్యవిముక్తులను గావించే రెండు వరాలను మాత్రమే కోరింది. మరొక వరాన్ని కోరమని ధృతరాష్ట్రుడు బలవంతం చేసినా, క్షత్రియకాంత రెండు వరాల కన్నా అధికంగా కోరరాదనే ధర్మాన్ని తెలియజెప్పి; రాజ్యం కోసం మూడవ వరాన్ని కోరటానికి అంగీకరించలేదు. అట్టి విపత్కర పరిస్థితిలో కూడా ధర్మాన్నితప్పని ద్రౌపది ధర్మశీలతను ధృతరాష్ట్రునితో సహా సభికులంతా ప్రశంసించారు. ఎంతటి అపకారాన్ని చేసినా, అన్యాయంగా ప్రవర్తించినా గురువులపట్ల సహనాన్నే ప్రదర్శించిన సహనశీలి ద్రౌపది. మహాభారత యుద్ధానంతరం 18వ రోజు రాత్రి అశ్వత్థామ తన ఐదుగురు పుత్రులు ద్రౌపదేయులను పసివారని కూడా చూడకుండా, నిద్రించేవారి కుత్తుకలు కోసి దారుణంగా హత్య గావించినప్పుడు హృదయవిదారకంగా రోదించినప్పటికీ, ఆ అశ్వత్థామను బంధించి తెచ్చి, ద్రౌపది ఎదుట భీమసేనుడు నిలబెట్టి సంహరించబోగా ద్రౌపది భీమసేనుని వారించింది. "అశ్వత్థామ గురుపుత్రుడు, గురుపుత్రుడు నాకు కూడా గురువుతో సమానమే. అట్టివాడు ఎన్ని అకృత్యాలు చేసినా చంపరాదు. నేను పుత్రులను పోగొట్టుకుని తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాను. ఈ అశ్వత్థామ తల్లి కృపి ఇప్పటికే భర్తను కోల్పోయిన దుఃఖములో ఉన్నది. అట్టి తల్లి భర్తనే గాక పుత్రుని కూడా కోల్పోతే ఆ దుఃఖం ఎలా ఉంటుందో ఊహించగలను. కనుక అతడిని వధించవద్దు" అని భీమసేనుని నివారించిన ఉదారమూర్తి ద్రౌపది. ఇక అన్యాయాన్ని, అధర్మాన్ని ఎదుర్కో వలసి వచ్చినపుడు ఎంతటివారినైనాసరే నిలదీసి ప్రశ్నించగల ధైర్యశాలి. తనను సభలోనికీడ్చి తెచ్చినప్పుడు "నేను ధర్మవిజితనా, అధర్మవిజితనా? అని కురుసభను నిలదీసింది. అలాగే కీచకుడు పరాభవించినప్పుడు విరాటసభలో విరాటుని, సభాసదులను నిలదీసింది. సత్యభామకు పాతివ్రత్యధర్మాలను తెలియజేసి, తద్వారా మహిళాలోకానికి మకుటాయమాన మనదగిన సౌశీల్యంతో విరాజిల్లిన ఆదర్శనారీశిరోమణి ద్రౌపది.

**2. ద్రౌపదిపై విమర్శలు:** ఇట్టి అసాధారణ ప్రతిభా విశేషాలతో అలరారే ద్రౌపదిని కొందరు కవులు, పండితులు, అధ్యాపకవృత్తిలో జీవించేవారు, పరిశోధకులు, హేతువాదులు ఎందరో తమ వక్రబుద్ధితో, సంకుచిత మనస్తత్వంతో విమర్శిస్తూ,

ధూషిస్తూ, అసత్యారోపణలు చేస్తూ కొన్ని గ్రంథాలు వ్రాశారు. అలాంటి వారిలో ప్రప్రథమంగా పేర్కొనదగిన వ్యక్తి "మహాభారతచరిత్రము" అనే గ్రంథాన్ని వ్రాసిన పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు. వీరు పండితులు, ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకులు కూడా. ఇంకా మరికొందరు వీరిని అనుసరిస్తూ, అనుకరిస్తూ వారివారి బుద్ధికి తోచినట్లు కొన్ని గ్రంథాలను వ్రాయటం జరిగింది. మరికొందరు వీరు వ్రాసినదాన్ని తప్పుపడుతూ, వ్యతిరేకిస్తూ గ్రంథం వ్రాశారే గాని, అందులో కొన్నింటిని సమర్థించటమో, ఈ తప్పును సరిచేయుటకు మరొక తప్పును వ్రాయుటమో చేశారు. ఇలాంటి వారిలో 'మహాభారత రహస్యము' అనే గ్రంథాన్ని వ్రాసిన శిష్టా సూర్యనారాయణ శాస్త్రిగారొకరు. ఇలా ఎందరో తమ చిత్తం వచ్చినట్లు మహాభారతం లోని పాత్రలను ముఖ్యంగా ద్రౌపదీదేవిని విమర్శిస్తూ గ్రంథాలు వ్రాశారు. కవిత్వాన్ని అల్లారు.

అయితే పదిమందికీ ఆదర్శప్రాయులుగా ఉండవలసిన కవులు, పండితులు, ఉపాధ్యాయులు ఎందుకు ఇలాంటి గ్రంథాలను వ్రాస్తారు? వ్రాస్తున్నారు? అనే సందేహం కలగక మానదు. ఈ సందేహం తీరాలంటే పెండ్యాలవారే తమ 'మహాభారత చరిత్రము' అన్న విమర్శక గ్రంథంలో తానెందుకు ఇలాంటి గ్రంథాన్ని వ్రాయటం జరిగిందో తానే స్వయంగా ఇలా తెలియజేశాడు.

"రామాయణ మహాభారతములు పాశ్చాత్య విద్యా పద్ధతి ననుసరించి బహిరంగ పరీక్షకు లోనగుచున్నవి. అంతరంగ పరీక్ష కంటే బహిరంగ పరీక్ష జనసామాన్య దృష్టి నాకర్షించి విశేష వివాదములకు కారణమగును. కాని ఈ వివాదము వలన గ్రంథావలోకనము విశేషముగ గలుగుటయను ఫలము కలుగును. గాన నా శక్తి కొలది మహాభారతమును బహిరంగ పరీక్షచే సంగ్రహముగా విమర్శించుచున్నాడను. (1993లో ముద్రితమైన మ.భా.చ.లో.4వ పేజీ)

ఆహా ఎంత చక్కని విజ్ఞానంతో కూడిన సమాధానం? ఎందుకురా ఐదేండ్ల పసిపాపపై అత్యాచార ప్రయత్నం చేశావు? అని అడిగితే 'అలా అయితేగాని నాపేరు, ఫోటో పేపరులో పడదు. అలా అయితేగాని టి.వి. తెరపై కనిపించదు' అన్నాడట ఒక ప్రబుద్ధుడు. అలా ఉంది పెండ్యాలవారి మాట.

పాశ్చాత్యపద్ధతిలో తన శక్తి కొలది మహాభారతాన్ని బహిరంగ పరీక్షచే విమర్శిస్తాడట. అంటే భారతీయుల ఆధ్యాత్మిక జ్ఞానసంపదను, తపస్సులను, శాపానుగ్రహ సామర్థ్యాలను, దేవతాసాక్షాత్కారాలను, పాతివ్రత్య మహిమలను, వరప్రభావాలను, దివ్యదృష్టులను, త్రికాల జ్ఞానములను అణిమాది అష్టసిద్ధులను, అసాధారణ దివ్యశక్తులను తెలుసు కోలేని పాశ్చాత్యులలాగా తన వక్రబుద్ధితో పవిత్రమైన ఆర్షగ్రంథాలను, మహర్షులను, మహాత్ములను, పతివ్రతామతల్లులను నోటికొచ్చినట్లు చెడ తిడతాడన్నమాట. దాని ద్వారా జన సామాన్యదృష్టిని ఆకర్షిస్తాడన్న మాట. సామాన్యంగా గ్రంథాలను స్వయంగా చదవలేని, చదవని పామర జనులే లోకంలో అధికంగా ఉంటారు. అలాంటి వారికి అవునన్నది కాదని, కాదన్నది ఔనని చెబుతుంటే-పెద్దలను దూషిస్తుంటే- మహాత్ములను విమర్శిస్తుంటే సరదాగా ఉంటుంది. విని ఆనందిస్తుంటారు గనుక అలా అధిక జనుల దృష్టిని ఆకర్షిస్తాడన్నమాట. ఇక స్వయంగా గ్రంథాలను చదివి, అందలి విషయాలను చక్కగా గ్రహించినవారుంటే వారితో విశేషవివాదాలు వస్తాయి. అంటే గ్రంథం గురించి చక్కగ తెలిసినవారితో వివాదాలు కావాలన్నమాట. ఇదొక పైశాచిక ఆనందం. ఈ వివాదాలవల్ల ప్రయోజనం ఏమిటో చెబుతున్నాడు. ఈ వివాదాల వల్ల గ్రంథావలోకనం విశేషంగా కలగటం ఫలమట, నిజమే! కొందరు విజ్ఞులైనవారు ఇదేమిటి? ఇలా గ్రంథవిరుద్ధంగా అన్యాయంగా వ్రాశారు? ఇది నిజమా? గ్రంథంలో ఇలాగే ఉన్నదా? అసలు గ్రంథంలో ఉన్నదా లేక కల్పించి చెబుతున్నారా? అనే సందేహాలతో, జిజ్ఞాసతో, నిజం తెలుసుకోవాలనే కుతూహలంతో గ్రంథాన్ని చూచేమాట నిజమే. అంతవరకు మంచిదే. అయితే అలా గాకుండా ఈ పవిత్ర గ్రంథాలను తిట్టి, ధూషించి, విమర్శించి హీరో అయిన వాణ్ణి అనుసరించి అలాగే తయారయ్యేవాళ్ళ సంగతేమిటి? అలా ఎందరో తయారయ్యారు కూడా.

అదిగో సరిగ్గా అలా పెండ్యాలవారిని ఆదర్శంగా తీసుకొని అనేకమంది కవులు, పండితులు, అధ్యాపకులు, విద్యాధికులు ఎందరో తమ కల్పనా చాతుర్యంతో అనేక కథలు, కవితలు, నవలలు రాస్తూ ద్రౌపదిని ఒక కాముకస్త్రీగా, కామపిశాచిగా, అబద్ధాల కోరుగా, దొంగ ఏడ్పులు ఏడ్చేనటిగా, ఎవరినైనా ఎంతటి వారినైనా ఎదిరించే స్వభావం గల ఆడరౌడీగా, వావివరుసలు మరచిపోయి ప్రవర్తించే పతితగా, నిండుసభలో సభ్యసమాజం తలదించుకొనే విధంగా కట్టిన బట్టను విప్పబోతుంటే 'విప్పుకో! నాకేం?' అనే కొత్తరకం సత్యాగ్రాహిగా ఇంకా ఎంతో హీనాతిహీనంగా, సభ్యసమాజం తలదించుకొనే విధంగా చిత్రిస్తూ ఇష్టం వచ్చిన కల్పనలతో అవాకులు చవాకులు ప్రేలుతున్నారు. దానికారణంగా జనసామాన్యదృష్టిని ఆకర్షిస్తున్నారు. అంతేగాదు మహాభారత గ్రంథాన్ని, అందులో ద్రౌపది వ్యక్తిత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకున్న వారితో వివాదాల్లు వచ్చిన్నవి. ఈనాడు ఎందరో దుశ్శాసనుని ప్రక్కకు త్రోసి నిర్వహించటాన్ని మాత్రం పండితులు, పామరులు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు. ఎందరో అసహ్యించుకుంటున్నారు.

అయితే ఏం మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కిన చందంగా ద్రౌపది ఉన్నత వ్యక్తిత్వాన్ని, ఆమె పాతివ్రత్యాన్ని, ఆమె సౌశీల్యాన్ని, అసాధారణ ధైర్యసాహసాలను, ఇంకా భార్యగా, తల్లిగా, కోడలిగా ఆమె వ్యక్తిత్వాన్ని లోకానికి తెలియజేస్తున్నానని వ్రాయటం ఇంకా ఆశ్చర్యకరం. చివరకు ద్రౌపదికి శ్రీకృష్ణునికి రంకుతనం అంటగట్టేంత నీచానికి ఎందుకు దిగజారటం? అనే శంక ఎవరికైనా కలుగుతుంది. దీనికి ఒకటే సమాధానం. నలుగురూ నడిచే త్రోవలో నడిస్తే ఎవడు పట్టించుకుంటాడు? మన దగ్గర అంగబలం, అర్థబలం, ఇంకా అనేక బలాలుండీ మామూలు వ్యక్తిగా ఉండిపోతే ఏం ప్రయోజనం? అందుకే ఈ సాహసం చేస్తున్నారు.

ఎందరు అల్పబుద్ధులైనవారు, వక్రబుద్ధిగలవారు, దుష్టబుద్ధిగలవారు ఎన్ని విధాలుగా భారతీయ సంస్కృతిని, ధర్మాన్ని నాశనం చేయాలని చూచినా; మన ఇతిహాసాలైన రామాయణ, భారతాలుగాని, వాటిని మనకు ప్రసాదించిన వాల్మీకి, వ్యాసమహర్షులు గాని చిరంజీవులై భారతీయుల హృదయాలలో నిలిచిపోవటం తథ్యం.

ఇక మహాభారతంలోని ద్రౌపది ఎట్టిదో, ఆమెను విమర్శకులు ఏమని దూషించారో, ఆమెలో ఏఏ దోషాలను ఆపాదించారో, ద్రౌపది వ్యక్తిత్వాన్ని ఎలా అపార్థం చేసుకున్నారో, వీటన్నింటికి మహాభారతం ఏమని సమాధానం చెబుతున్నదో, సత్యమేమిటో, కల్పనలేమిటో తెలుసుకుందాం.

ముందుగా ద్రౌపదీ జన్మవృత్తాంతాన్ని మూలభారతం ఏమి చెబుతున్నదో చూద్దాం-

**ద్రౌపదీ జననం**

బకాసుర వధానంతరం ఏకచక్రపురంలో పాండవులున్న గృహానికి ఒక బ్రాహ్మణుడు విచ్చేసి, కుంతీపాండవుల కోరిక మేరకు అనేక కథలు వినిపిస్తున్నాడు. ఒకరోజు మాటల మధ్యన ద్రుపదరాజకుమారి ద్రౌపది స్వయంవరం జరగబోతున్నదని చెప్పగా కుంతీదేవి ఆయననిలా ప్రశ్నించింది. "మహాత్మా! ద్రుపద పుత్రుడు దృష్టద్యుమ్నుడు యజ్ఞకుండం నుండీ, అలాగే ద్రౌపది వేదీ మధ్యం నుండి జన్మించారని చెప్పుకుంటున్నారు. వారి అద్భుత జన్మవిధానం గురించి వివరంగా తెలియజేయవలసింది" అని ప్రార్థించింది. (ఆది .164 అ.10శ్లోకాలు)

అలా ప్రార్థించగా ఆ గాథనిలా తెలియజేస్తున్నాడు బ్రాహ్మణుడు. ద్రోణాచార్యుడు, ద్రుపదుడు చిన్ననాటి స్నేహితులని; దుర్భరదారిద్ర్యంతో ఉన్న ద్రోణుడు మహారాజైన ద్రుపదుని వద్దకెళ్ళి 'నేను నీ మిత్రుణ్ణి' అని గుర్తుచేయగానే ద్రుపదుడు అహంకారంతో ద్రోణుని తీవ్రంగా అవమానించాడని; దానికి ప్రతీకారంగా ద్రోణుడు తన శిష్యులైన భీమార్జునుల ద్వారా యుద్ధంలో ద్రుపదుని బంధింప జేసి తన మిత్రత్వాన్ని గుర్తు చేశాడని; ఈ అవమానాన్ని సహించలేని ద్రుపదుడు ద్రోణునిపై ప్రతీకారం తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడని పూర్వగాథను తెలియజేశాడు బ్రాహ్మణుడు. (ఆది 165అ. 1-28శ్లో. సారం)

అలా నిశ్చయించుకున్న ద్రుపదుడు; ద్రోణాచార్యుని సంహరించగల మహావీరుడైన పుత్రునికొరకై తపిస్తూ బ్రహ్మనిష్ఠులు, మంత్రద్రష్టలు, కఠోరవ్రతపాలనలో నిమగ్నమైన యాజుడు, ఉపయాజుడు అనే ఇరువురు బ్రాహ్మణులను ఆశ్రయించాడు. ఎంతోకాలం వారిచరణసేవలో నిమగ్నమై, వారి అనుగ్రహాన్ని సంపాదించాడు. వారు ద్రుపదుని యొక్క అభీష్టపుత్రరూప ఫలసిద్ధికై అవసరమైన యజ్ఞకర్మను ఉపదేశించారు. ద్రుపదుడు యజ్ఞానికి సర్వం సిద్ధం చేశాడు. యజ్ఞం నిరాటంకంగా కొనసాగింది. యజ్ఞం పరిసమాప్తమయ్యే సమయంలో యాజుడు ద్రుపదుని భార్యను పిలిచి "మహారాణీ! నీవు శీఘ్రమే ఈ హవిస్సును స్వీకరించుటకు నా వద్దకు రా! నీకు దీనివల్ల ఒక కుమారుడు, కుమార్తె జన్మించగలరు" అన్నాడు. దానికి మహారాణి, "మహాత్మా! నేనిప్పుడు తాంబూల సేవనం చేసి ఉన్నాను. నా శరీరాన్ని దివ్యసుగంధ అంగరాగాలతో అలంకరించాను. సంతానాన్ని ప్రసాదించే హవిస్సును స్పర్శించాలంటే నేను స్నానం చేసి పవిత్రురాలిని కావాలి. కనుక యాజమహాశయా! నా ఈ ప్రియకార్యం కొరకు కొంచెంసేపు వేచి ఉండండి" అన్నది. అప్పుడు యాజుడు, "యాజునిచేత సిద్ధం చేయబడి, ఉపయాజుని చేత అభిమంత్రించబడియున్న ఈ హవిస్సు నీవు వచ్చినా లేక అక్కడే నిలిచిపోయినా, యజమాని కోరికను సిద్ధింప జేయకుండా ఎలా ఉంటుంది?" అని పలికి యాజుడు సంస్కరించబడిన ఆ హవిస్సును హోమాగ్నిలో ఆహుతి చేయగా ఆ అగ్నినుండి కిరీటకవచాదులతోను, ఖడ్గబాణ ధనుస్సులతోను, గొప్ప రథాన్ని అధిరోహించి అగ్నిలా ప్రకాశిస్తున్న అంగాలతో, భయం గొలిపే రూపంతో దృష్టద్యుమ్నుడు ఉద్భవించాడు. (ఆది. 166అ.1-41శ్లో) ఆ తరువాత-

**శ్లో॥ కుమారీ చాపి పాంచాలీ వేదీ మధ్యాత్ సముత్థితా।**
**సుభగా దర్శనీయాంగీ స్వసితాయచలోచనా॥ (44)**

**శ్లో॥ శ్యామా పద్మపలాశక్షీ నీలకుంచిత మూర్ధజా ।**
**తామ్రతుంగనఖీసుభ్రూః చారుపీనపయోధరా॥ (45)**

**శ్లో॥ మానుషం విగ్రహం కృత్వా సాక్షాత్ అమరవర్ణినీ।**
**నీలోత్పల సమోగంధో యస్యాః క్రోశాత్ ప్రధావతి॥ (46)**

**తా॥** అంతట వేదీమధ్యం నుండి ఒక కన్య ఉద్భవించింది. ఆమెయే పాంచాలీ. ఆమె చాలా అందంగానూ, సౌభాగ్యశీలిగానూ, విశాలమైన కమలదళాలవంటి నేత్రాలను కలిగి ఉన్నది. శ్యామవర్ణ

సూక్తిమాలిక "నేను శరీరాన్ని నాలో ఆత్మ ఉంది" అనేది పాశ్చాత్యుల సిద్ధాంతం, "నేను ఆత్మను నాకు శరీరం ఉంది" అనేది భారతీయుల వేదాంతం

శరీరంతోను, దీర్ఘమైన నల్లని కేశాలతోను, ఎరుపురంగు గోళ్ళు కలిగి, దొండపండు వంటి మనోహరమైన పెదవులతో సర్వ అవయవాలు నిరుపమాన సౌందర్యంతో ఉన్నది. సాక్షాత్తూ స్వర్గలక్ష్మియే మానవదేహం ధరించి భూమిపై అవతరించినట్లుగ ఉన్నదామె. ఆమె శరీరం నుండి పుష్పసుగంధసువాసనలు నలుదిక్కులా క్రోశపర్యంతం వ్యాపిస్తున్నాయి.

ఆ సమయంలో భూమిపై ఆమెతో సమానమైన సౌందర్యం గల స్త్రీ మరొకరెవరూ లేరని; దేవతలు, దానవులు, యక్షులలో సుందరాకారులైనవారు ఆమెను భార్యగా పొందాలని తహతహ లాడుతున్నారట.

అప్పుడు ఆకాశవాణి ఇలా అన్నది, "ఈ కన్యపేరు కృష్ణ. ఈమె సమస్తయువతులలోను సర్వశ్రేష్ఠమైనది; అందమైనది మరియు క్షత్రియ సంహారం కొరకు జన్మించింది" అని. ఇది ఆ బ్రాహ్మణుడు కుంతీపాండవులకు తెలియజేసిన ద్రౌపదీ జన్మ వృత్తాంతం.

ఈ ద్రౌపదీ జన్మగాథను బట్టి ఆమె అందరిలాగా తల్లి గర్భం నుండి జన్మించలేదని, యజ్ఞవేదీమధ్యం నుండి అయోజనిగా, ఆరూఢయవ్వనవతిగా జన్మించినదని, సాటిలేని సౌందర్యంతో, శ్యామవర్ణంతో, శరీరంనుండి సుగంధ సువాసనలతో జన్మించినదని తెలుస్తున్నది.

ఇక ఆమె పూర్వజన్మగాథ మూలభారతంలో ఎలా తెలియజేయబడిందో చూద్దాం.

**4. ద్రౌపదీపూర్వజన్మ వృత్తాంతం**

ఏకచక్రపురంలో బ్రాహ్మణుని ద్వారా ద్రౌపదీ జన్మ వృత్తాంతాన్ని విన్న కుంతీపాండవులు ద్రౌపదీ స్వయంవరాన్ని తిలకించేందుకు పాంచాల నగరానికి వెళ్ళాలని నిశ్చయించు కున్నారు. అదే సమయంలో వేదవ్యాసమహర్షి కుంతీ పాండవులున్న గృహానికి విచ్చేశాడు. కుశలప్రశ్నల అనంతరం వ్యాసుడు పాండవులకు ద్రౌపదీ పూర్వజన్మగాథను ఇలా తెలియజేస్తున్నాడు. (ఆది ప.168 అ.1-5శ్లో)

చాలాకాలం నాటిమాట. ఒక తపోవనంలో గొప్ప తపస్వియైన మహాత్ముడుండేవాడు. ఆయనకు ఒక కుమార్తె. ఆమె గొప్ప అందగత్తె. సమస్త సద్గుణాలరాశి. అయినప్పటికీ తన పూర్వకర్మల ఫలితంగా, దురదృష్టవశాత్తు ఎంతకాలమైనా ఆమెకు వివాహం కాలేదు. ఆమె పతిని కోరి శంకరునికై ఉగ్ర తపస్సు చేసింది. ఆమె తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై, "శుభాంగీ! నీకేంవరం కావాలో కోరుకో. నీ కోరికను తీర్చేందుకే వచ్చాను" అన్నాడు. దానికా ఋషికన్య, "ప్రభూ! సర్వగుణసంపన్నుడైన పతిని ప్రసాదించమ"ని పదే పదే అర్థించింది. భక్తసులభుడైన శంకరుడు 'నీకు భరత వంశీయులైదుగురు పతులగుదురు గాక!" అని వరమిచ్చాడు (6-11శ్లో).

అందుకు ఆ ఋషికన్య, "దేవా! నేను మీ అనుగ్రహంతో ఒక్క పతిని కోరియే తపస్సు చేశాను" అనగా, "కళ్యాణీ! నీవు నాతో పతినిమ్మని ఐదుసార్లు పలికావు. కనుకనే నీకు ఐదుగురు పతులగుదురని వరమిచ్చాను. అయితే అది ఈ జన్మలో కాదు. ఈ శరీరాన్ని వదలి నీవు మరొక దేహాన్ని ధరించినప్పుడే నా ఈ వరంప్రకారం జరుగుతుంది" అని చెప్పి పరమేశ్వరుడంతర్ధాన మయ్యాడు. ఆ దేవతా స్వరూపిణి ఐన కన్యయే ఇపుడు ద్రుపదుని ఇంటి అయోజనిగా జన్మించింది. ఆ ద్రుపదపుత్రిక కృష్ణయే మీకు భార్యగా విధిచే నిర్ణయించబడింది. కనుక ఓ మహావీరులారా! మీరిప్పుడు పాంచాల నగరానికి వెళ్ళి ద్రౌపదిని పొందండి. మీకు సుఖం కలుగుతుంది అని చెప్పి వ్యాసుడు అంతర్హితుడయ్యాడు. (ఆది ప.168 అ. 12-15శ్లో)

ఈ ద్రౌపదీ పూర్వజన్మగాథతో పాండవుల పూర్వజన్మగాథ కూడా ముడివేయబడియున్నది. దానినే **పంచేంద్రోపాఖ్యానం** అంటారు. అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేధించిన తరువాత వివాహ ప్రసక్తి వచ్చినప్పుడు; ధర్మరాజు ద్రుపదునితో ఇలా అన్నాడు "ఎన్నడూ అసత్యమాడని మా తల్లి వాక్కు అసత్యం కాకుండా ఉండేందుకు మేము ఐదుగురము ద్రౌపదిని వివాహమాడాలని నిశ్చయించుకున్నాము" అని. అది విని ద్రుపదుడు, "మహాత్మా! ఒక్క పురుషుడు అనేకమంది స్త్రీలను వివాహమాడవచ్చును గాని, ఒక్క స్త్రీ అనేకమంది పురుషులను పెండ్లియాడుట ఎలా ధర్మసమ్మతమవుతుంది? ఇది నాకు సమ్మతంగా లేదు" అన్నాడు. దానికి ధర్మరాజు, "మహారాజా! ధర్మం సూక్ష్మమైనది. పూర్వకాలంలో ప్రచేతసులనే పదిమంది సోదరులు ఒక్క స్త్రీనే వివాహమాడటం జరిగింది. నా వాక్కు ఎన్నడూ అనృతం పలకలేదు. నా బుద్ధి అధర్మంలో నిలువదు. నా తల్లి మమ్ము ఇలాగే ఆదేశించింది. నా మనస్సులో కూడా ఇదే సరైనదని అనిపిస్తున్నది" అన్నాడు. అప్పుడు ద్రుపదుడు, "ధర్మనందనా! నీవు, కుంతీదేవి, నా పుత్రుడు దృష్టద్యుమ్నుడు మీరు ముగ్గురూ ఆలోచించి ఏది శ్రేయస్కరమో నిశ్చయించండి" అనగా ఆ మువ్వురూ ఆలోచన చేస్తున్నారు. ఆ సమయంలో వ్యాసమహర్షి అక్కడ ప్రత్యక్షమై అందరి అభిప్రాయాలు తెలుసుకొని ద్రుపదునితో, "రాజా! ఈ వివాహవిషయంలో ఒక రహస్యం ఉన్నది. అదేమిటో నీకు తెలియజేస్తాను" అని చెప్పి, తన ఆసనం నుండి లేచి, ద్రుపదుని చెయ్యిపట్టుకొని రాజభవనం లోపలి గదికి తీసుకెళ్ళి ఈ ద్రౌపదీ పాండవుల పూర్వజన్మగాథ- పంచేంద్రోపాఖ్యానాన్ని ఇలా తెలియజేస్తున్నాడు. (ఆది ప.194-195 అ)

**(వచ్చే సంచికలో..)**



# మహాభారతం

## ద్రౌపది 18

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

### 5. పంచేంద్రోపాఖ్యానం

'ద్రౌపది' పాండవుల పూర్వజన్మగాథను వ్యాసమహర్షి ద్రుపద మహారాజుకు ఇలా తెలియజేస్తున్నాడు. ఇది మహాభారతం ఆది పర్వంలోని 196వ అధ్యాయంలోనిది.

నైమిశారణ్యంలో దేవతలంతా కలిసి ఒక యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. ఆ యజ్ఞానికి కర్త సూర్యపుత్రుడైన యమ ధర్మ రాజు. ఒకనాడు దేవతలంతా స్నానార్థమై గంగానదికి వెళ్ళి ఒడ్డున కూర్చున్నారు. ఆ సమయంలో ఒక స్వర్ణకమలం గంగాజల ప్రవాహంలో వస్తూ ఉన్నది. దేవతలంతా ఆశ్చర్యచకితులయ్యారు. ఈ కమలం ఎక్కడినుండి వస్తున్నదో తెలుసుకోవాలని భావించిన దేవేంద్రుడు గంగా మూలస్థానమైన గంగోత్తరి వైపుకు బయలు దేరాడు. అక్కడ దేవేంద్రుడు అగ్ని సమాన తేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక యువతిని చూచాడు. ఆమె గంగాజలం కొరకు అక్కడికి వచ్చి, గంగలో దిగి ఏడుస్తూ నిలబడి ఉన్నది. ఆమె కంటినుండి జాలువారే ఒక్కొక్క కన్నీటిబొట్టు గంగాజలంలో పడి సువర్ణమయ కమలంగా తయారవుతున్నది. ఈ అద్భుత దృశ్యాన్ని చూచిన ఇంద్రుడు ఆమె వద్దకు వెళ్ళి "కళ్యాణీ! నీవెవరు? ఎందుకిలా ఏడుస్తున్నావు? చెప్పు. నీ నుండి సత్యాన్ని తెలుసుకోవాలనుకుంటు న్నాను" అన్నాడు. దానికాయువతి "దేవేంద్రా! నేనొక అభాగ్యు రాలిని. నేనెవరనో, ఎందుకేడుస్తున్నానో తెలియాలంటే నేను ముందుకు వెళ్తుంటాను. నీవు నా వెనుకరా! అక్కడ నీవే స్వయంగా చూడవచ్చు" అన్నది. ఆ యువతి ముందు నడుస్తున్నది. ఇంద్రుడు ఆమెననుసరిస్తూ వెనుక నడుస్తున్నాడు. అలా వెళ్ళి హిమవత్పర్వత శిఖరంపై వారొక దృశ్యాన్ని చూచారు. ఒక సుందర తరుణ వయస్కుడైన యువకుడు సిద్ధాసనంలో కూర్చొని ప్రక్కనే ఉన్న ఒక యువతితో క్రీడా వినోదం సలుపుతున్నాడు. వారాక్రీడలో తన్మయులై ప్రపంచాన్నే మరిచిపోయి ఉన్నారు. చుట్టూ ఏమి జరుగుతున్నా పట్టించుకొనే స్థితిలో లేరు. అది చూచి ఇంద్రునికి కోపం వచ్చింది. అతడితో "మహానుభావా! ఈ జగత్తంతా నా ఆధీనంలో ఉన్నది. నేనే ఈ జగత్తుకు ప్రభువును. నన్నే నిర్లక్ష్యం చేసి వ్యవహరిస్తున్నావే" అన్నాడు.

ఇంద్రుని కోపాన్ని చూచి ఆ దేవపురుషుడు చిరునవ్వుతో ఇంద్రుని వైపుకు చూచాడు. ఆ దృష్టి పడటంతోనే ఇంద్రుని శరీరం స్థంభించిపోయింది. ఆ మహాపురుషుడు తన క్రీడను ముగించి, "ఈ దేవేంద్రుణ్ణి నేనున్న చోటుకు తీసుకొనిరా!" అని ఆ ఏడుస్తున్న యువతితో అన్నాడు. ఆ యువతి 'అలాగే'నని ఇంద్రుని చేయి పట్టుకున్నది. అంతే. ఆ చేతి స్పర్శ తగలటంతోనే ఇంద్రుని శరీరాంగాలన్నీ శిథిలమై పట్టుదప్పి క్రింద పడిపోయాడు. అంతట ఆ మహాపురుషుడు పరమశివుడు, "దేవేంద్రా! ఇక ఎప్పుడూ ఇలా అహంకరించి మాట్లాడకు. నీలో అనంత బలపరాక్రమాలున్నాయి, అందువల్ల ఇక్కడ పర్వతగుహ ముఖద్వారాన్ని మూసి ఉంచిన బండరాతిని ప్రక్కకు తొలగించి లోనికి వెళ్ళి చూడు. అక్కడ నీలాంటి సూర్యసమాన తేజస్సంపన్నులైన ఇంద్రులున్నారు" అనగా దేవేంద్రుడు ఆ గుహద్వారాన్ని చూచి ఎంతో దుఃఖంతో దేవేంద్రుడు 'నాకు ఇలాంటి దుర్దశ ఎన్నటికీ కలుగరాదు' అని తనలో తాను అనుకున్నాడు. అప్పుడు పర్వతంపై ఉన్న మహాదేవుడు కనుటెర్ర జేసి కోపంతో "ఇంద్రా! నీ మూర్ఖత్వంతో నన్ను అవమాన పరచావు కనుక నీవు ఈ గుహలో ప్రవేశించు" అన్నాడు. దానితో ఇంద్రుని గర్వమంతా అణిగి, అంగాలన్నీ శిథిలమై, తీవ్రదుఃఖంలో మునిగి "జగద్రక్షకా! నీవే సమస్త సృష్టిని ఉత్పత్తిచేసే ఆదిపురుషుడవు" అని అనేక విధాల ప్రశంసించాడు.

అప్పుడు పరమశివుడు వీరంతా నీలాగే పూర్వపు ఇంద్రులు. ఇప్పుడు నీవు కూడా వీరితోపాటు ఈ గుహలో శయనించు. భవిష్యత్తులో మీరంతా మనుష్యయోనులందు జన్మిస్తారు. ఆ జన్మలో మీరు అనేక దుస్సహకార్యాలు చేస్తారు. బలవీర్య పరాక్రమాలను

ప్రదర్శించి దుష్టశిక్షణ చేస్తారు. ఈ శుభకర్మల ద్వారా తిరిగి మీరు మీ ఇంద్రలోకాన్ని చేరుకుంటారు అన్నాడు. ఆ మాటలు విని నలుగురు పూర్వఇంద్రులు శివునితో "భగవాన్! మేము మీ ఆజ్ఞ ప్రకారం దేవలోకం నుండి మానవలోకానికి వెళ్తాం. అక్కడ దుర్లభమైన మోక్షప్రాప్తికి సాధనచేయుట సులభం. ఐతే అక్కడ మేము ధర్మ, వాయు, ఇంద్ర, ఇరువురు అశ్వనీకుమారుల ద్వారా తల్లిగర్భంలో ప్రవేశించాలి. అక్కడ జన్మించి, దివ్యాస్త్రాలతో మానవ వీరులతో యుద్ధం చేసి తిరిగి ఇంద్రలోకానికి వస్తాం" అన్నారు. పూర్వఇంద్రుల మాటలు విని అప్పటి ఇంద్రుడు శివునితో "మహాదేవా! నేను నీ వీర్యంతో నా అంశతో దేవతా కార్యసిద్ధికై ఒక కుమారుణ్ణి ప్రసాదిస్తాను. అతడు ఈ నలుగురితో పాటు ఐదవవాడౌతాడు. అతణ్ణి స్వయంగా నేనే ప్రసాదిస్తాను. విశ్వభుక్, భూతధామ, శిబి, శాంతి అనే ఈ ఐదుగురితోపాటు నాచే ప్రసాదించబడిన తేజస్వి ఐదవవాడు. ఇలా పంచేంద్రుల జననం జరుగుతుంది" అన్నాడు.

అంతట శంకరుడు వారి అభీష్టములు సిద్ధించగలవని వరమిచ్చి, వారి సాధు స్వభావాల కారణంగా భగవానునితో కలసి ఉండగలరని దీవించి; స్వర్గలోక లక్ష్మి, లోకోత్తర సౌందర్యరాశి అయిన ఆ యువతియే మనుష్య లోకంలో వారికి భార్య కాగలదని ఆశీర్వదించాడు (ఆది. 196 అ.9-30శ్లో).

ద్రుపద మహారాజా! ఈ ప్రకారంగా హిమాలయ గుహ అంతర్భాగాన బందీలుగా ఉన్న ఆ నలుగురు పూర్వఇంద్రులే ధర్మజ, భీమ, నకులు, సహదేవులు కాగా, సాక్షాత్తు ఇంద్రుని అంశతో జన్మించినవాడే ఈ సవ్యసాచి అర్జునుడు. ఈ దివ్యరూప సౌందర్యవతి ద్రౌపదియే ముందేవీరికి భార్యగా పరమేశ్వరునిచే నిశ్చయించబడిన స్వర్గలక్ష్మి. దేవతల సహకారము, అభీష్టము లేకపోతే నీ యజ్ఞ కర్మద్వారా వేదీమధ్యం నుండి ఇట్టి దివ్యరూప సౌందర్యం గల కన్య సూర్యచంద్ర తేజస్సులతో సమానమైన వర్చస్సు గలిగి, శరీరం నుండి క్రోసుదూరం వ్యాపించే సుగంధంగల కన్య ఎలా ఉద్భవించేది?" అని చెప్పి వ్యాసమహర్షి తన తపశ్శక్తి ప్రభావంతో ద్రుపదునికి అద్భుత దివ్యదృష్టిని ప్రసాదించాడు. దానితో ద్రుపదుడు దివ్యశరీరాలతో, తలలపై బంగారు కిరీటాలతో, మెడలో అందమైన సువర్ణమాలలతో, ఇంద్రతేజస్సుతో ప్రకాశిస్తున్న పాండవుల పూర్వ దివ్య దేహాలను దర్శిస్తున్నాడు. అలాగే తన కుమార్తె యొక్క పూర్వపు సర్వశ్రేష్ఠ సుందరరూపాన్ని; చంద్రునివంటి మోము, అగ్నివంటి ప్రకాశము గల దివ్యనారీ రూపాన్ని చూచి ఆమెను పాండవపత్నిగా చేయుటయే యోగ్యమని నిశ్చయించుకున్నాడు. (34-43శ్లో).

అంతట వ్యాసుడు ప్రసన్నుడై ద్రుపదునితో "రాజా! ఈ సందర్భంలో నీ కుమార్తె యొక్క పూర్వజన్మగాథ కూడా నీవు వినాలి. ఒక తపోవనంలో మహాత్ముడైన ఒక మునికి ఒక సకల సద్గుణరాశి యైన ఒక కుమార్తె ఉన్నది. ఆ ఋషికన్య రూపవతి, సౌశీల్యవతి, గుణవతి ఐనప్పటికీ ప్రారబ్ధవశాత్తు చాలాకాలం వరకు వివాహం కాలేదు. ఆమె శంకరుని గూర్చి కఠోరమైన తపస్సు చేయగా శంకరుడు ప్రత్యక్షమై నీకేం వరం కావాలో కోరుకోమన్నాడు. దానికామె "ప్రభూ! సర్వగుణ సంపన్నుడైన పతినిమ్మని పదేపదే అర్థించింది. భక్తసులభుడైన శంకరుడు నీకు ఐదుగురు పతులగుదురని వరమిచ్చాడు. దానికా ఋషికన్య పరమేశ్వరా! నేను గుణవంతుడైన ఒక్కపతినే కోరుకున్నాను అని చెప్పగా కళ్యాణీ! నీవు పతినిమ్మని నాతో ఐదుమార్లు పలికావు. కనుకనే నీకు ఐదుగురు పతులగుదురని వరమిచ్చాను. నీకు శుభం జరుగుతుంది. ఎందుకంటే నీవు మరొకదేహాన్ని ధరించినప్పుడే నేను చెప్పినట్లు జరుగుతుంది అని మహాదేవుడు తెలియజేశాడు. ద్రుపదమహారాజా! ఈ ఋషికన్యయే దివ్యరూపసౌందర్యవతియైన నీ కుమార్తెగా జన్మించింది. ఈమె ముందుగానే పంచపతులకు పత్నిగా నిర్ణయించ బడినది" అని వ్యాసుడు ద్రౌపదీ పాండవుల పూర్వజన్మల గాథను తెలియజేశాడు (44-51శ్లో)

పరమేశ్వరుని గూర్చి ఘోరతపస్సు చేసిన ఋషికన్యయే శివుని ఆనతిపై దేవేంద్రుని శివునివద్దకు తీసుకెళ్ళిన యువతి. ఆమె సాక్షాత్ స్వర్గలక్ష్మియని, పాండవులకొరకై ద్రుపదుని యజ్ఞంలో వేదీమధ్యం నుండి అయోజనిగా జన్మించినదని వ్యాసుడు తెలియజేశాడు.

ఇదీ మూలభారతంలోని ద్రౌపదీపాండవుల పూర్వజన్మకు సంబంధించిన పంచేంద్రోపాఖ్యానం. ఇప్పుడు లభిస్తున్న సంస్కృత మహాభారత వ్రాతప్రతులన్నింటిలోను ఉన్న కథ ఇదే. అయితే విమర్శకులు ఆంధ్రమహాభారతంలోని నాలాయనీ ఉపాఖ్యానాన్ని ఉటంకిస్తూ ద్రౌపదిని కాముక స్త్రీగా నీచంగా చిత్రించి విమర్శిస్తుంటారు. ఈ నాలాయనీ ఉపాఖ్యానం సంస్కృత భారతంలో లేదు. ఉన్నట్లు వారూ చెప్పలేదు. జైమినిభారతం నుండి గ్రహించి ఉండవచ్చునంటారు. ద్రౌపదిపూర్వజన్మలో ఋషికన్య. ఆ ఋషికన్య అంతకు ముందు చెబుతున్నది. ఈ నాలాయనీ గాథ గీతాప్రెస్, గోరఖ్‌పూర్‌వారు పరిశోధించి ముద్రించిన మూలభారతంలో కూడా లేదు. అయినప్పటికీ విమర్శకుల ముచ్చట ఎందుకు కాదనాలి? అనే ఉద్దేశ్యంతో ఆంధ్రమహాభారతంలో మాత్రమే ఉన్న ఆ గాథను ఇస్తున్నాం.

## 6. నాలాయనీ ఉపాఖ్యానం

ఇది తొల్లినాలాయనియైన ఇంద్రసేన యనం బరగిన పరమ పతివ్రత. మౌద్గల్యుండను మహామునికి భార్యయై; కర్మవశంబున కుష్ఠవ్యాధిగ్రస్తుడు, వయోవృద్ధుడు, దుర్గంధ వదనుడు, దుఃఖ

జీవుడు, ముక్కోపి ఐన భర్తను పరమభక్తితో ఆరాధిస్తూ ఆయన ఉచ్ఛిష్టాన్ని భుజిస్తూ ఉండేది. ఒక రోజున అతడు భోజనము చేస్తుండగా చేతివ్రేలు తెగి భోజనములో పడిపోయింది. అయినప్పటికీ ఆమె ఏవగించుకొనకు ఆ వ్రేలిని ప్రక్కన పడవేసి ఆ ఉచ్ఛిష్టాన్ని భుజించింది. అది చూచి మౌద్గల్యుడు ఆమె పతి భక్తికి ఎంతో సంతసించి, "నిన్ను నేను ఎలా సంతోష పెట్టగలనో, ఏ కోరిక ఏదో చెప్పు, నెరవేరుస్తాను" అనగా, "నీవు మనోహర రూపంబున ఐదుమూర్తులను ధరించియు, ఏకమూర్తిని ధరించియు నన్ను సంతోషపెట్టుమ"ని కోరినది. అతడు తన తపశ్శక్తితో సుందర రూపాన్ని ధరించి కైలాసము, మేరుగిరియందు అనేకవేల సంవత్సరాలు ఆమెను సంతోషపరచి, తుదకు నివృత్తి మార్గంలో తపస్సు చేసుకుంటూ దేహాన్ని విడిచిపెట్టాడు. ఆ నాయాయని కామోపభోగములందు తృప్తిచెందక, దేహాన్ని విడిచి కాశీరాజను రాజర్షికి కుమార్తెగా పుట్టి చాలాకాలం వివాహం కాకపోవటంతో పతిని గోరి రుద్రుని గూర్చి ఘోరతపస్సు చేసినది. ఆమె తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరము కోరుమన పతిదానంబు సేయమని ఐదుమార్లు అడిగినది. దానితో శివుడు దేహాంతరమున నీకైదురు పతులగుదురని వరమిచ్చెను. నేనొక్కపతిని గోరియే తపస్సు చేసితినని ఆమెయనగా నీవు 5 మార్లు అడుగుటవల్ల అలా వరమిచ్చితినని పరమేశ్వరుడు చెప్పి, నీకు ఐదుగురు పతులైనను వారియందు ధర్మం తప్పకుండా ఉంటావు అనగా ఋషికన్య "దేవా! ఆ ఐదుగురు పతులయందు ప్రత్యేక సంగమంబున నాకు కౌమారంబు (కన్యాత్వము)ను, పతిశు శ్రూషాసిద్ధియు, సౌభాగ్యమును ప్రసాదించమని" కోరింది. రుద్రుడు ఆమె కోరిన వరములన్నింటిని ప్రసాదించి, నీవిప్పుడు గంగాతీరమున నున్న ఇంద్రుని నా వద్దకు తోడ్కొని రమ్మని పంపెను. ఇక ఇక్కడినుండి పంచేంద్రోపాఖ్యానం. (ఆం.మ.భా.ఆదిపర్వం సప్తమాశ్వాసం)

## 7. ద్రౌపదిపై విమర్శలు

'మహాభారత చరిత్రము' అనే విమర్శక గ్రంథాన్ని వ్రాసిన పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు మహాభారతంలో చెప్ప బడిన ద్రౌపదీగాథను 'ఆ కథ ఇది' అని (223పే) ఏమివ్రాశారో చూద్దాం.

"నాళాయను నొకతె మౌద్గల్యుడను వృద్ధుడును, కుష్ఠియునగు మునిభార్యయై యుండెను. అతడు నాలాయనిం కామోపభోగముల తృప్తినొందింప తపస్సునంతయు ధారపోసియు ఆమెను తృప్తి నొందింపలేకుండెను. నీరతిచే నాగుహ్యేంద్రియము తృప్తినొందక బాధనొందుచున్నది. ఏ రీతినైన తృప్తి నొందింపుమని నాళాయని మౌద్గల్యుని వేధింపనాతడు కుపితుడై, చెప్పకూడని మాటలు నిశ్శంకతో చెప్పితివిగాన ద్రుపదునింట భూలోకములో నావిర్భ వింపుము. నీకచట ఐదుగురు భర్తలు సంభవింపగలరని శపించెనట! ఆమెయే రుద్రుంగూర్చి తపమాచరించి పంచపతిత్వ వరము నొందెనని పంచేంద్రోపాఖ్యానానికి ముడిపెట్టబడినది. మౌద్గల్యునిచే పంచపతిత్వమునకు శప్తురాలగు నాళాయని రుద్రుని గూర్చి పంచ పతిత్వమునకై యేల తపస్సు చేయవలసి వచ్చినదో? పై ఉపాఖ్యానములను విమర్శించి చూడగా ద్రౌపది హిమవత్పర్వత ఉత్తరభాగమున మౌద్గల్యుడను మునిని వరించి 'దుర్భరరోగిణి' యగుటచే మౌద్గల్యుని వలన తృప్తిలేక వెడలగొట్టబడి, భరత ఖండమునకేతెంచి, యాజుని ఆశ్రయించి ద్రుపదుని యజ్ఞవేదికకు గొనితేబడియుండునని తోచుచున్నది"

– ఇదీ పెండ్యాలవారు విమర్శించి చూడగా ఆయన బుద్ధికి తోచినట్లు వారు వ్రాసుకోవటమేనన్నమాట. నిజమే! బుద్ధిశుద్ధంగా, నిర్మలంగా ఉన్నవారికి అందులోని పాత్రల యదార్థ స్వరూప స్వభావాలు తెలుస్తాయి. అలా గాక బుద్ధిని బుగ్గిచేసుకొని, అశుద్ధం చేసుకొన్నవారికి పతివ్రతలు పతితతలుగా, పతితలు పతివ్రతలుగా; ధర్మాత్ములు దుష్టులుగా; దుష్టులు ధర్మాత్ములుగా అనిపిస్తూ ఉంటారు. అందుకే గ్రంథంలో ఉన్నదానిని మార్చి, లేనిదానిని జత చేసి, 'కాళిదాసు కవిత్వం కొంత, మన పైత్యం మరింత అన్నట్లుగా చేసి ఇట్టి వారికి వ్రాయాలనిపించటంలో ఆశ్చర్యం లేదు. కల్పనలతో, అబద్ధాలతో, జుగుప్సాకరంగా, నీతిబాహ్యంగా వ్రాసిన ఈ వ్రాతలను పరిశీలన చేద్దాం!

**వ్రాత:** నాళాయని యనునొకతె మౌద్గుల్యుడను వృద్ధుడును, కుష్ఠియునగు మునిభార్య. అతడు నాలాయినిం కామోపభోగంబుల తృప్తినొందింప తపస్సునంతయు ధారపోసియు ఆమెను తృప్తి నొందింపలేకుండెను, నీరతిచే నాగుహ్యేంద్రియము తృప్తినొందక బాధపడుచున్నది. ఏ రీతినైన తృప్తి నొందింపుమని నాళాయని మౌద్గల్యుని వేధింప....

**పరిశీలన:** కథలో చెప్పినదేమిటి? ఈయన వ్రాసినదేమిటి? ఈ నాలాయని గాథ అసలు మూలంలో లేనే లేదు. ఆంధ్ర భారతంలో ఉన్నది. పోనీ అక్కడైనా ఏమని ఉన్నది? పరమ పతివ్రత అనీ, కుష్ఠవ్యాధిగ్రస్తుడు, వృద్ధుడు, దుర్గంధవదనుడు, దుఃఖజీవుడు, ముక్కోపి ఐన భర్తను పరమభక్తితో ఆరాధిస్తూ ఆయన తినగా మిగిలిన ఉచ్ఛిష్టాన్ని భుజిస్తూ ఉండేదని; ఒకనాడు ఆయన భుజిస్తూ ఉండగా వ్రేలు తెగిపడ్డా ఏవగించుకోకుండా ఆ ఉచ్ఛిష్టాన్ని భుజించి

పతిని మెప్పించిన పరమపతివ్రత అనీ ఉన్నది. అంటే వృద్ధుడు, కుష్ఠురోగి, కోపిష్టి, దుర్గంధవదనుడు అయిన భర్తను అఖండ భర్తృపరిచర్యలచే భక్తితో సేవించిన ఉత్తమ ఇల్లాలు, పరమ పతివ్రత అని గ్రంథం చెబుతుంటే- 'ఆ కథ ఇది' అని ఏం చెబుతున్నారు పెండ్యాలవారు తన బుద్ధికి తోచిన కథను? నాలాయని పచ్చి కాముక స్త్రీయని, కామోపభోగాలకై పతిని వేధించే స్త్రీయని, ఆయన తన తపస్సునంతా ధారపోసినా ఆమెకు తృప్తి కలిగించలేక పోయాడని, నీ రతిచేత (సంభోగం వల్ల) నాగుహ్యేంద్రియం (స్త్రీ రహస్యావయవం) తృప్తి చెందక బాధపడుతున్నదని, ఎలాగైనా సరే నన్ను తృప్తి పరచమని సిగ్గూశరం లేకుండా, అసహ్యకరంగా మాట్లాడినట్లు వ్రాశాడు. ఈయన వ్రాసిన మాటలు నాలాయని అన్నట్లు గ్రంథంలో ఉన్నవా? ఎందుకీ అసభ్యకరమైన వ్రాతలు? ఇలాంటి వ్రాతలు వ్రాస్తే గాని తృప్తి చెందని బుద్ధియా ఈయనది?

ముక్కోపి అయిన భర్తకు ఏ కోరిక లేకుండా అసాధారణ పరిచర్యలను భక్తితో చేసిన ఆ పరమపతివ్రతను, తన నుండి ఇంతవరకూ ఏ సుఖాన్ని, సంతోషాన్ని పొందని భార్యను, తనవల్ల కష్టము, దుఃఖము, బాధలుపడ్డ సహనశీలియైన భార్యను "నిన్నెలా సంతోషపెట్టగలనో కోరుకో. నీ కోరిక నెరవేరుస్తాను" అని ప్రసన్నుడై, తనంతట తానుగా వరమిచ్చిన భర్తను 'నాకు కామోపభోగేచ్ఛ కలదు. మీరు మనోహర రూపంబును ధరించి నన్ను సంతోషపెట్టమని కోరింది. ఇది పెండ్యాల వారి బుద్ధికి వేధించినట్లు తోచింది. భార్య భర్త ద్వారా కామసుఖాన్ని పొందాలనుకోవటం తప్పా? అందులోనూ ఏ సుఖమూ లేకుండా చాలాకాలం భర్తను సేవించిన భార్యకు కామేచ్ఛ ఉండటం తప్పా? అసలు వివాహం ఎందుకు చేసుకుంటారు? "ధర్మేచ, అర్థేచ, కామేచ, త్వయైషా నాతిచరిత వ్యానాతి చరామి" అనే ప్రతిజ్ఞతో జరిగే వివాహవిధి ఏమిటి? ధర్మ, అర్థ, కామములనే 3 పురుషార్థాల యందు భార్యాభర్తలిరువురు కలిసిమెలసి ప్రవర్తించాలని గదా! ఈ మాత్రం కూడా అర్థం చేసుకోలేక భర్త ద్వారా కామేచ్ఛను తీర్చుకోవటం తప్పుగా చిత్రించటం ఏమి సంస్కారం?

మరీ అసభ్యము, అసహ్యకరము అయిన వ్రాత ఉన్నది. నాయాలని భర్తతో 'నీ రతిచేత నా గుహ్యేంద్రియం తృప్తి నొందక బాధపడుచున్నది. ఏ రీతిగానైనా నన్ను తృప్తి పొందించుము' అన్నదట' ఉన్నదాగ్రంథంలో అలాగని? గ్రంథంలో లేదు, మరి ఎక్కడ ఉన్నది? ఈయన బుద్ధిలో ఉన్నది. అది నాలాయని మాటకాదు. ఆయనకు తెలిసిన వారిని ఎవరిదో మాట అయి ఉండవచ్చునేమో? ఇంతగా సిగ్గు విడిచి అసభ్యంగా వ్రాయుటకు ఎలా మనసు ఒప్పిందో పాఠకులే ఆలోచించాలి.

మౌద్గల్యుడు తన తపస్సునంతయు ధారపోసియు నాలాయనిని తృప్తినొందింప లేకుండెనని మరొక అబద్ధం. గ్రంథంలో ఉన్నదేమి? అతడు తన తపశ్శక్తితో సుందర రూపాన్ని ధరించి, అనేక సంవత్సరాలు ఆమెను సంతోషపరచి, తుదకు నివృత్తిమార్గంలో తపస్సు చేసుకుంటూ దేహాన్ని విడిచిపెట్టాడు-అని. ఆయన గొప్ప తపస్వి. మునిపుంగవుడు. భార్య చేసిన పరిచర్యలకు సంతోషించి, ఆమెను వరం కోరమని ప్రోత్సహించి, ఆమె కోరికను నెరవేర్చి తుదకు ప్రవృత్తి మార్గాన్ని విడిచి నివృత్తి మార్గంలో తపస్సుకై వెళ్ళి తపస్సుచేసుకుంటూ కాలక్రమంలో దేహాన్ని చాలించాడు. పెండ్యాలవారి బుద్ధికి ఏమి తోచినది? ఆయన తపస్సునంతయు ధారపోసి ఆమెను తృప్తి పరచలేకపోయాడు- అని. ఇలా అబద్ధాలు వ్రాస్తే గాని ఆయనకు తృప్తి కలగదు కాబోలు. కామసుఖానికై భర్తను వేధించినది 'నాలాయని' అని వ్రాస్తే గాని ఆయన మనస్సు శాంతించలేదు కాబోలు.

అరణ్యవాసం చేస్తున్న పాండవుల వద్దకు ఒకనాడు రోమశ మహర్షి రాగా ధర్మరాజు ఆయన ద్వారా అనేక కథలు వింటున్నాడు. రోమశమహర్షి శాంతి ఋష్యశృంగుల వివాహం గురించి ధర్మరాజుకు తెలియజేసి-

**శ్లో॥ అరుంధతీవాసుభగా వశిష్ఠం లోపాముద్రావా యదాహ్యగస్తం।**
**నలస్యవై దమయంతీ యధాభూత్ యధాశచీ వజ్ర ధరస్యచైవ॥**

**(వన 113అ.23శ్లో)**

**శ్లో॥ నాలాయనీచేంద్ర సేనాబభూవ వశ్యానిత్యం ముద్గలస్యాజమీఢ।**
**తధాశాంతిఋష్యశృంగం వనస్థం ప్రీత్యాయుక్తా పర్యచరన్నరేంద్ర॥**

**(వన 113అ.21శ్లో)**

**తా॥** ధర్మనందనా! వశిష్ఠునికి సౌభాగ్యశీలి అరుంధతి లాగా, అగస్త్యునకు లోపాముద్రలాగా, నలునికి దమయంతి లాగా, దేవేంద్రునికి శచీదేవిలాగా, మౌద్గల్యమహర్షికి నాలాయని ఇంద్రసేనలాగా ఋష్యశృంగునికి శాంతాదేవి భక్తితో పరిచర్యలాచరించి పతివ్రతామ తల్లుల జేజేలందుకున్నది (అని తెలియజేశాడు)


అంటే భక్తితో పతికి పరిచర్యలు చేయుటలో ఉపమానముగా చెప్పబడిన పతివ్రతామ తల్లుల సరసన చేరిన నాలాయనిని పచ్చి కాముకురాలిగా, కామపిశాచిగా, భర్తను వేధించే నీచస్త్రీగా, సిగ్గు లేకుండా మాట్లాడే బజారు మనిషిగా చిత్రించబూనటం, అందుకు గ్రంథంలో లేని విషయాలను ఉన్నట్లుగా చెప్పబూనటం; నా బుద్ధికి ఇలా తోచించి అని వ్రాయటం ఎంత హేయమో విజ్ఞులు ఆలోచించాలి. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని కథలు, నవలలు వ్రాసేవారి చిత్తవృత్తులెలాంటివో గ్రహించాలి.

ఇంకా పెండ్యాల వారి వ్రాత ఎలా సాగింది?

(వచ్చే సంచికలో..)

# మహాభారతం

## ద్రౌపది 19



రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

**వ్రాత-2: "ఏ రీతినైన తృప్తి నొందింపుమని నాళాయని మౌద్గల్యుని వేధింపనాతడు కుపితుడై చెప్పకూడని మాటను నిశ్శంకతో చెప్పితివి గాన ద్రుపదునింట భూలోకములో నావిర్భవింపుము. నీకచట ఐదుగురు భర్తలు సంభవించగలరని శపించె"నట.**

**పరిశీలన:** మౌద్గల్యుడు కుష్ఠురోగగ్రస్తుడు, ముక్కోపి, అతి కోపనుడు. ఒకరోజు అతడు భోజనము చేస్తూ తన వ్రేలును కొరికి అందులో పడవేయగా, ఏవగించుకొనక నాళాయని ఆ ఉచ్ఛిష్టాన్ని తిన్నది. అలా తన భార్య తనకు చేసిన సేవలకు, ఆమె పాతివ్రత్యానికి సంతసించిన మౌద్గల్యుడు నీ కోరిక ఏమిటని అడిగి, ఆమె కోరికను తీర్చుటకు తన తపశ్శక్తితో సుందర మనోహర రూపాన్ని ధరించి; కైలాసము, మేరుగిరియందు అనేక వేల సంవత్సరాలు ఆమెను సంతోషపరచి తుదకు నివృత్తి మార్గంలో తపస్సు చేసుకుంటూ దేహాన్ని విడిచిపెట్టినట్లు ఆంధ్రమహాభారతం చెబుతుండగా-శాస్త్రిగారు ఏ రీతినైన తృప్తి నొందింపుమని నాళాయని భర్తను వేధించినదట. అందుకాయన కుపితుడై చెప్పకూడని మాటను నిశ్శంకతో చెప్పితివి గాన దృపదునింట జన్మించుము, నీకచ్చట ఐదుగురు భర్తలు సంభవించగలరని శపించినట్లు కథను అల్లారు. అసలీ నాళాయని గాధ మూలంలో లేదు. ఆంధ్రభారతంలో మాత్రమే ఉన్నది. మరి అక్కడ భర్తను వేధించటం, భర్త భార్యను శపించటం ఉన్నదా? ఎందుకీ అబద్ధాలు? ఎలాగైనా పరమపతివ్రతను కాముకురాలిగా, సిగ్గు లేనిదానిలాగా, చెప్పకూడని మాటలు చెప్పేదానిగా, పతిచేత శపించబడినదానిగా చిత్రించాలనే గదా! పతివ్రతల పట్ల ఇంతటి ద్వేషబుద్ధియా? పాపం శమించుగాక!

**వ్రాత-3 : ఆమెయేరుద్రుంగూర్చి తపమాచరించి పంచ పతిత్వ వరమునొందెనని పంచేంద్రోపాఖ్యానానికి ముడిపెట్ట బడింది. మౌద్గల్యునిచే పంచపతిత్వమునకు శప్తురాలైన నాళాయని రుద్రుని గూర్చి పంచపతిత్వమునకై ఏల తపస్సు చేయవలసి వచ్చెనో?**

**పరిశీలన:** "చదవేస్తే ఉన్న మతిపోయిందంటారు" ఇలాంటి వారిని గూర్చే. అసలు రుద్రుని గూర్చి తపస్సు చేసినది నాళాయనియా? ఋషికన్యయా? ఆంధ్రభారతంలో స్పష్టంగా "నాళాయని దేహాన్ని విడిచి కాశీరాజను రాజర్షికి కుమార్తెగా పుట్టి చాలాకాలం వివాహం కాకపోవటంతో పతిని గోరి రుద్రుని గూర్చి తపస్సు చేసినది" అని ఉండగా నాళాయని భర్తచేత శపించబడి, వెళ్ళగొట్టబడి రుద్రుని గూర్చి ఘోర తపస్సు చేసినదని శాస్త్రిగారు మరొక అభూత కల్పన చేశారు. మూలభారతంలో కూడా వ్యాసుడు కుంతీపాండవులకు వినిపించిన గాధ గాని, ద్రుపదునికి వినిపించిన గాధగాని ఏ మార్పులు లేకుండా ఒక్కటే విధంగా ఉన్నది. "ఒక తపోవనంలో ఋషికన్య ప్రారబ్ధవశాత్తు చాలాకాలం వరకు వివాహం కాకపోవ టంతో పతిని కోరి శంకరుని గూర్చి ఘోర తపస్సు చేసినది. ఆమె తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరము కోరు కొమ్మనగా 'సర్వగుణసంపన్నుడైన పతినిమ్మని పదేపదే అర్థించింది. భక్త సులభుడైన శంకరుడు నీకు ఐదుగురు పతులగుదురని వరమిచ్చాడు. దానికా ఋషికన్య నేను ఒక్కపతిని గోరియే తపస్సు చేసితిననగా, నీవు పతినిమ్మని ఐదుమార్లు అడిగావు. అందుకే ఐదుగురు పతులగుదురని వరమిచ్చాను. నీవు ఈ దేహాన్ని విడిచి మరొక దేహం ధరించినప్పుడే నాయీ వరప్రకారం జరుగుతుందని పరమేశ్వరుడంతర్ధానమయ్యాడు.

దీనిని బట్టి తపస్సు చేసినది నాళాయని కాదు, ఋషికన్య అనే విషయం స్పష్టం. ఆ తపస్సు చేసినది ఎంతకాలానికీ వివాహం కానందున సర్వగుణ సంపన్నుడైన పతిని కోరియే. అయితే పరమేశ్వరుడు ప్రత్యక్షం కావటంతో పరవశంతో ఐదు మార్లు అర్థించింది. అంతే తప్ప ఐదుగురు పతులను కోరికాదు.

నాళాయని యే రుద్రుం గూర్చి తపమాచరించి పంచపతిత్వ

వరము నొందెనని పంచేంద్రోపాఖ్యానానికి ముడిపెట్టబడినదని శాస్త్రి గారు వ్రాశారు. నాళాయనిని ఋషికన్యకు ముడిపెట్టడం, ఋషికన్య తపస్సును నాళాయనికి ముడిపెట్టటం, పంచపతిత్వానికి శప్తురాలైన దన్న నాళాయనిని పంచపతిత్వ వరము నొందిన ఋషి కన్యకు ముడిపెట్టటం చూస్తుంటే ఈ ముడులు పెట్టటంలో కథలను ఇష్టంవచ్చినట్లు మార్చటంలో శాస్త్రిగారి హస్తలాఘవం ఎట్టిదో తెలిసి పోతున్నది.

పంచపతిత్వమునకు శప్తురాలైన నాళాయని రుద్రునిగూర్చి పంచపతిత్వమునకై ఏల తపస్సు జేయవలసి వచ్చెనో! అనే ధర్మ సందేహమొకటి మతిలేనివారు, బుద్ధిహీనులు అలా చేస్తారు. ఇక్కడ నాళాయని శపించబడనూ లేదు. తపస్సు చేయనూ లేదు. తపస్సు చేసినది ఋషికన్య. ఆమె ఒక్కపతి కొరకే తపస్సు చేసినది. నిజంగా ఆమె ఐదుగురు పతులకొరకే తపస్సు చేసి ఉంటే తనకోరిక నెరవేరినందుకు ఆనందించాలిగాని, నేను ఒక్కపతిని కోరియే తపస్సు చేశానని చెప్పవలసిన పనేముంది? కనుక శాస్త్రిగారి వ్రాత అతుకులబొంత. ముడులుపెట్టే అస్తవ్యస్త వ్రాత.

పై ఉపాఖ్యానాలను విమర్శించి చూడగా ఆయనకు ఇంకేదో తోచినదట. ఏం తోచినదో చూద్దాం.

**వ్రాత-4 : పై ఉపాఖ్యానాలను విమర్శించి చూడగా ద్రౌపది హిమవత్పర్వత ఉత్తర భాగమున మౌద్గల్యుని వరించి, 'దుర్భగరోగిణి'యగుటచే మౌద్గల్యుని వలన తృప్తిలేక వెడలగొట్ట బడి, భరతఖండమునకేతెంచి యాజుని ఆశ్రయించి, ద్రుపదుని యజ్ఞవేదికకు గొని తేబడియుండునని తోచుచున్నది"**

**పరిశీలన:** పంచపాండవులెంతమంది? అని అడిగితే మంచపు కోళ్ళులాగా ముగ్గురు అని చెప్పి, రెండు వేళ్ళు చూపి ఒకటి ముడిచాడట ఒక బుద్ధిమంతుడు. అంతకంటె ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు ఆ బుద్ధిమంతుణ్ణి మించినవాడే మన శాస్త్రిగారు. ఇంతవరకు "నాళాయన మౌద్గల్యుడను మునిభార్య" అని ఆంధ్ర భారతానికి అనుగుణంగా కథను నడిపిన శాస్త్రిగారు ఇప్పుడు ద్రౌపది మౌద్గల్యుని వరించినదని కొత్త కథను ఎత్తుకున్నాడు. దీనితో నాళాయనీ ఉపాఖ్యానము, ఋషికన్య తపస్సు, ద్రౌపది అయోనిజగా జన్మించుట అనే మొత్తం కథలను చుట్టజుట్టి ఆవల పారవేసి, తన బుర్రలో పుట్టిన బుద్ధిని బట్టి భారతగాథను నడిపిస్తున్నాడు. ఇక్కడ మొత్తం 3 విషయాలను శాస్త్రిగారు తెలిపారు. 1) ద్రౌపదియే మౌద్గల్యుని వరించి, అతడి వల్ల తృప్తిలేక వెడలగొట్టబడినదని, 2) ద్రౌపది 'దుర్భగరోగిణి'యని, 3) ద్రౌపది యాజుని ఆశ్రయించి ద్రుపదుని యజ్ఞవేదికకు గొని తేబడినది అని. ఇలా అని తోచుచున్నదట. వీటిని పరిశీలిద్దాం.

1) ద్రౌపది అందాలరాశి; సౌభాగ్యశీలి; కమల దళాలవంటి నేత్రాలు గలది; శ్యామవర్ణంతో; దీర్ఘమైన నల్లని కేశాలతో, సర్వావయవ నిరుపమాన సౌందర్యంతో, క్రోశపర్యంత వ్యాప్త శరీర సౌగంధ్యంతో, సాక్షాత్ స్వర్గలక్ష్మి మానుషదేహం ధరించినట్లుగా ఉన్నది. (ఆది ప.1661.44,45శ్లో). అట్టి అపురూప సౌందర్యవతి కుష్ఠువ్యాధిగ్రస్తుడు, వయోవృద్ధుడు, దుర్గంధవదనుడు, దుఃఖజీవుడు, ముక్కోపి ఐన మౌద్గల్యుని వరించినదట. ఇన్ని లక్షణాలున్న అందగాడు దొరకలేదోమో! దుర్భగరోగిణియగుటచే మౌద్గల్యుని వలన తృప్తిలేక వెళ్ళగొట్టబడినదట. అబద్ధమాడినా గోడకట్టినట్లుండాలంటారు. మరి ఇలా ఆకుకు అందకపోకకు పొందక అన్నట్లు అబద్ధంతో కథను కల్పించటం ఎందుకు? నేనేం వ్రాసినా గుడ్డిగా నమ్మేస్తారనే అహమా? ద్రౌపది మౌద్గల్యునిచే వెళ్ళగొట్టబడిందా? కనీసం నాళాయనిని కూడా వెళ్ళగొట్టలేదే. అతడే తపస్సు చేసి దేహాన్ని వదలినట్లు గ్రంథంలో ఉన్నది. అంటే వ్యాసుడు వ్రాసినదానిని నేనెందుకు అంగీకరించాలి? నా ఇష్టం వచ్చినట్లు గాథలను అస్తవ్యస్తం చేసి మహాభారతం మానవులకు ఉపయోగపడకుండా చేస్తాను అనే దుర్బుద్ధి తప్ప ఇంకేమున్నది?

ఇక మౌద్గల్యునిచే దౌపది వెడలగొట్టబడటానికి కారణం ఆమె 'దుర్భగరోగిణి'యటు. అదేమిటో చూద్దాం.

ద్రౌపది దుర్భగరోగిణియట; అపురూపలావణ్యవతిగా వర్ణించబడ్డ ద్రౌపదికి ఒక రోగాన్ని అంటగట్టి పైశాచిక ఆనందాన్ని పొందాలనే ఆలోచన పెండ్యాలవారి కెలావచ్చింది?

పాండవులకు ఋషికన్య గాథను చెబుతూ వ్యాస భగవానుడు, "తపోవనంలో సమస్త సద్గుణాలరాశి, గొప్ప అందగత్తె అయిన ఋషికన్య ఉన్నది. ఆమె-

**శ్లో॥ కర్మభిఃసుకృతై స్సాతు దుర్భగా సమపద్యత।**
**నాద్య గర్భత్పతింసోతు కన్యారూపవతీ సతీ॥** (ఆది ప.168అ.7శ్లో)

తా॥ ఆమె తన పూర్వకర్మల ఫలితంగా దురదృష్టవశాన వివాహము కాక చాలాకాలం ఉన్నది" అని చెప్పటం జరిగింది.

ఇక్కడ 'దుర్భగ' అనే శబ్దం కనిపించటంతో పెండ్యాలవారికి ఒళ్ళుపొంగిందేమో! దుర్భగ-అంటే దుష్టమైన భగము (గూఢావయవం) గలది అనే ఒక అసభ్యకరమైన అర్థం చెప్పి తన వెకిలితనాన్ని, లౌకితనాన్ని చాటుకున్నాడు. ఆయన తన మహాభారత చరిత్రము 154వ పేజీలో ఇలా వ్రాశారు. "దుర్భగ అంటే దుష్టమైన గూఢావయవం గలది. స్త్రీ రోగములలో కొందరికి గూఢావయము ఉబ్బెత్తుగా నుండును, వారు రతియందు అసంతృప్తి గల వారై బహుపతిత్వము కోరుదురు" అని.

దుర్భగ అంటే దుష్టమైన గూఢావయవం అయితే మరి సుభగా అంటే ఏమిటి? మంచి గూఢావయం గలది అనే గదా! ఋషికన్య విషయంలో దుర్భగా అన్న వ్యాసమహర్షి ద్రౌపదీ విషయంలో ఏమన్నాడు?

**శ్లో॥ కుమారీచాపి పాంచాలీ వేదీ మధ్యాత్ సముత్థితా।**
**సుభగా దర్శనీయాంగీ స్వసితాయచలోచనా॥ (ఆది ప.166అ. 44శ్లో)**

వక్రబుద్ధి గలవారికి, లేకితనం గలవారికి ఇలాంటి అర్థాలే స్ఫురిస్తాయి. నిజమైన అర్థం ఏమంటే సుభగా అంటే సౌభాగ్యవతి అని; దుర్భగా అంటే దౌర్భాగ్యవతి అని అర్థం.

అందుకే పై ఋషి కన్య విషయంలో చెప్పిన సంస్కృత శ్లోకార్థాన్ని ఆంధ్రభారతంలో నన్నయగారు ఇలా తెనిగించారు.

**సీ. తానొక్కమునికన్య తనకర్మవశమున**
**బతిబడయంగ నోపక యుపేత**
**దౌర్భాగ్యయై ఘోర తపమొనరించిన..** దుర్భగ=దౌర్భాగ్యవతి-అనియే.

అసలు దుర్భగ అని చెప్పింది ఋషికన్య గురించి, సుభగా అని చెప్పింది ద్రౌపది గురించి, మరి పెండ్యాలవారేం ముడి వేస్తున్నారు? ద్రౌపది 'దుర్భగరోగిణి'యని. విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పవలసిన తెలుగు పండితుడి విద్యా-బుద్ధి ఇలా వెర్రితలలు వేయటం మన దౌర్భాగ్యమే తప్ప మరేమీ కాదు.

3) ద్రౌపది మౌద్గల్యునిచే వెడలగొట్టబడి యాజుని ఆశ్రయించి దృపదుని యజ్ఞవేదికకు గొనితేబడినది-అట. ఇంకా మన అదృష్టం. ద్రౌపది యాజుని వరించి, వివాహమాడి; తృప్తిలేకపోవటంతో; యాజుడు దృపదుని యజ్ఞవేదికకు తెచ్చాడు అని అనలేదు. అంటే గ్రంథంలో చెప్పినట్లు ద్రౌపది వేదీమధ్యం నుండి అయోనిజగా జన్మించలేదని, యాజుడు ఎలాగో మాయచేసి ద్రుపదునికి అంటగట్టాడు అని పెండ్యాలవారి వితండం.

ఒక గొప్ప మహారాజు యజ్ఞం చేస్తుంటే ఋత్విక్కులు, పురోహితులు, మంత్రులు, సామంతరాజులు, రాజోద్యోగులు, పౌరజానపదులు, అంతఃపురనారీజనులు ఎందరుంటారు? వీరందరి కన్ను గప్పి ద్రౌపదిని తెచ్చుట ఎట్లు? యజ్ఞం సమాప్త మయ్యేవరకు ఎవ్వరికీ కనిపించకుండా ఆమెను రహస్యంగా దాచుట ఎట్లు? వేదీమధ్యం నుండి అందరి సమక్షంలో ఆమెను ఉద్భవింపజేయుట ఎట్లు? ఇంతమంది మోసపోవుట ఎట్లు?

బహుశ ఇలాంటి సందేహం వస్తుందనే కాబోలు పెండ్యాల వారి అనుచరగణంలో ఒక ప్రబుద్ధుడు ఈ సందేహాన్ని తీర్చాడు. అదేమిటంటే యజ్ఞం పరిసమాప్తం కాబోయే సమయంలో ఒక్క సారిగా పెద్ద అగ్నిజ్వాల-దానిలో పచ్చికట్టెలు వేయగా పెద్ద పొగ-దానితో అందరూ కళ్ళు మూసుకోగా ద్రౌపదిని తెచ్చి అక్కడ కూర్చోబెట్టడం-అనే కథను అల్లి తన చాతుర్యానికి తానే మురిసి పోయాడు. కాకపోతే ఎక్కడెక్కడో కూర్చున్న వారితో సహా యజ్ఞశాలలోని వేలాదిమంది ఆ పొగకు కళ్ళు మూసుకుంటే; హోమ కుండానికి దగ్గరే ఉన్న యాజుడు, ద్రౌపది మాత్రం ఎలా కళ్ళు తెరుచుకొని నాటకం ఆడారో ఆ మహానుభావుడికే తెలియాలి.

విమర్శించి చూడగా ద్రౌపది... ద్రుపదుని యజ్ఞవేదికకు గొనితేబడియుండునని తోచుచున్నదట ఈ విమర్శకాగ్రేసరునికి. అంటే విమర్శకుడికి ఇలా తోస్తుంటుంది కాబోలు. లేక ఇలా తోచినపుడే విమర్శకుడౌతాడో! నోటికి వచ్చినట్లు ప్రేలటం, నాలుకను ఎన్ని వంకరలైనా త్రిప్పటం-ఇదే నా విమర్శకుల లక్షణం? ఇదేనా గ్రంథపరిశోధనా పద్ధతి?

పెండ్యాల వారి గ్రంథంలోని దోషాలనెత్తి చూపుతూ, ఆయనను విమర్శిస్తూ మరొక విమర్శకుడు శిష్టా సూర్యనారాయణ శాస్త్రి గారు తమ మహాభారత రహస్యములో ద్రౌపదీ జన్మ గురించి ఏమివ్రాశారో చూద్దాం.

**శిష్టా వారి విమర్శ:**

**ద్రౌపది దృపదునకు దృష్టద్యుమ్నునితోపాటు దత్త పుత్రికయని నా అభిప్రాయము. పుత్రేష్ఠిని బట్టియు, పంజేంద్రో పాఖ్యానాన్ని బట్టియు విచారించి చూడగా ఋషికన్యయైన ఈమెను ద్రుపదుడు దత్తపుత్రికగా స్వీకరించెననియే తోచుచున్నది.** (మహాభారత రహస్యం 590 పేజీ)

**జవాబు:** 'రెండు రెళ్ళు ఆరు' అని ఒకడంటే 'అబ్బే అది తప్పు, 'రెండు రెళ్ళు ఏడు' అన్నాడట మరొక మేథావి. అలా ఉంది ఈ విమర్శకులవరస.

ద్రౌపది మౌద్గల్యునిచే వెడలగొట్టబడి, యాజుని ఆశ్రయించి, ద్రుపదుని యజ్ఞవేదికకు గొని తేబడియుండునని తోచుచున్నది అని పెండ్యాలవారు వ్రాస్తే; ద్రౌపదిద్రుపదునికి దృష్టద్యుమ్నునితో పాటు దత్తపుత్రికయని నా అభిప్రాయము, ఋషికన్యయైన ఈమెను ద్రుపదుడు దత్తపుత్రికగా స్వీకరించెననియే తోచుచున్నది-అని శిష్టావారు వ్రాశారు.

ఆయనకు అట్లా తోస్తే ఈయనకిట్లా తోచింది. అంతే తప్ప గ్రంథంలో ఉన్న దానితో వీరికి సంబంధం లేదు. ఇంతకూ వీరు విమర్శించే ద్రౌపదీ మహాభారతంలోని ద్రౌపదియా? లేక వారి వారి గ్రామాలలో, వారి వీధులలో ఉన్న ద్రౌపదియా?

పుత్రేష్ఠిని బట్టి పంచేంద్రోపాఖ్యానాన్ని బట్టి విచారించి చూడగా ఋషికన్యయైన ఈమెను ద్రుపదుడు దత్తపుత్రికగా స్వీకరించెననియే తోచుచున్నదట శిష్టా వారికి.

పుత్రేష్టి గురించి కుంతీపాండవులకు తెలియజేసిన బ్రాహ్మణు డేమని చెప్పాడు? యజ్ఞం పరిసమాప్తమయ్యే సమయంలో యాజుడు ద్రుపదుని భార్యను పిలిచి హవిస్సును స్వీకరించమని, దీనివల్ల నీకు ఒక కుమారుడు, కుమార్తె జన్మించగలరని చెప్పగా; ద్రుపదరాణి "మహాత్మా! సంతానాన్ని ప్రసాదించే హవిస్సును స్పర్శించాలంటే నేను స్నానం చేసి పవిత్రురాలిని కావాలి. కనుక కొంచెంసేపు వేచి ఉండండి" అన్నది. దానికి యాజుడు "యాజుని చేత సిద్ధం చేయబడి,

పెరటిచెట్టు మందు మెచ్చరు-దూరపు కొండలు నునుపు

ఉపయాజుని చేత అభిమంత్రించబడి యున్న ఈ హవిస్సు నీవు వచ్చినా, అక్కడే నిలిచినా యజమాని కోరికను సిద్ధింపజేయకుండా ఎలా ఉంటుంది?" అని పలికి ఆ హవిస్సును హోమాగ్నిలో ఆహుతిచేయగా అగ్నికుండం నుండి కిరీట, కవచ, ఖడ్గ, బాణ, ధనుస్సులతో రథాన్ని అధిరోహించి దృష్టద్యుమ్నుడు; వేదీమధ్యం నుండి ద్రౌపది ఉద్భవించారు. ఇదీ బ్రాహ్మణుడు చెప్పిన ద్రౌపదీ దృష్టద్యుమ్నుల జన్మ వృత్తాంతం. ఇక -

పంచేంద్రోపాఖ్యానాన్ని ద్రుపదునికి వినిపించిన వ్యాస మహర్షి ఏమన్నాడు?

**శ్లో॥ దృపదైషాహిసా జజ్ఞే సుతావై దేవరూపిణీ।**
**పంచానాం విహితా పత్నీ కృష్ణా పార్షత్య నిందితా**
**(ఆది 196 అ. 51శ్లో)**

**తా॥** దృపద మహారాజా! ఆ ఋషికన్యయే (నీకు మరొక జన్మలోనే ఈ పంచపతిత్వం ప్రాప్తిస్తుందని పరమేశ్వరునిచే వరం పొందిన ఋషికన్యయే) నీ ఈ దివ్యస్వరూపమైన పుత్రికగా ఈ యజ్ఞవేదిక నుండి ఉత్పన్నమైనది-అని.

ఇలా యజ్ఞవేదికనుండి జన్మించినదని పుత్రేష్టిని బట్టి, పంచేంద్రోపాఖ్యానాన్ని బట్టి మహాభారత గ్రంథంలో స్పష్టంగా చెప్పబడియుండగా; ఋషికన్యయే దృపదునికి దత్తపుత్రికయని ఈ పండిత విమర్శకునికి తోచనిదట. నిజంగా ద్రౌపది దత్త పుత్రికయే ఐతే అలా వ్రాయటానికి వ్యాసునికేమి ఇబ్బంది? కుంతిని దత్తపుత్రికగా చెప్పలేదా మహాభారతంలో? అంటే ఈ విమర్శకులు ఎలాగైనా వ్యాసుడు వ్రాసినది తప్పని తేల్చాలి. కనుక వీరికి ఎట్లాతోస్తే అట్లా వ్రాస్తారు. వీరికి పుత్రకామేష్టి యజ్ఞాలపై, మహర్షుల తపోశక్తులపై, అమానుష కృత్యాలపై నమ్మకం లేదన్న మాట, విచిత్రం ఏమిటంటే ఈ పండితుడే (శిష్టావారు) పెండ్యాల వారిని, ఇతర విమర్శకులను గూర్చి తన 'మహాభారత రహస్యము' నందు "నిర్వీర్యులు, అల్పబుద్ధులు గల ఈ కాలపు విమర్శకులు ఈ విషయమును (దివ్యకృత్యములను) గ్రహింపకపోవుటచేతనే మహాభారతార్థమంతయు తలక్రిందు లగుచున్నది. ధర్మరహస్యమును గుర్తెరుంగక పోవుట చేత మహాభారతమందు, ప్రక్షిప్తములుగా తలపబడుచున్నవి" (మ.భా.ర.205 206పే) అని వ్రాశారు.

**"కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డునాకినట్లు"** ఆ విమర్శకులను ఏమని విమర్శించాడో అవి తనకే తగిలినవి. నిర్వీర్యులు, అల్ప బుద్ధులు గనుకనే గ్రంథంలో అయోనిజగా వేదీ మధ్యం నుండి జన్మించినదని చెప్పబడిన ద్రౌపది ద్రుపదునికి దత్తపుత్రికగా ఈయనకు తోచినది. ఋషికన్య ముందు జన్మ. ఆ ఋషికన్య దేహాన్ని విడిచి వేదీమధ్యం నుండి అయోనిజగా జన్మించినది.

బ్రాహ్మణుని మాట, వ్యాసుని మాట ఒకే విధంగా ఏ తేడా లేకుండా ఉన్నది. ఈ విమర్శకులకు మాత్రం తలకొకరకంగా తోస్తున్నది.

ఇక కోటమర్తి చినరఘుపతిరావు అనే కవి తన 'సుయోధన విజయము' అనే గ్రంథంలో ద్రౌపదిని పతివ్రత అనరాదని కవిత్వం అల్లినాడు. ఎలా?

**విమర్శ:**

**"ఇహలోక సౌఖ్యంబునింతి వీడగలేక మూడు జన్మంబులు ముగుదదాల్చె ఇంద్రియంబుల గెల్వ నెరుగని ఈ కాంత మీతోడ పొత్తుండి మెలగగలదె తగ పతివ్రతయంచు ద్రౌపది ననరాదు, కులసతి కాదట్టి కోమలాంగి"**

**సమాధానము:** ఇహలోక సౌఖ్యాన్ని వీడలేక మూడుజన్మ లెత్తినదట ద్రౌపది. ఇంద్రియముల గెలువలేని ఈమెకు పాండవులతో పొత్తు కుదరదట. ద్రౌపదిని పతివ్రత అనరాదట.

ఇంతకూ ఆమె ఎత్తిన 3 జన్మలేవీ? **1) నాలాయని, 2) ఋషికన్య, 3) ద్రౌపది.**

**1) నాలాయని:** ముదుసలి, కుష్ఠురోగి, ముక్కోపియైన భర్తను పరమభక్తితో సేవించి, ఆరాధించి, పరిచర్యలు చేసి భర్త మెప్పుపొందిన **పరమపతివ్రత.**


**2) ఋషికన్య:** సౌందర్యవతి, సకలసద్గుణరాశి అయినప్పటికీ కన్యాత్వమున పెద్దకాలముండి, పతినికోరి పరమేశ్వరుని గూర్చి ఘోర తపస్సు చేసి పరమేశ్వరుని ప్రత్యక్షం గావించుకొన్న **మహాతపస్వి.**

**3) ద్రౌపది:** అయోనిజగా జన్మించి, పరమేశ్వరుని వర ప్రకారంగా పాండవులకు ధర్మపత్నియై దేశదేశాల రాజుల చేత, సకలముని జనులచేత, సమస్త ప్రజలచేత, శతృవుల చేతకూడా **మహాపతివ్రతగా ప్రశంసలందుకొన్న మహా ఇల్లాలు.**

**"పంచభిఃప్రాప్యకౌమారం మహాభాగా భవిష్యసి"** ప్రత్యేక పతి సాంగత్యంతో కన్యాత్వాన్ని వహిస్తూ పూజ్యురాలవై యుందువని పరమేశ్వరుడే ఋషికన్యకు వరమిస్తే-'తగ పతివ్రత యంచు ద్రౌపది ననరాదు' అన్న ఈ ప్రబుద్ధుణ్ణి ఏమనాలి?

పంచభర్తృకయైన ద్రౌపదిని మహాపతివ్రతయని ఎట్లా అనగలం? అనే పండిత, పామరులతో సహా సర్వజనుల సంశయాన్ని నివృత్తి చేయుటకు; అపూర్వము, అసాధారణము, అనన్య సామాన్యము, అమోఘము, ఆశ్చర్యకరము, అద్వితీయము అప్రమేయము అసదృశము, అన్యులకు అసాధ్యము, ప్రశంస నీయము అయిన పాంచాలీ పాండవ దాంపత్యమును గూర్చి, ద్రౌపదీ దేవి పాతివ్రత్యమహిమను గురించీ, సామాన్యులకు ఊహకు కూడా అందని ద్రౌపదీ సౌశీల్యం గురించి తెలుసు కుందాం.

**(వచ్చే సంచికలో..)**



# మహాభారతం

## ద్రౌపది 20

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)

(గత సంచిక తరువాయి)

### 8. ద్రౌపదీదేవి పాతివ్రత్య మహిమ

**అపూర్వము, అమోఘము, అనూహ్యము, అసాధారణము, అకళంకము, అసదృశము, అప్రమేయము, అనిర్వచనీయము, అద్వితీయము, అనన్య సామాన్యము, అనితరసాధ్యము (అన్యులకు అసాధ్యము), అసిధారావ్రతము (కత్తిమీద సాము లాంటిది), మహిమాన్వితము, సకల మునిజన సంస్తుతము, పరమేశ్వర వరనిర్దిష్టము, శతృవులచేత కూడా ప్రశంసనీయము ఐన ద్రౌపదీదేవి పాతివ్రత్య మహిమ ఎట్టిదో; పాంచాలీ పాండవ దాంపత్యం ఎలాంటిదో ఇప్పుడు తెలుసుకుందాం!**

#### a) పరమేశ్వర వరనిర్దిష్టము

ద్రౌపది పూర్వజన్మమున ఋషికన్య. ఆమె సకల సద్గుణ రాశి, రూపవతి, సౌశీల్యవతి. ఐనప్పటికీ ప్రారబ్ధవశాత్తు చాలాకాలం వరకు వివాహం కాలేదు. ఆమె శివుని గూర్చి ఘోరమైన తపస్సు చేసినది. పరమేశ్వరుడు ఆమె తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమై, 'నీకేం వరం కావాలో కోరుకోమన'గా ఆమె, "ప్రభూ! సర్వగుణ సంపన్నుడైన పతినిమ్మని పలుమార్లు అర్థించింది. భక్తసులభుడైన పరమేశ్వరుడు "నీకు ఐదుగురు పతులగుదురని వరమిచ్చాడు. దానికా ఋషికన్య, "దేవా! నేను గుణవంతుడైన ఒక్కపతిని కోరియే తపస్సు చేశాను" అని చెప్పగా పరమశివుడు, "కళ్యాణీ! నీవు పతినిమ్మని 5 మార్లు (పతిందేహి, పతిందేహి, పతిందేహి, పతిందేహి, పతిందేహి) పలికావు. అందుకే నీకట్టి వరమును ఇచ్చాను. నీకు శుభం జరుగుతుంది. నీవు మరొక దేహాన్ని ధరించినప్పుడే ఈ పంచపతిత్వము సిద్ధిస్తుంది" అన్నాడు.

అప్పుడా ఋషికన్య-

**శ్లో॥ యదియే పతయఃపంచ వరమిచ్ఛామి యాచితుం।**
**కౌమారంచ భవేత్ సర్వైః సంగమే సంగమేచమే॥**

***(కుంభకోణ ప్రతి ఆది ప.212 అ)***

**తా॥** దేవా! నాకు ఆ పంచపతిత్వము తప్పనియెడల నా యాచన నాలకించి నాకొకవరమును ప్రసాదించుము. ఏకైక పతి సాంగత్యమునందు నాకు కన్యాత్వము సిద్ధించునట్లు అనుగ్రహించుము" అన్నది.

అలా ఋషికన్య కోరగా పరమేశ్వరుడు-

**రుద్ర ఉవాచ:**

**శ్లో॥ భోగానాప్స్యసి సద్ధించ యోగేనచ మహత్త్వతాం॥**
**అన్యదేహాంతరే చైత రూపభాగ్య గుణాన్వితా॥**
**పంచభిః ప్రాప్య కౌమారం మహాభాగా భవిష్యసి**

(ఆది ప.212 అ)

**తా॥** "నీవు మరుజన్మలో రూప, భాగ్య, గుణాన్వితురాలవై ఏకైక పతి సాంగత్యమునందు కన్యాత్వమును వహించుచూ, ఐదుగురు భర్తలతో పూజ్యురాలివై ఉంటావు, సకల భోగభాగ్యాలతో తులతూగుతూ, మహిమాన్వితురాలివై ఉంటావు" అన్నాడు.

ఇదే విషయం ఆంధ్రభారతంలో కూడా ఇలాగే ఉన్నది. (ఆదిపర్వం సప్తమాశ్వాస)

**వ.** అనిన దానికి రుద్రుండిట్లనియె **261**

**క.** నా వచనంబున నీకయ్యేవురు పతులందు ధర్మవెడపక యుండున్
గావున నిట్టి వరంబిందీవరదళనేత్ర యిచ్చితిని దయతోడన్ **262**

**వ.** అనిన నదియట్లేని నయ్యేవురు పతులందును బ్రత్యేక సంగమంబునను నాకు గౌమారంబును, పతిశుశ్రూషాసిద్ధియుం, సౌభాగ్యంబును ప్రసాదింపవలయుననిన రుద్రుండు దాని కోరిన వరంబులెల్ల నిచ్చి........ **263**

ఋషికన్యకోరగా ప్రత్యేక పతిసాంగత్యమున కన్యాత్వమును, పతిశుద్రూషాసిద్ధియు, సౌభాగ్యమును పరమేశ్వరుడు ప్రసాదించాడు.

ఇటువంటి వరం ఉండబట్టే పాంచాలీ పాండవ దాంపత్యం సర్వజనామోదమూ, సకల ముని జనసంస్థుతమూ, శతృవుల చేత కూడా ప్రశసంనీయమూ అయినది. అంతే కాదు; ద్రౌపదితో పాండవుల వివాహం ఒక్కొక్కరితో ఒక్కొక్కరోజు జరిగినది కూడా అందుకే. ఎందుకు? ఎలా?

## b) ద్రౌపదీ పాండవుల వివాహం జరిగిన తీరు

మొదట తన కుమార్తె ద్రౌపదిని పాండవులైదుగురికి ఇచ్చుటకు అంగీకరించని ద్రుపదునికి వ్యాసభగవానుడు పాండవుల యొక్క, ద్రౌపదియొక్క పూర్వజన్మగాథకు సంబంధించిన పంచేంద్రోపాఖ్యానమును వివరించి, ఋషికన్యకు పరమ శివుడిచ్చిన వరములను తెలిపి, దివ్యదృష్టిని ప్రసాదించగా సర్వాన్ని కన్నులారా దర్శించాడు. అంతట ద్రుపదుడు వ్యాసునితో, "మహర్షీ! మీరు చెప్పిన విషయాలు తెలియక నేను ఈ వివాహానికి అంగీకరించలేదు. కాని విధాత ఏమి నిశ్చయించాడో దానిని కాదనటం ఎవరికి సాధ్యం? దైవఘటన అనివార్యం. ఈమె తపస్సు చేసి వరమును పొందినప్పుడు అలా చేయుటే ఉచితం. పరమేశ్వరుడే అలా విధించినప్పుడు అది ధర్మమైనా, అధర్మమైనా సరే, నేను అపరాధిని కాదలచుకోలేదు. ఈమె పాండవులైదుగురకు పత్నిగా పూర్వజన్మలోనే నిశ్చయించబడినది. కనుక ఈమె పాణిగ్రహణమును పాండవులు విద్యుక్తముగా చేయుదురు గాక!" అని తన సమ్మతిని తెలియజేశాడు.

అంత వ్యాసుడు ధర్మరాజుతో **"అద్యైవ పుణ్యాహముత వః పాండవేయ। పాణిం కృష్ణాయాస్త్వం గృహాణాద్య పూర్వం"** (ఆది ప.197 అ.5శ్లో) "పాండునందనా! నేడు పుణ్యదినం. మంచిముహూర్తం. అందువల్ల పెద్దవాడవైన నీవే ముందుగా ద్రౌపదీ పాణిగ్రహణము చేయుము" అని చెప్పెను. ద్రుపదుడు తన పుత్రులతో కలిసి ద్రౌపది వివాహమహోత్సవమునకు తగిన సన్నాహములు చేయుచుండగా పౌరులతోను, మహాజనులతోను, బంధుమిత్రులతోను, బ్రాహ్మణులతోను, అంతఃపుర కాంతలతోను, జానపదులతోను సభామండపము కిక్కిరిసిపోయింది. మంగళస్నాన మాచరించి ద్రౌపదీదేవి సర్వాభరణ భూషితురాలై వివాహ మండపంలో ప్రవేశించింది. అలాగే మంగళస్నానా లాచరించి అమూల్య వస్త్రాభరణ శోభితులై పాండవులు అగ్నివంటి తేజస్సు గల తమ పురోహితుడు ధౌమ్యునితో కలిసి, ఒకరి వెనుక ఒకరుగా వచ్చి సభలో ఆశీనులయ్యారు. ఆ తరువాత వేదపారంగతుడైన ధౌమ్యుడు మంత్రపూర్వకముగా అగ్నిని ప్రజ్వలింప జేసి, ఆహుతులు సమర్పిస్తూ యుధిష్ఠిరుని పిలిచి ద్రౌపదితో పాణిగ్రహణము చేయించాడు. అగ్నికి ప్రదక్షిణము చేయించి వివాహవిధిని నిర్వర్తింపజేశాడు. ఆ తరువాత ధర్మజుడు ధౌమ్యుని అనుజ్ఞను తీసుకుని ద్రౌపదితో కలిసి వివాహ మండపమును వీడి వెళ్ళాడు. ద్రౌపదీ ధర్మజుల వివాహాన్ని కన్నులారా వీక్షించిన ప్రజలు, బంధుమిత్రులు తమతమ నెలవులకు వెళ్ళారు.

**శ్లో॥ క్రమేణ చానేన నరాధిపాత్మజా**
**వరస్త్రియస్తే జగృహుస్తదాకరం।**
**హన్యహన్యుత్తమ రూపధారిణో**
**మహారథాఃకౌరవవంశవర్ధనాః ॥ (ఆది ప.197అ. 13శ్లో)**

తా॥ అదే క్రమంలో కురువంశవర్ధనులు, ఉత్తమ రూప సంపన్నులు, మహారథులు ఐన పాండవులు ఒక్కొక్క రోజున ఒక్కొక్కరు చొప్పున ద్రౌపదీపాణిగ్రహణం చేసిరి.

ఒక్కరోజు పాండవులైదుగురు ద్రౌపదిని వివాహమాడక ఒక్కొక్కరోజున ఒక్కొక్కరిచొప్పున వివాహము చేయించుటలోని రహస్యమేమిటి?

ఈ విషయాన్ని తరువాతి శ్లోకంలో దేవర్షి నారదుడు ఇలా తెలియజేశాడు.

**శ్లో॥ ఇదంచ తత్రాద్భుత రూపముత్తమం**
**జగాద దేవర్షిరతీతమానుషం।**
**మహానుభావాలకిల సా సుమధ్యమా**
**బభూవ కన్యైవగతే గతే హని॥ (ఆది ప.197 అ.14శ్లో)**

**తా॥** అక్కడ జరిగిన అద్భుత, ఉత్తమ, అలౌకిక ఘటనను దేవర్షి నారదుడు ఇలా వర్ణిస్తున్నాడు. **"దివ్యసుందర రూపంతో విలసిల్లే ద్రౌపదికి వివాహం జరిగిన మరుసటి రోజుకు కన్యాత్వం సిద్ధిస్తుంది గనుక ఇలా రోజుకొక్కరు చొప్పున వివాహమాడటం జరిగింది"**

పరమేశ్వర వరప్రభావంతో ద్రౌపదీదేవికి ఏ రోజునకారోజే (అనుదినము) కన్యాత్వము సిద్ధిస్తుంది గనుకనే ఇలా పాండవులు వరుసగా ఒక్కొక్కరోజు ఒక్కొక్కరుగా ద్రౌపదీ పాణిగ్రహణం చేశారు. ఇదీ పాంచాలీ పాండవ వివాహంలోని రహస్యం.

ఆంధ్రమహాభారతంలో కూడా ద్రౌపదీపాండవుల వివాహం ఇట్లే తెలుపబడినది.

వ. **"ఇట్లు వేల్చి ముందర ధర్మపుత్రునకు, ద్రుపరాజపుత్రిం బాణిగ్రహణంబు సేయించి తొల్లి యేవురకు వివాహంబు సేయు నప్పుడూ కన్యాత్వంబు దూషితంబు గాకుండా నీశ్వరువరంబునం గౌమారత్వంబు వడసిన యక్కన్యకం గ్రమంబున భీమార్జున నకులసహదేవులకుంబాణిగ్రహణంబు సేయించిన" (ఆది ప.సప్తాశ్వాసం 284)**

**దీనిని బట్టి ప్రతిదినము కన్యగానే ద్రౌపది వివాహవేదికపై వచ్చి ఒక్కొక్కరిని వివాహమాడుట అపూర్వం, అకళంకము, అప్రమేయము, అనితరసాధ్యము. ఇదంతా పరమేశ్వర వరప్రసాదం వల్లనే జరిగింది.**

-వివాహం జరిగింది. మరి ఒక్క ద్రౌపదియందు పంచ పాండవులు ఎలాంటి భేదభావము లేకుండా దాంపత్యాన్ని ఎలా కొనసాగించారు?

## c) పాంచాలీ పాండవ దాంపత్య నియమం

పాండవులు ఇంద్రప్రస్థంలో ఉండగా ఒకనాడు నారదుడు విచ్చేశాడు. ధర్మరాజు ఎదురేగి మహర్షిని ఆహ్వానించి అర్ఘ్య పాద్యాదులర్పించి, సుఖాసీనుని చేశాడు. పాండవులు ఒక్కొక్కరే వచ్చి నారదమహర్షికి నమస్కరించి ఆశీస్సులందుకున్నారు. ఆ

తరువాత ద్రౌపదీదేవి వచ్చి మహర్షికి నమస్కరించి ఆయన ఆశీర్వాదాలు పొందింది. అంతట **నారదుడు ఏకాంతమున పాండవులతో** ఇలా అన్నాడు.

**శ్లో॥ పాంచాలీ భవతామేకా ధర్మపత్నీ యశస్వినీ।**
**యథావో నాత్రభేదఃస్యాతః తథానీ తిర్విధీయతాం**
**(ఆది ప. 207 అ.18శ్లో)**

**తా॥ యశస్విని పాంచాలి ఒక్కతే మీ అందరకు ధర్మ పత్నియై ఉన్నది. అందువల్ల మీలో మీకు భేదభావం కలుగ కుండుటకై మీరొక నియమమును చేసుకొనవలెను.**

ఇలా చెప్పి నారదుడు "పాండునందనులారా! ఈ విషయంలో మీకొక ఉపాఖ్యానాన్ని వినిపిస్తాను. సుందోపసుందు లనే సోదరులిద్దరు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఒకే కంచంలో తినేవారు, ఒకే శయ్యపై పరుండే వారు, ఒకే ఆసనంపై కూర్చుండేవారు. అయినప్పటికీ వారు తిలోత్తమ అనే అప్సరస కొరకై పరస్పరం ఒకరితో ఒకరు పోరాడి ఇరువురూ మరణించారు" అని వినిపించి, "ధర్మనందనా! మీలో మీకు వైరభావం కలగకుండా ఉండాలంటే ఏదో ఒక నియమాన్ని ఏర్పరచుకోండి" అని హితవు పలికాడు.

నారదమహర్షి మాటల్లోని మర్మాన్ని గ్రహించాడు ధర్మరాజు. నారదమహర్షి సమక్షంలోనే పాండవులు తమలో తాము ఒక నియమాన్ని ఏర్పరచుకొన్నారు.

**శ్లో॥ ఏకైకస్య గృహేకృష్ణా వసేత్ వర్షమకల్మషా।**
**ద్రౌపద్యాసః సహాసీనా నన్యోన్యం యోభిధర్శయేత్।**
**సనోద్వాదశవర్షాణి బ్రహ్మచారీ వనే వసేత్॥**
**(ఆది ప.211అ.29శ్లో)**

**తా॥** పాండవులలో ఒక్కొక్కరి ఇంట ద్రౌపది ఒక్కొక్క సంవత్సరం ఉంటుంది. ఆ కాలంలో ద్రౌపదితో ఏకాంతంలో ఉన్న సోదరుని మరొక సోదరుడు చూసినట్లైతే అతడు 12 సంవత్సరములు బ్రహ్మచర్యవ్రతంతో వనవాసం చేయాలి.

ఇదీ నియమం. అది విని నారదమహర్షి సంతోషంతో వెళ్ళిపోయాడు. ఇట్టి నియమాన్ని అనుసరించి పరస్పర అనురాగంతో, భక్తి విశ్వాసాలతో, లోకోత్తర సౌమనస్యముతో, ఎట్టి భేదభావాలు, పొరపొచ్చాలు లేకుండా పాంచాలీ పాండవుల దాంపత్యం సాగిపోతున్నది.

– ఈ నియమం ప్రకారం నడుచుకుంటున్నారు. బాగానే ఉంది. ఇలా నడుచుకుంటున్నా ద్రౌపది ఐదుగురితో వర్తిస్తూ లోకోత్తరమైన తన పాతివ్రత్య ధర్మాన్ని ఎలా కొనసాగిస్తున్నది? ఊహకు కూడా అందని ఆమె ప్రవర్తన ఏమిటి? ఆమె మనోనిగ్రహం ఎట్టిది?

## D) ద్రౌపదీదేవి లోకోత్తర పాతివ్రత్యం

సామాన్యంగా లోకంలో స్త్రీకి ఒక్క భర్తయే ఉంటాడు. కనుక అట్టి భర్తయందు అనురాగంతో ఉంటూ, భర్త అభిప్రాయాలకు, మాటలకు విలువనిస్తూ, భర్తను గౌరవిస్తూ, పూజిస్తూ, సేవలు చేస్తూ పాతివ్రత్య ధర్మాన్ని నెరవేర్చుకోవచ్చు. సీత, సావిత్రి, అనసూయ, అరుంధతి.. ఇలా ఎందరో పవిత్రతామ తల్లులు ఈ భూమిపై అవతరించి, పతివ్రతలుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. కాని ఇక్కడ ద్రౌపదికి ఐదుగురు భర్తలు. ఐదుగురు భర్తలతో ద్రౌపది ఎలా పతివ్రతగా పరిగణించబడినది? ఈ విషయం మన ఊహకు కూడా అందదు. అందుకే ఇది లోకోత్తర పాతివ్రత్యం అనటం ఏమిటది?

### ఎలా ప్రవర్తించింది ద్రౌపది పాండవులతో?

నారదుని హితబోధతో పాండవులైదుగురు ద్రౌపదితో ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం ఉండునట్లు నియమం ఏర్పరచు కున్నారు. ఈ నియమం ప్రకారం ద్రౌపది **ధర్మరాజు గృహంలో ఉన్న సంవత్సరం ధర్మరాజును భర్తగా అనురాగంతో చూస్తూ,** భీమార్జున నకులసహదేవులను మరుదులుగా వాత్సల్యంతో చూచేది. **భీముని గృహంలో ఉన్న సంవత్సరం భీముని భర్తగా అనురాగంతోను,** మిగిలిన అర్జున నకుల సహదేవులను మరుదులుగా వాత్సల్యంతోను చూచేది. 'పితృసమోజ్యేష్ఠ' పెద్దవాడు (అన్న) **తండ్రితో సమానము అనే శాస్త్రవచనము ననుసరించి ధర్మరాజును మామగా పూజ్యభావంతో** గౌరవించేది. అలాగే **అర్జునునితో కూడియున్నప్పుడు అర్జునుని పతిగా అనురాగం తోను,** ధర్మజభీమసేనులను మామలుగా పూజ్యభావం తోను, నకులసహదేవులను మరుదులుగా వాత్సల్యంతోను చూచేది. ఇక **నకులునితో నున్నప్పుడు నకులుని భర్తగా అనురాగంతోను,** ధర్మజ భీమార్జునులను మామలుగా పూజ్య భావంతోను, సహదేవుని మరిదిగా వాత్సల్యంతోను చూచేది. ఇక **సహదేవునితో ఉన్న సంవత్సరం సహదేవుని భర్తగా అనురాగం తోను, ధర్మజ, భీమార్జున నకులులను మామూలుగా పూజ్యభావం తోను చూచేది.**

ఈ విధంగా పాండవులు ద్రౌపదీదేవికి పతులు మాత్రమే కాదు; మామలు, మరుదులు కూడా. ఈ పద్ధతిని బట్టి సర్వ జ్యేష్ఠుడైన ధర్మరాజు స్వయంగా పతియు, సోదరులను బట్టి మామయుకాగా; సర్వకనిష్ఠుడైన సహదేవుడు స్వయంగా భర్తయు, అన్నలను బట్టి మరిదియు అయ్యాడు. ఇక మధ్య ఉన్న భీమార్జున నకులులు ముగ్గురు స్వయంగా పతులును, అన్నలనుబట్టి మరుదులను, తమ్ములను బట్టి మామలుగాను అయ్యారు. ఈ విషయాన్ని తెలియజేసే ఒకే ఒక్క శ్లోకం మహాభారతంలో ఇలా ఉన్నది.

**శ్లో॥ జ్యేష్ఠే పతిశ్వరుతా పతిదేవరతా నుజే।**
**మధ్యమేషచపాంచాల్యాస్త్రితయంత్రితయంత్రిషు॥**

**తా॥** జ్యేష్ఠే (పెద్దవాడు) పతి (భర్త) శ్వశురత (మామ)

కాగా; అనుజే (చిన్నవాడు) పతి (భర్త) దేవరత (మరిది) ఆయ్యాడు. మధ్యమేషు (మధ్యలో ఉన్న) త్రిషు (ముగ్గురు) పాంచాల్యా (పాంచాలికి) త్రితయం త్రితయం (భర్తలు, మామలు, మరుదులు)

ఇలా భర్తగా భావించినకాలంలో అనురాగాన్ని చూపుతూ; మరిదిగా భావించిన కాలంలో వాత్సల్యాన్ని చూపుతూ, మామగా భావించిన కాలంలో పూజ్యభావాన్ని చూపుతూ అపూర్వము, అనన్య సాధారణము, అసదృశము, అనితరసాధ్యము, అకళంకము అయిన పాతివ్రత్య ధర్మాన్ని కాపాడుకుంటూ అభేద్యముగా పంచపాండవులతో కాపురము చేసి సత్కీర్తిని వెలయించిన సాధ్వీ శిరోమణి ద్రౌపదీదేవి. ఎంతటి మనోనిగ్రహం, ఎంతటి సమర్థత, ఎంతటి దైవానుగ్రహం ఉంటే సాధ్యపడుతుంది ఇలాంటి పాతివ్రత్యధర్మం? అసాధారణమైన ఈ ద్రౌపదీదేవి సచ్చరిత్రము ఆస్తికులైన భారతీయులకు పాపహరం అనుటలో అతిశయోక్తి లేదు

**ఇట్టి పాతివ్రత్య ధర్మాన్ని కొనసాగించటానికి ద్రౌపదికి ఎలా సాధ్యమయింది?**



పూర్వజన్మలో ఋషికన్యగా ఉన్నప్పుడు చేసిన ఘోర తపస్సుకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై పంచపతిత్వమును విధించినప్పటికీ ఏకైక పతిసాంగత్యమున కన్యాత్వసిద్ధి కలుగుతుందని, ఐదుగురు భర్తలైనప్పటికీ పూజ్యురాలవై యుంటావని వరాన్ని అనుగ్రహించటం **ఒక కారణం**. మహాభారతంలో పరాశరుడు వ్యాసజననం తర్వాత సత్యవతికి కన్యాత్వాన్ని ప్రసాదించాడు. సూర్యభగవానుడు కుంతీదేవికి కన్యాత్వాన్ని ప్రసాదించాడు. ఇపుడు సాక్షాత్తు పరమేశ్వరుడే పతితో సంగమించిన తర్వాత కన్యాత్వం సిద్ధిస్తుందని వరమిచ్చాడు.

ఇక నారదుని ప్రేరణతో పాండవులు ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం ద్రౌపదితో ఉండుటకు నియమేర్పరచుకోవటం **రెండవ కారణం**. దీనివల్ల సోదరులు మధ్య ఎటువంటి భేదం గాని, వైమనస్యంగాని ఏర్పడకుండా దాంపత్యం సాఫీగా సాగిపోయింది.

ద్రౌపదీదేవియొక్క అద్భుత మనోనిగ్రహం వల్ల పాండవులను పతులుగా, మామలుగా, మరుదులుగా చూడగలగటం **మూడవకారణం**.

అందుచేతనే పాంచాలీ పాండవదాంపత్యం దేవర్షి నారదుని చేత, మునులచేత, మహర్షులచేత ప్రశంసించబడినది. అంతేకాదు సామ్రాజ్యంలోని సాధారణ పౌరులు గాని, జానపదులు గాని, అధికారులుగాని, సామంతులుగాని, పురోహితులుగాని-ఎవ్వరూ కూడా పాంచాలీ పాండవదాంపత్యాన్ని తప్పుపట్టలేదు.

ఒక మహారాజుగాని, లేదా చక్రవర్తి గాని ఎందరినైనా వివాహం చేసుకోవచ్చు. దానికి ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేదు. కాని పట్టపురాణి కావాలంటే మాత్రం ప్రజల, పౌరజానపదుల అంగీకారం ఆనాడు తప్పనిసరిగా ఉండాలి. రాజసూయ యాగానంతరం ధర్మరాజు సామ్రాజ్య పట్టాభిషిక్తుడైనప్పుడు ద్రౌపది పట్ట మహిషిగా పట్టాభిషిక్తురాలైనది. దీనికి సమస్త ప్రజలు అంగీకరించారు. దీనిని బట్టి ఆనాటి వారెవ్వరికీ ద్రౌపదీ పాతివ్రత్యంపై గాని, పంచపతిత్వంపై గాని ఎట్టి అపనమ్మకంగాని, వ్యతిరేకతగాని లేదని స్పష్టమవుతున్నది.

-ఇట్టి ద్రౌపదీ దేవి యొక్క పాతివ్రత్యాన్ని నిరూపించే సంఘనటలు ఏమిటో తెలుసుకుందాం!

(వచ్చే సంచికలో..)


---

# వేషధారణ-నామస్మరణ

ఓ కిరాతకుడు పక్షులను పట్టుకొనుటకై విల్లు అమ్ములతో అడవికి వెళ్ళాడు. అతని వాలకము గమనించి, అవి ఎగిరిపోయినవి. అందుచేత నిస్పృహ చెంది, ఒక గుట్టచాటున దాగి చూచుచుండెను. ఇంతలో ఒక వైష్ణవుడు కట్టెలు కొట్టుకొనుటకు అక్కడికి వచ్చాడు. పక్షులు యథాప్రకారం ఎగిరివచ్చి, స్వేచ్ఛగా విహరింపసాగెను. కొన్ని పక్షులు అతడు తెచ్చుకున్న చద్దిమూటపై కూడా వాలినవి. కిరాతకునికి ఒక ఉపాయం తట్టింది. వైష్ణవ వేషము వేసుకొని, చద్దిమూటలో మందు కలుపుకొని వచ్చిన బాగుండునని ఆలోచించాడు. అలాగే చేశాడు కూడా! కానీ తీరా పక్షులు నిర్భయంగా దరిచేరినప్పుడు అతని హృదయము మారిపోయెను. కేవలం వేషము వలననే తనకు అంత ప్రభావమున్నప్పుడు, నిజముగా వైష్ణవుడైన ఎంత బాగుండుననిపించినది. అదే భావనతో హరినామస్మరణ చేయుచు, ఆ మందు కలిపిన చద్దిమూటను మట్టిలో పూడ్చివేసెను. కాలక్రమములో భక్తుడిగా మహాభక్తుడిగా మారి చరిత్రలో నిలిచిపోయెను.

కాబట్టి వేషధారణను బట్టే నడక, నడత, మనసు మారుతుంటాయి. ఏది స్మరిస్తూంటామో ఆ ప్రభావం మనస్సుపై ఉంటుంది కూడా! అందుకని మంచిగా వస్త్రధారణ చేసుకుందాం! మంచి మాటలు, ఆలోచనలు ఎల్లప్పుడూ మనసులో నింపుకుందాం!!

**-బి. లక్ష్మికుమారి**



# మహాభారతం

## ద్రౌపది 21

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

### 9. ద్రౌపదీదేవి పాతివ్రత్యాన్ని నిరూపించు సంఘటనలు

#### A) అనంత వస్త్రావిర్భావము

ధర్మనందనుడు ధృతరాష్ట్రుని పిలుపు మేరకు హస్తినాపురం వచ్చి శకునిప్రేరణతో జూదమాడటం జరిగింది. జూదంలో సర్వసంపదలను, రాజ్యాన్ని, తమ్ములను కోల్పోవటంతో తనను తాను ఒడ్డుకొని ఓడిపోయాడు. ఆ తరువాత శకుని ప్రేరేపించగా ద్రౌపదిని ఒడ్డి ఓడిపోయాడు. పిమ్మట దుశ్శాసనుడు దుర్యోధనుని ఆజ్ఞపై అంతఃపురం నుండి ద్రౌపదిని జుట్టుపట్టుకుని సభకు ఈడ్చుకొని వచ్చాడు. నేను ధర్మవిజితనో, అధర్మవిజితనో చెప్పమని ద్రౌపది సభికులను, పెద్దలను ప్రశ్నించింది. కొంతచర్చ జరిగిన తర్వాత దుర్యోధన సోదరులలో ఒకడైన వికర్ణుడు 'ద్రౌపదీ ప్రశ్నకు సమాధానం చెప్ప'మని సభాసదులను ప్రోత్సహించి, ఎవ్వరూ మారు పలుకక పోవటంతో "నేనే ధర్మనిర్ణయం చేస్తున్నాను" అని చెప్పి ద్రౌపది ధర్మవిజిత కాదు, అధర్మవిజితయేనని సకారణంగా తీర్పుచెప్పి, అట్టి ద్రౌపదిని, పరమపతివ్రతను, రజస్వలను, ఏకవస్త్రను సభకీడ్చితెచ్చుట అధర్మము, అన్యాయము అన్నాడు. దానిపై కర్ణుడు వికర్ణుని దూషించి, "ఈ ద్రౌపది బంధకి (కులట) అట్టి ఈమె ఏకవస్త్రయే కాదు, వివస్త్రయైనా తప్పులేదు" అని చెప్పి దుశ్శాసనునితో -

శ్లో॥ దుశ్శాసన సుబాలోయం వికర్ణ ప్రాజ్ఞవాదికః
పాండవానాంచవాసాంసి ద్రౌపద్యాశ్చాప్యుపాహర॥
(సభా ప.68 అ.38శ్లో)

తా॥ "దుశ్శాసనా! ఈ వికర్ణుడు మూర్ఖుడు, అయినప్పటికీ విద్వాంసునిలాగా మాట్లాడుతున్నాడు. నీవు ద్రౌపదియొక్క వస్త్రాలను హరించు" అన్నాడు.

ద్రౌపదీ వస్త్రాపహరణానికి మూలపురుషుడు కర్ణుడు, సినిమాలలో చూపించినట్లుగా దుర్యోధనుడు కాదు వస్త్రాపహరణానికి ఆజ్ఞ ఇచ్చినది. ఈ నీచానికి పాల్పడినవాడు, సభలో ద్రౌపదిని నోటికి వచ్చినట్లు ప్రేలినవాడు, అధర్మాన్ని ధర్మంగా చిత్రించినవాడు కర్ణుడే. దుర్యోధనుని కన్నా, దుశ్శాసనుని కన్నా, శకునికన్నా భయంకరంగా నీచాతి నీచంగా, ఒక త్రాగుబోతులా మాట్లాడిన దుష్టుడు కర్ణుడే. అలా కర్ణుని ప్రోత్సాహంతో దుశ్శాసనుడు వస్త్రాపహరణానికి ఉపక్రమించాడు.

భయంకరమైన గాలివానకు కొబ్బరిచెట్టు ఊగిపోయినట్లుగా ద్రౌపది అల్లల్లాడిపోయింది. అప్పుడు భగవానుని స్మరించింది, ప్రార్థించింది. ద్రౌపది ఆర్తనాదం భగవానుని హృదయాన్ని చలింపజేసింది. అంతే, ద్రౌపది శరీరం నుండి అక్షయంగా వస్త్రాలు వస్తూనే ఉన్నాయి. ఆమె శరీరంపై చీర అలాగే ఉంటూ రంగురంగుల చీరెలు అక్కడ గుట్టలుగా పడి ఉన్నాయి. దుశ్శాసనుడు చీరలు లాగి లాగి చేతులు నొప్పి పుట్టి, చమటలు పోసి, అలసి సొలసి పడిపోయాడు. ఈ అద్భుత దృశ్యం సభలోనున్నవారందరిని ఆశ్చర్య చకితులను చేస్తున్నది. ద్రౌపదిని ప్రశంసిస్తూ దుశ్శాసనుని నిందిస్తున్నారు సభికులంతా.

ఇక్కడ తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే ఎంతటి భక్తులకైనా సరే భగవంతుడు ఏమికోరితే దానినివ్వడు. మనకు అర్హత ఉండాలి. అందుకే ఎవ్వరికీ కూడా కోరిన కోరికలన్నీ నెరవేరవు. మనం బ్యాంకుకు వెళ్ళి లక్ష రూపాయలు కావాలని చెక్కు ఇస్తాం. అయితే మన ఖాతాలో అంత డబ్బు ఉంటేనే మన చెక్కు మంజూరు అవుతుంది. లేనిచో తిరస్కరిస్తారు. అలాగే మన ఖాతాలో పుణ్యం, సుకృతం ఉన్నంతవరకే భగవంతుడు మన కోర్కెలు తీరుస్తాడు.

ఇప్పుడు ద్రౌపది భగవంతుని ప్రార్థించింది. భగవంతుడు అక్షయ వస్త్రాలిచ్చాడు. అంటే ఇక్కడ భగవంతుడెక్కడో కూర్చొని ఒక చీరెను మరొక చీరెతో కుట్టి పంపటం కాదు. ద్రౌపదీ

దేవి శరీరం నుండియే భగవంతుని అనుగ్రహంతో అక్షయంగా వస్త్రములు ఆవిర్భవిస్తున్నాయన్నమాట. ఈ అద్భుతం ఎలా జరిగింది? ద్రౌపదీదేవి యొక్క అమోఘపాతివ్రత్యమే వస్త్ర రూపంలో అనంతంగా శరీరం నుండి ఆవిర్భవిస్తున్నాయి. దీనినిబట్టి ద్రౌపది మహాపతివ్రతయని మనకు ఋజువౌతుంది.

**B) ధృతరాష్ట్రుడు కంఠోక్తిగా చెప్పుట**

వస్త్రాపహరణంతో శాంతించలేదు దుష్టచతుష్టయం. భీమసేనుడు క్రోధంతో ద్రౌపదినిలా ఘోరాతి ఘోరంగా అవమానించిన దుశ్శాసనుని రాబోయే యుద్ధంలో గుండెలు బ్రద్దలుకొట్టి వెచ్చటి నెత్తురు పానం చేస్తానని శపథం చేశాడు. విదురుడు సభాసదులతో ద్రౌపదీప్రశ్నకు ఇప్పటికైనా సమాధానం చెప్పండని ప్రోత్సహించాడు. సభ ఆలోచనలో మునిగి ఉంది. అప్పుడు కర్ణుడు లేచి “దుశ్శాసనా! ఈ ద్రౌపది మీ దాసి, కనుక దాసీలుండే గృహానికి తీసుకుపో!” అన్నాడు. ద్రౌపది తిరిగి సభాసదులను అడిగింది “నేను దాసినా?” అని. పెద్దలు మాట్లాడుతున్నారు. మధ్యలో కర్ణుడు అందుకున్నాడు “ద్రౌపదీ! పాండవులకు నీపై ఏ అధికారము లేదు. కౌరవులే నీ ప్రభువులు. దుర్యోధనుని పరిచారికలలో చేరిపో. వాళ్ళు ఏ సేవలో వినియోగిస్తే దానినే భాగ్యంగా భావించు” అని రెచ్చ గొడుతున్నాడు. అంతేకాదు, “ద్రౌపదీ! నీకు ఐదుగురు భర్తలున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కనుక జూదంలో ఆలినొడ్డి ఓడిపోని ఆరవవానిని ఎంచుకో” అంటూ దుర్యోధనునిని కనుసైగ చేయటంతో; దుర్యోధనుడు ద్రౌపది వైపు చూచి, చిరునవ్వులు చిందిస్తూ తన తొడపై వస్త్రాన్ని తొలగించి తన ఎడమ తొడపై కూర్చోమన్నట్టు సైగ చేశాడు.

దానితో భీముని నేత్రాలు రక్తగోళాలైనవి, “రాజ్య సంపదల మదంతో ఈ ద్రౌపదికి తొడను చూపి సైగచేసిన ఈ దురాత్ముడైన దుర్యోధనుని తొడలను యుద్ధంలో విరగగొట్టక పోతే నా పితృపితామహుల లోకాలకు దూరమై పోయెదను గాక!” అని భీకర ప్రతిజ్ఞ చేశాడు భీమసేనుడ.

అదే సమయంలో ధృతరాష్ట్రుని గృహం సమీపంలో నక్క కూసింది. దానిని అనుసరించి గాడిదలు ఓండ్రపెట్టినవి. రౌద్రములైన పక్షులు అమంగళకరధ్వనులు చేసినవి. ఉత్పాత రూపమైన ఆ ఘోర శబ్దాలు విని గాంధారీ విదురులు భయపడి ధృతరాష్ట్రుని వద్దకు పరుగులు తీసి ఉత్పాతాలను వివరించారు.

దానితో ధృతరాష్ట్రుడు ప్రప్రథమంగా నోరు విప్పాడు. ఏమని-

**శ్లో॥ హతోసి దుర్యోధన మందబుద్ధే**
**యస్త్వం సభాయాం కురుపుంగవానాం।**
**స్త్రియం సమాభాషసి దుర్వినీత**
**విశేషతో ద్రౌపదీం ధర్మపత్నీం॥ (సభా ప. 71 అ. 25శ్లో)**

**తా॥** ఓ మందబుద్ధీ! దుర్యోధనా! నీవు గెలిచినా మరణించినట్లే. దుర్వినీతా! నీవు శ్రేష్ఠులైన కురువంశీయుల సభలో కులస్త్రీని అందునా పాండవుల ధర్మపత్నిని తీసుకొచ్చి దుర్భాషలాడుతావా? ఛీ! ఛీ!! నీవు పాపివి.

ఇదే ఆంధ్రభారతంలో నన్నయగారు ఎలా తెనిగించారో చూద్దాం-

**చం. పరమపతివ్రతన్ సభతపస్విని పాండవ ధర్మపత్ని ధ**
**ర్మరత నయోనిజం బ్రకృతి మానవభామినిగా దలంచి దె**
**ప్పరములు వల్కగా దగునె బాల్యమునాదిగ దుష్టభావనన్**
**బెరిగితి నీ నిమిత్తమున బెద్దయుదుఃఖితులైరి పాండవుల్**
**(సభా. ద్వి. ఆ. 255)**

ఇలా దుర్యోధనుని నిందించి ద్రౌపదితో-

**శ్లో॥ వరంవృణీష్వపాంచాలి మత్తోయ దభివాంఛసి**
**వధూనాం హి విశిష్టామేత్వం ధర్మపరమా సతి॥**
**(సభా. ప. 71 అ. 27శ్లో)**

**తా॥** “అమ్మా! నీవు నా కోడండ్రందరిలోను శ్రేష్ఠురాలవు, ధర్మపరాయణురాలవు. పతివ్రతవు. నీ ఇష్టం వచ్చిన వరాన్ని కోరుకో, అనుగ్రహిస్తాను” అన్నాడు ధృతరాష్ట్రుడు.

-ఇంతకీ ద్రౌపదీదేవి కర్ణుడన్నట్లు బంధకియా? లేక ధృతరాష్ట్రుడున్నట్లు పతివ్రతయా?

దుష్టులైన తన కుమారులను, కర్ణుని చాటుగా ప్రోత్సహించే ధృతరాష్ట్రుడు పైకి ద్రౌపదిని పతివ్రతయని పరమ పతివ్రతయని ప్రశంసించాడే గాని లోలోపల అలాంటి భావం లేదు; కర్ణుని అభిప్రాయమే తనకూ ఉన్నది-అంటారా? ఐతే అమ్మా ద్రౌపదీ! నీవు నా కోడండ్రందరిలోను శ్రేష్ఠురాలివని ఎందుకన్నాడు? ఒకవేళ కర్ణుడన్నట్లు ద్రౌపది కులటవేశ్య ఐతే ఆమె తన కోడండ్రందరికన్నా శ్రేష్ఠమైనదన్నాడు గదా! అంటే తన కోడండ్రు కులటల కన్నా వేశ్యలకన్నా అధములని ఆయన అభిప్రాయమా? అంగీకరిస్తారా కౌరవాభిమానులు? కౌరవాభిమానులే కాదు మానవత్వం ఉన్న ఎవ్వరూ అంగీకరించరు. అంటే ఇక్కడ ధృతరాష్ట్రుడు కర్ణుని మాటలను తిరస్కరించటమే కాదు, కర్ణుని వాచాలత్వాన్ని అసహ్యించుకున్నాడు కూడా. అందుకే ద్రౌపదిని పరమపతివ్రత అని ప్రశంసించటమే గాక, ఆమెను తన కోడండ్రతో పోల్చి వారికంటే శ్రేష్ఠురాలని, ధర్మపరాయణ అని కూడా చెప్పటం జరిగింది. ఇలా ధృతరాష్ట్రుడు కంఠోక్తిగా, నిస్సందేహంగా ద్రౌపదీదేవి పాతివ్రత్యాన్ని ప్రకటించాడు.

ద్రౌపది సౌశీల్యాన్ని, సమర్ధతను, సహనాన్ని గూర్చి దుర్యోధనుని ద్వారానే ఇంతకుముందు విని ఉన్నందున ధృతరాష్ట్రుడిలా నిస్సందేహంగా ప్రకటించటం జరిగింది.

ఎప్పుడు చెప్పాడు దుర్యోధనుడు తండ్రితో? ధర్మజ

సూక్తిమాలిక **కోరికలతో జీవించే వ్యక్తికి సేవాభావం ఉండదు. సేవాభావంతో జీవించే వ్యక్తికి కోరికలు ఉండవు**

రాజసూయ యాగానికి వెళ్లి, అక్కడ కొన్ని నాళ్ళుండి తిరిగి వచ్చిన తర్వాత, పాండవుల ఐశ్వర్యమునకు కన్ను కుట్టిన దుర్యోధనుడు శకునితో ఆలోచించి, మాయాజూదానికి ధర్మజుని రప్పించుటకు తండ్రివద్దకెళ్ళి తండ్రితో మాట్లాడే సందర్భంలో ఇలా అన్నాడు

**సీ. జన్మంబుసూడంగ సకలభూములనుండి**
**వచ్చిన రాజన్య వరులనవని**
**సురులను వైశ్యుల శూద్రుల నాత్మీయ**
**బంధుసుహృద్వీర భటనియోగ**
**జనులను, పేదల సాధుల నిత్యంబు**
**దాన పరీక్షించి తగవెతింగి**
**యన్నంబు దయబెట్టి యందఱు గుడిచిన**
**దనుమధ్య యర్ధరాత్రంబునపుడు**
**ఆ. గాని కుడువదట్టి కమలాక్షి ద్రౌపది**
**యదియుగాక యమ్మహాధ్వరమున**
**నధముడయ్యగడు బ్రియంబున నభ్యర్చి**
**తుండకాని వంచితుండ లేదు**

**- (సభాప. ద్వితీయాశ్వాసం 116)**

**భావం:** యజ్ఞాన్ని చూచుటకు అన్ని దేశాలనుండి వచ్చిన రాజులను, బ్రాహ్మణులను, వైశ్యులను, శూద్రులను, ఆత్మీయ బంధవులను, వీరభటులను, పేదలను, సాధువులను ప్రతి నిత్యము తానే స్వయంగా పరికించి, అందరూ భుజించారో లేదో చూచి, అందరూ భుజించిన తరువాత ఎప్పుడో అర్ధరాత్రి సమయాన తాను భుజించేది కమలాక్షి ద్రౌపది. అంతేకాదు, రాజసూయ మహాయజ్ఞము జరిగినంత కాలం అధముడు కూడా ప్రేమతో పూజింపబడ్డాడే గాని వంచింపబడ్డవాడే లేడు.

ఇలా ద్రౌపదిని ప్రశంసించి చెప్పినవాడు దుర్యోధనుడు. కాని కర్ణుడు వాచాలుడు గనుకనే బంధకి యన్నాడు.

ఏ ద్రౌపదిని కర్ణుడు ఈనాడు బంధకి అంటున్నాడో, ఆ ద్రౌపది పట్టమహిషిగా, అర్ధాంగిగా, ధర్మపత్నిగా ధర్మరాజు రాజసూయ యాగము చేయగా, ఆ యాగానికి భీష్మ, ధృతరాష్ట్ర, విదుర, ద్రోణ, కృప, అశ్వత్థామ, దుర్యోధన, శకునిలతో పాటుగా వెళ్ళి ఈ కర్ణుడు వారిచేత సత్కారములందుకొని వచ్చినవాడే. ఆనాడు ద్రౌపదీదేవి కులకాంతయా? నేడు కులటయా? ఇదే వాచాలత్వం అంటే.

ఇక్కడిలా మాట్లాడిన ఈ కర్ణుడే రాయబారానంతరం తిరిగి వెళ్ళే కృష్ణునితో ఊరి పొలిమేరలలో ఏకాంతంగా ఏమన్నాడు?

**శ్లో॥ యదబ్రువ మహంకృష్ణ కటుకానిస్మపాండవాన్**
**ప్రియార్థం ధార్త రాష్ట్రస్య తేన తప్యేహ్యకర్మణా॥**

**(ఉద్యో. ప.141 అ. 45శ్లో)**

**తా॥** కృష్ణా! నాడు సభలో పాండవులకు మర్మభేదకము లగునట్లు కటువుగా ఏ మాటలు మాట్లాడితినో అవన్నీ దుర్యోధనాదుల ప్రీతికొరకు మాట్లాడాను. నన్ను క్షమించు–

అదుసుతొక్కటం, కాలుకడగటం, నోటికి వచ్చినట్లు ప్రేలటం, క్షమాపణలు కోరటం, ఇదీ కర్ణుని మనస్తత్వం. (ముందు ముందు ప్రత్యేకంగా కర్ణుని శూరత్వాన్ని, దాన గుణాన్ని, ప్రభుభక్తిని, వాచాలత్వాన్ని, అతడి వ్యక్తిత్వాన్ని అందించటం జరుగుతుంది)

ఏతావాతా తేలినదేమంటే–ధృతరాష్ట్రుడు గాని, భీష్మద్రోణ విదురులుగాని, దుర్యోధనుడుగాని, శకునిగాని, సభలో కూర్చున్న రాజలోకంగాని, ఆనాటి ప్రజలు గాని, ముని జనులు గాని–ఎవ్వరూ ద్రౌపదిని బంధకి అనిగాని, పతివ్రత కాదని గాని అనలేదు, భావించలేదు. వాచాలుడు గనుక కర్ణుడు వాగి తర్వాత పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేశాడు. ద్రౌపది మహాపతివ్రతయనుట నిర్వివాదాంశం.

## C) విరాటుని కొలువులోని సంఘటన

అజ్ఞాతవాసాన్ని విరాట నగరంలో గడిపేందుకు నిశ్చయించుకున్నారు పాండవులు. ద్రౌపది 'మాలిని'పేరుతో 'సైరంధ్రి'గా విరాటుని భార్య సుధేష్ణ కొలువులో చేరింది. పది నెలలు గడిచిన తరువాత విరాటుని బావమరది కీచకుడు సుధేష్ణాదేవి మందిరంలో ద్రౌపదిని చూచాడు. అసమాన సౌందర్యంతో విరాజిల్లే ద్రౌపదిని చూచి కామపరవశు దయ్యాడు కీచకుడు. ఎన్నో విధాల ద్రౌపదిని వేధించాడు, వెంటబడ్డాడు. తిరస్కరించింది ద్రౌపది, అతడిలో కామోన్మాదం పెచ్చరిల్లింది. సహనాన్ని కోల్పోయిన ద్రౌపది తీవ్రస్వరంతో కీచకుని మందలించింది.

సైరంధ్రిచేత తిరస్కరించబడిన కీచకుడు సోదరి సుధేష్ణ వద్దకెళ్ళి "ఎలాగైనా సరే సైరంధ్రిని నా దగ్గరకు పంపించు. లేదా నేను మరణిస్తాను" అని బెదిరించాడు. ఎలాగైనా సోదరుని మనస్సు మార్చాలని ఎంతో ప్రయత్నించింది సుధేష్ణ. కాని కీచకుడు పట్టినపట్టు వీడలేదు. విధిలేక అంగీకరించింది సుధేష్ణ.

సుధేష్ణ సైరంధ్రిని పిలిచి "నాకు దప్పికగా ఉంది. కీచకుని మందిరంలో రుచికరమైన పానీయాలున్నాయి. వెంటనే వెళ్ళి తీసుకురా" అని ఆజ్ఞాపించింది. "కీచకుడు ఎంతటి లజ్జాహీనుడో, కామపిశాచియో మీకు తెలుసు. మీ కొలువులో చేరేటప్పుడే నేను కొన్ని షరతులు పెట్టాను.

ఇప్పుడిలా ఆదేశించటం మీకు న్యాయం కాదు. నేను అతడి గృహానికి వెళ్ళజాలను" అన్నది సైరంధ్రి. దానికి సుధేష్ణ, "కళ్యాణీ! నీకు ఏ కష్టము కలుగదు, నిన్ను పంపుతున్నట్టు ఇప్పుడే కీచకునికి చెప్పాను. నా మాట విని నన్ను సంతోష పెట్టు, వెళ్ళిరా!" అన్నది.

చేసేదిలేక కీచకుని భవంతివైపు బయలుదేరింది సైరంధ్రి. ఏమి జరుగుతుందోననే భయం వెంటాడుతున్నది. 'ఇక దైవమే రక్షించాలి' అని భావించి సూర్య భగవానుని వైపు చూచి ఆ ప్రత్యక్ష దైవాన్ని ఇలా ప్రార్థించింది.

**శ్లో॥ యధాహమన్యం భర్తృభ్యో నాభిజానామి కంచన।**
**తేన సత్యేన మాం ప్రాప్తం మాకుర్యాత్ కీచకోవశే॥**
**(విరాట ప.15 అ. 17శ్లో)**

**తా॥** ఓ సూర్యభగవానుడా! నేను నా పతులను దప్ప అన్యులనెవ్వరినీ మనస్సులో తలచని పతివ్రతనైతే; ఈ సత్య ప్రభావంతో అబలనైన నాకు కీచకునివల్ల ఎట్టి ప్రమాదము సంభవించకుండుగాక!

ఇలా ప్రార్థించి రెండు ఘడియలు సూర్యోపాసన గావించగా సూర్యభగవానుడు ద్రౌపదిని రక్షించుటకై అదృశ్య రూపంలో ఒక రాక్షసుని నియోగించాడు. ఆ రాక్షసుడు ఎవరికీ కనిపించకుండా ద్రౌపది వెంటఛాయలా నడుస్తున్నాడు.

ద్రౌపది కీచకుని భవంతిలో ప్రవేశించింది. ఆమెను చూచి కీచకుడు కామోన్మాదుడయ్యాడు, చేయి పట్టుకున్నాడు, వదిలించుకుంది ద్రౌపది. "సుధేష్ణాదేవి దాహంతో ఉన్నది, మదిరతెమ్మని నన్ను పంపింది. త్వరగా ఇచ్చి పంపించు" అన్నది ద్రౌపది.

కీచకునికి ఆమె మాటలు వినిపించటం లేదు, ఆమెను తన బాహువుల్లో బంధించాలని ముందుకు అడుగువేశాడు. పైటచెంగు పట్టుకున్నాడు. ఆమె రెండు చేతులతో విసిరికొట్టింది. దానితో మొదలుతెగిన చెట్టులాగా క్రిందపడి పోయాడు కీచకుడు.

–ఇక్కడ ద్రౌపది రెండు చేతులతో విసిరికొట్టగా కీచకుడు మొదలుతెగిన చెట్టులా క్రింద పడ్డాడంటే కీచకుడంత బలహీనుడా? లేక ద్రౌపది కీచకుని కన్నా గొప్ప బలవంతురాలా? రెండూ కాదు. కీచకుడికి సింహబలుడనే పేరుంది. అతడు భీమునితో సమానమైన బలం గలవాడు. మరెందుకలా పడిపోయాడు? ద్రౌపదిని అదృశ్యంగా అనుసరిస్తూ వచ్చిన రాక్షసుడు ఆ కీచకుని అదే సమయంలో నెట్టటంతో అలా పడిపోయాడు. సూర్యభగవానునిచే నియమించ బడిన ఈ రాక్షసునికృత్యం ముందు స్పష్టంగా తెలుస్తుంది.

కీచకుడలా పడిపోవటంతో ద్రౌపది భయంతో పరుగులెత్తుతూ ధర్మరాజు కూర్చొని ఉన్న విరాటుని సభలోనికి ప్రవేశించింది. కీచకుడు లేచి ఆమెను వెంబడిస్తూ, పరుగెత్తుతూ విరాటుని కొలువులోనికి ప్రవేశించాడు. అక్కడ ద్రౌపదిని సభికులందరూ చూస్తుండగానే జుట్టుపట్టుకొని ఈడ్చి క్రింద పడవేసి కాలితో తన్నాడు. కీచకుని పాదతాడనానికి ద్రౌపది ముఖం నుండి రక్తం స్రవించింది. ఇదే సమయంలో ద్రౌపదికి రక్షగా వచ్చిన రాక్షసుడు అదృశ్యరూపంలో ఉండి దుష్టకీచకుని దూరంగా విసిరివేశాడు. ఇదిగో ఆ శ్లోకం.

**శ్లో॥ తస్యయో2సౌ తదార్కేణ రాక్షసః సంనియోజితః।**
**సకీచ కమపోవాహ వాతవేగేన భారత॥**
**(విరాట 16అ. 11శ్లో)**

దానితో కీచకుడు నిశ్చేష్టుడై మొదలుతెగిన మ్రానులా నేలపై పడిపోయాడు.

–ఇలా రెండు పర్యాయములు, రెండుచోట్ల కీచకుని కీచుమనిపించాడు సూర్యునిచే నియుక్తుడైన రాక్షసుడు. అదృశ్యంగా ఉండి ద్రౌపదిని రక్షించమని రాక్షసుని ఆదేశించింది, నియమించిందీ సూర్యభగవానుడు. సూర్య భగవానుని రక్షించమని ప్రార్థించినది ద్రౌపది. ఆ ప్రార్థనలో తాను తన పతులను తప్ప అన్యపురుషులను తన మనస్సునందు తలచని పతివ్రతనైతే తనకు రక్షణ కలిగించాలని సూర్యుని ప్రార్థించింది. ఆ ప్రార్థనను సూర్యభగవానుడు ఆలకించి, రక్షణ కల్పించాడంటే ఆమె పరమపతివ్రతయని ఆ ప్రత్యక్షనారాయణునికి తెలుసునన్నమాట. అంటే సూర్యభగవానుడు ద్రౌపదీదేవిని పరమపతివ్రతయని విశ్వసించాడన్నమాట. **ద్రౌపది పరమపతి వ్రతయనుటకు ఇంతకన్నా ఇంక ఏమి సాక్ష్యం కావాలి?** ఈ లోకంలో ఎవరైనా ప్రమాణం చేయాలంటే సూర్యచంద్రుల సాక్షిగా అని ప్రమాణం చేస్తుంటారు. అదిగో ఆ సూర్యుడే ఇక్కడ సాక్షి. ఈ సూర్యుడు– 'ద్రౌపదిని బంధకి అని నోటికి వచ్చినట్లు ప్రేలిన కర్ణునికి జన్మనిచ్చినవాడ'ని మరిచిపోరాదు.

పాండవుల అరణ్యవాసకాలంలో శ్రీకృష్ణునితో కలిసి పాండవులను చూచివెళ్ళుటకు వచ్చిన ఆయన ప్రియభార్య సత్యభామ ద్రౌపదీదేవి వద్ద పాతివ్రత్య ధర్మాలను తెలుసుకొని వెళ్ళింది. ఆ సందర్భంలోనే ద్రౌపది తాను పతులతో ఎలా వ్యవహరించి వారి మనస్సులను చూరగొన్నదో తెలియజేసింది.


ఇట్టి పరమపావన చరిత ద్రౌపదిని ఇప్పటికీ కారుకూతలు కూసే దుష్టులు, నీచులు ఉండటం, నవలలు వ్రాయటం మన దౌర్భాగ్యం.

–ఇక ద్రౌపదీదేవి యొక్క లోకోత్తర స్వరూపం ఏమిటో తెలుసుకుందాం!

(వచ్చే సంచికలో..)



ప్రేమించడం నా సహజలక్షణం అని తెలుసుకుంటే ఈర్ష్య నీ దరికి చేరదు



# మహాభారతం

## ద్రౌపది 22

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

## 10. ద్రౌపదీ దేవిలోకోత్తర స్వరూపం

(A) అయోనిజ

ద్రౌపదీ దేవి అందరిలా తల్లిగర్భం నుండి శిశువుగా జన్మించలేదు. ఆమె ద్రుపదుని యజ్ఞమునందు వేదీమధ్యం నుండి **ఆరూఢ యౌవనవతి ఐన కన్యగా** ఉద్భవించినది. అంటే **అయోనిజగా జన్మించినది.** ఈ విషయం ద్రౌపదీ జన్మవృత్తాంతంలో ఇలా చెప్పబడింది.

**శ్లో॥ కుమారీ చాపి పాంచాలీ వేదీ మధ్యాత్ సముత్థితా ।**
**సుభగా దర్శనీయాంగీ స్వసితాయచ లోచనా ॥**
(ఆది. 166 అ. 44 శ్లో)

**తా॥ వేదీ మధ్యంనుండి ఒక కన్య ఉద్భవించింది. ఆమెయే పాంచాలి. ఆమె సర్వావయవ నిరుపమాన సౌందర్యంతో, విశాలమైన కమల దళముల వంటి నేత్రములు కలిగి, సౌభాగ్యవతిగా ఉన్నది.**

ద్రౌపది అయోనిజగా జన్మించినట్లు మహాభారతం చెబుతుంటే కొందరు పండితుల మనుకొనేవారు అయోనిజులై జన్మించుట అసాధ్యమని, అందుకు శాస్త్రాలు ఏవీ అంగీకరించవని పనిగట్టుకొని విమర్శించారు. **శాస్త్రాలు అంగీకరిస్తాయో లేదో చూద్దాం.**

షడ్దర్శనాలలో **వైశేషిక దర్శనము** నందు 174వ సూత్రం ఇలా తెలియజేస్తున్నది. **"తత్ర శరీరం ద్వివిధం యోనిజ మయోనిజం చ"** - అని. ఈసూత్రం యొక్క భావం ఏమంటే "ఇక్కడ శరీరం యోనిజం (స్త్రీ గర్భంనుండి జన్మించినది), అయోనిజం (స్త్రీ గర్భంతో సంబంధం లేకుండా ఉద్భవించినది) అని రెండు విధములు - అని.

శుక్రశోణిత సంబంధం లేకుండానే ధర్మవిశేషం చేత కలిగేది అయోనిజమని, అది దేవతలయొక్క ఋషుల యొక్క మహత్తువల్ల సంభవించేదని, అటువంటి అయోనిజులున్నారని భాష్యంలో చెప్పబడింది.

ద్రోణాచార్యులు, కృపాచార్యులు, కృపి దృష్టద్యుమ్నుడు, ద్రౌపది వీరందరు ఇలా అయోనిజులుగా జన్మించినవారేనని **మహాభారతం** తెలియజేస్తున్నది.

అంతేకాదు ఇట్టి జన్మలలోని అఘటిత ఘటనలను గూర్చి సందేహించే జనుల కొరకు **స్కాంద పురాణం** లోని బ్రహ్మోత్తర ఖండం 19వ అధ్యాయంలో ఇలా చెప్పబడింది.

"ఈ విశ్వమంతయు మాయామయం. అనాదియై క్షణ భంగురమైన ఈ జగత్తులో ఎప్పుడో, ఏ మూలనో పుట్టి పోయేవాడు, 'ఇది సాధ్యము, ఇది అసాధ్యము' అని ఎలా నిర్ధారణ చేయగలడు? అభూత పూర్వములై, నిరూపించ శక్యంగాని ఎన్నో విషయాలు మాయావశమున కలుగుచున్నవి. అట్టి మాయ ఈశ్వరుని వశమైయున్నది. అట్టి ఈశ్వరుని చర్యలు ఎవ్వరికెరుక? రాజర్షియైన యూపకేతువు యొక్క శుక్రం (వీర్యం)తో కలిసిపోయిన నీటిని త్రాగి వేశ్య గర్భవతియైనది. విభాండకముని యొక్క శుక్రంతో కలిసిన జలమును త్రాగి ఒక హరిణి (ఆడలేడి) గర్భందాల్చి ఋష్యశృంగుని కన్నది. సురాష్ట్ర భూపాలుని చేతిని తాకి ఒక హరిణి గర్భవతియై ఒక మునీశ్వరునికి జన్మనిచ్చినది. అలాగే చేపగర్భం నుండి మత్స్యరాజు, మత్స్యగంధి (సత్యవతి) జన్మించారు. మహిషి గర్భంనుండి మహిషాసురుడు జన్మించాడు. వసుదేవుని వల్ల దేవకీదేవి ధరించిన గర్భం అతని మరొక భార్యయైన రోహిణీదేవి యందు యోగ మాయచేత ప్రవేశపెట్టబడగా ఆమెకు బలరాముడు

జన్మించాడు. దేవతల యొక్క మహర్షుల యొక్క శాపప్రభావం వల్లగాని, వరప్రభావం వల్లగాని అఘటిత ఘటనలు జరుగుతూఉంటాయి. ఇందులో సందేహించ వలసినదేమీ లేదు. సాంబుని కడుపు నుండి మునుల శాపంవల్ల ముసలం (రోకలి బండ) పుట్టలేదా? ముని మంత్ర ప్రభావమున యవనాశ్వునకు గర్భం రాలేదా?" అని.

ఇలా వేదాలు, వేదాంగాలు, షడ్దర్శనాలు, పురాణాలు, ఇతిహాసాలు జన్మలలోని చిత్ర విచిత్రాలు అనంతములని ఘోషిస్తూ ఉన్నాయి.

రామాయణంలో తపము చేయుచున్న **వేదవతి** తనను బలాత్కరించబోయిన రావణుని ధిక్కరించి, ప్రజ్వలించుచున్న అగ్నిలో తనదేహాన్ని దగ్ధం గావించుకొని, ఆ తరువాత అయోనిజయై జనక మహారాజుకుమార్తె **సీతాదేవిలాగా** ఆవిర్భవించినట్లు, మహాభారతంలో **ఋషికన్య** చాలాకాలం వివాహం కాకపోగా పతినికోరి పరమేశ్వరునికై తీవ్ర తపస్సుచేసి పరమశివుని ప్రత్యక్షం గావించుకొని; ఆ ఈశ్వరునిచే పైజన్మములో నీకు ఐదుగురు పతులగుదురని వరమును పొంది; ఆ శరీరాన్ని విడిచి, ఆ తరువాత ద్రుపదుని యజ్ఞవేదిక నుండి **అయోనిజయై భూభార హరణార్థమై ఆవిర్భవించినది ద్రౌపదీ దేవి. అసలు ద్రౌపది ఎవరు?**

## (B) స్వర్గ లక్ష్మి

వ్యాసమహర్షి ద్రుపదునికి పంచేంద్రోపాఖ్యానాన్ని, ద్రౌపది పూర్వజన్మ విశేషాలను వినిపించి ఆమె స్వరూపాన్ని ఇలా వర్ణించాడు –

**శ్లో॥ స్వర్గశ్రీః పాండవార్థాయ సముత్పన్నా మహా మఖే ।**
**తేహ తప్త్వా తపోఘోరం దుహితృత్వం తవా గతా॥**
(ఆది. 196 అ. 52 శ్లో)

**తా॥ : ఈమె స్వర్గలోక లక్ష్మి. పాండవుల కొరకు ఈమె నీ మహాయజ్ఞమునందు ఉద్భవించినది. అత్యంత ఘోరమైన తపస్సుచేసి ఈ జన్మలో నీ కుమార్తె అయ్యే సౌభాగ్యాన్ని పొందింది** – అని.

**ఈ స్వర్గ లక్ష్మికే శచీదేవి అనే పేరు గలదు.** ఈ విషయం మహాభారతం ఆదిపర్వంలోని సంభవపర్వ భాగమున ఇలా చెప్పబడింది.

**శ్లో॥ ద్రౌపదీ త్వధ సంజజ్ఞే శచీభాగా దనిందితా ।**
**ద్రుపదస్యకులే కన్యా వేదీ మధ్యాదనిందితా॥**
(ఆది. 67అ. 157 శ్లో)

**తా॥ సాధ్విద్రౌపది శచీదేవి అంశతో ద్రుపద మహారాజు యజ్ఞంలో వేదీ మధ్యం నుండి ఒక అనింద్య సుందరిగా కన్యా రూపంలో ఉద్భవించింది.**

**కనుక ద్రౌపదీ దేవి సాక్షాత్తు స్వర్గలక్ష్మి శచీదేవియే.** అంటే స్వర్గలక్ష్మియే ముందు ఋషికన్యగా జన్మించి, పరమేశ్వరునికై ఘోర తపస్సుచేసి, పంచేంద్ర స్వరూపులైన పాండవులకు పత్నిగా నిశ్చయించబడి; మరు జన్మమునందు అయోనిజగా ద్రుపదుని యజ్ఞమున వేదీ మధ్యము నుండి జన్మించినది అని గ్రహించాలి.

దేవీభాగవతము నందు కూడా ద్రౌపది వేదీ మధ్యము నుండి జన్మించినదని; **ఆమె లక్ష్మీ అంశ సంభూతురాలనీ తెలియజేయటం జరిగింది.** చతుర్ధ స్కందం 17వ అధ్యాయంలో –

**శ్లో॥ "ద్రౌపదీచ మహాభాగా కథం దుఃఖస్య భాగినీ ।**
**వేదీ మధ్యాచ్చ సంజాతా లక్ష్మ్యంశ సంభవా కిల ॥"**
అని గలదు.

ఇలా స్వర్గలక్ష్మి (శచీదేవి) అంశలో జన్మించిన ద్రౌపదీ దేవియొక్క అసాధారణ రూపలావణ్యము లెలాంటివి?

## (C) అద్భుత సౌందర్య, రూప, లావణ్యములు

ద్రౌపదీ జన్మవృత్తాంతాన్ని కుంతీ పాండవులకు ఏకచక్రపురంలో వినిపించిన బ్రాహ్మణుడు ద్రౌపదీ దేవియొక్క లోకోత్తర సౌందర్యాన్ని ఇలా వివరించాడు.

ద్రౌపదీ దేవి లోకోత్తర సౌందర్యరాశి, సౌభాగ్యశీలి. విశాలమైన కమలదళాల వంటి నేత్రాలు కలిగి ఉన్నది. శ్యామవర్ణ శరీరంతో, దీర్ఘమైన నల్లని కేశాలతో, ఎరుపు రంగు గోళ్ళతో, దొండపండు వంటి మనోహరమైన పెదవులతో, సర్వ అవయవాలు నిరుపమాన సౌందర్యంతో ఉన్నది. ఇంకా–

**శ్లో॥ మానుషం విగ్రహం కృత్వా సాక్షాత్ అమర వర్ణినీ।**
**నీలోత్పల సమోగంధో యస్యాః క్రోశాత్ ప్రధావతి ॥**
(ఆది. 166 అ. 46 శ్లో)

**శ్లో॥ యాభిభర్తి పరం రూపం యస్యా నాస్త్యు పమాభువి।**
**దేవదానవ యక్షాణాం ఈప్సితాం దేవరూపిణీం ॥**
(ఆది. 166 అ. 47 శ్లో)

**తా॥ : సాక్షాత్తు స్వర్గ లక్ష్మియే మానవ రూపం ధరించి వచ్చినట్లుగా ఉన్నది. ఆమె శరీరం నుండి నీలోత్పలములతో సమానమైన పుష్ప సుగంధ సువాసనలతో కూడిన పరిమళము క్రోశ పర్యంతము నలుదిక్కులా వ్యాపిస్తున్నది. (46)**


కర్తవ్యం నిర్వర్తిస్తే – దైవత్వం దగ్గర అవుతుంది. ధర్మము పాటిస్తే – సుఖము ప్రాప్తిస్తుంది.

**తా॥ : ఆమె రూపం అత్యద్భుతం. పరమ సుందర రూపం కలిగి ఉన్నది. ఆ సమయంలో పృథ్విపై ఆమె వంటి సౌందర్యరాశి మరొకరు లేరు. దేవతలు, దానవులు, యక్షులలోని సుందరాకారులు దేవ రూపంతో ప్రకాశిస్తున్న ఆమెను పొందుటకు ఆసక్తి చూపుతున్నారు.**

ద్రౌపదికన్నా ముందు పరాశర మహర్షి వర ప్రసాదంతో సత్యవతి యోజన గంధి అయింది. ఆమె శరీరం నుండి ఒక యోజనం దూరం సుగంధం వ్యాపిస్తుంది. **కాని ద్రౌపది పుట్టుకతోనే క్రోశ పర్యంతవ్యాప్త శరీర సుగంధం కలిగినదియైనది. ఇది అపూర్వం.**

**ఇక సాముద్రిక శాస్త్రంలో పరమపతివ్రతలైన ఉత్తమ స్త్రీలకు ద్వాత్రింశత్ (32) లక్షణములు చెప్పబడినవి.**

హరిశ్చంద్ర చక్రవర్తి విశ్వామిత్రుడు పెట్టిన పరీక్షలో తన ధర్మపత్ని చంద్రమతిని విక్రయించవలసి వచ్చినది. అప్పుడామెను కొనుటకు వచ్చిన విప్రుడు ఆమెకు మూల్యమును నిర్ణయించుచూ ఇలా అన్నాడు.

**శ్లో॥ అనురూపమిదం విత్తం గృహాణాఽర్పయ మేఽబలాం।**
**ధర్మశాస్త్రేషు యదృష్టం స్త్రియో మౌల్యం నరస్యచ॥**
**శ్లో ॥ద్వాత్రింశల్లక్షణో పేతా దక్షా శీలగుణాన్వితా ।**
**కోటి మౌల్యం సువర్ణస్య స్త్రియః పుంసః తథాఽర్బు దం॥**

(దేవీభాగ.7 స్కం 22 అ.)

**తా॥** : సచ్చరిత్రము కలిగి, సద్గుణములు కలిగి, ద్వాత్రింశత్ (32) లక్షణములతో కూడియున్న పురుషునకు అర్బుదం (పదికోట్ల సువర్ణములు) అనియు ధర్మ శాస్త్రములతో మూల్యము నిర్ణయింపబడి యున్నది - అని.

మరి ద్రౌపదీ దేవి కూడా అలా సాముద్రిక శాస్త్రంలో చెప్పబడిన 32 లక్షణములు కలిగి యున్నదా? అలా ఉంటే ఆమె ఉత్తమ స్త్రీగా, మహాపతివ్రతగా పరిగణింపబడుతుంది. విరాట పర్వంలో ఈ సందేహం తీరిపోతుంది.

పాండవులు అరణ్యవాసం 12 సంవత్సరాలు పూర్తిచేశారు. ఇక ఒక్క సంవత్సరం జనపదాలలో అజ్ఞాతవాసం చెయ్యాలి. దానిని మత్స్య దేశంలో సాగించటానికి నిశ్చయించుకున్నారు పాండవులు. తమ తమ వేషాలను మార్చుకొని ఒక్కొక్కరే విరాట నగరంలో ప్రవేశిస్తున్నారు. ముందుగా ధర్మరాజు 'కంకుభట్టు' అనే పేరుతో విరాట మహారాజు కొలువులో చేరాడు. ఆ తరువాత భీమసేనుడు 'వలలుడు' అనే నామధేయంతో వంటలవానిగా విరటుని కొలువులో చేరాడు.

ఆ పిమ్మట ద్రౌపదీ దేవి 'మాలిని' అనేపేరుతో సైరంధ్రీ వేషంతో విరాట నగర వీధులలో చరిస్తూ ఉన్నది. కమల దళాల వంటి విశాల నేత్రాలతో చంద్రబింబాన్ని మరపించే మోముతో, మృదులకేశ పాశంతో మలిన వస్త్రాన్ని ధరించి వీధులలో తిరుగుతున్న ఆ సౌందర్య రాశిని అంతః పురంలోని మేడపై పచార్లు చేస్తున్న విరాటపత్ని సుధేష్ణ చూచింది. సాక్షాత్తు లక్ష్మీదేవిలా శోభిస్తున్న అపురూప లావణ్యవతి ద్రౌపదిని చూచి పరిచారికలచే పిలిపించి, నీవెవరు? ఎందుకు వీధుల్లో తిరుగుతున్నావు? అని ప్రశ్నించింది. దానికి ద్రౌపది,"అమ్మా! నేను సైరంధ్రిని. ఎవ్వరైనా పనికల్పించి ఆశ్రయమిస్తే నేను వారిని సేవిస్తాను. జీవనయాత్రకై తిరుగుతున్నాను" అన్నది.

అప్పుడు సుధేష్ణ -

**శ్లో॥ నైవం రూపా భవంత్యేవ యధావదసి భామిని ।**
**ప్రేషయంతీవ వై దాసీః దాసాంశ్చ వివిధాన్ బహూన్॥**

(విరాట. 9 అ. 9 శ్లో)

**తా॥** : అమ్మా! నీవు చెప్పే విషయంపై విశ్వాసం కలగటం లేదు. నీలాంటి రూపవతి ఐన స్త్రీ సైరంధ్రి కాజాలదు. నీవు అనేకమంది దాసదాసీ జనలను ఆజ్ఞాపించే మహారాణిలా కనిపిస్తున్నావు. అంతేగాదు -

**శ్లో॥ నోచ్చగుల్ఫా సంహతోరు స్త్రి గంభీరా షడున్నతా ।**
**రక్తా పంచసు రక్తేషు హంస గద్గద భాషిణీ ॥**
**శ్లో॥ సుకేశీసుస్తినీ శ్యామా పీనశ్రోణి పయోధరా ।**
**తేన తేనైవ సంపన్నా కాశ్మీరీవ తురంగ మీ ॥**
**శ్లో॥ అరాలపక్ష్మి నయనా బింబోష్ఠీతను మధ్యమా ।**
**కంబుగ్రీవా గూఢశిరా పూర్ణచంద్ర నిభాననా ॥**

(విరాట.98.10,11,12 శ్లో)

**తా॥** : గుల్ఫం, నాభి, వాక్కు, బుద్ధి, ముక్కు (నాసిక), చెవులు, కళ్ళు, స్థనములు, గోళ్ళు, హస్తములు, పాదతలములు, కనురెప్పలు, ఓష్టము, పాదముల గోళ్ళు, వ్రేళ్ళు, నాలుక, స్వరం (మధుర స్వరం), నల్లని దీర్ఘ కేశములు, శరీర కాంతి, పెదవులు, ముఖం, మెడ, నడుము, చెక్కిళ్ళు, దంతములు - అన్నీ ఉత్తమ స్త్రీకి సాముద్రిక శాస్త్రంలో చెప్పబడిన ద్వాత్రింశత్ (32) లక్షణములు నీయందు గోచరించుచున్నవి. నీది శ్రీదేవీ రూపంతో సమానమైన అసమాన సౌందర్యం. కాశ్మీర దేశపు గుర్రానికి ఉన్నట్లుగా నీలో అనేక శుభలక్షణాలు కనిపిస్తున్నాయి.

కళ్యాణీ! నీవెవరో నిజం చెప్పు. నీవు దాసివి కానేకాదు. నీవుదేవతవా? యక్షకాంతవా? నాగకన్యవా? గంధర్వ

 కాకిలాగ కలకాలము జీవించుట తగదు. హంసలాగ కొద్దికాలము బ్రతికినా దిగులు పడవద్దు.

కాంతవా? లేక అప్సరసవా? లేదా ఈ నగర అధిష్ఠాన దేవతవా? కిన్నర కాంతవా? విద్యాధరివా? లేక చంద్రుని భార్య రోహిణివా? లేక ఇంద్రాణివా? వారుణీదేవివా? విశ్వకర్మపత్నివా? బ్రహ్మదేవుని శక్తి సావిత్రివా? దేవతలలో ఏ ప్రముఖ దేవతవో చెప్పు – అన్నదిసుధేష్ణ.

**మానవులకు దుర్లభమైన దివ్య స్వరూపము ద్రౌపదీ దేవిది. దీనినిబట్టి ఉత్తమ స్త్రీకి ఉండవలసిన లక్షణములన్నీ ఉన్న సాధ్వీశిరోమణి ద్రౌపది.**

ఇక ఆమె పూర్వ జన్మగాథలను పరిశీలించినప్పుడు

(i) **నాయాయని** జన్మమునందు సీత, సావిత్రి, అరుంధతి, లోపాముద్ర, అనసూయ మొదలైన మహాపతివ్రతలతో తులతూగి పతిసేవలో తరించిన మహాసాధ్వి.

(ii) **ఋషికన్య** జన్మమునందు పతిప్రాప్తికై ఈశ్వరునికై అఖండ తపస్సుజేసి పరమేశ్వర అనుగ్రహ పాత్రమై మరుజన్మలో సంకల్పసిద్ధి యగునట్లు వరమును పొందిన తపశ్శక్తి సంపన్నురాలు.

(iii) **ద్రౌపది** జన్మము నందు భూభారమును తొలగించుటకు సీతాదేవి వలె అయోనిజగా ద్రుపదుని వేదీమధ్యము నుండి జన్మించిన స్వర్గ లక్ష్మి.

మనుష్య దుర్లభమైన అసాధారణ విశేషములు గల సాధ్వీ శిరోమణి ద్రౌపది. ఇట్టి ద్రౌపది పతులతో ఎలా మెలిగేది? ఎలా వారి అనురాగాన్నిచూరగొన్నదీ ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

## (D) సత్యాద్రౌపదీ సంవాదం – పాతివ్రత్య ధర్మాలు

పాండవులు అరణ్యవాసం చేస్తున్న కాలంలో వారి క్షేమ సమాచారములు తెలుసుకొనుటకు ఒకసారి శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై కామ్యకవనానికి విచ్చేశాడు. ఒకరోజున ద్రౌపదీ సత్యభామలు ఏకాంతంలో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో సత్యభామ ద్రౌపదితో "మహావీరులు, బుద్ధిశాలురు, శౌర్యధనులు అయిన పాండవులను నీవు ఎలా నీ వశంలో ఉంచుకోగలిగావు? వ్రతాలా? మంత్రాలా? జపహోమాదులా, వశీకరణ ఔషధాలా? మూలికలా? దాచుకోకుండా చెప్పు. నేను కూడా నీ మార్గాన్నే అనుసరించి శ్రీకృష్ణుని నా వశం చేసుకుంటాను అన్నది సత్యభామ.

దానికి ద్రౌపది సత్యా! నీవేనా ఇలా అడిగింది? పాతివ్రత్యంతో జీవించేవారు చర్చించుకోవలసిన విషయాలేనా ఇవి? శ్రీకృష్ణుని ప్రియపత్నివి. నీకిలాంటి ప్రసంగం ఉచితం కాదు. ఔషధాలు మూలికలచేత భర్తను వశపరచుకొనేందుకు భార్య ప్రయత్నిస్తున్నదని తెలిస్తే ఇంట్లో దూరిన సర్పాన్ని చూచినట్లు భార్యను చూస్తాడు భర్త. భార్యను చూడగానే భయంతో, ఉద్వేగంతో కలత చెందుతాడు. శాంతి కరవవుతుంది. శాంతిలేని వారికి సుఖం ఎక్కడ? **భర్త సుఖాన్ని నాశనంచేసే స్త్రీ సాధ్వి అవుతుందా?** పైగా ఒక్కొక్కపుడు ఔషధాలవల్ల జబ్బులు, అంధత్వం, ముసలితనం, చెవుడు వస్తాయి. ఒక్కోసారి ప్రాణాలు కూడా పోవచ్చు. ఇలాంటి ఆలోచన కూడా ఉత్తమ స్త్రీలకు రాకూడదు.

నేను నా భర్తల విషయంలో ఎలా నడుచుకుంటానో విను. నేను అహంకారంతో నడుచుకోను. నా భర్తలకు సంతోషం కలిగించే సేవలను అందిస్తాను. చెడుమాటలు మాట్లాడను. అసభ్యంగా వారి ఎదుట నిలబడను. నా భర్తల మనస్సును వారి ముఖ కవళికలను బట్టి తెలుసుకొని అందుకు అనుగుణంగా నడుచుకుంటాను. భర్తలు, సేవకులు భుజించనిదే నేను భుజించను. నా భర్తలు నిద్రించిన తరువాతనే నిద్రిస్తాను. వారు మేల్కొనుటకు ముందే నేను నిద్రలేస్తాను. వారు నిలబడి ఉండగా నేను కూర్చోను. ద్వారం వద్ద నిలబడను. దుష్టులతో మాట్లాడను. వెకిలిగా నవ్వను. ఇంటిలోని పాత్రలను నేనే శుభ్రంచేస్తాను. భోజనం శుచిగా, రుచిగా నేనే తయారుచేస్తాను. వారివారి అవసరాలను కనిపెట్టి వడ్డిస్తుంటాను. సోమరితనాన్ని దరికి జేరనివ్వను. అబద్ధాలు ఆడను. నా భర్తలకు ఇష్టంలేని పనులు చేయను. వినయంగా ఉంటాను. నా భర్తలకు ప్రియంగా, హితంగా ఉంటాను. కుటుంబ ఆదాయ వ్యయాలు నేనే చూసుకుంటాను. ఈ విధమైన ప్రవర్తన వల్లనే నా భర్తలు నాకు వశవర్తనులయ్యారు. అంతేగాని దుష్ట స్త్రీలు అవలంభించే మంత్రతంత్రాలు, వశీకరణాలు, ఔషధాలు వంటివాటి జోలికి పోను.

ద్రౌపది పలికిన పలుకులు విన్న సత్యభామ సిగ్గుపడింది. క్షమాపణ కోరింది. "సత్యా! నేను చెప్పినట్లు నీవు నడుచుకోగలిగితే నీ భర్త నీ కొంగుపట్టుకొనే ఉంటాడు. **పతికి మించిన దైవం సతికి లేదు. పతి అనుగ్రహం ఉంటే సతికి సర్వ కోరికలు ఈడేరుతాయి. పతి కోపిస్తే సతి ఆశలన్నీ అడుగంటిపోతాయి.** సేవల ద్వారానే పతిని వశపరచుకోవాలి. **పతిసేవ సతికి పవిత్రమైన పూజ.** ద్వారం వద్ద భర్త కంఠస్వరం వినిపించగానే ఎదురుగా వెళ్ళి నవ్వుతూ కనిపించు. సేవకులకు ఏదైనా పని చెబితే దానిని నీవే చేస్తుండు. భర్త నీతో ఏదైనా


సంపన్నులకు ఆత్మానందము లేకుండా పోతుంది. ఆత్మానందము చేకూర్చలేని సంపద ఉన్నా ప్రయోజనం లేదు.

విషయాలు చెబితే వాటిని రహస్యంగా ఉంచు. నీ భర్తకు సన్నిహితులు, మిత్రులు ఐనవారిని ఆదరించు. నీ భర్తకు శతృవులైన వారిని దూరంగా ఉంచు. ఇలా నడుచుకుంటే శ్రీకృష్ణుడు నీకు ప్రసన్నుడవుతాడు. నిన్ను క్షణం కూడా విడిచి ఉండడు" అని ద్రౌపది పాతివ్రత్య ధర్మాలను తెలుపగా సత్యభామ సావధానంతో విని ద్రౌపదికి కృతజ్ఞతలు తెలియజేసింది. అంతేకాదు, **"ద్రౌవదీ! నీ చరిత్ర జగత్పూజ్యమని నేను తెలియక అడిగిన విషయము గనుక క్షమింపు మన్నది" సత్యభామ.**

సత్యభామతో ద్రౌపది చెప్పినది నిజమే ననుటకు - దుర్యోధనుడు 'రాజసూయ యాగ సమయమున ద్రౌపది ఎలా నడుచుకున్నదో' ధృతరాష్ట్రునితో చెప్పినది గట్టి సాక్ష్యము. ఏమి చెప్పాడు దుర్యోధనుడు?

**"ధర్మజ రాజసూయయమున అన్ని వర్ణములలోను అన్నపానములచేతను, ఆభరణముల చేతను ఆదరించబడని వాడొక్కడును లేడు. వికలాంగుల వరకు ఎవ్వరు భుజించిరో, ఎవ్వరు భుజించలేదో ద్రౌపదీదేవి తాను భుజింపకయే స్వయముగా పరీక్షించుచుండెను" -** అని.

ఈ విధంగా శతృవుల చేత కూడా శ్లాఘించబడిన పవిత్ర చరిత్ర గలిగిన సాధ్వీ శిరోమణి ద్రౌపది. ఇది ద్రౌపదీ దేవియొక్క లోకోత్తర స్వరూపం. -ఇక మత్స్య యంత్రమును కొట్టవచ్చిన కర్ణుని "సూతపుత్రుని నేను వరించన"ని తిరస్కరించుట ద్రౌపదికి ధర్మమా? మయసభలో దుర్యోధనుని చూచి నవ్వినదా? మొదలైన ప్రశ్నలకు మహాభారతం ఏమి చెబుతున్నదో తెలుసుకుందాం.

సర్వేజనాః సుఖినోభవంతుః (వచ్చే సంచికలో..)

# ఎవరు స్వచ్ఛమైన సేవకుడు?


పర్షియా దేశీయుడైన అబూబెన్ ఏడం గొప్ప మానవతా వాదిగా పేరు ప్రఖ్యాతలు గడించాడు. నిరంతరం పేద సాదలకు, రోగగ్రస్తులకు తనకున్నంతలో సహాయం చేస్తూ ఉండేవాడు. అయితే ప్రార్థన, ఉపవాస దీక్ష వంటి మతపరమైన ఆచారాలపట్ల విముఖత చూపేవాడు. దైవాన్ని గురించి అసలు ఎన్నడూ ఆలోచించలేదు.

ఒకరాత్రి అతని కలలో ఒక దేవదూత బంగారు పుస్తకంలో ఏదో రాస్తూ కనబడ్డాడు. "ఏమిటి రాస్తున్నావు" అని అబూ అడిగాడు. "దైవాన్ని ప్రేమించిన భక్తుల పేర్లు" అని దేవదూత చెప్పాడు. "అందులో నా పేరుందా?" అని అబూ అడుగగా "లేదని" దేవదూత చెప్పాడు. అప్పుడు మత ప్రచారకుడైన ముల్లా అతనికి చేసిన హెచ్చరిక గుర్తువచ్చింది. ఎందుకంటే దైవానికి సేవ చేసినవారినే దైవం అనుగ్రహిస్తాడని ముల్లా అంతక్రితమే చెప్పడం జరిగింది. అయినాసరే అబూ ఆశ్చర్యపడలేదు, బాధపడలేదు. అతనికి సామాజిక సేవే తప్ప దైవారాధనపట్ల ఆసక్తి కలుగలేదు.

కొన్నేళ్ళ తర్వాత మళ్ళీ ఓ రాత్రి ఆ దేవదూత కలలో కనబడ్డాడు. "ఇంకా మీ జాబితా పూర్తవలేదా?" అని అబూ ప్రశ్నించాడు. "ఈసారి దైవం ప్రేమించిన వ్యక్తుల పేర్లు రాస్తున్నాను" అన్నాడు. "అందులో నా పేరుందా?" అని అబూ అడిగాడు. "మొట్టమొదటి పేరు నీదే" అని దేవదూత ఆ జాబితాను చూపెట్టాడు.

పూజలు, వ్రతాలు, తీర్థయాత్రలు దైవంలోని విశ్వానికి ప్రదర్శనలు. నీవు దైవాన్ని ప్రేమిస్తే చాలదు. దైవం నిన్ను ప్రేమించేలా నడచుకోవాలి. ప్రేమ స్వరూపుడైన దైవం చూసేది నీతోటి మానవులపట్ల నీ ప్రవర్తన, సమాజ సేవే తప్ప ఆయనకు ఎంత దగ్గరవుతున్నావు అనేది ముఖ్యం కాదు.

భగవంతుడు సర్వులయందున్నాడన్న నగ్న సత్యాన్ని మననం చేసుకుంటూ, జాతి, మత, కుల, భేదాలను విస్మరించి అందరినీ ప్రేమిస్తూ, అందరికీ నిస్వార్థ సేవలందిస్తూ ఉండాలి. భగవంతుడు ప్రేమస్వరూపుడు. వాస్తవానికి ప్రేమే భగవంతుడు. ఆ ప్రేమజ్యోతి మనయందు వెలగాలంటే మన హృదయం ప్రమిదగా, మనస్సు ఒత్తిగా, దైవశక్తి తైలంగా, వైరాగ్యమైన జ్యోతిని వెలిగించాలి. ఆ వైరాగ్య భావనతో సమాజంలోనికి ప్రవేశించి ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా నిస్వార్థ సేవలందించగలిగితే ఎవరైనా భగవంతుడుగా విశిష్టమైన పూజలందుకునే అర్హతను పొందుతారు. ఇదే మానవుడు మాధవుడవ్వడానికి ప్రత్యక్ష రాచబాట. ఎందుకంటే సమాజమే భగవంతుని విశ్వరూపం. ఆ రూపంలో ఉన్న భగవంతుడిని సేవించి రూపరహితుడైన భగవంతుని అనుగ్రహం సంపాదించాలి. సమాజ సేవకు మించిన ఆధ్యాత్మిక సాధన లేదు.



# మహాభారతం

## ద్రౌపది 23

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

### 11. మత్స్యయంత్ర ఛేదన సమయంలో ద్రౌపదీదేవి 'సూతపుత్రుని వరింపననుట' న్యాయమా?

**సందేహం:** లోకంలో చాలామందికి ఇదొక ధర్మ సందేహం. ద్రౌపదీదేవిది వీర్యశుల్క స్వయంవరం. స్వయంవరమునకు వచ్చిన వీరులలో ఎవరైతే మత్స్య యంత్రమును ఐదు బాణములతో ఛేదించగలుగుతారో వారిని ద్రౌపది వరించాలి. కాని చాలామంది రాజులు మత్స్యయంత్రమును ఛేదించుటలో విఫలమయ్యారు. అలాంటి సమయంలో కర్ణుడు మత్స్య యంత్రమును ఛేదించుటకై ధనుస్సును సజ్యము చేయుచుండగా ద్రౌపది ఉచ్చస్వరంతో 'సూతపుత్రుని నేను వరింపను' అన్నది. ఇదెలా న్యాయము?

**సందేహ నివారణ:** ఈ సందేహం తీరాలంటే అసలేం జరిగిందో ద్రౌపదీ స్వయంవర వృత్తాంతాన్ని ఆమూలాగ్రంగా తెలుసుకోవాలి. సంస్కృత మహాభారతం ఆదిపర్వం 184వ అధ్యాయం నుండి 186వ అధ్యాయం వరకు గల వృత్తాంతాన్ని ముందుగా తెలుసుకుందాం.

**శ్లో॥ యజ్ఞసేనస్య కామస్తు పాండవాయ కిరీటినే।**
**కృష్ణాం దద్యామితి సదా నచైతద్ వివృణోతి సః॥**
**శ్లో॥ సోన్వేషమాణః కౌంతేయం పాంచాల్యో జనమేజయ।**
**దృఢం ధనురనా నమ్యం కారయామాస భారత॥**
**శ్లో॥ యంత్రం వైహాయసం చాపి కారయామాసకృత్రిమం।**
**తేనయంత్రేణ సమితం రాజాలక్ష్యం చకారసః**
**(ఆది ప.184 అ.8-9-10 శ్లో)**

**తా॥** ద్రుపద మహారాజుకు తన కుమార్తె ద్రౌపదిని పాండవ మధ్యముడైన అర్జునునకిచ్చి వివాహం చేయాలనే కోరిక బలంగా ఉన్నది. అయితే ఇతరులకెవ్వరికీ తన కోరికను వ్యక్తం చేయలేకపోతున్నాడు. (8) లక్కగృహ దహనానంతరం పాండవుల జాడలేదు. వారి కోసం అన్వేషిస్తూనే ఒకవేళ వారు జీవించి ఉంటే వారిని బయల్పరచటానికి ఒక ఉపాయాన్ని పన్నాడు. అర్జునుడు తప్ప మరొకరెవ్వరూ ఎక్కుపెట్టలేని ధనుస్సును తయారు చేయించాడు. (9) ఆకాశంలో ఒక యంత్రం వేగంగా తిరుగుతూ ఉంటుంది. తిరుగుతున్న ఆ యంత్రం పై భాగాన ఛేదించవలసిన లక్ష్యమును (మత్స్యం బొమ్మను) నిలిపాడు. ఇపుడా గిరగిర తిరిగే యంత్రం యొక్క రంధ్రం నుండి బాణంతో పైనున్న లక్ష్యాన్ని కొట్టాలి. ఇదీ మత్స్య యంత్రం (10).

ఇట్టి వీర్యశుల్క స్వయంవరాన్ని ఏర్పాటు చేయడంలో ద్రుపదుని అభిప్రాయం ఏమిటి? వెనుక కుమారాస్త్ర విద్యా ప్రదర్శన సమయంలో కదిలే లక్ష్యాన్ని కొట్టినవాడు అర్జునుడే గనుక అర్జునుడు జీవించి ఉంటే తప్పక బయటపడతాడు. ఒకవేళ కర్ణుడు కూడా ఈ లక్ష్యాన్ని ఛేదించగలవాడైనా కుల హీనుడు కనుక ఇబ్బంది లేదు-అనేదే ద్రుపదుని అభిప్రాయం. ద్రుపదుడు ఇలాంటి నిర్ణయానికి రావటానికి కారణం ఆయన పురోహితుడు 'పాండవులు లక్క ఇంటి నుండి తప్పించుకొని జీవించియే ఉన్నారని' అనుట.

ద్రుపదుని ఈ స్వయంవర ప్రకటనను విని అనేక దేశాల నుండి రాజులు, చక్రవర్తులు, క్షత్రియవీరులు, మహర్షులు, విప్రవర్యులు వచ్చారు. హస్తినాపురం నుండి దుర్యోధనాదులు కర్ణుని వెంటబెట్టుకొని వచ్చారు. బ్రాహ్మణవేషంలో ఉన్న పాండవులు వచ్చారు. స్వాగత సత్కారాలు జరుగుతున్నాయి. స్వయంవరం మండపం ఇంద్రభవనంలా వెలిగిపోతున్నది. దుందుభిధ్వానాలు మారుమ్రోగుతున్నాయి. వేదవేత్తలైన బ్రాహ్మణులు అగ్నికి ఆహుతులర్పిస్తున్నారు. స్వస్తివాచకాలు మిన్ను ముట్టినవి. వాయిద్యాలు మ్రోగుతున్నాయి. సంగీతం శ్రావ్యంగా వినిపిస్తున్నది.

ఆ సమయంలో అందమైన వస్త్రాలు, అనేక రకాల ఆభరణాలు ధరించి, చేతిలో సువర్ణవరమాలను ధరించిన ద్రుపద రాజకుమారి ద్రౌపదిని వెంటబెట్టుకొని దృష్టద్యుమ్నుడు సభామంటపంలో ప్రవేశించాడు. సభామధ్యంలో నిలిచి మేఘ గంభీరస్వరంతో, అర్థయుక్తమైన మధుర వచనాలతో ఇలా అన్నాడు. (ఆది 184 అ.12-34 శ్లో)


నీవు చేసే మంచిపనులే నీ కీర్తి ప్రతిష్ఠలను పెంచును

శ్లో॥ ఇదం ధనుర్లక్ష్యమిమేచ బాణాః
శ్రుణ్వంతుమే భూపతయః సమేతాః।
ఛిద్రేణ యంత్రస్య సమర్పయధ్వం
శరైఃశితైః వ్యోమచరైః దశార్థైః॥
శ్లో॥ ఏ తన్మహత్ కర్మ కరోతియోవై
కులేన రూపేణ బలేన యుక్తః
తస్యాద్య భార్యా భగినీ మమేయం
కృష్ణా భవిత్రీ నమృషా బ్రవీమి॥
**(ఆది-184 అ.35-36శ్లో)**

**తా॥** స్వయంవరానికి అరుదెంచిన రాజమండలికి వందనం. నా మాటలు శ్రద్ధగా ఆలకించండి. ఇదిగో ఇది ధనుస్సు. ఇవి బాణాలు. పైన యంత్రం ఉన్నది. ఈ 5 బాణాలతో ఆకాశంలో తిరుగుతున్న యంత్రం యొక్క రంధ్రం నుండి పైనున్న లక్ష్యాన్ని ఛేదించాలి. నేను సత్యం చెబుతున్నాను. ఉత్తమకులం, సుందరరూపం, బలం కలిగిన ఏ వీరుడు ఈ గొప్ప కార్యాన్ని సాధిస్తాడో, అతడిని నా సోదరి కృష్ణ వరిస్తుంది. (35-36)

ఇలా పలికి దృష్టద్యుమ్నుడు అక్కడకు వచ్చిన రాజుల యొక్క పేర్లు, గోత్రాలు పరాక్రమం గురించి వర్ణిస్తూ తన సోదరితో ఇలా అంటున్నాడు. (ఆది 184 అ. 37శ్లో)

185వ అధ్యాయం మొత్తం ద్రౌపదితో చెప్పిన రాజుల వివరణయే. ఇక 186వ అధ్యాయం రాజుల మత్స్య యంత్ర ఛేదనకు ప్రయత్నం ఏమిటిది?

రాజపుత్రులు, యౌవనంలో ఉన్న వీరాధివీరులు తామే అధికశక్తిశాలురమని, ఒకరినొకరు స్పర్థతో చూసుకుంటూ, ద్రౌపది నాదే అవుతుంది అనుకుంటూ, తమతమ స్థానాల నుంచి లేచి వస్తున్నారు. ధనుస్సు నెత్తుటకు ప్రయత్నించి విఫలమవుతున్నారు. అల్లెత్రాటిని తగిలించగల వారే అరుదుగా ఉన్నారు. విల్లును వంచటానికి ప్రయత్నిస్తుంటే అది వారిని దూరంగా విసిరికొడుతున్నది. వింటి దెబ్బ తిన్న రాజులు మెల్లగా వెళ్ళి వారి వారి స్థానాలలో తలలు దించుకొని కూర్చుంటున్నారు. చేదిరాజు శిశుపాలుడు ధనుస్సు నెత్తలేక క్రింద కూలబడ్డాడు. జరాసంధుడు కూలబడి అవమాన భారంతో సభను విడిచి వెళ్ళాడు. శల్యుడు కూడా విఫల మనోరథుడై తన స్థానంలో కూర్చున్నాడు.

రాజులందరి ఈ దురవస్థను చూచి ధనుర్ధరులలో శ్రేష్ఠుడైన కర్ణుడు ధనుస్సు వద్దకెళ్ళి దానిని ఎత్తి, విల్లును వంచి, అల్లెత్రాటిని బిగించి, బాణాన్ని సంధించాడు. అది చూచి పాండవులు కర్ణుడు తప్పక లక్ష్యాన్ని ఛేదించగలడని తమలో తాము అనుకుంటున్నారు. అంతట-

శ్లో॥ దృష్ట్వాతు తం ద్రౌపదీ వాక్యముచ్చైః
జగాదనాహం వరయామి సూతం।
సామర్షహాసం ప్రసమీక్ష్య సూర్యం
తత్యాజకర్ణః స్ఫురితం ధనుస్తత్॥ **(ఆది 186 అ.23శ్లో)**

**తా॥** కర్ణుని చూచి ద్రౌపది ఉచ్చస్వరంతో ఇలా అన్నది. నేను సూతజాతి పురుషుని వరించను-అని. ఇది విని కర్ణుడు రోష హాసములతో ధనుస్సు విడిచి, సూర్యభగవానుని వైపు చూచి వెనుదిరిగి వెళ్ళెను.

ఆ తరువాత దుర్యోధనుడు ధనుస్సు నెత్తి నారిని సంధించ బోగా అతడి చేతివ్రేళ్ళ సందులో గాయమైంది. వెంటనే క్రింద పడిపోయాడు. సిగ్గుతో తలవంచుకొని తిరిగి వెళ్ళి తన స్థానంలో కూర్చున్నాడు. (186 అ.పూర్తి) ఇదీ స్వయంవర వృత్తాంతం.

-మత్స్యయంత్రమును కొట్టినవానిని వరించవలసిన ద్రౌపది, కర్ణుని చూచి నేను సూతపుత్రుని వరించననుట న్యాయమా? అని సందేహం.

అంత అన్యాయంగా ద్రౌపది అంతటి సభలో ఎలా అనగలుగుతుంది? అలా అన్నప్పుడు కర్ణుడేమీ మాట్లాడకుండా ఎందుకు వెనుదిరిగి వెళ్ళాడు? కర్ణుని కంతటి అవమానం జరుగుతుంటే దుర్యోధనాదులు ఎందుకు మౌనంగా ఉన్నారు? మిగిలిన రాజలోకం అంతా ఎందుకు మారు మాట్లాడలేదు?

కనుక ద్రౌపది అన్యాయంగా మాట్లాడలేదని స్పష్టం. అందుకే కర్ణుడు మారుమాట్లాడలేదు అనేది కూడా స్పష్టం. దృష్టద్యుమ్నుడు స్వయంవర నియమాన్ని ప్రకటిస్తూ **"కులేన, రూపేణ, బలేనయుక్తంః"** అని అనుటలో కులీనత కూడా ఒక అర్హతయేనని గ్రహించాలి. కనుకనే 'సూత కులజుడైన కర్ణుని వరింపనని బాణప్రయోగానికి ముందే ద్రౌపది తెలియ జేసింది. తన కులహీనతను బట్టియే కర్ణుడు మారు మాట్లాడ లేక ఊరకుండిపోయినాడు. కర్ణుడు మారు మాట్లాడలేక ఊరకుండి పోయినా ఈనాటి కర్ణాభిమానులు గాని, దుష్ట చతుష్టయాభిమానులు గాని ఊరుకోలేక ద్రౌపదిని అన్యాయమని నిందిస్తున్నారు. కొంతమంది సామాన్యులు కులీనత విషయాన్ని గ్రహించలేక ద్రౌపది అలా ఎందుకన్నదా? అని సందేహం వ్యక్తం చేస్తుంటారు.

మరొక సందేహం. కులం విషయంలో నియమం ఉన్నదని మనకు తెలియకపోవచ్చు. కాని సభలో ఉన్నవారికి తెలుసు కదా! కర్ణుడికి కూడా తెలిసే ఉండాలి కదా! అలా తెలిసి కూడా కర్ణుడెందుకు స్వయంవరానికి వచ్చాడు? లక్ష్యము నేయుటకు ఎందుకు ప్రయత్నించాడు? అనేదే ప్రశ్న. తనకు ప్రాణమైన దుర్యోధనునితో కలిసి వచ్చాడు. క్షత్రియ వీరులంతా ధనుస్సు నెత్తలేక పోవటంతో; తనకా సమర్థత ఉన్నది గనుక, తన సమర్థతను ప్రదర్శించుటకు ప్రయత్నించాడు. ఐతే ద్రౌపది కులం విషయంలో సడలింపు లేదని ప్రతించటంతో ఏమీ చేయలేక వెనుదిరిగి వెళ్ళాడు.

ఇక ఆంధ్రమహాభారతంలో నన్నయగారు మాత్రం ద్రౌపది 'సూతపుత్రుని నేను వరింపనని' అన్నట్లు వ్రాయలేదు, అంతేకాదు కర్ణుడు మత్స్యయంత్రమును ఛేదించలేక వెనుదిరిగి పోయినట్లు వ్రాశాడు. ఆయన ఎందుకిలా వ్రాశాడు? ఆనాడు

ఆయనకు లభించిన సంస్కృతభారత ప్రతిలో అలాగే ఉన్నదో? లేక ద్రౌపది ఇలా అనటంలోని న్యాయాన్యాయాల గొడవ నాకెందుకనుకున్నాడో? "ద్రౌపది సూతపుత్రుని వరింపనని అన్నట్లు వ్రాయలేదు. పైగా అందరు రాజులతోబాటు కర్ణుడు విఫలమయ్యాడు" అని వ్రాసినందున ఇక ఈ న్యాయా న్యాయాల ప్రశ్నయే ఉత్పన్నం కాదు. ఇంతటితో ఈ అంశాన్ని ముగించి మరొక అంశాన్ని ఎత్తుకుందాం.

## 12.మయసభలో దుర్యోధనుడు క్రిందబడినపుడు ద్రౌపది నవ్వినదా?

**సందేహం:** "మయసభలో నీటబడినప్పుడు దుర్యోధనుని చూచి ద్రౌపది నవ్వినది. అందుకే ప్రతీకారంగా ద్రౌపదిని నిండు సభలోనికీడ్పించి వస్త్రాపహరణం చేయించి పగ తీర్చు కున్నాడు దుర్యోధనుడు" అని సినిమాలలో చూపించిన కథను బట్టి, లేదా కొందరు విమర్శకుల కథనాలను బట్టి అనుకుంటూ ఉంటారు చాలామంది. ఇలా ద్రౌపది నవ్వవచ్చా? అని కొందరు అడుగుతూ ఉంటారు. అసలు ఇంతకీ ద్రౌపది నవ్వినదా? లేక అపనింద వేయటమేనా?

**సందేహ నివారణ:** సంస్కృత భారతంలో దుర్యోధనుని మయ సభా సందర్శన సందర్భంలో ద్రౌపది నవ్వినట్లు లేనే లేదు. మరి ఏముంది అక్కడ? సభాపర్వం 47వ అధ్యాయం చూద్దాం.

**శ్లో॥** వసన్ దుర్యోధనస్తస్యాం సభాయాం పురుషర్షభ।
శనైర్దదర్శతాం సర్వాం సభాం శకునినా సహ॥ **(సభా 47 అ.1 శ్లో)**

**తా॥** దుర్యోధనుడు మయసభా భవనంలో ఉంటున్న సమయంలో శకునితో కలిసి మెల్లమెల్లగా ఆ మయసభా భవనం మొత్తాన్ని పరిశీలన చేస్తున్నాడు (1)

ఒకనాడు ఆ భవనంలో తిరుగాడుతూ స్ఫటిక మణిమయ ప్రదేశం మీద నడుస్తూ అక్కడ జలమున్నట్లు భావించి తను కట్టిన వస్త్రాన్ని పైకెత్తి పట్టుకున్నాడు. జలమున్నదనే మోహంతో భ్రమతో అలాచేసి సిగ్గుపడి మరొకవైపుకు వెళ్ళాడు. అక్కడ స్ఫటిక మణిమయంతో సమానమైన స్వచ్ఛమైన జలంతో నిండి, స్ఫటిక కమలములతో నిండిన తటాకాన్ని స్థలంగా భావించి దభీమని అందులో పడిపోగా వస్త్రములు తడిసి పోయినవి (సభా. 47 అ. 2-6 శ్లో)

**శ్లో॥**జలే నిపతితం దృష్ట్వా భీమసేనో మహాబలః।
**జహాస జహసుశ్చైవ కింకరాశ్చ సుయోధనం॥**

**శ్లో॥**వాసాంసిచశుభాన్యస్మై ప్రదదూ రాజశాసనాత్।
**తథాగతంతుతందృష్ట్వా భీమసేనో మహాబలః॥**

**శ్లో॥**అర్జునశ్చ యమౌబోభౌ సర్వేతే ప్రాహసం స్తదా।
**నామర్షయత్ తతస్తేషా మవహాసమమర్షణః॥**

**(సభా 47 అ.7-8-9శ్లో)**

**తా॥** దుర్యోధనుడలా నీటిలో పడటంతో భీమసేనుడు మరియు అతడి సేవకులు నవ్విరి (7). ధర్మనందనుని ఆజ్ఞతో భీమసేనుడు సుందరమైన వస్త్రములను దుర్యోధనునికి ఇచ్చెను. దుర్యోధనుని ఈ దురవస్థను చూచి అర్జున నకుల సహదేవులు నవ్వసాగిరి. దుర్యోధనుడు స్వభావసిద్ధంగా అహంభావి గనుక అతడు వారి నవ్వును సహించలేకపోయెను. (8-9) - ఇదీ సంస్కృతమహాభారతంలో ఉన్న విషయం ద్రౌపదీదేవి నవ్వినట్లుగాని, అక్కడున్నట్లు గాని లేదు. ద్రౌపదీ ధర్మజులు మయసభలో లేరు- ఆ తరువాత దుర్యోధనుడు అక్కడినుండి మరొకచోటికి వెళుతూ తెరచి ఉన్న ద్వారమును మూసి ఉన్నట్లుగా భావించి లోపలికి పోకుండాను, అలాగే మరొకచోట మూసి ఉన్న ద్వారమును తెరచి ఉన్నట్లుగా భావించి లోనికిపోవ ప్రయత్నించి తలగోడకు కొట్టుకొనుటతో వెనుదిరిగి వచ్చాడు. ఇలా జరిగిన తర్వాత ధర్మరాజు అనుజ్ఞ తీసుకొని దుర్యోధనుడు హస్తినాపురానికి బయలుదేరాడు శకునితో కలిసి (సభా 47 అ. 10-15)

దీనితో 'ద్రౌపది నవ్వినది' అను మాట యదార్థం కాదు. 'ద్రౌపది నవ్వినందుకే ఆమెను నిండుసభలో వస్త్రాపహరణం చేయించి అవమానించాడు దుర్యోధనుడు' అనే మాట కూడా యదార్థం కాదు అని తేలింది. అదే యదార్థమైతే వస్త్రాపహరణ సమయంలోను, ఆ తర్వాత సభ్యులు దుర్యోధనుని నిందిస్తూ ఉంటే అప్పుడైనా చెప్పాలి గదా! "ఈ ద్రౌపది మయసభలో నేను క్రింద పడినప్పుడు నవ్వినది; అందుకే దానికి ప్రతీకారంగా ఇప్పుడిలా అవమానిస్తున్నాను" అని అన్నాడా? అనలేదే! ద్యూతసభలో ఎన్ని తర్జన భర్జనలు జరిపినా ద్రౌపది నవ్వినట్లు దుర్యోధనుడు చెప్పనేలేదు. పైగా వస్త్రాపహరణం చేయమని చెప్పినవాడు దుర్యోధనుడు కాదు. ఆ పాపం కర్ణునిది. మయసభలో దుర్యోధనుడు క్రిందపడినపుడు భీమార్జున నకుల సహదేవులు, కింకరులు నవ్వినట్లు మాత్రమే సంస్కృత మహాభారతం తెలికజేస్తున్నది. ద్రౌపది నవ్వినట్లు లేనేలేదు.

ఇక హస్తినాపురానికి తిరిగివస్తున్న దుర్యోధనుడు చింతా క్రాంతుడై విచారంతో ఉన్నాడు. దానికి కారణం ఏమిటో ఇలా తెలియజేయబడింది.

**శ్లో॥** పాండవశ్రీ ప్రతప్తస్య ధ్యాయమానస్య గచ్ఛతః।
**దుర్యోధన స్యనృపతేః పాపామతిరజాయత॥ (సభా.47అ.16శ్లో)**

**తా॥** పాండవుల రాజ్యసంపదను చూచి సహించలేక రగిలి పోతున్న దుర్యోధనుడు అదే తలచుకుంటూ మదిలో పాప పూర్ణమైన ఆలోచన చేస్తున్నాడు.

పాండవసంపద అధికం కావటం చూచిన దుర్యోధనుని శరీరం రంగు మారిపోయింది (వివర్ణసమపద్యత). ధర్మజుని యా సభను, వారి సంపదను గూర్చియే చింతతో రగిలిపోతున్నాడు, పిచ్చివాడౌతున్నాడు. అది చూచి శకుని కారణమడుగగా ఇలా అంటున్నాడు. "మామా! అర్జున పరాక్రమంతో జయించబడిన సమస్త భూమండలము యుధిష్ఠిర వశమైంది.

**శ్లో॥ అమర్షేణతు సంపూర్ణో దహ్యమానో దివానిశం।**
**శుచిశుక్రాగమే కాలే శుష్యేత్ తోయమివాల్పకం॥ (సభా 47అ.24శ్లో)**

**తా॥** ఈ పాండవసంపద చూచి రాత్రింబవళ్ళు అసూయతో రగిలిపోతున్నాను. బాగా ఎండలు మండే వేసవి కాలంలో నీరు కాలిపోతున్నట్లు నేను అసూయాగ్నిలో కాలిపోతున్నాను.

శ్రీకృష్ణుడు తన చక్రంతో శిశుపాలుని సంహరిస్తే ఒక్కరైనా అదేమని నోరెత్తి మాట్లాడారా? రాజులంతా భయంతో కప్పాలు చెల్లించారు. పాండవైశ్వర్యం నానాటికీ వృద్ధి చెందుతున్నది. నేను ధర్మజుని నాశనానికి ఎన్నో ప్రయత్నాలు చేశాను. దాని నతిక్రమించి అతడు నీటిలోని పద్మంలాగా వృద్ధి చెందుచున్నాడు. ఇదంతా చూస్తే దైవకృపయే ప్రధానం కాని పురుషార్థం అనవసరమనిపిస్తున్నది.

**శ్లో॥ సోహం శ్రియంచతాం దృష్ట్వా సభాం తాంచతథావిధాం।**
**రక్షిభిశ్చావ హాసం తం పరితప్యే యథాగ్నినా॥ (సభా 47 అ. 39శ్లో)**

**తా॥** నేనా ధర్మజుని సంపదను చూచి, దివ్యమైన అ మయసభను చూచి, ఆ రక్షకుల అపహాసమును జూచి నిరంతరము అగ్ని జ్వలిస్తున్నట్లు పరితపిస్తున్నాను.

కనుక నేను జీవించలేను. మరణించటానికి అనుమతినిమ్ము" అన్నాడు దుర్యోధనుడు.

–ఇక్కడ కూడా ద్రౌపది నవ్వినట్లు చెప్పలేదు. పాండవుల సంపద చూచి అసూయతో రగిలిపోతున్నానని అన్నాడే గాని, ద్రౌపది మాటయే లేదు. మయసభలో ఏమి జరిగినదీ దగ్గరనే ఉండి స్వయంగా చూసిన శకునితో ద్రౌపది నవ్వినట్లు చెప్పలేదు. గనుక ద్రౌపదీదేవి నవ్వలేదు అని స్పష్టం.

ఐతే శకుని సలహాతో ధర్మజుని పిలిపించి మాయాజూదం ఆడించాలని నిశ్చయించుకొని, తండ్రి అనుమతికై వెళ్ళినపుడు, దుర్యోధనుడు రాజసూయ యాగ విశేషాలను, పాండవ పరాక్రమాన్ని, ఐశ్వర్యాన్ని ఎంతగానో వర్ణించి, అది తనకు అసూయా జనకమైనదని తెలియజేస్తూ చివరిలో ఒక మాటన్నాడు తండ్రితో. అదేమిటంటే–

**శ్లో॥ తత్రమాం ప్రాహసత్ కృష్ణః పార్థేన సహ సుస్వరం।**
**ద్రౌపదీచ సహస్త్రీభిః వ్యథయంతీ మనోమమ॥ (సభా 50 1.30శ్లో)**

**తా॥** శ్రీకృష్ణుడు అర్జునునితో కలిసి నా వైపు చూచి పకపక నవ్వాడు. ఇతర స్త్రీలతో కలసి ద్రౌపది కూడా నా మనస్సుకు వ్యథ కలిగేటట్లు నవ్వినది.

– దుర్యోధనుడు చివరగా చెప్పిన ఈ మాట పూర్తిగ అబద్ధం. ఎందుకంటే అందరు బంధువులు, శ్రీకృష్ణుడు యాగానంతరం తిరిగి వారి వారి స్వస్థలాలకు వెళ్ళిన కొన్ని నాళ్ళకు దుర్యోధనుడు శకునితో గలసి మయసభావైభవాన్ని తిలకించాలని వెళ్ళాడు. ద్వారకకు వెళ్ళిపోయిన శ్రీకృష్ణుడు– ఇక్కడలేని శ్రీకృష్ణుడు నవ్వినట్లు చెప్పటం అబద్ధం. దానితో అక్కడలేని ద్రౌపది నవ్వినట్లు చెప్పాడు. ఇదంతా పాండవులపై తండ్రిలో విద్వేషాగ్నిని రగిల్చి, జూదానికి ఇష్టపడేట్లు చేయటానికి కావచ్చు. (సభాపర్వం 45వ అధ్యాయం 51 నుండి 59 శ్లోకాల్లో శ్రీకృష్ణుడు ద్వారక వెళ్ళటం చెప్పబడింది)

ఇక ఆంధ్ర మహాభారతంలో నన్నయగారు "**స్ఫటిక దీప్తి జాలపరివృతంబైన జలాశయంబు స్థలంబుగా వగచి కట్టిన పుట్టంబు దడియంజొచ్చి క్రమ్మరిన వానింజూచి పాంచాలియు బాండుకుమారులును నగిరంత**" అని తెనిగించటం జరిగింది.

– ఈ తెలుగు భారతమే ఆంధ్రదేశంలో ప్రచారంలో ఉన్నందున ద్రౌపదీదేవి నవ్వినదనే సామాన్యులు భావిస్తున్నారు; సినిమాలలో, టి.వి.సీరియల్స్‌లో చూపిస్తున్నారు. కాని మూలంలో లేదు. మరిలేని దానిని నన్నయగారు ఎందుకు వ్రాశారు? అనేది ప్రశ్న. తమ భారతాంధ్రీకరణము స్వతంత్ర రచనలా సాగిందని వారే చెప్పటం వల్ల, అక్కడక్కడ కొన్ని మార్పులు చేశామని వారే తెలిపినందున, అక్కడ దుర్యోధనుడు తండ్రితో చెప్పినపుడు ద్రౌపదీదేవి తనను జూచి నవ్వినదని అన్నందున, అది మనసులో పెట్టుకొని ఇక్కడ వ్రాసి ఉండవచ్చు. ఏది ఏమైనా మూలంలో మాత్రం ద్రౌపది నవ్వినట్లు లేనేలేదు.


దుర్యోధనుడు క్రిందపడినపుడు ధర్మజ సోదరులు, సేవకులు నవ్వారు. నిజమే. ఇలాంటి సందర్భాలలో ఎవరైనా నవ్వటం సర్వసాధారణం. అప్రయత్నంగా, అనాలోచితంగా ఎవరికైనా నవ్వు వస్తుంది. మన స్నేహితుడు వర్షాకాలంలో జర్రున జారిపడితే నవ్వురాదా? ఎవరైనా పైనచూస్తూ నడుస్తూ అరటితొక్కపై కాలువేసి జారిపడితే నవ్వురాదా? అవన్నీ అవమానాలా? ఆ సమయంలో ధర్మరాజు జారిపడ్డా నవ్వు వస్తుంది.

అసలు దుర్యోధనునికీ పాటు ఎందుకు కలిగింది? దుర్యోధనుని తోపాటు శకుని కూడా చూచాడు గదా మయసభను! మరి శకునికెందుకీ పాట్లు లేవు? వెంట వచ్చిన సహాయకులు వివరంగా చెబుతుంటే విచిత్రాలు చూస్తూ ఆనందించాడు, ఆశ్చర్యపోయాడు శకుని. కాని దుర్యోధనుడో– అహంభావి. "సేవకులు నాకు చెప్పేదేమిటి? నేనెరుగని చిత్రాలేమున్నాయి? నాకు తెలియని సభలేమున్నాయి?" అని విసవిస జొరబడి, అడుగడుగున విభ్రాంతుడై, జలమును స్థలమనుకొని వెళ్ళి క్రిందపడి, బట్టలు తడుపుకున్నాడు. అప్పుడెవరికి నవ్వు రాదు? ఇది వినేవారికే నవ్వు వస్తుంది. అక్కడ చీకటి లేదు. దుర్యోధనునికి అంధత్వం లేదు. కనుక ఈ నవ్వు పరిహాసం కానేకాదు.

దీనిని బట్టి ద్రౌపది దుర్యోధనుని చూచి నవ్వలేదు; ఆమె నవ్వినందుకే దుర్యోధనుడు వస్త్రాపహరణమనే దురంతాన్ని తలపెట్టలేదు–అని స్పష్టం.

**ఇక ద్యూత సభలో ద్రౌపది ధర్మతత్పరత ఎట్టిదో సభలో ఏమి జరిగిందో విశ్లేషణ చేద్దాం!**

(వచ్చే సంచికలో)



(గత సంచిక తరువాయి)

# మహాభారతం

## ద్రౌపది 24

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

### 13. ద్యూత సభలో ద్రౌపది ధర్మతత్పరత

**ఎ) ద్యూతసభలో ధర్మజుని చేత పణంగా పెట్టబడి, ఓడింపబడిన ద్రౌపదిని సభకు తీసుకు రమ్మని దుర్యోధనుడు ప్రాతిగామిని పంపగా; ఆమె "నన్నోడి తన్నోడెనా? లేక తన్నోడి నన్నోడెనా? నేను ధర్మవిజితనా? అధర్మ విజితనా?" అని ధర్మ సందేహం లేవనెత్తి, సభకు వచ్చుటకు నిరాకరించుట ధర్మమా? తన భర్తలు దుర్యోధనునికి సేవకులైనప్పటికీ తాను మాత్రం దుర్యోధనుని ఆజ్ఞను తిరస్కరించుట ధర్మమా? అని కొందరు సందేహం వ్యక్తం చేస్తుంటారు.**

ద్రౌపది ఎందుకలా ధర్మ సందేహం లేవనెత్తిందో తెలియాలంటే జూదం జరిగిన విధం తెలియాలి. కనుక ముందుగా జూదం ఎలా జరిగిందో తెలుసుకుందాం.

సభాపర్వం 60వ అధ్యాయంనుండి జూదం జరిగిన విధానం సంస్కృత (మూల) భారతంలో ఇలా వివరంగా తెలియజేయబడింది.

**జూదం ప్రారంభమైంది.** ఎంతో విలువైన మణిరత్నాలను పణంగా పెట్టాడు ధర్మరాజు. దుర్యోధనుడు కూడా మణులను, ధనరాసులను పణంగా పెట్టాడు. శకుని పాచికలు వేశాడు. "ధర్మనందనా! ఈ పందెం నేనే గెలిచాను" అన్నాడు శకుని. "శకునీ! నీవు మోసంతో ఈ పందెంలో నన్ను ఓడించావు. అందుకే గర్విస్తున్నావు. సరే అక్షయ ధనరాసులతో కూడిన పెట్టెలు, సువర్ణరాసులు పణంగా పెడుతున్నాను" అన్నాడు ధర్మరాజు. శకుని పాచికలు వేసి **"ఈ పందెం కూడా నేనే గెలిచాను"** అన్నాడు ఆ తరువాత చైత్రరథాన్ని; 64 కళలలో ప్రవీణులై తరుణీ వయస్సులో ఉన్న లక్షమంది దాసీలను; కార్యశూరులైన లక్షమంది సేవకులను; సువర్ణ హారాలతో వెలిగి పోయే వెయ్యి ఏనుగులను ఒక్కొక్కటిగా ఒడ్డి ఓడిపాయడు ధర్మరాజు. ఆ తరువాత సువర్ణ పతాకాలతో, శ్రేష్ఠమైన గుర్రాలతో, అనుభవజ్ఞులైన సారథులతో శోభించే వెయ్యి రథాలను; అర్జునుడు సాధించి తెచ్చిన గంధర్వహయాలను; తన వద్దనున్న సువర్ణరాసులను వరుసగా ఒడ్డి ఓడిపోతున్నాడు ధర్మనందనుడు. (సభా. 60,61అ)

దారుణమైన శకునియొక్క కపట జూదాన్ని తిలకించిన విదురుడు అనేక విధాలుగా ధృతరాష్ట్రునికి హితబోధ చేశాడు. జూదమనే మైకంలో పడిపోయిన నీ పుత్రుడు పాండవుల వల్ల కలిగే నాశనాన్ని ఊహించలేకపోతున్నాడు. ఇప్పటికైనా నా మాటలు విని విపత్తులు కొని తెచ్చుకోకు. పాండవులతో వైరం నీ ఒక్కడితోనో, నీ దుష్టపుత్రుడు దుర్యోధనునితో సరిపెట్టుకోదు. నీ సమస్త పుత్ర, మిత్ర, బాంధవ ప్రజలతో సహా సర్వులను తుడిచిపెట్టి వేస్తుంది. ఇది భయంకర సంగ్రామానికి దారి తీస్తుంది-అని ఎన్నో విధాల హెచ్చరికలు చేశాడు. ధృతరాష్ట్రుడు గాని, దుర్యోధనుడు గాని ఎవ్వరూ విదురుని ధర్మబోధను ఆలకించే స్థితిలో లేరు.

ఇదంతా వింటూనే విననట్లుగా నటిస్తూ శకుని 'మహారాజా నీ ధనాన్ని, రత్నరాసులను, ఏనుగులను, గుర్రాలను, రథాలను, దాసదాసీ జనులను కోల్పోయావు. ఇంకా ఏమి పణంగా పెట్టగలవు? అన్నాడు. దానికి ధర్మరాజు "సింధూనదీ తీరము నుండి పర్ణాశానదీ తీరము వరకు బల భూములలో ఉండే ఎద్దులను, ఆవులను, గుర్రాలను, మేకలను, గొర్రెలను ఒడ్డుతున్నాను" అన్నాడు. 'అవి కూడా నేనే గెల్చుకున్నాను' అన్నాడు పాచికలు వేసిన శకుని (62-64).

ఇక చివరిగా బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన అగ్ర

హారాలను మినహాయించి మిగిలిన నగరాలు, జనపదాలు, అందులో నివసించే బ్రాహ్మణేతరులైన జనులను ఫణంగా పెట్టాడు ధర్మరాజు. పాచికలు వేసి 'వాటిని కూడా నేనే గెలుచుకున్నాను' అన్నాడు శకుని. "ధర్మారాజా! ఇంక ఇపుడు ఏమి ఒడ్డుతావు? అని శకుని ప్రేరేపించగా, "నా సోదరుడు నకులుని నా ధనంగా పణం బెడుతున్నాను" అన్నాడు ధర్మరాజు. శకుని పాచికలు వేసి "యుధిష్ఠిరా! నీ ప్రియసోదరుడు నకులుడు మా అధీనుడయ్యాడు. ఇప్పుడెవరిని ఒడ్డుతావు?" అన్నాడు. "ధర్మ ప్రబోధకుడు, మహాపండితుడు ఐన సహదేవుని పందెంగా ఒడ్డుతున్నాను" అని ధర్మరాజు అనటంతో పాచికలు వేసిన శకుని "నకులునితోపాటు సహదేవుడు కూడా మాచే జయించబడ్డాడు" అన్నాడు.

ధర్మరాజు ముందుగా ఒడ్డినది నకులుణ్ణే. అయితే ఆంధ్ర మహాభారతంలో నన్నయ గారు ముందుగా సహదేవుని పందెంలో ఒడ్డినట్లు వ్రాయటం జరిగింది. ఇది స్వతంత్రించి ఇలా వ్రాశారో, లేక ఆనాడు ఆయనకు లభించిన ప్రతిలో అలాగే ఉన్నదో తెలియదు గాని ఈనాడు లభిస్తున్న సంస్కృత భారత మూల గ్రంథాన్నింటిలోను నకులునే ముందుగా పణం బెట్టినట్లు ఉన్నది. ఆంధ్రదేశంలో ఆంధ్రభారతమే అధిక ప్రచారంలో ఉండటం వల్ల హరికథలలోను, సినిమాలలోను, నాటకాలలోను, ప్రవచనాలలోను సహదేవుణ్ణే ముందుగా ఓడినట్లు చెబుతుంటారు. ఇక జూద విషయంలోకి వెళదాం.

"యుధిష్ఠిరా! మాద్రీసుతులు, నీ సోదరులు ఐన నకుల సహదేవులు మా ఆధీనులయ్యారు. ఇక నీ ప్రియసోదరులు భీమార్జునులు మిగిలియున్నారు. వారిద్దరూ నీకు అత్యంత ఆత్మీయులు, మాననీయులు. కనుక వారిని మాత్రం పందెంలో పెట్టవు అనే భావిస్తున్నాను" అన్నాడు శకుని. దానికి ధర్మరాజు "ఓరీ దుష్టుడా! అధర్మపరుడా! కపటవర్తనుడా! శకునీ! నీవు మా సోదరుల మధ్య చిచ్చు రగిలించడానికి చూస్తున్నావు" అన్నాడు. ఆపై శకుని, 'ధర్మనందనా! ప్రలోభంతో అధర్మము నాచరించే మనుష్యులు నరకంలో పడతారు. నీవు వయస్సులో పెద్దవాడవు. గుణాలలో శ్రేష్ఠుడవు. భరతవంశ భూషణుడవు. నీకు నమస్కారం. జూదంలో ఓటమిని చవిచూసే కొద్దీ మానసికంగా స్థాయిని కోల్పోతారు. నోటికి వచ్చినట్లు మట్లాడుతారు. నిజం చెప్పాలంటే అలాంటి మాటలు అతడు మేలుకొని ఉన్నప్పుడే కాదు నిద్రలో కూడా కలవరించడు" అని రెచ్చగొట్టాడు శకుని.

దానితో ధర్మరాజు "శకునీ! భయంకరమైన యుద్ధమనే సముద్రాన్ని అర్జునుడనే నావ సాయంతో మేము దాటుతున్నాం, అట్టి నా తమ్ముడు అర్జునుని పణంగా బెడుతున్నాను" అనగానే పాచికలు వేసిన శకుని "ధర్మనందనా! ఈ పందెం కూడా నేనే గెలుచుకున్నాను. ఇపుడు నీ వద్ద పణం పెట్టుటకు భీమసేనుడనే ధనం మాత్రమే ఉన్నది. కనుక అతణ్ణి ఒడ్డి నీ అదృష్టాన్ని పరీక్షించుకో" అన్నాడు. అపుడు ధర్మరాజు "మా సేనను నడిపే వజ్రదేహుడు, ఇంద్రసమాన పరాక్రమశాలి, మహాబలుడు భీమసేనుని పణంగా బెడుతున్నాను" అన్నాడు. మరుక్షణంలోనే పాచికలు వేసిన శకుని విజయ దరహాసంతో "ఈ పందెం కూడా నేనే గెలుచుకున్నాను. ధర్మరాజా! నీవు నీ సోదరులతో సహా సర్వ సంపదలను జూదంలో కోల్పోయావు. ఇప్పుడిక నీ వద్ద ఓడిపోని ధనం ఏమున్నది?" అన్నాడు. వెంటనే ధర్మరాజు తనను తానే పణంగా పెట్టేందుకు త్వరపడ్డాడు. "శకునీ నేను పాండవులలో పెద్దవాడిని, నేను కూడా ఓడితే నన్ను గెలుచుకున్న వారికి సేవ చేస్తాను" అన్నాడు. శకుని పాచికల మోసంలో తనను కూడా పణంగా పెట్టుకొని ఓడిపోయాడు ధర్మరాజు. దీనితో సకల సంపదలు, రాజ్యము, పాండవులైదుగురు మాయాజూదంలో శకుని చేత ఓడించబడి దుర్యోధనునికి అధీనులయ్యారు.

ఇప్పుడు శకుని అంటున్నాడు:-

**శ్లో॥ ఏతత్ పాపిష్ఠమకరోర్యదాత్మానం పరాజయే।**
**శిష్టే సతి ధనే రాజన్ పాప ఆత్మ పరాజయః ॥** (సభా 65అ. 30 శ్లో)

**తా॥** రాజా! నిన్ను నీవు ఒడ్డుకొని ఓడిపోయిన నీవు చేసినది గొప్ప అధర్మ కార్యము. పందెం వేయటానికి ఇంకా ధనం మిగిలియుండగా ఆత్మపరాజయం పాపహేతువు.

**వైశంపాయన ఉవాచ:**

**శ్లో॥ ఏవముక్త్వా మతాక్షస్తాన్ గ్లహేసర్వానవస్థితాన్।**
**పరాజయం లోకవీరాన్ ఉక్త్వా రాజ్ఞాం పృథక్ ప్రథక్॥** (సభా 65 అ. 31శ్లో)

**తా॥** (జనమేజయ మహారాజా!) పాచికలు వేయటంలో నిపుణుడైన శకుని ధర్మజునిచే పణం పెట్టించే విషయంలో తగిన మాటలు మాట్లాడి, సభలో ఉన్న లోక ప్రసిద్ధులైన రాజులతో మరల మరల పాండవుల యొక్క పరాజయాన్ని తెలియజేశాడు.

ఆ తరువాత శకుని ధర్మరాజుతో ఇలా అంటున్నాడు:-

**శ్లో॥ అస్తితేవై ప్రియారాజన్ గ్లహేకోఽపరాజితః।**
**పణస్వ కృష్ణాం పాంచాలీం తయాత్మానం పునర్జయ॥**
(సభా. 65 అ. 32శ్లో)



ఇతరులలోని మంచిని చూడటం వల్ల మన సద్గుణాలు వికాసం పొందుతాయి

**తా॥** మహారాజా! ఇప్పటివరకు నీవు ఓడిపోని ధనం నీ ప్రియతమ ధర్మపత్ని ద్రౌపది ఉన్నది. అందువల్ల పాంచాల రాజకుమారి కృష్ణను (ద్రౌపదిని) పందెంలో ఒడ్డు. ఆమె ద్వారా తిరిగి నీ దాస్యాన్ని తొలగించుకొని విజయం సాధించు-అని.

శకుని అలా ఆదేశించటంతో అప్పటికే తనను తాను ఒడ్డుకొని ఓడిపోయి కౌరవులను దాసుడైన ధర్మరాజు సేవక ధర్మానికి తలొగ్గి, కష్టముతో ద్రౌపదిని పందెంగా ఒడ్డటం జరిగింది. ధర్మరాజు ఎప్పుడైతే ద్రౌపదిని పణంగా పెట్టటం జరిగిందో అప్పుడు ఆ సభ క్షోభించింది. రాజులంతా శోకించారు. భీష్మ, ద్రోణ, కృపాచార్యుల శరీరాలు చెమర్చినవి. విదురుడు రెండు చేతులతో తలపట్టుకొని ముఖం వంచుకొని విచారగ్రస్తుడయ్యాడు. (ఈ సమయంలో ధృతరాష్ట్రుని మనస్థితి తెలిపే శ్లోకం)

**శ్లో॥ ధృతరాష్ట్రస్తు తం హృష్టః పర్యపృచ్ఛత్ పునఃపునః॥**
**కింజితం కింజితమితి హ్యాకారం నాభ్యరక్షత॥**
**(సభా 65అ. 43శ్లో)**

**తా॥** ధృతరాష్ట్రుడు లోలోపల సంతోషిస్తూ, ఎవరు గెలిచారు? ఎవరు గెలిచారు? అని మాటిమాటికి అడుగుతూ తన సంతోషాన్ని దాచలేకపోతున్నాడు.

ఇక కర్ణ దుశ్శాసనులు అమితంగా సంతోషించగా, ఇతర సభాసదులందరి కన్నులనుండి అశ్రువులు రాలుతున్నవి. కొందరు రోదించారు. 'ఈ విజయం కూడా మాదే' అంటూ కుటిలాత్ముడైన శకుని పాచికలను పైకెత్తి పట్టుకొని విజయోల్లాసంతో మదోన్మత్తుడై చేతులను చక్రాకారంలో త్రిప్పు తున్నాడు (సభాపర్వం 65వ అధ్యాయం).

ఇలా అప్పటికే తనను తాను ఒడ్డుకొని ఓడిపోయిన ధర్మరాజు చేత ద్రౌపది పణంగా పెట్టబడి ఓడిపోవటంతో, దుర్యోధనుడు విదురునితో, "ఓ విదురా! ఇలారా! నీవు వెళ్ళి పాండవుల ప్రియసతి ద్రౌపదినిటకు తీసుకొని రమ్ము. ఆ పాపాత్మురాలు శీఘ్రమే ఇక్కడకు వచ్చి ఇల్లు తుడవాలి. దాసీలతో కలిసి ఉండాలి" అన్నాడు. దానికి విదురుడు "మూర్ఖుడా! నీవు నీచుని లాగా దురుక్తులాడుతున్నావు. పూర్ణ కోపంతో ఉన్న మహావిషం గల కాలసర్పాలు నీ తలపై ఉన్నాయి. ఓ మందమతీ! నీవు వాటిని ప్రకోపింపజేసి యమ సదనానికి పోవద్దు. ద్రౌపదిని దాసి అంటావా? ఆమె ఎన్నటికీ దాసి కాజాలదు. ఎందుకంటే ధర్మరాజు తనను తాను ఒడ్డుకొని ముందే ఓడిపోయాడు. ఆ తరువాత నీ మామ శకుని రెచ్చగొట్టి పణంగా ఒడ్డమని ఆదేశించినపుడు పణంగా పెట్టాడు. తననే ఓడినవానికి మరొకరిని పణంగా ఒడ్డే అధికారం ఎక్కడుంటుంది? కుంతీపుత్రులు పావనులు. వారు ఏనాడూ ఎవరినీ బాధించి ఎరుగరు. వాళ్ళ ఉన్నతిని చూచి ఓర్వలేక కుక్కలాగా మొరుగుతున్నావు" అన్నాడు (సభాపర్వం 66 అధ్యాయం)

అంతట మదోన్మత్తుడైన దుర్యోధనుడు విదురుని సభాపదుల సమక్షంలో నిందించి, ప్రాతికామిని పిలిచి "నీవు వెళ్ళి ద్రౌపదిని తీసుకొని రమ్ము. నీకు పాండవుల వల్ల భయం లేదు. ఈ విదురుడు భయపడి ఇలా మాట్లాడుతున్నాడు. ఈతడు మన వృద్ధిని కోరేవాడు కాదు" అని ఆజ్ఞాపించాడు. అంత ప్రాతికామి సింహం గుహలోనికి నక్క ప్రవేశించినట్లు ద్రౌపదీ దేవి భవనంలో ప్రవేశించి ఆమెతో, "అమ్మా! ధర్మరాజు జూదప్రియుడై జూదంలో సమస్తాన్నీ పోగొట్టుకొని చివరిగా పందెంలో నిన్ను కూడా పణంగా పెట్టి ఓడిపోయాడు. కౌరవులకు నీవు దాసివి. నిన్ను తీసుకురమ్మని దుర్యోధన మహారాజు ఆజ్ఞాపించాడు" అన్నాడు.

"ప్రాతికామీ! నీవు ఏం మాట్లాడుతున్నావు? రాజపుత్రులెవరైనా భార్యను జూదంలో పందెం వేసే వారుంటారా? అంత జూదరి అయ్యాడా ధర్మరాజు? పణంగా పెట్టడానికి ఆయన వద్ద వేరే ధనమే లేదా? అని ప్రశ్నించింది ద్రౌపది. అప్పుడు ప్రాతికామి "అమ్మా! ధర్మరాజు ముందుగా మిమ్ము ఓడలేదు. ముందు సంపదలన్నీ ఓడాడు. ఆపైన తమ్ములను, తరువాత తనను కూడా ఓడాడు. ఇక చివరకు మిమ్ము పణంగా పెట్టి ఓడాడు" అని తెలియజేశాడు.

ఇలా ప్రాతికామి చెప్పిన క్రమాన్ని బట్టి ధర్మనందనుడు తనను తాను ఒడ్డుకొని ఓడిన తరువాతనే తనను ఒడ్డినట్లు గ్రహించిన ద్రౌపది ప్రాతికామితో, ప్రాతికామీ! నీవు సభకు వెళ్ళి ముందు **తన్నోడి నన్నోడెనో లేక నన్నోడి తన్నోడెనో** ధర్మరాజునడిగి తెలుసుకొని రా! ఆ తరువాత నన్ను సభకు తీసుకువెళ్ళు" అన్నది. (సభా. 67వ అ. 1-8శ్లో)

-ఇదీ జూదం జరిగిన విధానం. ఇది కపట జూదమా? లేక న్యాయంగా జరిగిన జూదమా? అన్న విషయాన్ని తరువాత విచారణ చేద్దాం. జూదంలో సర్వస్వం ఒడ్డి ఓడిన ధర్మరాజు వరుసగా తమ్ములను, ఆ తరువాత తనను ఒడ్డుకొని ఓడిపోయాడు. అలా ఓడిపోయిన వారికి మరొకరిని పణంగా పెట్టే అధికారం ఉన్నదా? ఉంటుందా? - ఉండదు. మరి తాను ఓడిన తరువాతనే ద్రౌపదిని పణంగా ఎలా పెట్టాడు ధర్మరాజు? తనంతట తానుగా పెట్టలేదు. శకుని ప్రేరణతోనే

పెట్టడం జరిగింది. అసలు ద్రౌపదిని పణంగా పెట్టే ఆలోచన ధర్మరాజుకు ఉంటే నలుగురు తమ్ములను ఓడిన తరువాత ద్రౌపదిని పణంగా పెట్టి ఉండేవాడు. కాని ద్రౌపదిని జూదంలో ఒడ్డటం ఇష్టం లేదు ధర్మరాజుకు. అందుకే నలుగురు సోదరులను కోల్పోవటంతో వెంటనే తనను తాను ఒడ్డుకున్నాడు. ఆలస్యం చేస్తే భీమార్జునులను ఒడ్డమని రెచ్చగొట్టినట్లు శకుని ద్రౌపదిని కూడా ఒడ్డమని రెచ్చగొట్టి తనచేత పణం పెట్టిస్తాడేమోననే శంక ధర్మజునికి ఉండి ఉండవచ్చు. మరి ద్రౌపదినొడ్డటం ఇష్టంలేని ధర్మరాజు శకుని ప్రేరణపై మాత్రం ఎందుకు ఒడ్డినట్లు? తాను అప్పటికే ఓడి కౌరవులకు దాసుడయ్యాడు. దాసునికి స్వతంత్రం ఉండదు. యజమాని చెప్పినట్లు వినాల్సిందే. అందుకే శకుని చెప్పినట్లుగా నడుచుకొని దాస ధర్మాన్ని నిర్వర్తించుటకే ద్రౌపదిని పణంగా పెట్టాడు. అలా పెట్టే అధికారం తనకుందా? ఆ విషయం దాసుడైన తనకు అవసరం లేదు. ఆ అర్హత గూర్చి ఆలోచించవలసింది యజమానే. యజమాని ఆజ్ఞాపించినట్లు నడుచుకోవటమే తన ధర్మం. కనుక ధర్మరాజు ధర్మం తప్పలేదు. గత్యంతరం లేని స్థితిలోనే ద్రౌపదిని పణంగా పెట్టి ఓడటం జరిగింది.

మరి శకుని ధర్మరాజును ఇప్పుడెందుకు ప్రేరేపించాడు? భీముని కూడా పణంగా పెట్టి ధర్మరాజు ఓడిన తర్వాత, అప్పుడే ద్రౌపదిని పణంగా పెట్టమని ఆదేశించవచ్చు గదా! ఆదేశించవచ్చు, అయితే ఆ ఆదేశాన్ని ధర్మజుడు పాటించనవసరం లేదు. ఎందుకంటే అప్పటికి తాను స్వతంత్రుడే గనుక. అందుకే బహుశా శకుని అప్పటికి మిన్నకుండి పోయి ధర్మరాజు తనను తాను ఓడిన తరువాత ద్రౌపదినొడ్డమని ఆదేశించాడు. ఇప్పుడు తప్పని సరిగా ధర్మరాజు తన ఆజ్ఞను పాలిస్తాడు అని విశ్వసించి అలా చేసి ఉండవచ్చు. ఐతే ఇది అధర్మమని, అధికారం లేని ధర్మజునిచే పణం పెట్టిస్తున్నానని శకునికి తెలియదా? తెలుసు. ద్యూతధర్మం తెలిసినవాడే శకుని. కాని అధర్మంగా నడుచుకోవటం, అన్యాయంగా ప్రవర్తించటం, మోసం చేయటం శకునికి వెన్నతో పెట్టిన విద్య. అందుకే ఎంత అధర్మంగా ప్రవర్తించినా తనకు పోయేదేమీ లేదని భావించి అలా ఆదేశించి ఉండవచ్చు.

ద్రౌపదిని ఒడ్డే అధికారం అప్పటికే ఓడిన ధర్మరాజుకు లేదని ధర్మవేత్తయైన విదురుడు సభలోనే నిర్భయంగా తెలియజేశాడు. ఐతే ఎవరి మాటలు వినేస్థితిలో లేని దుర్యోధనుడు ద్రౌపదిని తాము గెలుచుకున్నామని, ఆమెను సభకు రప్పించి దాసీ కృత్యములు చేయించాలని సభలోనే నిశ్శంకగా ప్రకటించి, ఆమెను తీసుకొని వచ్చుటకు ప్రాతికామిని పంపించాడు. ఆ వెళ్ళిన ప్రాతికామి ద్రౌపదితో చెప్పినప్పుడు ధర్మరాజు ముందుగా సర్వస్వాన్ని జూదంలో ఓడిపోయి, ఆ తరువాత తమ్ములను, తనను ఓడిపోయి, చివరకు ద్రౌపదిని నోడిపోయినట్లు చెప్పటం జరిగింది. ఈ క్రమాన్ని వినటంలోనే తననుతాను ఒడ్డుకొని ఓడిన తరువాతనే ధర్మరాజు తనను పణంగా పెట్టినట్లు గ్రహించిన ద్రౌపది తాను ధర్మంగా జయించబడలేదని, కనుక కౌరవులకు అధీనురాలై ఉండవలసిన అగత్యం లేదని, అందువల్ల తాను దుర్యోధనుని ఆజ్ఞననుసరించి, సభకు రావలసిన అగత్యం లేదని నిశ్చయానికి వచ్చింది.

అందువల్లనే ధుర్యోధనుని ఆజ్ఞను తిరస్కరించింది. తనను ఆజ్ఞాపించవలసింది ధర్మనందనుడే గాని దుర్యోధనుడు కాదు. మరి తన్నోడినన్నోడెనా? నన్నోడి తన్నోడెనా? అని ఎందుకు ధర్మ సందేహాన్ని లేవనెత్తింది? నిజమే ప్రాతికామి చెప్పిన దాన్ని బట్టి ధర్మజుడు ముందుగా తాను ఓడిన తర్వాతనే ద్రౌపది నొడ్డాడు. ఆ విషయం తెలిసీ తిరిగి సందేహం వ్యక్తం చేయటం ఎందుకు? ఎందుకంటే ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటో తన భర్త ధర్మరాజే చెప్పాలి. తాను సభకు రావాలా? అవసరం లేదా? ఇది నిర్ణయించవలసింది ధర్మరాజే. అందుకే ధర్మరాజునే అడగమని ప్రాతికామికి చెప్పి పంపించింది.

ఈ సందర్భంలో ద్రౌపది ధర్మబద్ధంగా నడుచుకున్నది. భర్తలంతా ఓడి కౌరవదాసులయ్యారు. వారు ఏమి చెయ్యటానికి, చెప్పటానికీ అశక్తులు. ఇట్టి విపత్కర పరిస్థితిలో తాను ధర్మవేత్తలా ఆలోచన చేస్తున్నది. **ఎంతటి విపత్కర పరిస్థితిలో కూడా ధర్మాన్ని తప్పరాదు**-అనే విశ్వాసంతో ధైర్యంగా నిలిచింది. తన భర్తలు జూదంలో ధర్మబద్ధంగానే ఓడి కౌరవులకు దాసులయ్యారు. కాని తాను అలా ధర్మబద్ధంగా ఓడలేదు. అనధికారి పెట్టిన పణం చెల్లదు. అందుకే తాను దుర్యోధనుని ఆజ్ఞను తిరస్కరించింది. సభకు వచ్చేందుకు ధర్మజుని అనుజ్ఞ ఉన్నదో లేదో తెలుసుకొనుటకే "ముందు తన్నోడి నన్నోడెనా? లేక నన్నోడి తన్నోడెనా? ఆ ధర్మజునే అడిగి రమ్మ"ని ప్రాతికామిని త్రిప్పి పంపింది.

ఇలా ప్రశ్నించటం ధర్మమా? అని ప్రశ్నించే వారు ఏమీ ప్రశ్నించకుండా దుర్యోధనుని ఆజ్ఞను శిరసావహించి, సభకు వచ్చి, అతని ఇల్లు తుడిచి, దాసీలతో కలిసి ఉంటే హర్షిస్తారా? అసలు జూదమే మోసం. అందులో కూడా ఓడినివానిచే


ఆకలివేసినా సింహం గడ్డిమేయదు. కష్టాలెన్ని చుట్టుముట్టినా ఉత్తముడు నీతి తప్పడు

పెట్టించిన పణం. కనుకనే ద్రౌపది అలా ప్రశ్నించటం ధర్మమేనని స్పష్టం.

**B.** కొందరు 'మాయాజూదం మాయాజూదం' అంటారు గదా! నిజంగా ఇది మాయాజూదమేనా? శకుని ధర్మరాజును మోసం చేసి గెలిచాడా? లేక జూదంలో ధర్మరాజు యొక్క చేతగానితనమో, శకుని యొక్క నైపుణ్యమో కారణమా?

పాండవుల రాజసూయం, వారి సంపదలు చూచిన దుర్యోధనుడు అసూయతో రగిలిపోతున్నాడు. అతడి శరీరం వివర్ణమైంది. రాత్రిళ్ళు నిద్రపట్టటం లేదు. ఎవ్వరితోను మాట్లాడటం లేదు. పిచ్చివాడైపోతున్నాడు. ఇది తెలుసుకున్న శకుని "దుర్యోధనా! ఎందుకలా విచారంగా ఉన్నావు? ఏమిటి నీ దుఃఖానికి కారణం" అన్నాడు. దానికి దుర్యోధనుడు "మామా! ఆ పాండవ ఐశ్వర్యాన్ని నీవు కూడా చూచావు గదా! శ్రీకృష్ణుడు సభలో శిశుపాలుని వధిస్తుంటే అందరూ జయ జయ ధ్వానాలు చేశారే కాని ఒక్కరైనా ఎదిరించారా? ఆ పాండవుల సంపదచూచి అసూయతో రగిలిపోతున్నాను. ఏ విధంగా పాండవ సంపదను హరించగలను? మామా! శత్రువులు ఇలా వృద్ధి పొందుతుంటే మానధనాద్యుడనైన నేను ఎలా సహించగలను? నేనిక జీవించి ప్రయోజనం ఏమున్నది?"

**శ్లో॥ వహ్నిమేవ ప్రవేక్ష్యామి భక్షయిష్యామి వా విషం।**
**అపోవాపి ప్రవేక్ష్యామి నహి శక్ష్యామి జీవితుం॥**
**(సభా 47అ. 31శ్లో)**

**తా॥** నేను అగ్నిలో దూకుతా. లేదా విషం తింటా. ఈ రెండూ కాకపోతే జలంలో ప్రవేశిస్తా. అంతేకాని నేను జీవించను.

**శ్లో॥ కృతోయత్నో మయాపూర్వం వినాశే తస్య సౌబల।**
**తచ్చ సర్వమతి క్రమ్య సంవృద్ధో ప్స్వివ పంకజం॥**
**(సభా 47అ.37శ్లో)**

**తా॥** నేను ఆ ధర్మరాజును నాశనం చేయటానికి ఎన్నో ప్రయత్నాలు ఇంతకు ముందు చేశాను. కాని అన్ని సంకటాలను అధిగమించి అతడు నీటిలోని పద్మంలాగా వృద్ధి చెందాడు అని తన మనోవేదనను తెలియజేశాడు దుర్యోధనుడు.

దుర్యోధనుడు స్వయంగా తెలియజేసిన తన మనోభావాలను బట్టి అతడెంతటి అసూయాపరుడో, పరుల సంపదలను కొల్లగొట్టాలని ఎంత ఆశపడుతున్నాడో, పాండవ సంపదను చూచి ఎలా కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నాడో తెలియటమే గాక చిన్నతనంలోనే పాండవుల నాశనానికి ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు కూడా అంగీకరిస్తున్నాడు.

ఇప్పుడు శకుని అంటున్నాడు, **"దుర్యోధనా! ధర్మరాజుకు జూదం అంటే ఎంతో ఇష్టం కాని ఎలా ఆడాలో తెలియదు. పిలిస్తే తప్పక వస్తాడు. నేను జూదంలో గొప్ప నైపుణ్యం గలవాణ్ణి. కనుక మీ తండ్రి ద్వారా ధర్మరాజును జూదానికి పిలవాలి"** అని పలికి దుర్యోధనుని వెంటబెట్టుకొని ధృతరాష్ట్రుని వద్దకెళ్ళి, తండ్రీ కొడుకులు ఇద్దరి సమక్షంలోనే ఇలా తన నిర్ణయాన్ని తెలియజేశాడు.

"దుర్యోధనా! లోకోత్తరమైన పాండవసంపద నీకు ప్రాప్తించే ఉపాయం చెబుతాను. ఈ భూమండలంలో నేను జూదవిద్యలో కుశలుడను. ధర్మజునకు జూదమునందు ప్రీతి గలదు. కాని అతడికి అందు నైపుణ్యము లేదు. జూదానికి గాని, యుద్ధానికి గాని ఆహ్వానించినపుడు ధర్మరాజు తప్పక వస్తాడు. ఇది ఆతని నియమము.

**శ్లో॥ నియతం తం విజేష్యామి కృత్వాతు కపటం విభో।**
**ఆనయామి సమృద్ధిం తాం దివ్యాం చోపాహ్వ యస్వతం॥**
**(సభా. 49 అ. 40శ్లో)**

**తా॥** రాజా! నేను కపటం చేసి యుధిష్ఠిరుని జూదంలో తప్పక ఓడిస్తాను. ఆతని దివ్యసమృద్ధితో కూడిన సంపదను నీకు రప్పిస్తాను. అతడిని జూదానికి ఆహ్వానించు" అన్నాడు.


ఇదే సందర్భంలో ఆంధ్రమహాభారతంలో కూడా శకుని వాక్యం ఇలాగే తెలియజేయబడింది.

**"నేనపహరించియిత్తు ధరానుత! మాయదురోదర వ్యాజమునన్"**

మాయాజూదంలో వారి సంపదనంతా అపహరించి నీకు ఇస్తాను- అని.

దీనిని బట్టి ఇది మాయాజూదమో? కాదో స్పష్టంగా తెలిసిపోతున్నది. జూదమాడిన శకునియే స్వయంగా మాయాజూదమని, నేను కపటం (మోసం) చేసి జూదంలో పాండవ సంపదను హరించి ఇచ్చెదనని స్పష్టంగా తెలియజేయటం గమనార్హం. అంతేగాక ఎటువంటి జూదం లేదా పేకాటలోనైనా అన్నిసార్లు ఒక్కరే గెలవటం కూడా సందేహించాల్సిన విషయమే. శకుని నైపుణ్యం గలవాడే అయినా ధర్మరాజు మరీ అంతచేతగాని వాడేమీ కాదు. కాని వేసిన ప్రతి పందెమూ శకుని గెలవటానికి కారణం జూదంలో శకుని చేసిన మోసమే, కపటమే. కనుక ఇది మాయాజూదమేననుటలో సందేహం లేదు.

ఇక ద్రౌపదీ ప్రశ్నపై ఏమి జరిగినదో..! **(వచ్చే సంచికలో)**



# మహాభారతం

## ద్రౌపది 25

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

**C) ద్రౌపదిని సభకీడ్చుకొని వచ్చుట: ద్రౌపది ధర్మశీలత**

"నన్నోడి తన్నోడెనా? లేక తన్నోడి నన్నోడెనా? ఆ ధర్మరాజునే అడిగి తెలుసుకొనిరా" అని ద్రౌపది ప్రాతికామిని సభకు త్రిప్పి పంపగా, అతడు తిరిగి వచ్చి ద్రౌపది ఇలా అడుగుతున్నదని ధర్మరాజుతో చెప్పాడు. పరాజయ దుఃఖంతో అచేతనుడైయున్న ధర్మరాజు మౌనంగా ఉన్నాడు. అప్పుడు దుర్యోధనుడు ప్రాతికామితో "ఓరీ! నీవు వెళ్ళి ద్రౌపదిని ఇక్కడికే వచ్చి అడగమని చెప్పు. ఆమె ప్రశ్నను, ధర్మజుని సమాధానాన్ని సభాసదులంతా వింటారు" అన్నాడు. దుర్యోధనుని సేవలో ఉన్న ప్రాతికామి రాజాజ్ఞ గనుక తిరిగి ద్రౌపదివద్దకెళ్ళి, "అమ్మా! దుర్యోధనుడు మిమ్ము సభకు వచ్చి అక్కడే అడగమంటున్నాడు. తల్లీ! కౌరవులకు వినాశకాలం సమీపించినది, మిమ్ములను సభకు రప్పించ సాహసించినవాడు తన ధన సంపదలను, వైభవాన్ని రక్షించుకోజాలడు" అన్నాడు.

అప్పుడు ద్రౌపది ప్రాతికామితో ఇలా అన్నది "సుఖదుఃఖములనేవి పండితులకు, మూర్ఖులకు తటస్థించుచునే ఉంటాయి. ఐతే జగత్తులో ధర్మమొక్కటే శ్రేష్ఠమైనది. ధర్మము గనుక రక్షింపబడుతుంటే అదే మనకు శుభములను కలిగిస్తుంది. నేనట్టి ధర్మాన్ని ఉల్లంఘించలేను. కనుక నీవు వెళ్ళి నా సందేహాన్ని గూర్చి సభ్యులనడుగు. ఇపుడు నా కర్తవ్యమేమిటో- అక్కడి ధర్మాత్ములు, నీతిజ్ఞులు, శ్రేష్ఠపురుషులు,. వృద్ధులు అయిన మహాత్ములు ఏమి చెబితే అలాగే నడుచుకుంటాను" అది విని ప్రాతికామి మరల సభకు వెళ్ళి ద్రౌపదీ ప్రశ్నను తెలుపగా దుర్యోధనుని నిర్బంధం చూచి, అతడి దురాగ్రహానికి భయపడి సభ్యులందరూ తలలు వంచి మౌనంగా ఉన్నారు. (సభా. 67అ. 7-17శ్లో)

-తాను ధర్మంగా జయించబడలేదని గ్రహించిన ద్రౌపది ముందుగా ధర్మరాజు వద్దకే ప్రాతికామిని పంపి తన ధర్మ సందేహాన్ని నివృత్తి చేసుకోవాలనుకుంది. ధర్మరాజు మౌనం వహించాడు. భార్య విషయంలో భర్త మౌనం వహించినప్పుడు, ఇక ఆమెకు సమాజంలోని పెద్దలు, ధర్మాత్ములే ఆశ్రయమౌతారు. అందుకే ఇట్టి క్లిష్ట పరిస్థితిలో తన కర్తవ్యం ఏమిటో చెప్పమని సభలోని పెద్దలనే కోరింది. కాని పెద్దలు కూడా మౌనం వహించారు.

-ఇంతవరకు ద్రౌపది ఎక్కడా అధైర్యం చెందలేదు. ధర్మాన్నీ తప్పలేదు. పైగా ధర్మాచరణమే సకలశుభాలు కలిగిస్తుందనే భరోసాతో ఉన్నది.

సభలోని పెద్దలు కూడా మౌనం వహించగా ఇట్టి స్థితిలో ద్రౌపది సభకు వచ్చుటే మంచిదని, తన ఆజ్ఞలేనిదే ఆమె సభకు రాదని భావించిన ధర్మరాజు, ద్రౌపదికి విశ్వాస పాత్రుడైన ఒక దూత చేత ఆమెకు ఒక సందేశం పంపించాడు. ఇవిగో ఆ శ్లోకాలు -

**శ్లో॥ యుధిష్ఠిరస్తు తచ్ఛ్రుత్వా దుర్యోధన చికీర్షతం।**
**ద్రౌపద్యాః సమ్మతం దూతం ప్రాహిణోత్భరతర్షభ॥**
**(సభా 67 అ.18శ్లో)**

**శ్లో॥ ఏకవస్త్రాత్వధోనీవీ రోదమానారజస్వలా।**
**సభామాగమ్య పాంచాలి శ్వశుర స్యాగ్రతో భవ॥**
**(సభా 67 అ. 19శ్లో)**

**తా॥** దుర్యోధనుని చికీర్షితమును (ఏమి చేయాలనుకుంటున్నాడో ఆ భావాన్ని) గ్రహించిన యుధిష్ఠిరుడు ద్రౌపదికి విశ్వాస పాత్రుడైన దూత ద్వారా ఈ విధంగా సందేశం పంపించాడు. (18శ్లో).

**తా॥** ఓ పాంచాల రాజకుమారీ! నీవు ఏక వస్త్రమును ధరించి యున్నప్పటికీ రజస్వలవై అధోనీవితో ఉన్నప్పటికీ సభకు వచ్చి, నీ మామ ధృతరాష్ట్రుని ఎదుట నిలబడు. (19శ్లో)

**శ్లో॥ అథత్వా మాగతాం దృష్ట్వా రాజపుత్రీం సభాంతథా।**
**సభ్యాస్సర్వే వినిం దేరన్ మనోభిర్ ధృతరాష్ట్ర జం॥**
**(సభా 67 అ.20 శ్లో)**

నీవంటి రాజకుమారి సభకు వచ్చి నిలుచుటను చూచిన సభాసదులంతా తమ తమ మనస్సులలో దుర్యోధనుని నిందించెదరు–అని.

– ఈ విధంగా ఎందుకు సందేశం పంపించాడు యుధిష్ఠిరుడు?–

దుర్యోధనుని చికీర్షితాన్ని గ్రహించి, ఏమిటా చికీర్షితం? ధర్మజుడు శకునిప్రేరణతో ద్రౌపదిని పణంగా పెట్టి జూదంలో ఓడిపోవటంతో, దుర్యోధనుడు విదురునితో అన్నాడు– "ఓ విదురా! నీవు వెళ్ళి ద్రౌపదిని తీసుకొనిరా. ఆ పాపాత్మురాలు ఇక్కడకు వచ్చి ఇల్లు తుడవాలి. దాసీలతో కలిసి ఉండాలి" అని. ఆ తరువాత ప్రాతికామిని పిలిచి, "నీవు వెళ్ళి ద్రౌపదిని తీసుకొనిరా. నీకు పాండవులవల్ల ఎట్టి భయమూ లేదు" అన్నాడు. ద్రౌపది వద్ద నుండి మొదటిసారి తిరిగి వచ్చిన ప్రాతికామితో "ఆమెను ఇక్కడికే వచ్చి అడగమని చెప్పు. సభ్యులందరూ వింటారు" అన్నాడు. అంటే ఎలాగైనా ద్రౌపదిని సభకు రప్పించాలని, ఆమెను అవమానించాలని, తద్వారా పాండువులు తల ఎత్తుకుని జీవించే వీలులేకుండా చేయాలని దుర్యోధనుని చికీర్షితం–మనస్సులోని దుష్టభావన. ఇట్టి చికీర్షితాన్ని గ్రహించిన యుధిష్టిరుడు ద్రౌపది రజస్వల గనుక, సభకు రాదగని స్థితిలో ఉన్నది గనుక, దుర్యోధనుడెలాగైనా ఆమెను సభకు రప్పించి, అవమానించాలనే దురాలోచనలతో ఉన్నాడు గనుక; నీవు ఎటువంటి స్థితిలో ఉన్నప్పటికీ సభకు వచ్చి ధృతరాష్ట్రుని ఎదుట నిలువుము. సభాసదులు నిన్ను చూచి దుర్యోధనుని దురాగతమునకు అతడినే నిందిస్తారు– అని ద్రౌపదికి సందేశం పంపించాడు యుధిష్ఠిరుడు.

యుధిష్ఠిరుడు ఊహించినట్లే దుర్యోధనుడు ప్రాతికామితో అంటున్నాడు, "ప్రాతికామీ! ద్రౌపదిని ఇక్కడకు తీసుకొనిరా! ఆమె ఎదుటనే ధర్మాత్ములైన కౌరవులు ఆమె ప్రశ్నకు సమాధానం చెబుతారు" అన్నాడు. దుర్యోధనునకు తాను వశవర్తియైనప్పటికీ ద్రౌపదీ కోపమునకు భయపడుతున్న ప్రాతికామి "ద్రౌపదీదేవికి నేనేమి చెప్పవలయునో తెలియ జేయండి" అని మరల సభాసదులను ప్రార్థించాడు.

అది చూచి దుర్యోధనుడు "దుశ్శాసనా! దుర్బల హృదయుడైన ఈ ప్రాతికామి భీమసేనునకు భయపడుతున్నాడు. నీవు స్వయంగా వెళ్ళి ద్రౌపదిని పట్టుకొని తీసుకురా! మన శత్రువులైన పాండవులు మనకు దాసులై పడియున్నారు. ఇక వాళ్ళు చేయగలిందేమీ లేదు" అన్నాడు. వెంటనే దుశ్శాసనుడు లేచి ఎర్రబడిన కనులతో పాండవ భవనంలో ప్రవేశించి "ద్రౌపదీ రమ్మ రమ్ము. నిన్ను ధర్మంగా జూదంలో గెలుచుకున్నాం. ఇక సిగ్గు విడిచి దుర్యోధనుని వైపు చూడు. కౌరవులను సేవించు. ఇక నీవు మా దాసివి" అన్నాడు. ద్రౌపది దుఃఖంతో కుమిలి పోయింది. తన మలినముఖాన్ని చేతులతో దాచుకొని భయంతో ధృతరాష్ట్రుని భార్యలున్న తావునకు పరుగుపెట్టినది. అంత దుశ్శాసనుడు గర్జిస్తూ అంతకన్నా వేగంగా పరుగెత్తి, రాజసూయ మహాయజ్ఞమునందు మంత్రపూతమైన పుణ్య జలాలతో అభిషేకించబడిన ద్రౌపదీదేవి శిరోజాలను పట్టుకొని, పాండవ పరాక్రమాన్ని గణించకుండా, సభాసమీపానికి ఈడ్చుకొని వచ్చి, అనాథనుగా ఎంచి మహావాయువు అరటి చెట్టును ఊపివేసినట్లు అటూఇటూ బలాత్కారంగా గుంజుతున్నాడు.

దుశ్శాసనుడు పట్టుకొనగానే ఆమె శరీరం కుంచించుకు పోయింది. మెల్లగా తగ్గు స్వరంతో "ఓరీ దుష్టుడా! మందబుద్ధీ! నేను రజస్వలను. ఏకవస్త్రమును ధరించియున్నాను. నన్ను సభకు చేర్చటం తగదు"అని పదేపదే చెబుతున్నా వినిపించుకోకుండా ఆమె నల్లని కురులను గట్టిగా పట్టుకొని ఈడుస్తూ ఇలా దుర్భాషలాడుతున్నాడు. (సభా 67అ.23-33 శ్లో)

**శ్లో॥ రజస్వలా వాభవయాజ్ఞసేని ఏకాంబరావా వ్యథవా వివస్త్రా।**
**ద్యూతే జితాచాసికృతాచదాసీ దాసీషు వాసశ్చయథోపజోషం॥**
**(సభ 67 అ.34శ్లో)**

**తా॥** ద్రౌపదీ నీవు రజస్వలవైనను సరే, ఏకవస్త్రవైనను సరే! చివరకు వివస్త్రవైనను సరే! జూదంలో నిన్ను గెల్చుకున్నాం. నీవు మా దాసివి. అందువల్ల నీవు మా ఇష్ట ప్రకారం దాసీలతో కలిసి ఉండాలి (34).

ఇది ద్రౌపదిని సభకీడ్చుకొని వచ్చిన విధం. ఇక్కడ దుర్యోధన దుశ్శాసనుల దుర్మార్గాన్ని, ద్రౌపది ధర్మజుల ధర్మశీలతను చక్కగా గ్రహించవచ్చు.

## D) కురుసభను ద్రౌపది నిలదీయుట, ద్రౌపదీ ప్రశ్నకు భీష్ముని సమాధానం.

రాజసూయ అవభృథ స్నానసందర్భంగా, మంత్రపూతమైన

పుణ్య జలాలతో పవిత్రీకృతం గావించబడిన ద్రౌపదీదేవి కేశపాశమును బట్టుకొని, దుష్టదుశ్శాసనుడు 'దాసి, దాసి' అంటూ ఆమె నటుఇటు గుంజుచుండగా, ఆమె కేశములు చెల్లా చెదరయ్యాయి. ఆమె కట్టిన వస్త్రం కొంత జారిపోయింది. ఆమె సిగ్గుతో, దుఃఖంతో, లోలోపల తీవ్రక్రోధంతో ప్రజ్వలిస్తూ ఆ విపత్కర పరిస్థితిలో ఇలా అంటున్నది "ఓరీ దుష్టుడా! ఈ సభలో శాస్త్ర పారంగతులున్నారు. కర్మిష్ఠులున్నారు. శాస్త్రముల నుపదేశించిన పితృసమానులైన గురువులున్నారు. ఇట్టి వారి ముందుకు రజస్వలను, ఏకవస్త్రను అయిన నన్ను ఈ విధంగా ఈడ్చుకొని రావటం అనుచితం. ఓ దురాచారీ! క్రూరకర్ముడా! నీవు నన్నిలా అవమానించిన నీ దుండగములను పాండవులు సహించరు. ఇంద్రాది దేవతలు సహాయపడినప్పటికీ నా భర్తలు నీ అత్యాచారాలకు తగిన దండన విధించకమానరు. ధర్మజుడు ధర్మనిరతుడు. అట్టి ధర్మము సూక్ష్మబుద్ధి గలవారికే అవగత మౌతుంది. నా భర్తయందు దోషం పరమాణు మాత్రం కూడా లేదు. నా బర్తలు అపరాధులు కాదు. నేను అపరాధుల భార్యను కాదు. కురువీరుల సమక్షంలో రజస్వలయైన నన్ను పట్టి ఈడ్చుకొని వచ్చితివే, ఇంతకంటే దుండగమున్నదా? నిన్ను మందలించు వాడొక్కడూ కూడా లేడే. ఇది అందరకు సమ్మతమే కాబోలు. ఛీఛీ భరతవంశోద్భవుల ధర్మం భగ్నమై పోయింది. ఇది ధర్మసభయేనా? లేక ధర్మం ఈ సభ నుండి పారిపోయిందా? ధర్మంలేదు, సదాచారం లేదు, సభ్యత లేదు, సంస్కారం లేదు. క్షాత్రం నశించిపోయింది. లేనిచో ఛిన్నాభిన్నమైపోతున్న కురుధర్మసేతువును సభలో చూస్తూ కురువీరులిలా ఉపేక్షిస్తారా? భీష్మద్రోణ విదురులకు, ధృతరాష్ట్ర ప్రభువుకు సమర్థత లేదు. కనుకనే దుర్యోధనుని ఈ భయంకర పాపకార్యం వైపు దృష్టి పెట్టలేకపోతున్నారు. ఒక అబలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ కూర్చునేవారు ధర్మపరులా? పాపభీతి కలవారేనా? చెప్పండి? మీ అందరి ముందే జూదం ఆడారు. జూదంలో నన్ను ధర్మబద్ధంగానే గెల్చుకున్నారా కౌరవులు? లేక అధర్మం జరిగిందా?" అని సభను నిలదీసిన ద్రౌపది దైన్యంతో పాండవుల వైపు చూచింది. అపుడు రాజ్యం పోయినా, ధనము, సువర్ణము, మణిరత్నరాసులు పోయినా కలుగని దుఃఖము; లజ్జాకోపములతో మిళితమైన ద్రౌపదీ దేవి చూచిన చూపుతో పాండవులకు ఆవహించింది. పాండవుల దేహాలు కంపించాయి. పాండవుల వైపు చూచున్న ద్రౌపదీదేవిని, సత్యానికి కట్టుబడి దీనులైయున్న పాండవులను చూచి, దుశ్శాసనుడు ద్రౌపదీదేవిని గుంజి, స్మృతి తప్పిందా అన్నట్లున్న ద్రౌపదీదేవిని 'దాసి, దాసి' అంటూ పకపక నవ్వగా, ఆ దుశ్శాసనుడలా అన్నందుకు కర్ణుడు పరమానంద భరితుడై దుశ్శాసనుని అభినందించి తానుకూడా పకపక నవ్వాడు. ఇదిగో ఆ శ్లోకపాదం. **"కర్ణస్తు తద్వాక్య మతీవ హృష్ట స్సంపూజ యామాస హసన్ సశబ్దం"**. ఆ తరువాత శకుని కూడా కర్ణుని వలెనే ఆనందించి, దుశ్శాసనుని అభినందించి పకపక నవ్వెను. ఆ దుశ్శాసనుని దుర్మార్గపు కృత్యానికి కర్ణశకుని దుర్యోధనులు తప్ప సభలోని మిగిలినవారందరూ మిక్కిలి దుఃఖించారు. (సభా 67అ. 35-46 శ్లోకములు).

- ఈ దుష్ట చతుష్టయచర్యను విజ్ఞులు జాగ్రత్తగా గమనించాలి. కర్ణుడు దుష్టుడు కాదు, చాలా మంచివాడు, ఉదారస్వభావుడు, ధర్మాత్ముడు అని అనుకొనేవారు కూడా ఈ సందర్భంలోను, ఇంకా ముందుముందు కర్ణుని వాచాలత, దుర్మార్గం, నోటికి వచ్చినట్లు ప్రేలటం, ధర్మాన్ని అధర్మంగా- అధర్మాన్ని ధర్మంగా నిరూపించటాన్ని గమనించాలి.

## ద్రౌపదీప్రశ్నకు భీష్ముని సమాధానం

ద్రౌపదీదేవి 'జూదంలో కౌరవులు నన్ను ధర్మబద్ధంగానే గెల్చుకున్నారా? లేక అధర్మం జరిగిందా? చెప్పండి!' అని సభను నిలదీసినపుడు భీష్ముడు ఇలా సమాధానం ఇచ్చాడు. భీష్ముని సమాధానం 3 శ్లోకాల్లో ఉన్నది. అవేమిటో చూద్దాం.

**శ్లో॥ నధర్మసాక్ష్మ్యాత్ సుభగే వివేక్తుం.**
**శక్నోమితే ప్రశ్న మిమం యధావత్'**
**అస్వామ్యశక్తఃపణితుం పరస్వం**
**స్త్రియాశ్చ భర్తుర్వశతాం సమీక్ష్య॥ (సభా 67 అ.47శ్లో)**

**తా॥** అమ్మా! సౌభాగ్యశాలినీ! ధర్మం అత్యంత సూక్ష్మమైనది గనుక నేను నీ ప్రశ్నకు ఇదమిత్థంగా వివేచించి చెప్పలేక పోతున్నాను. (1)**'స్వామికానివాడు పరుల ధనాన్ని పణంగా పెట్టలేడు. కాని (2) స్త్రీ ఎప్పుడూ పతి అధీనంలో ఉండేదే'**

**శ్లో॥ త్యజేత సర్వాం పృధివీ సమృద్ధాం**
**యుధిష్ఠిరో ధర్మమధో నజహ్యాత్।**
**ఉక్తం జితోఽస్మీతి చ పాండవేన**
**తస్మాన్నశక్నోమి వివేక్తుమేతత్। (సభా 67 అ.48శ్లో)**

**తా॥** (3)ధర్మరాజు ధన సంపదలతో తులతూగుతున్న ఈ సమస్త భూమండలాన్నైనా త్యజిస్తాడు గాని ధర్మాన్ని మాత్రం త్యజించడు. అట్టి ధర్మనందనుడు '**జితోఽస్మి**' అని అనటం వల్ల తననొక్కనినే ఓడినట్లు స్వయంగా తెలియజేశాడు. కనుక వివేచించి చెప్పలేక పోతున్నాను.

శ్లో॥ ద్యూతేఽద్వితీయ శ్శకునిర్ నరేషు
కుంతీ సుతస్తేన నిసృష్ట కామః
నమన్యతే తాం నికృతిం యుధిష్ఠిరః
తస్మాన్నతే ప్రశ్న మిమం బ్రవీమి॥ (సభా 67 అ.49శ్లో)

తా॥ [(4)] రాజులందరిలోను ద్యూతవిద్యావిశారదుడు శకుని. ఈ శకునియే యుధిష్ఠిరుని ప్రేరేపించి నిన్ను జూదంలో ఒడ్డేందుకు కోరికను రగిలించాడు. కాని యుధిష్ఠిరుడు శకుని యొక్క మోసాన్ని తెలుసుకోలేకపోయాడు. అందువల్ల నీ ప్రశ్నకు వివేచించి సమాధానం చెప్పలేకపోతున్నాను.

ఇదీ భీష్ముని సమాధానం. ఇలా "నీ ప్రశ్నకు వివేచించి సమధానం చెప్పలేకపోతున్నాన"ని భీష్ముడు చెబుతున్నప్పటికీ, ఈ 3 శ్లోకాల భావాన్ని కలిపి లోతుగా విశ్లేషణ చేస్తే భీష్ముని ఆంతరంగిక అభిప్రాయం స్పష్టంగానే ఉన్నది. ఆ బాహ్యార్థానికి అంతరార్థమేమిటో చూద్దాం.

**1. స్వామికానివాడు పరుల ధనాన్ని పణంగా పెట్టలేడు:** ధర్మరాజు ముందుగా తనను తాను ఒడ్డుకొని ఓడిపోయాడు. అలా ఓడినవాడు స్వామికాడు కనుక నిన్ను పణంగా బెట్టుటకు అధికారం ఉండదు. అంతేకాదు, నీవు పాండవులైదుగురికీ భార్యవు. కనుక నీవు పరధనానివి. పరధనాన్ని పందెం వేసే అధికారం ఎవ్వరికీ ఉండదు. కనుక ధర్మరాజుకు నిన్ను ఒడ్డే అధికారం లేదు.

**2. స్త్రీ ఎప్పుడూ పతి అధీనంలో ఉండేదే:** భార్య ఎప్పుడూ భర్తయొక్క ధనమే గనుక, భర్త ఓడినపుడు ఆ ఓటమిలో భార్య కూడా ఉన్నట్లే. అంటే ధర్మరాజు తనను తాను ఒడ్డుకొని ఓడిపోయినపుడు ధర్మరాజుతో పాటుగా ద్రౌపది కూడా ఓడిపోయినట్లేనని అనుకుందామన్ననూ-

**3. "ధర్మరాజు ధనసంపదలతో తులతూగుతున్న ఈ సమస్థ భూమండలాన్నైనా త్యజిస్తాడు గాని ధర్మాన్ని మాత్రం త్యజించడు. అట్టి ధర్మనందనుడు జితోస్మి' అనటం వల్ల తన నొక్కనినే ఓడినట్లు స్వయంగా తెలియజేశాడు"** - ధర్మరాజు ధర్మాన్ని ఎట్టి పరిస్థితులలోనూ విడిచిపెట్టడు. అట్టి ధర్మరాజు తనను తానొడ్డుకొని ఓడినప్పుడు జితౌస్వః అనకుండ 'జితోఽస్మి అన్నాడు. అంటే తననొక్కడినే ఓడినట్లు (అందులో ద్రౌపదిలేనట్లు) తెలియజేశాడు. కనుక భర్తతో పాటే భార్య అని అనటానికి వీలు లేదు. ధర్మజుని ఓటమిలో ద్రౌపది ఓటమి లేదు. మరొక ఋజువు కూడా ఉన్నది.

**4. "రాజులందరిలోను ద్యూత విద్యావిశారదుడు శకుని. ఆ శకునియే యుధిష్ఠిరుని ప్రేరేపించి నిన్ను జూదంలో ఒడ్డేందుకు కోరికను రగిలించాడు"** ధర్మరాజు ఓటమిలోనే ద్రౌపది ఓటమి ఉన్నదా? లేదా? అని తేల్చటానికి శకుని అభిప్రాయం కూడా పరిగణించదగినదే, ఎందుకంటే ద్యూత ధర్మం తెలిసినవారిలో శకుని మొదటివాడు. అట్టి శకునియే ద్రౌపదిని పందెం ఒడ్డమని ప్రత్యేకంగా ధర్మరాజును ప్రేరేపించాడు. ఒకవేళ ధర్మరాజు ఓడితే అతడి భార్యకూడా ఓడినట్లే అయితే దాసుని భార్యకూడా దాసియే. ఐతే ధర్మరాజు ఓడిన తర్వాత; ఓడి కౌరవులకు దాసుడైన తర్వాత ద్రౌపదిని పణంగా ఎందుకు పెట్టిస్తాడు శకుని? పైగా ధర్మరాజు తనను తాను ఒడ్డుకొని ఓడిన తరువాత శకుని ధర్మరాజుతో "ధర్మనందనా! నిన్ను నీవు ఒడ్డుకొని ఓడిపోయిన నీవు చేసినది గొప్ప అధర్మ కార్యము: పందెం వేయటానికి ఇంకా ధనం మిగిలియుండగా ఆత్మపరాజయం పాపహేతువు. మహారాజా! ఇప్పటి వరకు నీవు ఓడిపోని ధనం నీ ప్రియతమ ధర్మపత్ని ద్రౌపది ఉన్నది. అందువల్ల ఆమెను ఒడ్డి ఆమె ద్వారా నీ దాస్యాన్ని తొలగించుకో" అన్నాడు.

అంటే ప్రత్యేకంగా శకుని ద్రౌపది ఇప్పటివరకు నీవు ఓడిపోని ధనం అని స్పష్టంగా తెలియజేశాడు. కనుక శకుని అభిప్రాయం ప్రకారం కూడా ధర్మజుని ఓటమిలో ద్రౌపది ఓటమి లేదు అని ఋజువౌతున్నది.

దీనినిబట్టి భీష్ముని అభిప్రాయం "ద్రౌపది అధర్మవిజిత" అనియే. ఎందుకంటే ద్రౌపదిని ఒడ్డే అధికారం అప్పటికే ఓడిపోయి ఉన్న ధర్మరాజుకు లేదు. ఒకవేళ ధర్మరాజు ఓటమిలో ద్రౌపది ఓటమి కూడా ఉన్నది అని భావిద్దామా! అంటే ధర్మరాజు తనను తాను ఒడ్డుకొని ఓడినప్పుడు 'జితోఽస్మి' అనుటవల్ల తానొక్కడే ఓడినట్లు చెప్పడం జరిగింది. అంతేగాక శకుని కూడా ధర్మజుని ఓటమి అనంతరం నీకింకా ఓడిపోని ధనం ఉన్నది. ఆమెయే ద్రౌపది, ఆమెనొడ్డుము' అని ద్రౌపదిని ప్రత్యేకంగా పణం పెట్టించాడు. ఆమె అప్పటికే ఓడిపోయి ఉంటే ప్రత్యేకంగా పణం పెట్టించవలసిన అవసరం ఏముంది? 'నీతో బాటు నీ పత్ని ద్రౌపది కూడా మాకు దాసి అయినది' అని ప్రకటించి ఉండవచ్చు గదా! కనుక ద్రౌపది అధర్మవిజిత. ఆమె కౌరవులకు దాసియనుట చెల్లదు. ఇది భీష్ముని సమాధానం వెనుకనున్న ఆంతర్యం.

భీష్ముని యొక్క నిర్ణయం "ద్రౌపది అధర్మవిజిత" అనియే ఐనపుడు అదే మాటను స్పష్టంగా చెప్పవచ్చు గదా! మరెందుకు

సంశయాస్పదముగా చెప్పినట్లు?

దుర్యోధనాదులు పెద్దలను లక్ష్యపెట్టకుండా వారి ఎదుటనే మదోన్మత్తులై ఒళ్ళు తెలియకుండా చెలరేగి దుండగాలను చేస్తున్నారు. శకుని మాయాజూదంతో పాండవ ఐశ్వర్యాన్ని, చివరకు పాండవులను గెల్చుకోవటంతో వారు మదంతో రెచ్చి పోతున్నారు. ద్రౌపదిని దాసియని, ఆమెను సభకు తీసుకొని రమ్మని మహామంత్రి, ధర్మస్వరూపుడు ఐన విదురునే ఆజ్ఞాపించాడు దుర్యోధనుడు. అప్పుడు సకల ధర్మవిదుడైన విదురుడు "ముందుగానే తనను తాను ఒడ్డుకొని ఓడిపోయిన ధర్మరాజు అనధికారియని, అతడు పెట్టిన ద్రౌపదీ పణం చెల్లదని, కనుక ద్రౌపది ధర్మవిజితకాదని, ఆమెను దాసియనుట మహాపాపమ"ని ఘోషించటంతో ఆ విదురుని నిందించి మాట్లాడాడు దుర్యోధనుడు.

విదురుని అలా నిందించి, దూషించిన దుర్యోధనుని ప్రేలాపనలను, మదోన్మత్తతను కన్నులారా దర్శించిన భీష్ముడు, ధర్మకోవిదుడైన విదురుని అభిప్రాయాన్నే తానూ చెప్పినచో తనకు కూడా విదురుని గతియేనని గ్రహించాడు. ఇక ఇలాంటి భయానక పరిస్థితిలో ద్రౌపదియే తనను తాను రక్షించుకోగల పాతివ్రత్యమాహాత్మ్యము కలిగియున్నదని నిశ్చయించి, ఈ దుష్టులకు కావలసిన శాస్తి ఇతరులెవ్వరూ కలుగజేసుకో కుండానే జరుగగలదని భావించాడు. ఇలాంటి స్థితిలో ద్రౌపదీ ప్రశ్నకు సమాధానాన్ని స్పష్టంగా చెబితే గొప్పకోలాహలం జరుగుతుందని దూరదృష్టితో ఆలోచించాడు. ఎందుకంటే "ద్రౌపది ధర్మవిజిత కాదు; కౌరవులదే అధర్మం, అన్యాయం" అంటే తమకు దుర్యోధనాదులవల్ల అవమానం మాత్రమే గాక ద్రౌపది పాండవులను రెచ్చగొట్టి గందరగోళం సృష్టించవచ్చు. అలాగాక 'ద్రౌపది ధర్మవిజితయే, కౌరవులు ధర్మంగానే ద్రౌపదిని గెల్చుకున్నారు' అంటే అది ధర్మహానియేగాక అధర్మంగా పలికిన తమపై ద్రౌపది కోపావేశంతో ఊగిపోవచ్చు. సభలో గందరగోళం జరుగవచ్చు. కనుక ఎలా చెప్పినా కీడు జరుగుతుంది. కనుకనే స్పష్టమైన సమాధానం చెప్పకుండా భీష్ముడు సంశయాస్పదంగా సమాధానం చెప్పటం జరిగింది.

భీష్ముడిలా సంశయాస్పదంగా సమాధానం చెప్పటం ధర్మమా?


కాదు, కానేకాదు. ఇలా అధర్మంగా ప్రవర్తించినందుకు, ధర్మనిర్ణయం చేయగలిగీ, చేయవలసిన సమయంలో చేయనందుకు అధర్మదోషం తనకు అంటుకుంటుంది. దాని యొక్క ఫలితాన్ని తాను తప్పక అనుభవించవలసిందేనని కూడా ఆయనకు తెలుసు. ఆ ఫలితాన్ని మహాభారత యుద్ధం 10వ రోజునుండి 58 రోజులపాటు పదునైన బాణాలతో కూడిన అంపశయ్యపై పరుండి అనుభవించటం కూడా జరిగింది. తాను చెప్పిన ధర్మనిర్ణయాన్ని వినిపించుకున్నా, వినిపించుకోకపోయినా, చెప్పదలచుకున్నదానిని నిర్భయంగా చెప్పటమే తన విధియని భావించి; ధైర్యంగా దుష్టులైన దుర్యోధనాదుల దురన్యాయాలను తెలియజేసిన విదురుడు దివ్యజీవనాన్ని గడిపి, అవధూతగా దేహాన్ని వదిలాడు. "ఎవరు చేసిన కర్మవారనుభవించక ఎవరికైనా తప్పదు" అనే సత్యం ఋజువైంది. ఇంత జరుగుతున్న ఏమీ తెలియనట్లు నటించిన ధృతరాష్ట్రుడు నూర్గురు కుమారులలో ఒక్కడు కూడా మిగల కుండా పోయి; ఏ పాండవులకైతే అన్యాయం చేశాడో ఆ పాండవుల పంచన పదమూడు సంవత్సరాలు మింగలేక, కక్కలేక దుర్భర జీవితాన్ని గడిపి తన పాపఫలాన్ని అనుభవించాడు.

"నవ్వుతూ పాపాలు చేస్తే ఏడుస్తూ అనుభవించాల్సి వస్తుంది" అని గుర్తెరిగి మానవులు తమతమ జీవితాలను సదాచార సంపన్నతతో సార్ధకం చేసుకోవాలి.

భీష్ముడిలా సంశయాస్పదంగా సమాధానం చెప్పటంతో ద్రౌపది సభాసదులతో, "జూదంలో నేర్పరి, కపటి, అనార్యుడు, దుష్టాత్ముడు, ధూర్తుడు ఐనవాడు ధర్మజుని జూదానికి పిలిచి జూదం ఆడించాడు. ఏ దోషమూ లేని ధర్మజుని జూదానికి రప్పించిన దెవరు? కపటనాటకానికి సూత్రధారి ఎవరు? ధర్మ నందనుడు ముందే పరాజయం చెందాడు. ఆ తరువాతనే నన్ను పణంగా ఒడ్డేందుకు ఆయనను వివశుని చేసి ప్రేరేపించారు. ఈ పందెం ఎలా చెల్లుతుంది? ఈ విషయాన్ని విమర్శించి మాకందరకు ప్రభువులైన సభాసదులే నా ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఈ సభలో ఎందరో మహాపురుషులు న్నారు. మహారాజులున్నారు. గురుశ్రేష్ఠులున్నారు. కురువంశ వృద్ధులున్నారు. వారందరికి కొడుకులున్నారు, కోడళ్ళున్నారు. నా ప్రశ్నకు ధర్మాధర్మ విచక్షణ చేసి సమాధానం ఇవ్వండి" అన్నది ద్రౌపది. ఆ విధంగా ఆక్రోశించి పలుకుతూ, దీనురాలై రోదనము చేయుచూ, తన పతులవైపు చూచుచున్న ద్రౌపది దేవిని దుశ్శాసనుడు కర్ణకఠోరంగా దుర్భాషలాడుతున్నాడు. ఆ సమయంలో దుర్యోధన సోదరుడు వికర్ణుడు ద్రౌపదీ ప్రశ్నకు సమాధానం చెబుతున్నాడు. ఏమని? (సభా 67అ. 50-52 శ్లోకాలలో)

(వచ్చే సంచికలో..)

సూక్తిమాలిక ఆనందముగా ఉండేవారికి సోమరితనము ఉండదు. సోమరితనము పెద్ద అవగుణము



# మహాభారతం

## ద్రౌపది 26

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

### E) ద్రౌపదీ ప్రశ్నకు వికర్ణుని ధర్మనిర్ణయం:

(సభా.68అ.11-25శ్లో)

భీష్ముడు సంశయాస్పదంగా సమాధానం చెప్పటంతో ద్రౌపది "ఈ సభలో ఎందరో మహాపురుషులున్నారు. మహారాజులున్నారు. గురుశ్రేష్ఠులున్నారు. కురువంశ వృద్ధులు ఉన్నారు. వారందరికీ కొడుకులు, కోడళ్ళు ఉన్నారు. నా ప్రశ్నకు విచక్షణ చేసి సమాధానం ఇవ్వండి" అని సభాసదులను నిలదీయటంతో ధృతరాష్ట్రుని పుత్రుడు, దుర్యోధనుని సోదరుడు ఐన వికర్ణుడు దుఃఖితులైన పాండవులను, దుశ్శాసనునిచే లాగబడుతున్న ద్రౌపదిని చూచి, తన స్థానం నుంచి లేచి నిలబడి, "సభాసదులారా! ద్రౌపదీదేవి ప్రశ్నకు ధర్మనిర్ణయం చేసి సమాధానం చెప్పండి. లేనిచో మనకు నరకం సంప్రాప్తిస్తుంది. పితామహుడు భీష్ముడు, మా పితృదేవులు ధృతరాష్ట్రుడు-వీరిద్దరూ కురువంశ వృద్ధ పురుషులు. మహాబుద్ధిశాలి విదురునితో కలిసి వీరెందుకు ద్రౌపదీప్రశ్నకు సమాధానం చెప్పటం లేదు? అందరికీ ఆచార్యులైన ద్రోణాచార్య, కృపాచార్యులు బ్రాహ్మణకులశ్రేష్ఠులు. వీరిద్దరు ఎందుకు నోరు విప్పరు? నాలుగు దిక్కులనుండి ఇక్కడకు విచ్చేసిన సకల దేశాధీశ్వరులైన పృధివీ పతులున్నారు. కామక్రోధాలు విడిచి, వారివారి బుద్ధిననుసరించి ద్రౌపదీ ప్రశ్నకు సమాధానం ఇవ్వాలి. ద్రౌపదీదేవి అనేక పర్యాయాలు అడిగినది. దీనిపై విచారణ చేసి మీ మీ సమాధానాలు ఇవ్వండి" అని ఎన్నిసార్లు అడుగుతున్నప్పటికీ రాజులు ఇది మంచియనిగాని, చెడ్డయనిగాని ఏమియు బదులు పలుకలేదు.

అంత వికర్ణుడు చేతిలో చేయివేసి నలుపుకుంటూ, దీర్ఘ నిట్టూర్పు విడిచి, "సభాసదులారా! మీరు ద్రౌపదీ దేవి ప్రశ్నకు సమాధానం చెప్పండి లేదా మానండి. నాకీ విషయమై గోచరించిన న్యాయాన్ని చెబుతున్నాను. "రాజులకు నాలుగు వ్యసనాలుంటాయి. అవే వేట, మద్యపానం, జూదం, విషయ భోగాసక్తి. ఈ వ్యసనాలలో చిక్కుకున్న మనుష్యులు ధర్మంగా నడుచుకోలేరు. ఇట్టి వ్యసనాసక్తులు చేసే పనులను ప్రజలు గౌరవించరు. ధర్మాత్ముడైన ఈ ధర్మనందనుడు జూదమనే వ్యవసనంలో చిక్కుకొన్నాడు. ధూర్తులైన జూదరుల ప్రేరణతో ద్రౌపదిని పణంగా పెట్టటం జరిగింది. ద్రౌపదీదేవి పాండవులైదుగురికీ భార్య ఒక్క ధర్మరాజుకే భార్య కాదు. అంతేగాక ధర్మ నందనుడు ముందుగా తనను తాను ఒడ్డుకొని ఓడిపోయి ఉన్నాడు, అలా ఓడిపోయిన తరువాతనే ద్రౌపదిని పణంగా పెట్టటం జరిగింది. అది కూడా స్వయంగా తాను పందెం పెట్టలేదు. శకుని ప్రత్యేకంగా ద్రౌపదిని పణంగా పెట్టమని నియోగించినపుడే పెట్టటం జరిగింది. దీని నంతటిని పరిశీలించి చూడగా ఈ ద్రౌపదీ పణం చెల్లదని, ద్రౌపదీ దేవి జయింపబడలేదని నా నిశ్చయం" అన్నాడు (సభా 68వ అ.11 నుండి 24శ్లో. వరకు)

**శ్లో॥ఏతచ్ఛ్రుత్వా మహాన్నాద స్సభ్యానా ముదతిష్ఠత।**
**వికర్ణం శంసమానానాం సౌబలం చాపి నిందతాం॥ (సభా 68 అ.25శ్లో)**

**తా॥** ఇది విని సభాసదులంతా సంతోషించారు. వికర్ణుని ప్రశంసిస్తూ, శకునిని నిందిస్తూ సభలో పెద్ద కోలాహలం అయింది (25)

– ఇంత వరకు జరిగిన విషయాన్ని పరిశీలన చేసి, "నేను ధర్మవిజితనా? అధర్మ విజితనా?" అన్న ద్రౌపది ప్రశ్నకు సభాసదులంతా మౌనం వహించటానికి కారణం ఏమిటో,

సభాసదుల ఆంతర్యం ఏమిటో విచారణ చేద్దాం. ధర్మం ద్రౌపదీ పాండవులదో, కౌరవులదో చూద్దాం.

ద్రౌపది ధర్మంగా జయించబడలేదని ముందే విదురుడు తెలియజేశాడు. ఆ తరువాత సభలో ద్రౌపది ప్రశ్నించినపుడు భీష్ముడు సంశయాస్పదంగా ఎందుకు చెప్పాడో, అసలు ఆయన ఆంతర్యం ఏమిటో ఇంతకుముందే వివరించటం జరిగింది. ఇక సభాసదులందరూ ఎందుకూ మౌనంగా ఉన్నారు? అనేది ప్రశ్న 'నేను ధర్మవిజితనా? అధర్మ విజితనా?" అని ద్రౌపది అడుగుతున్నదేగాని, దుర్యోధనుడు 'నాదేమన్నా అధర్మం ఉన్నదా?' అని సభ్యులనడగటం లేదు. పైగా సభలో కూర్చున్న రాజులంతా దుర్యోధనుని అనుయాయులే. అయినా దుర్యోధనుడు 'ధర్మం చెప్పండి' అని అడగటం లేదు. తమను అడగని వారికి చెప్పటం, పైగా మదోన్మత్తులై యున్నవారికి చెప్పటం, తమ పై అధికారికి చెప్పటం ఎంత దుష్కరమైన విషయమో చెప్పనవసరం లేదు. పైగా 'నీదే అధర్మం' అని దుర్యోధనునికి చెప్పాలంటే అసలు సాధ్యపడని విషయం. నిజంగా ద్రౌపది ధర్మబద్ధంగానే జయింపబడి ఉన్నట్లైతే ఎంతో ఆనందంతో ఎగిరి గంతులు వేస్తూ దుర్యోధనుని పక్షాన నిలిచి ధర్మం చెప్పేవారే. కాని ద్రౌపది 'అధర్మ విజిత' గనుక దుర్యోధనునికి కోపం కలిగించే విధంగా మాట్లాడటానికి జంకి మౌనంగా ఉన్నారు. ఇలా మౌనంగా ఉండటం ధర్మం కాదని వారికీ తెలుసు. అందుకే వికర్ణుడు అందునా దుర్యోధన సోదరుడైన వికర్ణుడు 'ద్రౌపది ధర్మబద్ధంగా జయింపబడలేదు' అని చెప్పగానే వికర్ణుని ప్రశంసిస్తూ, శకునిని నిందిస్తూ పెద్ద కోలాహలం చేశారు. దీనినిబట్టి సభాసదుల ఆంతర్యం ఏమిటో తెలిసి పోతున్నది. తాము పైకి చెప్పలేని ధర్మనిర్ణయాన్ని వికర్ణుడు చెప్పటంతో అతడిని ప్రశంసిస్తూ, కపట జూదసూత్ర ధారి శకునిని నిందిస్తూ తమ ఆంతర్యాన్ని బయటపెట్టారు.

సభలో అన్యాయం జరుగుతున్నపుడు తెలిసీ ఆ అన్యాయాన్ని ఎదిరించి న్యాయం చేయనపుడు; ధర్మ నిర్ణయం చేయమని అబలకోరినా, తెలిసీ ధర్మనిర్ణయం చేయనిచో ఆ పాపంలో నాలుగవ వంతు సభ్యులకు చెందుతుంది. అందుకే స్వయంగా తాము అన్యాయాన్ని ఎదిరించలేకపోయినా, ధర్మ నిర్ణయం చేయసాహసించకపోయినా, వికర్ణుని మాటలకు తమ అంగీకారాన్ని తెలిపి పాపభారాన్ని తగ్గించుకున్నారు.

దీనినిబట్టి దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు వీరందరికి రహస్యంగా మార్గదర్శియైన ధృతరాష్ట్రునికి తప్ప మిగిలిన సభాసదులందరికీ ద్రౌపదీ పాండవులదే ధర్మమని; కౌరవులదే అధర్మమని స్పష్టంగా తెలుసునని, కాని దుష్టులతో చెప్పటకు భయపడి మాత్రమే చెప్పలేదని స్పష్టమవుతున్నది.

మరి వికర్ణుడెలా చెప్పాడు? ఎందుకు చెప్పాడు?

వికర్ణుడు దుర్యోధన సోదరుడు జూదంలో నైపుణ్యం గలవాడు. ద్యూత ధర్మం తెలిసినవాడు. శకుని కపటం తెలిసిన వాడు. అన్నతో కలిసి అధర్మ కార్యాలలో పాల్గొన్నవాడే ఐనప్పటికీ; పాండవుల మీద ప్రత్యేకంగా ఏ అభిమానం లేనివాడే అయినప్పటికీ; సభలోకి ద్రౌపదిని-పాండవ ధర్మ పత్నిని ఈడ్చుకొని రావటం సహించలేకపోయాడు. ద్రౌపదీ ప్రశ్నకు తెలిసీ ధర్మం చెప్పకపోతే నరకమన్న విషయం తెలిసిన వాడు గనుక ధర్మనిర్ణయం చేసి చెప్పాడు. దుర్యోధనునికి సభలో అంతగా భయపడవలసిన అవసరం లేదని గ్రహించియే ధైర్యంగా ముందుకువచ్చి ధర్మాన్ని చెప్పాడు వికర్ణుడు.

"నూర్గురు కౌరవులను నేనే సంహరిస్తాను. అలా చేయక పోతే పితృపితామహుల గతికి తప్పిన వాడనౌతాన"ని భీమసేనుడు సభలో ఘోరప్రతిజ్ఞ చేశాడు. ఆ ప్రతిజ్ఞ ప్రకారం కురుక్షేత్ర యుద్ధభూమిలో వందమందినీ సంహరించాడు. అలా సంహరించేటప్పుడు ఎంతో ఆనందించాడు. దుర్యోధన, దుశ్శాసనులను చంపేటపుడు ఎంతో ఆవేశంతో ఆనంద తాండవ నృత్యం చేశాడు. కానీ ఒక్క వికర్ణుని చంపేటపుడు మాత్రం "సోదరా! క్షత్రియధర్మం అత్యంత క్రూరమైనది. అందు వల్లనే నా ప్రతిజ్ఞ ప్రకారం నిన్ను చంపవలసి వస్తున్నది" అని కంటతడి పెట్టుకున్నాడు. 18 రోజుల యుద్ధంలో శత్రుసంహారం చేసేటపుడు భీముడు కంటతడి పెట్టుకున్న సందర్భం ఇదొక్కటే. దీనికి కారణం ఆనాడు ద్యూత సభలో ధైర్యంగా అన్నకు వ్యతిరేకంగా ధర్మాన్ని చెప్పటమే.

దుష్టదుర్యోధనునికి స్వయంగా సోదరుడైన వికర్ణుని అభిప్రాయం ప్రకారం ద్రౌపది జయింపబడ లేదని, శకునిది మోసమని, పాండవుల అధర్మం లేదని తేలింది. ఇక వికర్ణుడలా మాట్లాడిన తరువాత క్రోధంతో ఊగిపోతూ కర్ణుడేమీ మాట్లాడాడో, ఎంత ధర్మంగా మాట్లాడాడో తెలుసుకుందాం.

### F) వికర్ణుని ధర్మనిర్ణయంపై కర్ణుని సంభాషణ:

**(సభాపర్వం 68అ.27-37శో)**

"ఓ వికర్ణా! అరణిలో పుట్టిన అగ్ని ఆ అరణినే కాల్చి వేసినట్లు; కొందరు తాము పుట్టిన కులానికి తామే కీడు తలపెడ తారు. ద్రౌపది పదేపదే ప్రశ్నిస్తున్నప్పటికీ సభాసదులెవ్వరూ సమాధానం చెప్పటం లేదు. ఎందుకో తెలుసా? ఆమె

ధర్మంగానే జయింపబడింది గనుక. ఓ ధృతరాష్ట్ర కుమారా! నీవు బాలుడగవు గనుక, ధర్మం తెలియని వాడవు గనుక పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు. ధర్మంగా జయింప బడిన ద్రౌపది జయింపబడలేదని నీవు ఎలా చెప్పగలుగు తున్నావు?

**శ్లో॥ కథం హ్యేవిజితాం కృష్ణాం మన్యసే ధృతరాష్ట్రజ॥**
**యదాసభాయాం సర్వస్వం న్యస్తవాన్ పాండవాగ్రజ॥**
**(సభా 68 అ.31శ్లో)**

**శ్లో॥అభ్యంతరాచ సర్వస్వే ద్రౌపదీ భరతర్షభ॥**
**ఏవంధర్మజితాం కృష్ణాం మన్యసే నజితాం కథం॥**
**(సభా 68 అ.32శ్లో)**

**తా॥** ధర్మరాజు సభలో తన సర్వస్వాన్ని ఒడ్డి ఓడినపుడు ఆ సర్వస్వంలోకి ద్రౌపది రాదా? ఆ విధంగా ధర్మపూర్వకంగానే జయించబడిన ద్రౌపది జయించబడలేదని ఎలా చెప్పగలవు? (31-32)

అంతేకాదు ద్రౌపదిని పణంగా పెడుతున్నట్లు ధర్మరాజు స్వయంగా నోటితో పలికాడు. ఆయన సోదరులు అంగీకారంగా మౌనం వహించారు. అయినపుడు ఆమె జయించబడలేదని ఎలా చెప్పగలవు?

ఒకవేళ ఏకవస్త్రయైన ద్రౌపదిని సభలోకి తీసుకొని రావటం ధర్మం కాదని అంటావా? అదే నీ సందేహమైతే నా సమాధానం విను. స్త్రీకి ఒక్క భర్తే ఉండాలి. అది దైవనిర్ణయం కాని. ఈమె అనేకమంది భర్తలకు భార్య అయింది. కనుక ఆమె బంధకి అని నా నిశ్చయం. ఇలాంటి స్త్రీని సభలోనికి తీసుకొని రావటంలో అధర్మమేమీ లేదు. ఈమె ఏకవస్త్రయైతే నేమి లేక వివస్త్ర అయితే నేమి? (ఇదిగో ఆ శ్లోకం)

**శ్లో॥ అస్యాసభామానయనం నచిత్రమేమతిః॥**
**ఏకాంబరధరత్వం వా పృథావాపి వివస్త్రతా॥ (సభా 68 అ.36 శ్లో)**

"ద్రౌపది పాండవుల సొత్తు. పాండవులు శకునిచే ధర్మంగా జయించబడ్డారు. కనుక ద్రౌపది కూడా ధర్మంగా జయించబడి నట్లే" అన్నాడు కర్ణుడు. (సభా 68అ.27-37శ్లో)

ఇదీ వికర్ణుని ధర్మనిర్ణయాన్ని త్రోసిపుచ్చుతూ కర్ణుడు చేసిన ప్రసంగం. ఈ సందర్భంగా కర్ణుడు ఎంత అధర్మంగా మాట్లాడినాడో; అతని మాటలలో ఎంత అసభ్యత వుందో వికర్ణుడు చెప్పిన దానిని ఎలా త్రోసిపుచ్చాడో విచారణ చేద్దాం.

ద్రౌపది ధర్మంగా జయించబడలేదని; దానికి కారణం ధర్మరాజు ముందుగా తనను తాను ఒడ్డుకొని పరాజితుడైన తరువాత శకుని ప్రేరణతో ద్రౌపదిని ఒడ్డటం జరిగిందని; ఆపైన ద్రౌపది పాండవులైదుగురికి భార్యయని; కనుక ద్రౌపదీపణం చెల్లదని వికర్ణుడు ధర్మనిర్ణయం గావించాడు.

దీనికి కర్ణుడేమని సమాధానం ఇచ్చాడు? ధర్మరాజు సభలో తన సర్వస్వాన్ని ఒడ్డి ఓడినపుడు ఆ సర్వస్వంలోకి ద్రౌపది రాదా? అంతేకాదు ద్రౌపదిని పణంగా పెడుతున్నట్లు ధర్మరాజు స్వయంగా నోటితో పలికాడు. ఆయన సోదరులు మౌనంగా అంగీకారం తెలిపారు. అయినపుడు ఆమె జయించబడ లేదని ఎలా చెప్పగలవు? అని కర్ణుడు సమాధానం ఇచ్చాడు.

ఈ కర్ణుని సమాధానం-ధర్మరాజు ముందుగా తనను తాను ఒడ్డుకొని పరాజితుడు కాలేదనుటకు పనికి వస్తుందా? పరాజితుడైన తరువాతనే ద్రౌపదిని పణంగా పెట్టుట అబద్ధం అనుటకు పనికి వస్తుందా? పైగా ధర్మరాజు స్వయంగా ద్రౌపదిని పణంగా పెట్టినాడనుటకు పనికి వస్తుందా? పరాజితుడైన యుధిష్ఠిరుని శకుని ప్రేరేపించలేదనుటకు పనికి వస్తుందా? ఈ కర్ణుని సమాధానం దేనికీ పొందని ప్రలాపము తప్ప వేరు కాదు. అంటే వికర్ణుడు చెప్పిన ఏ కారణాన్నీ కర్ణుడు త్రోసివేయలేక తన వాదాన్ని సమర్థించుకోవటానికి సరిక్రొత్త వాదాన్ని లేవదీశాడు. ఏమిటది?

ధర్మరాజు సభలో తన సర్వస్వాన్ని ఒడ్డి ఓడినపుడు ఆ సర్వస్వంలోకి ద్రౌపది రాదా? అని. ధర్మరాజు జూదంలో కూర్చున్న దగ్గరనుండి ఒక్కొక్క పణం పెడుతూ ఆడాడు. మణులు, రత్నాలు, ధనం, ఏనుగులు, రథాలు, గంధర్వహయాలు, రాజ్యం- ఇలా ఒక్కోదానికి ఒడ్డి ఓడాడు. ఆపైన నకులుని, సహదేవుని, అర్జునుని, భీమసేనుని ఒక్కొక్కరిని ఒక్కొక్కసారిగా ఒడ్డి ఓడాడు. అంతేగాని సర్వస్వాన్ని ఎప్పుడూ ఒడ్డలేదు. ఆ తర్వాత వెంటనే తనను తాను ఒడ్డుకొని ఓడిపోయాడు. పోనీ ధర్మరాజు ఓడితే ఆ ఓటమిలో ద్రౌపది కూడా ఉన్నది అనే ఉద్దేశ్యంతో కర్ణుడు అలా అన్నాడని అనుకుందాం. అలాగైతే ద్యూతధర్మం బాగా తెలిసిన శకుని విడిగా ద్రౌపదిని పణముగా ఎందుకు పెట్టించాడు? ద్రౌపదిని పణంగా పెట్టమని ప్రేరేపించే టపుడు శకుని ధర్మరాజుతో ఏమన్నాడు? ధర్మనందనా! నిన్ను నీవు ఒడ్డుకొని ఓడిపోయిన, నీవు చేసినది గొప్ప అధర్మకార్యం. పందెం వేయటానికి ఇంకా ధనం మిగిలియుండగా ఆత్మ పరాజయం పాపహేతువు.

**శ్లో॥ అస్తితే వైప్రియారాజన్ గ్లహ ఏకో పరాజితః॥**
**పణస్వ కృష్ణాం పాంచాలీం తయాత్మానం పునర్జయ॥**
**(సభా 65 అ.32శ్లో)**

**తా॥** మహారాజా! ఇప్పటి వరకు నీవు ఓడిపోని ధనం నీ ప్రియతమ ధర్మపత్ని ద్రౌపది ఉన్నది. అందువల్ల పాంచాల రాజకుమారి కృష్ణను (ద్రౌపదిని) పందెంలో ఒడ్డి ఆమె ద్వారా నీ దాస్యాన్ని తొలగించుకొని తిరిగి విజయం సాధించు- అన్నాడు శకుని.

దానితో అప్పటికే పరాజితుడై, కౌరవ దాసుడైయున్న ధర్మరాజు దాసధర్మాన్ని అనుసరించి తనకు ఇష్టం లేకపోయినా ద్రౌపదిని ఒడ్డటం జరిగింది.

దీనిని బట్టి శకుని అభిప్రాయం ప్రకారం కూడా 'ధర్మరాజు ఓటమిలో ద్రౌపది ఓటమి లేదు అని స్పష్టం. అలా ద్రౌపది ఓటమి, ధర్మరాజు ఓటమిలో ఉంటే; "నీకింకా ఓడని ధనం ద్రౌపది ఉన్నది-ఆమెనిపుడు ఒడ్డు" అని ఎందుకంటాడు?

పోనీ శకునికి అంతగా ద్యూతధర్మం తెలియక, అనవసరంగా, అప్పటికే ఓడిన ద్రౌపదిని మళ్ళీ పణం పెట్టిస్తున్నాడు- అని భావించినపుడు, ద్యూతధర్మం బాగా తెలిసిన కర్ణుడు అక్కడే ఉన్నాడు గదా! "ఓ మూర్ఖశిఖామణీ! శకునీ! నీకు బుద్ధి ఉన్నదా? ధర్మరాజు ఓడితే ద్రౌపది కూడా ఓడినట్లే కదా? మరి తిరిగి ప్రత్యేకంగా ద్రౌపదిని ఎందుకు ధర్మరాజు చేత పణం పెట్టిస్తున్నావు?" అని అడ్డు పడాలి గదా! మరి అపుడు మౌనంగా ఉండి ఇప్పుడిలా అతి తెలివి చూపించటం ఏమిటి? ఇదే దుష్టబుద్ధి. దీనిని బట్టి కర్ణుని వాదం తమ దుష్టచతుష్టయంలోని శకుని చర్యకే విరుద్ధం. ఇక వికర్ణుని ధర్మనిర్ణయానికి విరుద్ధమని, అసంబద్ధమని వేరే చెప్పవలసిన పనే లేదు.

దీనిని బట్టి పరాజితుడైన ధర్మజునిచేత ద్రౌపదీ పణమును విడిగా పెట్టించిన శకుని చర్యవల్ల ద్రౌపది అంతకుముందే ఓడినట్లే-ధర్మజుని ఓటమలో ద్రౌపది ఓటమి ఉన్నట్లేనన్న కర్ణుని వాదం అర్థరహితం, అసంబద్ధం, అసత్యం అనీ వికర్ణుని ధర్మనిర్ణయం అప్రతిహతం అని ఋజువౌతున్నది.

ఇంకా కర్ణుని ప్రలాపాలలో నిజానిజాలేమిటో చూద్దాం.

'ఓ వికర్ణా! ద్రౌపది పదేపదే ప్రశ్నిస్తున్నప్పటికీ సభ్యులెవ్వరూ ఎందుకు సమాధానం చెప్పటం లేదు? ఆమె ధర్మంగానే జయింపబడింది గనుక' అన్నాడు.

ద్రౌపది ధర్మంగానే జయింపబడింది గనుక ఎవ్వరూ సమాధానం చెప్పలేదా? ద్రౌపది ధర్మంగా జయింపబడిందని చెప్పటానికి సభ్యులు మౌనం వహించాల్సిన పనేముంది? తమపై అధికారం గల దుర్యోధనుడు ఎంతో సంతోషిస్తాడు గదా! పాండవులకు అందునా జూదంలో ఓడి దాసులైయున్న పాండవులకు భయపడాల్సిందేమీ లేదు గదా! అలా చెప్పి ఉంటే దుర్యోధనునికి తమపై ఎంతో అభిమానం గలిగి అనుగ్రహం కలుగుతుంది గదా! మరి ఎందుకు ద్రౌపదీ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఉన్నట్లు? అంతేకాదు. ద్రౌపది ధర్మంగానే జయింపబడి ఉంటే-అదే వారి అభిప్రాయమైతే 'ద్రౌపది పణం చెల్లదు, ఆమె ధర్మంగా జయించబడలేదు' అని ధర్మనిర్ణయం చేసిన వికర్ణుని మాటలకు ఎందుకు ప్రశంసించి తమ సంతోషాన్ని వెల్లడించారు? వికర్ణుని మాటలకు ప్రశంసించటమే గాక కపట జూదసూత్రధారి శకునిని ఎందుకు నిందిస్తారు?

దీనిని బట్టి సభాసదులు మదోన్మత్తుడై చెలరేగిపోతున్న దుర్యోధనునికి భయపడిమాత్రమే "ద్రౌపది అధర్మవిజిత" అని చెప్పలేక మౌనం వహించారని తేలిపోతున్నది. తాము చెప్పలేని విషయాన్ని దుర్యోధన సోదరుడే ధైర్యంగా చెప్పటంతో వికర్ణుని ప్రశంసించి, శకునిని నిందించారు. ఇంత స్పష్టంగా తెలుస్తున్నా కర్ణుడెందుకలా పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నాడు? దుర్యోధనుని ప్రీతికొరకే. దుర్యోధనుని ప్రీతికొరకు, అతణ్ణి సంతోష పెట్టటం కొరకు ఎన్ని అబద్ధాలైనా ఆడతాడు, ఎన్ని అకృత్యాలైనా చేస్తాడు, ఎంత పాపాన్నైనా మూటగట్టుకుంటాడు కర్ణుడు. రాయబారం విఫలమై తిరిగి వెళ్ళే శ్రీకృష్ణునితో హస్తినాపుర పొలిమేరలలో స్వయంగా ఈ కర్ణుడే ఏకాంతంగా ఏమన్నాడో చూడండి.

**శ్లో॥ యదబ్రువ మహంకృష్ణకటుకానిస్మ పాండవాన్‌।**
**ప్రియార్థం ధార్తరాష్ట్రస్య తేన తప్యేహ్యకర్మణా॥ (ఉద్యో. 141 అ.45శ్లో)**

తా॥ కృష్ణా! నాడు సభలో పాండవులకు మర్మభేదకము లగునట్లు కటువుగా ఏమాటలు మాట్లాడితినో అవన్నీ దుర్యోధనాదుల ప్రీతికొరకు మాట్లాడాను. క్షమించు.

ఇదీ కర్ణుని వ్యక్తిత్వం. అడుసుత్రొక్కటం-కాలు కడగటం. నోటికి వచ్చినట్లు ప్రేలటం-క్షమాపణలు కోరటం.

వికర్ణుని ధర్మనిర్ణయాన్ని త్రోసిపుచ్చుతూ కర్ణుడు సభ్య సమాజం తలదించుకొనే విధంగా మానవత్వాన్ని మరచి మాట్లాడిన మరొక విషయం గురించి విచారణ చేద్దాం.

"ఓ వికర్ణా! ఒకవేళ ఏకవస్త్రయైన ద్రౌపదిని సభలోనికి తీసుకురావటం ధర్మం కాదని అంటావా? విను. స్త్రీకి ఒక్కరే భర్త ఉండాలి. అది దైవనిర్ణయం. కాని ఈమె అనేకమంది భర్తలకు భార్య. కనుక ఈమె బంధకి అని నా నిశ్చయము. ఇట్టి స్త్రీని ఏకవస్త్ర ఐతే నేమి? వివస్త్ర అయితే నేమి? సభలోనికి తీసుకు

రావటంలో అధర్మమేమీ లేదు" అన్నాడు కర్ణుడు. (సభా 68 అ. 35-36శ్లో). ఈ మాటలలోని ధర్మాధర్మములేమిటో చూద్దాం.

స్త్రీకి ఒక్కరే భర్త. అది దైవనిర్ణయం. అంటే దైవ నిర్ణయాన్ని అంగీకరిస్తున్నాడు కర్ణుడు. మరి ద్రౌపదికి పంచపతిత్వము దైవనిర్ణయం కాదా? పరమేశ్వరుడే స్వయంగా 'నీకు దేహాంత రమున ఐదుగురు పతులగుదురని, ప్రత్యేక పతి సాంగత్యమున నీకు కన్యాత్వం సిద్ధిస్తుందని, ఐదుగురు భర్తలైనప్పటికీ పతివ్రతగా ఖ్యాతి నొందగలవని" ఋషికన్యకు వరమివ్వటం వల్లనే గదా ఆ ఋషి కన్య ద్రౌపదిగా ద్రుపదునికి అయోనిజగా జన్మించి పంచభర్తృక అయింది. కనుక ద్రౌపది ఐదుగురు భర్తలు కావటం దైవనిర్ణయమే.

అంతేకాదు కర్ణుడు ఈనాడు ఏ సాధ్విని 'బంధకి' అంటున్నాడో ఆమె అర్ధాంగిగా ధర్మరాజు రాజసూయయాగం చేసినపుడు, ఆ యాగానికి భీష్మ, విదుర, ధృతరాష్ట్ర, ద్రోణ, కృప, అశ్వద్ధామ, సోమదత్త, భూరిశ్రవ, శల్య, శకుని, సైంధవ, దుర్యోధన, దుశ్శాసన, వికర్ణాదులతో గలిసి వెళ్ళిన కర్ణుడు, ఈ ద్రౌపదీ పాండవులచేత అనేక సత్కారాలు పొంది వచ్చినవాడే. ఆనాడు ద్రౌపదీదేవి కులకాంతయా? పతివ్రతయా? నేడు బంధకియా? కులటా?

పూజ్యురాలైన సాధ్వీమతల్లిని బంధకియనుటయే మహా పాపం. 'బంధకి' అంటే భర్త గాక అన్యులైన నలుగురిని కూడినది అని అర్థం. ద్రౌపదికి ఐదుగురు పాండవులు వివాహ పూర్వకంగా భర్తలైన వారేగాని అన్యులు కాదు. అట్టి పరమపతివ్రతను నిండు సభలో నిందించటమే గాక ఇట్టి స్త్రీని విగతవస్త్రను చేసి సభకు తెచ్చినను ధర్మవిరోధము లేదు" అనటం మనుష్య లక్షణమేనా? మానవత్వం అనిపించుకుంటుందా? సభ్య సమాజం తలదించుకోదా? దీనిని రాక్షసకృత్యం అనరు. ఇది పైశాచిక కృత్యం. కర్ణునిది పైశాచిక నృత్యం.

ఎవరైనా ఒక వేశ్య తనకు హాని కలిగిస్తున్నదని తెలిసినా ఈ కలియుగంలో ఏ మానవుడైనా ఆమెను సభలోనికి రప్పించి బట్టలు ఊడదీయాలంటాడా? అలా ఊడదీయమని ఆదేశాస్తాడా? మరి అధర్మం మెండుగా ఉండే కలియుగంలోనే ఒక సామాన్య మానవుడు తనకు హాని కలిగించిన స్త్రీని వివస్త్రను చేయాలని అనుకోడే. అలాంటిది ధర్మం-అధర్మం సమానంగా ఉండే ద్వాపరయుగంలో, మహావీరుడైన ఒక రాజు (అంగదేశానికి రాజు)కర్ణుడు తనకు గాని, తన యజమానులవంటి కౌరవులకు గాని ఏ హానీ చేయని ఒక మహా పతివ్రతామ తల్లిని, కురువంశపు కోడలిని, సామ్రాజ్య పట్టమహిషిని ఆ కురువంశ శ్రేష్ఠులైన భీష్మ, ధృతరాష్ట్ర, విదురుల సమక్షంలో, కృపద్రోణాది గురుశ్రేష్ఠుల సమక్షంలో, దేశ దేశాల రాజులు, మహారాజుల సమక్షంలో వివస్త్రను చేసి సభకు తెచ్చినా తప్పు లేదంటాడా? అసలు ఒక త్రాగుబోతైనా ఇలా మాట్లాడుతాడా? ఇంత ఒళ్ళు తెలియని నగ్న తాండవాన్ని, పైశాచిక తాండవాన్ని నిండు సభలో కావిస్తున్న కర్ణుని ఈనాడు మెచ్చుకొనే కర్ణాభిమానుల ప్రవృత్తి ఎలాంటిదో సభ్యత గలిగిన మానవులు ఆలోచించాలి. పాపం శమించుగాక!

-వికర్ణుని మాటలు త్రోసిపుచ్చుతూ బంధకియైన ద్రౌపదిని వివస్త్రను చేసి సభకు తెచ్చినా తప్పులేదని పలికిన కర్ణుడు ఆ తరువాత ఏమన్నాడు?


(వచ్చేసంచికలో..)

## ముంచుకొస్తున్న ప్లాస్టిక్ ముప్పు

తీవ్రమైన మంచినీటి ఎద్దడి పశువుల ప్రాణాలకు హాని. ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం పెరగడంతో వాటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తులు మార్కెట్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంటున్నాయి. ప్లాస్టిక్ వస్తువుల వాడకం ప్రజల నిత్యజీవితంలో భాగమై పోయింది. అయితే వీటి ఉపయోగం ఏ మేరకనేది పక్కన బెడితే ప్లాస్టిక్ కలిగించే కీడు మాత్రం చాలా ఎక్కువే. ఈ విషయమై ఎప్పటినుండో పర్యావరణ వేత్తలు గగ్గోలు పెడుతున్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించకపోతే కొన్నేళ్ళకు మంచినీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముందని భూగర్భ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా భూగర్భంలోని కొన్ని పొరలకు అడ్డుగోడగా నిలిచి అనేక ఖనిజ లవణాలను నీటిని పైకి రానివ్వకుండా అడ్డుపడ్తున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తులను పశువులు తింటే జీర్ణంకాక మృతి చెందుతాయి. కావున ప్లాస్టిక్ కవర్‌లు, క్యారీబ్యాగ్స్‌ను వాడకండి.

మురళిమోహన్ గురూజీ

సూక్తిమాలిక: ఎవ్వరికీ ఉపకారం చెయ్యకపోయినా ఫర్వాలేదు... అపకారం మాత్రం తలపెట్టవద్దు.



# మహాభారతం

## ద్రౌపది 27

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

### G) ద్రౌపదీ వస్త్రాపహరణం-కర్ణుని దుష్టత్వపరాకాష్ట

వికర్ణుని ధర్మనిర్ణయాన్ని త్రోసి పుచ్చుతూ, "బంధకియైన ద్రౌపదిని వివస్త్రను చేసి సభకు తెచ్చినను తప్పులేదని" అధర్మ పూర్వకమైన అసందర్భ ప్రలాపం గావించిన కర్ణుడు, ఆ తర్వాత ఏమన్నాడో చూద్దాం

**శ్లో॥యచ్చై షాంద్రవిణం కించిత్ యాచైషా ఏచ పాండవాః**
**సౌబలేనేహతత్ సర్వం ధర్మేణ విజితం వసు॥ (సభా 68 అ. 37శ్లో)**

**తా॥** పాండవుల వద్ద గల ధనము, ద్రౌపది, పాండవులు ఈ సర్వాన్ని సుబలపుత్రుడైన శకుని ధర్మబద్ధంగా గెలుచు కున్నాడు. కనుక-

**శ్లో॥ధుశ్శాసన సుబాలోయం వికర్ణః ప్రాజ్ఞవాదికః॥**
**పాండవానాంచ వాసాంసి ద్రౌపద్యాశ్చాప్యపాహర॥ (సభా 68 అ.38శ్లో)**

**తా॥** ఓ దుశ్శాసనా! ఈ వికర్ణుడు బాలుడు; కాని గొప్ప విద్వాంసునిలాగా మాట్లాడుతున్నాడు. నీవు పాండవుల యొక్క ద్రౌపది యొక్క వస్త్రాలను లాగేసెయ్ అన్నాడు కర్ణుడు.

అది విని పాండవులు ఐదుగురు తమ తమ ఉత్తరీయాలను తీసి కింద ఉంచారు. ఆ తర్వాత దుశ్శాసనుడు నిండు సభలో పెద్దలు వృద్ధులు-అందరి సమక్షంలో ద్రౌపదీదేవి కట్టిన వస్త్రాన్ని పట్టుకొని బలాత్కారంగా లాగటం ప్రారంభించాడు. (సభా 68 అ.39, 40 శ్లో)

వస్త్రాపహరణమనే నీచ, నికృష్ట, పైశాచిక కృత్యానికి మూల కారణం కర్ణుడు. వస్త్రాపహరణం చేయమని ఆదేశించింది కర్ణుడు. వస్త్రాపహరణం చేసింది దుశ్శాసనుడు. మన రాష్ట్రంలో మాత్రం వస్త్రాపహరణం చేయమన్నది దుర్యోధనుడనే నమ్ముతారు అందరూ. ఎందుకంటే సినిమాల లోను, ప్రవచనాలలోను, రచ్చబండ చర్చలలోను, హరికథలు, బుర్రకథలలోను ఎక్కువగా ఇలాగే చెబుతారు గనుక. అయితే వారెందుకు ఇలా చెబుతున్నారు? ఆంధ్రమహాభారతంలో నన్నయగారు ద్రౌపదీ వస్త్రాపహరణగాధ సందర్భంగా దుర్యోధనుడే వస్త్రాపహరణానికి ఆదేశించినట్లుగ చెప్పటం జరిగింది గనుక. ఆంధ్రదేశంలో ఆంధ్రమహాభారతమే ఎక్కువ ప్రచారంలో ఉండటంవల్ల, సంస్కృత మూలగ్రంథాన్ని చూడని వారందరూ ఇలాగే భావిస్తున్నారు. కాని సంస్కృత మూలంలో స్పష్టంగా కర్ణుడే వస్త్రాపహరణకు ఆదేశించినట్లుగ వ్యాస మహర్షి చెప్పటం జరిగింది. ఈనాడు భారతదేశంలో లభిస్తున్న 5 సంస్కృతమూలభారత వ్రాత ప్రతులలోను ఇలాగే ఉన్నది. ఒక్కదానిలో కూడా దుర్యోధనుడు ఈ పాపకార్యానికి ఆదేశించినట్లుగా లేదు. అన్ని వ్రాత ప్రతులను పరిశోధించి ప్రచురించిన గీతాప్రెస్ గోరఖ్‌పూర్ వారి సంస్కృత మహాభారతంలో కూడా కర్ణుడే ఈ నీచకృత్యానికి ప్రోత్సహించినట్లు స్పష్టంగా ఉన్నది. దానినే పైన సభాపర్వం, 68వ అధ్యాయం 38వ శ్లోకంగా ఇవ్వటం జరిగింది.

దీనినిబట్టి వస్త్రాపహరణమనే నీచబుద్ధి కర్ణునిదేననుటలో ఏ సందేహమూలేదు. మరి మహాభారతాన్ని ఆంధ్రీకరించిన నన్నయగారు అలా ఎందుకు వ్రాశారు? ఆయనకు కర్ణునిపై అభిమానమా? దుర్యోధనునిపై ద్వేషమా? అదేం కాదు. అలాంటి మహాత్ములకు రాగద్వేషాలను అంటగట్టి మాట్లాడటం మహాపాపం. మరైతే అలా ఎందుకు వ్రాసినట్లు? నన్నయగారు భారతాన్ని ఆంధ్రీకరించిన 11వ శతాబ్దం నాటికి ఏదో ఒక ప్రతిలో అలా దుర్యోధనుడే వస్త్రాపహరణకు ఆదేశించినట్లు ఉండవచ్చు. దానినిబట్టి ఆయన వ్రాసి ఉండవచ్చు. నన్నయ గారు ఒక్క మహాభారత ప్రతిని గాక అనేక ప్రతులను తన పరిశీలనలో పెట్టుకొని ఉండాలి. ఆ కారణంగానే ఆయన ధృతరాష్ట్రుడే రాజ్యాభిషిక్తుడైనట్లు ఆదిపర్వం పంచమాశ్వాసంలో


సహకారమివ్వటమంటే బానిసగా అవ్వమని కాదు

వ్రాసి, ఆ తరువాత వచ్చిన షష్ఠాశ్వాసంలో "నీవు అంధుడవై రాజు కాలేక పోవటాన పాండురాజే రాజై ఈ భూమిని పాలించాడు. ఇపుడా పాండురాజు పుత్రుడు ధర్మరాజు రాజైతే ఆ తరువాత అతని పుత్రుడు రాజౌతాడు. ఈ విధంగా పాండు వంశీయులే ఈ రాజ్యాన్ని పాలిస్తుంటే మేము, మా పుత్ర పౌత్రులు వారిని సేవిస్తూ బ్రతకాల్సిందే గదా!" అని దుర్యోధనుడు తండ్రితో అంటే, దానికి ధృతరాష్ట్రుడు "నాయనా దుర్యోధనా! నేను హీనాంగుడనగుట చేత రాజ్య పట్టాభిషేకానికి అర్హుడను కానందున, నా తమ్ముడు పాండురాజే రాజై ఈ భూమండలాన్ని పరిపాలించాడు" అని అన్నట్లుగ వ్రాయటం జరిగింది. పంచమాశ్వాసంలో ధృతరాష్ట్రుడే రాజైనట్లు వ్రాసిన నన్నయగారు, షష్ఠాశ్వాసంలో "నీవు రాజువు కాలేక పోయినందున పాండురాజు రాజైనాడని" దుర్యోధనుడు; "హీనాంగుడనగుట చేత నేను రాజు కాలేక పోతినని" ధృతరాష్ట్రుడు చెప్పుకొన్నట్లు ఎలా వ్రాశాడు? ఇది పరస్పర విరుద్ధం గదా! దీనిని బట్టి నన్నయగారు ఏదో ఒక ప్రతిని గాక అనేక ప్రతులను తన పరిశీలనలో పెట్టుకొని ఉండవచ్చునని తెలుస్తున్నది. అయితే మూల గ్రంథంలో ఏమి ఉన్నదో– మహాభారతాన్ని మనకు అందించిన వ్యాసుడు ఏమి చెప్పాడో అదే మనం స్వీకరించవలసి ఉన్నది. కనుక వస్త్రాపహరణం అనేది కర్ణుని బుర్రలో పుట్టిన బుద్ధియేననుట నిర్వివాదాంశం. ఈ వస్త్రాపహరణయే మహాభారత యుద్ధానికి, 18 అక్షౌహిణుల సేన 18 రోజులలో సర్వనాశనం కావటానికి కారణమైంది. అందుకే "కర్ణుడు లేని భారతమా?" అనే మాట ప్రచారంలోనికొచ్చింది. అంటే కర్ణుడే లేకపోతే మహాభారత యుద్ధం జరిగేదా? ఇంతటి సర్వనాశనం సంభవించేదా? అనే భావంతో ఈ మాట ప్రచారంలోని కొచ్చింది. ఐతే కొందరు ఈ మాటను మరొక విధంగా అర్థం చేసుకుంటారు. కర్ణుడెంతో గొప్పవాడు, మహావీరుడు, దానశీలి, సత్యవాక్పాలకుడు, ధర్మాత్ముడు, త్యాగ శీలి, స్నేహానికి ఎంతో విలువ ఇచ్చేవాడు అనే ఉద్దేశంతో కర్ణుడు లేకపోతే మహాభారతం ఏముంటుంది? అనే భావంతో కర్ణుడు లేని భారతమా? అంటూ ఉంటారు.

కర్ణుడు ఎంతటి అధర్మపరుడో ద్యూత సభలోనే మనకు అర్థమౌతుంది. దుశ్శాసనునికి వస్త్రాపహరణ ఆదేశం ఇవ్వటానికి ముందు కర్ణుడేమన్నాడు? పాండవుల ధనం, సంపదలు, ద్రౌపది, పాండవులు ఈ సర్వాన్నీ శకుని ధర్మ బద్ధంగా గెలుచుకున్నాడు–అని. ఆడింది కపటజూదమని తెలియదా కర్ణునికి? తెలిసీ తెలియనట్లు మాట్లాడేవాడు సత్య వాక్పాలకుడా? మాయాజూదంలో గెల్చుకున్న సంపద ధర్మ బద్ధంగా గెల్చుకున్నదా? ఇదేనా ధర్మతత్పరత? సత్యవాక్పాలన? తాను కుంతీపుత్రుడనని తెలిసినా, దుర్యోధనునికి చెప్పకుండా దాచటం మిత్రధర్మమా? పరశురాముని చేత, బ్రాహ్మణుని చేత శపించబడి తిరిగివచ్చిన కర్ణుడు 'పరశురాముని ప్రార్థించి శాపవిమోచనం పొందా'నని పచ్చిగా అబద్ధమాడటం సత్యవాక్పాలనా? మిత్రధర్మమా? "ధర్మరాజే ఈ సమస్త భూమండలానికి చక్రవర్తి కావాలి. దుర్యోధనునికి రాజ్యం రావటం అనర్థకరమ"ని కర్ణుడు శ్రీకృష్ణునితో పలకటం స్నేహానికి విలువ ఇవ్వటమేనా? ద్రోణాచార్యునికి గురుదక్షిణగా ద్రుపదుని బంధించి తెచ్చుటకు దుర్యోధనునితో కలిసి వెళ్ళిన కర్ణుడు, ద్రుపదునితో జరిగిన ఘోరయుద్ధంలో ద్రుపదుడు అంగ సంధులలో తాడనం చేయుటతో యుద్ధరంగాన్ని విడిచి పారిపోవటం పరాక్రమమా? ఘోషయాత్రా నెపంతో వెళ్ళి గంధర్వులతో యుద్ధం తటస్థించినప్పుడు గంధర్వుల ధాటికి నిలువలేక దుర్యోధనాదులను విడిచి వెనుదిరిగి చూడకుండా వికర్ణుని రథమెక్కి పారిపోవటం వీరత్వమా? పరాక్రమమా? ద్రౌపదీ స్వయంవరం సమయంలో బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునునితో పోరాడి అతడి ధాటికి నిలువలేక పారిపోవటం వీరత్వమా? ఇక ద్యూతసభలో కర్ణుడు పలికిన పలుకులు, ద్రౌపదిని అన్నమాటలు, చేసిన పరిహాసాలు ఒక త్రాగుబోతు మాట్లాడే మాటలో కాదో మనకు చక్కగా తెలుస్తుంది. ఎంతటి పైశాచిక కృత్యమో ముందుముందు ఇంకా తెలుస్తుంది. ఇట్టి దుష్టుడైన కర్ణుడు దుష్టచతుష్టయంలో అతి ముఖ్యుడైన కర్ణుడు లేకపోతే మహాభారత యుద్ధమే సంభవించేది కాదు అనే ఉద్దేశంతోనే "కర్ణుడు లేని భారతమా?" అనే సామెత వచ్చింది. (ఇంకా కర్ణుని వ్యక్తిత్వాన్ని గురించి ముందు ముందు ప్రత్యేకంగా తెలియజేయటం జరుగుతుంది)

కర్ణుని ఆదేశంతో దుశ్శాసనుడు ద్రౌపదీదేవి కట్టిన వస్త్రాన్ని పట్టుకొని, బలాత్కారంగా లాగటం ప్రారంభించగానే ఏమి జరిగిందో గ్రంథంలోనికి వద్దాం.

దుశ్శాసనుడు ద్రౌపది కట్టిన చీరను అందుకోవటంతో "గోవిందా! కృష్ణా! గోపీ జనప్రియా! ద్వారకావాసా! ఈ కౌరవులు నన్ను అవమానిస్తున్నారు. కౌరవసాగరంలో మునిగిపోతున్న నన్ను రక్షించు" అంటూ మాటిమాటికీ స్మరిస్తూ ఆర్తనాదాలు చేస్తున్నది. ద్రౌపది యొక్క భక్తికి, ప్రార్థనకు చలించిన శ్రీకృష్ణుడు శయ్యనుండి తటాలున దిగి పరుగు తీశారు. అవ్యక్త రూపంలో ప్రవేశించి రంగురంగుల వస్త్రాలతో ద్రౌపదీదేవి శరీరాన్ని ఆచ్ఛాదింపజేస్తున్నాడు. దుశ్శాసనుడు

వస్త్రాన్ని లాగుతుంటే అలాంటివే అయిన వస్త్రాలు ఆమె శరీరం నుండి ఉద్భవిస్తున్నాయి. ద్రౌపదీదేవి యొక్క ధర్మశీలత, పాతివ్రత్య మహిమతో ఆమె శరీరం నుండి రంగురంగుల వస్త్రాలు అక్షయంగా, అఖండంగా, ఆశ్చర్యకరంగా వస్తూనే ఉన్నాయి. దుశ్శాసనుడు వస్త్రాలను లాగిలాగి అలసిపోయాడు. వేలకొద్దీ రంగురంగుల చీరలు అక్కడ గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. దుశ్శాసనుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.

ఆ సమయంలో అక్కడ భయంకరమైన కోలాహలం చెలరేగింది. జగత్తులోని ఈ అద్భుత దృశ్యాన్ని చూచి సదస్యులైన రాజులందరూ ద్రౌపదిని ఘనంగా ప్రశంసించారు. అదే సమయంలో దుశ్శాసనుని ఘోరంగా నిందించారు. ఆ సమయంలో భీమసేనుడు లేచి, నేత్రాలనుండి క్రోధారుణ జ్వాలలు ఎగసిపడుతుండగా, పిడికిలి బిగించి, "ఓ సభాసదులారా! నా ప్రతిజ్ఞను వినండి. ఇంతకు పూర్వం ఇలాంటి ప్రతిజ్ఞను ఎవ్వరూ చేయలేదు. ఇక ముందు కూడా ఎవ్వరూ చేయరు. భరతవంశానికి కళంకాన్ని తెచ్చిన ఈ దుష్ట దుశ్శాసనుని రాబోయే యుద్ధంలో గుండెలు బ్రద్దలు గొట్టి, వీడియొక్క వేడివేడి రక్తాన్ని పానం చేస్తాను. అలా చేయలేకపోతే నేను నా పితృపితామహుల గతికి తప్పిన వాడినౌతాను" అని భయంకర ప్రతిజ్ఞ చేయటంతో సదస్యులంతా భీమసేనుని ప్రశంసిస్తూ దుశ్శాసనుని నిందించారు. సభలో ఆశీనులైన రాజన్యులందరూ దుశ్శాసనుని అనేక విధాల నిందించటమే గాక, సభలో ఎవ్వరూ ద్రౌపదీ ప్రశ్నకు సమాధానం చెప్పకపోవటంతో ధృతరాష్ట్రుని కూడా నిందిస్తూ, క్రోధంతో చూస్తున్నారు. (సభా 68 అ. 41-57శ్లో)

అంతట విదురుడు లేచి, "సభాసదులారా! ధర్మం చెప్పమని ద్రౌపది అడుగుతున్నది. కాని ఎవ్వరూ ఈ విషయమై ఆలోచించటం లేదు. వికర్ణుడు తన అభిప్రాయాన్ని తెలియజేశాడు. మీరు కూడా మీమీ నిర్ణయాలు ఏమిటో చెప్పండి. సభలో ధర్మజ్ఞులు ఉండీ ధర్మనిర్ణయం చేయకపోతే అసత్య భాషణ ఫలంలో సగం సభ్యులకు చెందుతుంది. అలాగాక తప్పుడు నిర్ణయం చేస్తే అసత్యఫలం పూర్తిగ వస్తుంది. కనుక మీ నిర్ణయాలు చెప్పండి" అన్నాడు.

దానికి కర్ణుడంటున్నాడు, "దుశ్శాసనా! ఈ ద్రౌపది మీ దాసి. కనుక ఈమెను మీ ఇంటికి తీసుకుపో! అన్నాడు (సభా. 68 అ.89శ్లో)

-విదురుడు చెప్పిందేమిటి? కర్ణుడు మాట్లాడిందేమిటి? "ద్రౌపదీ ప్రశ్నకు మీ సమాధానం ఏమిటో చెప్పండి" అని విదురుడంటుంటే; "దుశ్శాసనా! ఈమె మీ దాసి, ఈమెను మీ ఇంటికి తీసుకపో" అని కర్ణుడంటున్నాడు. దీనితో కర్ణుని వ్యక్తిత్వం ఏమిటో తెలుసుకోవచ్చు. అసలు సభలో ఎలా ప్రవర్తించాలో తెలుసా కర్ణునికి? తెలియదనటానికి వీల్లేదు. ఎందుకంటే అతడు ఒక రాజ్యానికి (అంగ) అధిపతి (రాజు). మరి అట్టివాడు తెలిసీ ఇంత బుద్ధిహీనంగా-ఒక త్రాగుబోతులా ఎందుకు మాట్లాడుతున్నాడు? అదే మదం, నీచబుద్ధి" నిండు సభలో అందరూ చూస్తుండగానే అనంత వస్త్రావిర్భావంతో సభాసదులంతా నిశ్చేష్టులై, ఈ అద్భుత దృశ్యాన్ని తిలకిస్తూ ద్రౌపదీదేవి పాతివ్రత్య మహిమను, ధర్మశీలతను ప్రశంసిస్తూ ఉంటే; ఈ సభమర్యాద తెలియని, అసందర్భ ప్రలాపి కర్ణుడు 'ద్రౌపది దాసి; కనుక మీ ఇంటికి తీసుకపో" అంటూన్నాడంటే ఏమాత్రం సిగ్గు, బిడియం ఉన్నదా? అందరూ ఛీ కొడుతున్నారనే స్పృహ ఉన్నదా? త్రాదు బారి కూర్చున్నవాడికి ఎవరేమనుకుంటే ఏం? ఇక కథలోకి వద్దాం.

కర్ణుడు దుశ్శాసనుడితో అలా అనగానే ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న దుశ్శాసనుడు ద్రౌపదిని సమీపిస్తున్నాడు. ద్రౌపది చలించిపోతూ తన సందేహాన్ని తీర్చుమంది. దుశ్శాసనుడు ఆమెను పట్టుకొని అటూ ఇటూ గుంజుతున్నాడు. ద్రౌపది మూర్ఛపోయింది. కొంతసేపటికి తేరుకుని "సభాసదులారా! నేను పాంచాలరాజు కుమార్తెను; శ్రీకృష్ణుని సఖిని; పాండవధర్మపత్నిని; కురువంశపు కోడలిని, నన్ను ఇలా నిండు సభలో అవమానిస్తున్నారు. కురుసామ్రాజ్యంలో ధర్మం నశించిపోయిందా? నేను దాసినా? చెప్పండి. మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటాను" అన్నది ద్రౌపది.

సభలో దుర్యోధన భయంతో ఎవరూ నోరు విప్పలేదు. ఇదే అదనుగా భావించిన కర్ణుడు అంటున్నాడు-

**శ్లో॥ప్రవిశ్యరాజ్ఞః పరివారం భజస్వ**
**తత్తే కార్యం శిష్టమావిశ్యతేత్ర**
**ఈశాస్తు సర్వేం తవరాజపుత్రి**
**భవంతివై ధార్తరాష్ట్రాన పార్థాః॥ (సభా 71 అ.2శ్లో)**

తా॥ రాజకుమారీ! ఇప్పుడు నీవు దుర్యోధన మహారాజు పరివారంలో చేరిపోయి అందరికీ సేవలు చేసుకో. నిన్నిక్కడ ఆజ్ఞాపించిన పనిలో నీవు చేయవలసిన కార్యం ఇదే మిగిలి ఉంది. ఈ రోజు నుండి ధృతరాష్ట్రుని పుత్రులందరూ నీ యజమానులే, పాండవులు కాదు.

**శ్లో॥అన్యం వృణీష్వ పతిమాశు భావిని**
**యస్మాత్ దాస్యం నలభసి దేవనేన॥**
**అవాచ్యావై పతిషు కామవృత్తిః**
**నిత్యం దాస్యే విదితం తత్ తవాస్తు॥ (సభా 71అ.3శ్లో)**

తా॥ సుందరీ! జూదంలో అలిని పణంగా బెట్టి ఓడిపోని మరియొక పతిని వివాహం చేసుకో. నీలాంటి దానికి ఇలా ఎంచుకోవటంలో తప్పులేదు. దాసీలు స్వేచ్ఛా చారిణులు. నీకీ దాస్యభావం ప్రాప్తించటం కూడా మంచిదే. ఓడిన పాండవులు ఇప్పుడు నీ భర్తలు కారు.

ఈ కర్ణుని మాటలకు తోకతొక్కిన తాచులా బుసలు కొడుతూ లేచాడు భీమసేనుడు. ధర్మరాజు అతడిని శాంతింప జేశాడు. అంత భీముడు, “అగ్రజా! ఈ సూతపుత్రుడు కర్ణుని మాటలకు నాకు కోపం లేదు. ఎందుకంటే ఇతడు దుర్యోధనుని దాసుడు. దాసధర్మాన్ని అనుసరించి అలా మాట్లాడుతున్నాడు. నీవు ద్రౌపదిని పణం పెట్టకుండా ఉన్నట్లైతే ఈ సూతపుత్రుడు ఇలా దారుణంగా మాట్లాడేవాడా?” అన్నాడు భీముడు.

భీముని మాటలు విని అచేతనుడైన ధర్మరాజుతో దుర్యోధనుడు ఇలా అంటున్నాడు. “ఓ ధర్మనందనా! భీమార్జున నకుల సహదేవులు నీ ఆజ్ఞానువర్తులు. కనుక నీవే ద్రౌపది ప్రశ్నకు సమాధానం చెప్పు. ద్రౌపది జయించబడిందా? లేదా? నీ అభిప్రాయం ఏమిటో చెప్పు” అంటూనే ఐశ్వర్యమందంతో ఉన్మత్తుడైన దుర్యోధనుడు, ఆ సమయంలో కర్ణుడు చేసిన కనుసైగను చూసి; భీమసేనుని తిరస్కార భావంతో చూస్తూ; ద్రౌపది వైపు చిరునవ్వులు చిందిస్తూ, తన తొడపై గల వస్త్రాన్ని తొలగించి ఎడమతొడను ద్రౌపదికి చూపించి కనుసైగ చేశాడు.

అది చూడగానే భీమసేనుని నేత్రాలు క్రోధంతో ఎరుపెక్కాయి. తీక్షణంగా దుర్యోధనుని వైపు చూస్తూ, సభా సదులందరూ వినేటట్లుగా “దుర్యోధనా! రాజ్యసంపదల మదంతో మత్తెక్కి ద్రౌపదికి తొడలు చూపి అవమానించిన నిన్ను రాబోయే మహాసంగ్రామంలో నా గదా దండంతో నీ తొడలు విరుగగొట్టి వధించనిచో నాకు నా పూర్వీకుల పుణ్య లోకములు లభించకుండుగాక!” అని తీవ్రమైన ప్రతిజ్ఞ చేశాడు భీమసేనుడు. ఆ సమయంలో భీముని శరీరంపై రోమం నుండి అగ్నికణాలు ప్రజ్వలిస్తున్నట్లుగా ఉన్నది.

దానితో విదురుడు “దుర్యోధనా! చివరకు ఎంతటి ఆపద తటస్థించిందో చూడు. ధర్మాన్ని ఉల్లంఘించి జూదం నడిపించావు. అంతేగాక నిండు సభలోనికి స్త్రీని బలాత్కారంగా ఈడ్చుకొని వచ్చి ఘోరాతిఘోరంగా అవమానించావు. నీ యోగ క్షేమాలు పూర్తిగా నశించిపోయినవి. కౌరవులు ఘోర పాపానికి ఒడిగట్టారనే విషయం నేటితో అందరికీ తెలిసి పోయింది” అన్నాడు.

ఈలోగా ధృతరాష్ట్రుని అగ్నిశాలలో ఒక నక్క అరిచింది. దానిని అనుసరిస్తూ అనేక గాడిదలు ఓండ్రపెట్టినవి. గ్రద్దలు, అనేక రకాల పక్షులు నలువైపులా సంచరిస్తూ అనేకమైన అమంగళధ్వనులు చేస్తూ రోదించినవి. గాంధారీ విదురులు ఈ శబ్దాలను విన్నారు. భీష్మ, ద్రోణ, కృపాచార్యులు కూడా ఈ అమంగళధ్వనులు విని ‘స్వస్తి’ ‘స్వస్తి’ అని పలికారు.

గాంధారీ విదురులు ఈ అమంగళకరధ్వనుల మర్మాన్ని గ్రహించి ధృతరాష్ట్రునితో చెప్పారు. దానితో ఇంతవరకు మౌనంగా ఉన్న ధృతరాష్ట్రుడు మొదటిసారిగా నోరు విప్పాడు. (సభాపర్వం 71వ అ.4 నుండి 24 శ్లో. వరకు)

– ఈ మొత్తం వ్యవహారంలో పాండవులపైకి దుర్యోధనుని రెచ్చగొట్టటమే ధ్యేయంగా, పాండవులను, ద్రౌపదిని నీచాతి నీచంగా మాట్లాడటం ద్వారా కర్ణుడు తన నీచ బుద్ధిని, దుష్ట మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నాడు. దుష్టచతుష్టయంలో దుర్యోధన దుశ్శాసన శకునిలు ఉండటం సమంజసమేగాని కర్ణుడు అంత దుష్టుడు కాదు గదా! అని అనుకొనేవారు ద్యూత సభలో కర్ణుని ప్రవర్తన చూసి, అతడి రెచ్చగొట్టే మాటలు చూసి, అబద్ధాలు, అన్యాయాలు, అసందర్భ ప్రలాపాలు చూసి దుర్యోధనునికన్నా, దుశ్శాసనుని కన్నా, శకుని కన్నా దుష్టుడు కర్ణుడే అనే నిశ్చయానికి రాక తప్పదు. వస్త్రాపహరణం చేయమని చెప్పిన వాడు కర్ణుడు. అలినొడ్డి ఓటుపడని అరవ భర్తను ఎంచుకోమని ద్రౌపదికి చెప్పి, దుర్యోధనునికి కనుసైగ చేసి, దుర్యోధనుడు తొడలు చూపటానికి కారణమైవాడు కర్ణుడు.

ఈ రెండు సంఘటనల కారణంగానే దుశ్శాసన, దుర్యోధనులను లోకభీకరలీలగా వధియింతునని భీముడు ప్రతిజ్ఞ చేయటం జరిగింది. అంటే పాండవ ధార్త రాష్ట్రుల మధ్య పచ్చ గడ్డివేస్తే భగ్గుమనేటట్లుగా చేసినవాడు కర్ణుడు. ఎందుకిలా చేస్తున్నాడు కర్ణుడు? ఈ సందేహాన్ని అంపశయ్యపై నున్న భీష్మునితో ఏకాంతంగా మాట్లాడుతూ ఈ కర్ణుడే తీర్చాడు. ఇప్పటికైనా సంధిచేసుకోమని 10 రోజుల యుద్ధం తరువాత భీష్ముడు తన వద్దకు వచ్చిన కర్ణునితో చెప్పగా, కర్ణుడేమన్నాడో చూడండి. “తాతా! ఈ సమస్త రాజలోకము వీరమరణం చెందటానికి గాను, నేను ఎల్లప్పుడూ ధర్మాత్ములైన పాండవుల మీదకు దుర్యోధనుని రెచ్చగొడుతూనే ఉన్నాను. అట్టి నేను ఈ రోజున సంధిచేసుకోమని దుర్యోధనునకు ఎలా చెప్పను?” అన్నాడు. అంటే యుద్ధపూర్వకంగా సమస్త రాజ లోకము నశించి పోవాలట. ఈ కర్ణుడు దుర్యోధనుని శ్రేయోభి లాభియా?

ద్యూతసభలో ఇంత నిర్లజ్జగా, నిశ్శిగ్గుగా, పైశాచిక విలయ తాండవం చేసిన కర్ణుని సమర్థించేవారు, అతడు మాట్లాడిన దానిలో తప్పేముందని వాదించేవారు, గ్రంథాన్ని చూడనివారు



నీవు పలికిన అన్ని పదాలలో భగవంతుని గురించినవి ఎన్ని?

ఐన కర్ణాభిమానులు ఎందరో ఉండవచ్చు. వీరు కర్ణుని సమర్ధిస్తే సమర్ధించవచ్చు. కాని కర్ణుడు మాత్రం తాను చేసిన కృత్యాన్ని సమర్ధించుకోలేదు. అందుకే రాయబారం విఫలమైపోయి తిరిగి వెళ్ళే శ్రీకృష్ణునితో ఏకాంతంలో హస్తినాపుర పొలిమేరలలో ఇలా అన్నాడు.

**శ్లో॥ యదబ్రువ మహం కృష్ణ కటుకానిస్మ పాండవాన్।**
**ప్రియార్థం ధార్తరాష్ట్రస్య తేనవప్యేహ్య కర్మణా ॥**
**(ఉద్యో.141అ.45శ్లో)**

**తా॥** కృష్ణా! ఆనాడు పాండవులను మర్మభేదకములగు ఏ కటువైన మాటలు మాట్లాడితినో అవన్నియు ధార్తరాష్ట్రుల ప్రీతికొరకు మాత్రమే మాట్లాడాను. అందువల్ల ఆ అకార్యానికి నన్ను క్షమించు-అన్నాడు కర్ణుడు.

అయితే కర్ణుడే స్వయంగా తాను చేసినది అకార్యమని అంగీకరించి క్షమాపణ కోరినా, కర్ణాభిమానులు మాత్రం అలా అంగీకరించలేరు. అది వారి ప్రవృత్తి.

అంతేకాదు పాండవులను చంపాలని, భీమునికి విషాన్నం తినిపించి గంగలో త్రోయాలని చేసిన అకృత్యాలలో శకుని దుర్యోధనులేగాని, కర్ణుడు లేదని కొందరు వాదిస్తుంటారు. ఇదిగో వారికొరకు ఆదిపర్వం 128వ అధ్యాయం 40వ శ్లోకం ఇవ్వబడుతున్నది.

**శ్లో॥ఏవం దుర్యోధనఃకర్ణః, శకునిశ్చాపి సౌబలః।**
**అనేకై రభ్యుపాయై స్థాం, జిఘాంసంతిస్మపాండవాన్॥**
**(ఆది 128 అ. 40శ్లో)**

**తా॥** ఈ ప్రకారంగా దుర్యోధనుడు, కర్ణుడు, సుబలపుత్రుడు శకుని ఈ ముగ్గురూ కలిసి అనేక ఉపాయాల ద్వారా పాండవులను చంపటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

– ప్రతి దుష్టకార్యంలోనూ-అంటే భీమునికి విషాన్నం పెట్టి గంగలో త్రోయించుటలోను; లక్కయింట కుంతీ సహా పాండవులను అగ్ని దగ్ధంగావించ ప్రయత్నించటంలోను, ఘోష యాత్రకై బయలుదేర దీయించటంలోను- అన్నింటిలోను కర్ణుని హస్తం ప్రధానంగా ఉన్నది. అందుకే దుష్టచతుష్టయంలో చేరిపోయాడు కర్ణుడు.

–ఇక గాంధారీ విదురుల హెచ్చరికతో నోరు తెరిచిన ధృతరాష్ట్రుడు ఏమంటున్నాడో, ఈ వస్త్రాపహరణ ఘట్టానికి ఎలా ముగింపు ఇవ్వబోతున్నాడో, ఆ తర్వాత ఏమి జరిగిందో, ఈ సందర్భంలో కూడా ద్రౌపదీదేవి యొక్క లోకోత్తర ధర్మనిష్ఠ ఎట్టిదో తెలుసుకుందాం.

(వచ్చే సంచికలో...)

**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF "DHYANAMALIKA" MONTHLY MAGAZINE, VIJAYAWADA AS REQUIRED UNDER RULE 8 OF THE REGISTRATION OF NEWS PAPERS (CENTRAL) RULES 1956**

**FORM IV**
(See Rule 8)

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Vijayawada |
| 2. Periodicity | : | Monthly |
| 3. Printers Name | : | **C .Bhikshamaiah** |
| 4. Whether Citizen of India | : | Yes |
| 5. Address | : | Plot No.143, D.No.54-13/5-4, Srinivasa Nagar Bank Colony, Vijayawada-520008. |
| 6. Publisher's Name & Address | : | **C.Bhikshamaiah**<br>Plot No.143, D.No.54-13/5-4, Srinivasa Nagar Bank Colony, Vijayawada-520008. |
| 7. Editor's Name & Address | : | **C.Bhikshamaiah**<br>Plot No.143, D.No.54-13/5-4, Srinivasa Nagar Bank Colony, Vijayawada-520008. |
| 8. Names & Addresses of Individuals who own the News Paper : | : | **C. Bhikshamaiah**<br>Plot No.143, D.No.54-13/5-4, Srinivasa Nagar Bank Colony, Vijayawada-520008 |

I, C.BHIKSHAMAIAH, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Vijayawada
28-02-2011

**Sd/- C. BHIKSHAMAIAH**
Publisher


నీ యోగ్యతలు, గుణాలు దుర్వినియోగం అయితే నీవే నష్టపోతావు



# మహాభారతం

## ద్రౌపది 28

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

**H) ధృతరాష్ట్రుడు వరములిచ్చుట-ద్రౌపది ధర్మనిష్ట**

అమంగళకరమైన శబ్దములను విని కీడు శంకించిన గాంధారీ విదురులు ధృతరాష్ట్రుని హెచ్చరించటంతో మొదటి సారిగా నోరు తెరిచాడు ధృతరాష్ట్రుడు. ఏమంటున్నాడు?

**శ్లో॥హతోసి దుర్యోధన మందబుద్ధే**
**యస్త్వం సభాయాం కురుపుంగవానాం।**
**స్త్రియం సమాభాషసి దుర్వినీత**
**విశేషతో ద్రౌపదీం ధర్మపత్నీం॥ (సభా 71అ.25శ్లో)**

**తా॥** ఓరీ మందబుద్ధీ! దుర్యోధనా! నీవిక మరణించినట్లే. ఓ దుర్వినీతా! కురువంశశ్రేష్ఠులున్న నిండుసభలోకి కులస్త్రీని, అందునా పాండవధర్మపత్ని ద్రౌపదిని తీసుకొచ్చి దుర్భాష లాడుతావా? ఛీ! నీవు పాపివి అన్నాడు ధృతరాష్ట్రుడు.

ఇలా దుర్యోధనుని నిరసించి, ద్రౌపదిని పిలిచి, ఆమెతో, "అమ్మా! పాంచాలీ! నీవు నా కోడంద్రందరిలోను శ్రేష్ఠురాలవు. మహాపతివ్రతవు. ధర్మపరాయణవు. నీ ఇష్టమైన వరాన్ని కోరుకో; అనుగ్రహిస్తాను" అన్నాడు ధృతరాష్ట్రుడు.

"మహారాజా! మీరు నాకు వరాన్ని ఇవ్వాలనుకుంటే ధర్మాచరణమే తన జీవన విధానంగా ఉన్న యుధిష్ఠిరుని దాస భావం నుండి విడుదల చేయండి. ఎందుకంటే నీ పుత్రుడు ప్రతివింధ్యుని ఏ రాజకుమారుడు 'దాసపుత్రుడ'ని అనకుండా ఉండాలి" అన్నది ద్రౌపది.

"కళ్యాణీ! నీవు ఏమి కోరావో అదే జరుగుతుంది. ఇప్పుడు నీవు మరొక వరాన్ని కోరుకో. నీకు ఇంకా ఇంకా వరాలివ్వాలని మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది" అన్నాడు ధృతరాష్ట్రుడు. దానికి ద్రౌపది, "రాజా! భీమార్జున నకుల సహదేవులను వారివారి రథాలతోను, అస్త్రశస్త్రాలతోను దాస్య విముక్తిని కల్పించి, స్వతంత్రులుగా చేయండి. ఇదే నా రెండవ కోరిక" అన్నది.

ఆపై ధృతరాష్ట్రుడు, "అమ్మా సౌభాగ్యవతీ! నీవు కోరిన రెండు వరాలను ఇచ్చాను. అయినా నాకు తృప్తి కలగటం లేదు. నీవు నా కోడంద్రందరిలోను ఉత్తమురాలవు; ధర్మపరాయణవు. రెండు వరాలు ప్రసాదిస్తే నిన్ను పూర్తిగ సత్కరించినట్లు కాదు. కనుక మూడవ వరాన్ని కోరుకో" అన్నాడు. ఇపుడు ద్రౌపది అంటున్నది. "ధృతరాష్ట్ర మహారాజా! లోభము ధర్మాన్ని నశింప జేస్తుంది. అందువల్ల ఇక వరాన్ని కోరుకోవటంలో నాకు ఆసక్తి లేదు. మూడవ వరాన్ని గ్రహించే అధికారం నాకు లేదు. ఎందుకంటే వైశ్యుడు ఒక వరాన్ని మాత్రమే కోరాలి. క్షత్రియ కాంత రెండు వరాలు కోరవచ్చు. క్షత్రియుడు మూడు వరాలు కోరుకోవచ్చు. బ్రాహ్మణునికి నూరు వరాలు కోరుకునే అధికారం ఉన్నదని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. ఇపుడు నా భర్తలు దాస్యం నుండి విడుదల పొందారు. వారు పుణ్య కర్మల ద్వారా ఉన్నతిని సాధించి సుఖంగా జీవించగలరు? ఇదీ ద్రౌపది ధర్మనిష్ట. (సభా 71 అ. 26-36శ్లో)

ఇదే సందర్భంలో ఆంధ్రమహాభారతంలో "తాను 3వ వరాన్ని ఎందుకు కోరకూడదో" ద్రౌపది ఇలా తెలియజేసింది.

**ఆ. వైశ్యసతికి నొక్కవరము సత్క్షత్రియ సతికి రెండు శూద్రసతికి మూడు విప్రసతికి నూరువేదజన్వరములు, గాన ఇక వేడగాదు నాకు (సభాపర్వం)**

-వైశ్యస్త్రీ ఒక్కవరాన్ని, క్షత్రియకాంత రెండు వరాలను, శూద్రస్త్రీ మూడు వరాలను, బ్రాహ్మణస్త్రీ నూరు వరాలను కోరవచ్చు. కనుక నేను 3వ వరాన్ని కోరరాదు-అని చెప్పినది.

-ఏమైనా క్షత్రియకాంత రెండు వరాల కన్నా ఎక్కువ కోరరాదని, తాను ధర్మాన్ని తప్పలేనని, నిర్ద్వంద్వంగా

ధృతరాష్ట్రుని మాటను త్రోసిపుచ్చినదే గాని; ఆశపడి కోరికలను కోరలేదు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో కూడా ద్రౌపది ధర్మ తత్పరత ఎట్టిదో విజ్ఞులు గ్రహించాలి.

ద్రౌపదీదేవి యొక్క పాతివ్రత్య మహాత్మ్యమును గుర్తించి; తటస్థించిన ఉత్పాతాలకు బెదరి గాంధారీ విదురులు చేసిన హెచ్చరికలను పెడచెవినిపెట్టలేక; పాండవులు తమకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోకుండా; వారిని చల్లబరచటానికి ధృతరాష్ట్రుడు ద్రౌపదీదేవికి వరములివ్వటం జరిగింది.

ద్రౌపది ఇలా మూడవ వరాన్ని కోరటానికి నిరాకరించటంతో, కోడలియొక్క ధర్మగుణాన్ని ప్రశంసించిన ధృతరాష్ట్రుడు, ధర్మరాజును తన వద్దకు పిలిచి, "అజాత శత్రూ! ధర్మనందనా! నీవు ధర్మమూర్తివి, శాంతమూర్తివి. నీకు శుభం జరుగుతుంది. నీవు నా ఆజ్ఞపై జూదంలో ఓడిన సమస్త సంపదలను, రాజ్యాన్ని స్వీకరించి, ఏ విధమైన విఘ్నము లేకుండా నీ అనుజులతోను, ద్రౌపదితోను కలిసి ఇంద్రప్రస్థానికి వెళ్ళి యథాప్రకారం రాజ్యపాలన గావించు. నీ మాట విన్నవారు ధర్మంగా నడుచుకుంటారు. నీకు ధర్మ సూక్ష్మాలు తెలుసు. ఎందరో పెద్దలను, మహాత్ములను సేవించావు. నీలో వినయం ఉంది, వివేకం ఉంది, విధేయత ఉంది. జరిగిన విషయాలను మరిచిపో. వృద్ధుడను, అంధుడను అయిన ఈ నీ పెదతండ్రిని, మీ పెదతల్లి గాంధారినీ చూచి దుర్యోధనుని దురాగతాలను మరిచిపో. వారి దుర్భాషలను పట్టించుకోకు. ఉత్తమ మానవులు సద్గుణాలను స్తుతిస్తారు. దుర్గుణాలను పట్టించుకోకుండా విడిచి పెడతారు. శత్రుభావం లేకుండా ఉండేవారే శ్రేష్ఠపురుషులు. ఈ సభలో నీవు మహాత్ముడుగా, ధర్మాత్ముడుగా శోభించావు. దుర్యోధనాదుల పరుష వాక్యాలను పట్టించుకోకు.

ఏదో నాలుగురోజులు బిడ్డలు కలిసిమెలిసి సంతోషంగా గడుపుతారని, ఒక్కసారి బిడ్డల శక్తి సామర్థ్యాలను చూడాలని ఈ జూదాన్ని అంగీకరించానే గాని, ఇలా విపరీత పరిణామాలకు దారి తీస్తుందనుకోలేదు. ప్రశాంతంగా వెళ్ళి ఇంద్రప్రస్థాన్ని ధర్మానుసారం పాలించండి" అన్నాడు.

ధృతరాష్ట్రుని ఆజ్ఞపై ధర్మరాజు సోదరులతోను, ద్రౌపదితోను, కలిసి రథాలనధిరోహించి ఇంద్రప్రస్థం బయలుదేరి వెళ్ళారు. (సభాపర్వం 73 అధ్యాయం)

## I) అనుద్యూతం-ధృతరాష్ట్రుని దుర్మార్గం

ద్రౌపదీ సమేతంగా పాండవులు ఇంద్రప్రస్థానికి ప్రయాణమయ్యారు. జరిగిన విషయాన్ని తెలుసుకున్న దుశ్శాసనుడు దుర్యోధన, శకుని, కర్ణులున్న చోటికి వచ్చాడు. "మనం ఎంతో కష్టపడి సంపాదించిన ధనరాశులను మన ముసలివాడు ఒక్క క్షణంలో శత్రువుల పరం చేశాడు" అని దుఃఖించాడు. దానితో పోగొట్టుకున్న సంపదను ఎలాగైనా తిరిగి రాబట్టుకోవాలని ఆలోచన చేశారు దుర్యోధన, శకుని, కర్ణులు. దుర్యోధనుడు తండ్రి వద్దకెళ్ళి "తండ్రీ! ప్రపంచంలో అర్జునునితో సమానమైన పరాక్రమశాలి మరియొకడు లేడు. స్వయంవరం సమయంలో కర్ణుడు కూడా అర్జునుని ధాటికి నిలువలేక వెనుదిరగవలసి వచ్చింది. ఖాండవవన దహన సమయంలో సాక్షాత్తూ దేవేంద్రుడే అర్జున పరాక్రమానికి బెదరి వచ్చిన దారినే వెళ్ళాడు. ఇక ఉత్తర దిగ్విజయ యాత్రలో రాజులంతా అర్జునునికి శరణాగతుల య్యారు. నాడు గురుదక్షిణ కొరకై ద్రుపదునిపై దండెత్తి ఆ ద్రుపదుని బంధించి తెచ్చి ద్రోణునికి గురుదక్షిణగా సమర్పించిన పరాక్రమశాలి అర్జునుడు. పూర్వం రామచంద్రుని తలచుకోగానే మారీచునికెలా భయం కలిగిందో అలాగే అర్జునుని తలచుకుంటే నాకు భయం కలుగుతున్నది" అన్నాడు. దానికి ధృతరాష్ట్రుడు, "నాయనా! అర్జునుని పరాక్రమం ఎట్టిదో నాకు తెలుసు. అందువల్ల నీవు ఎప్పుడూ అర్జునునితో శతృత్వం పెట్టుకోకు. వాళ్ళను కష్టపెట్టాలి అనుకోకు. జూదానికో, యుద్ధానికి వారితో సిద్ధపడకు. వారితో స్నేహంగా ఉంటే నీకు శుభం జరుగుతుంది" అన్నాడు.

ఆ మాటలకు దుర్యోధనుడు తండ్రితో ఇలా అంటున్నాడు.

**శ్లో॥ద్యూతే పార్థస్య కౌరవ్య మాయయానికృతిఃకృతా।**
**తస్మాద్ధితం జవౌసదా త్వన్యోపాయేన నోభవేత్॥**

**తా॥** కౌరవేశ్వరా! ద్యూతక్రీడలో మేము పాండవులను మోసం చేశాం. వారు మాపై పగబట్టి ఉన్నారు. కనుక మీరే ఏదో ఒక ఉపాయం ఆలోచించాలి-అన్నాడు దుర్యోధనుడు.

"దుర్యోధనా! ఇప్పటికే నీవు ఎన్నో ఉపాయాల ద్వారా పాండవులను వధించాలని తలపెట్టావు. కాని ఏం జరిగింది? వారి కీర్తి ప్రతిష్టలు పెరిగిపోయాయి. నీవేమో అపకీర్తి పాలయ్యావు. కనుక ఇంక అవి కట్టిపెట్టి, వారితో స్నేహంగా ఉండు" అన్నాడు ధృతరాష్ట్రుడు.

దుర్యోధనుడు రెండు ఘడియలు ఆలోచించి, "తండ్రీ! దేవ గురువు బృహస్పతి ఇంద్రునికి రాజనీతిని బోధిస్తూ, శత్రువును ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించరాదని, యుద్ధం చేయకుండా ఏదో ఒక ఉపాయంతో గాని, యుద్ధం చేసి గాని వధించి తీరాల్సిందే" అని తెలియజేశాడు. "భయంకర విషసర్పాలు కాటు వేయటానికి సిద్ధంగా ఉంటే, వాటిని చంపాలేగాని, భుజాలపై కెక్కించుకుంటారా ఎవరైనా?"

"తండ్రీ! భీమార్జున నకుల సహదేవులు, యుధిష్ఠిరుడు మాపై ప్రతీకారం తీర్చుకొనేందుకే ప్రయత్నిస్తారు. వారిని మోసగించి, అనేక దుర్భాషలాడిన మమ్ములను వారెన్నటికీ క్షమించరు. ద్రౌపది విషయంలో మేము చేసిన అమానుషమైన చర్యలను వారెలా సహించి మౌనంగా ఉంటారు? కనుక ఏదో ఒక ఉపాయంతో మనం అపాయం నుండి బయట పడాలి.

మహారాజా! మనం హాయిగా జీవించాలంటే మరొక్క మారు పాండవులను జూదానికి ఆహ్వానించాలి. ఈసారి జూదంలో ఎవరు ఓడితే వారు పన్నెండేళ్ళు అరణ్యవాసం చేసి ఆ తరువాత పదమూడవ ఏట ఒక నగరంలో అజ్ఞాత వాసం చేయాలి. అజ్ఞాతవాస కాలంలో ఎవరైనా వారిని గుర్తు పడితే తిరిగి 12 ఏళ్ళు అరణ్యవాసము, ఒక ఏడు అజ్ఞాతవాసం చేయాలి. వారికైనా, మాకైనా ఇదే నియమం. మా మామ శకుని పాచికలు వేయటంలో అందెవేసిన చేయి. కనుక మేమే గెలుస్తాం. పాండవులు అరణ్యవాసానికి వెళ్ళగానే మనం మన రాజ్యాన్ని విస్తరిస్తాం. మిత్రరాజులను పెంచుకుంటాం. సైన్యాన్ని వృద్ధిచేస్తాం. పదమూడవ సంవత్సరంలో పాండవులు తిరిగివస్తే వారిని యుద్ధంలో ఓడిస్తాం. కనుక మీరు వెంటనే వారిని ఆహ్వానించండి" అన్నాడు దుర్యోధనుడు.

దానిపై ధృతరాష్ట్రుడు-

**శ్లో॥తూర్ణం ప్రత్యాన యస్వైతాన్ కామం వ్యవగతానపి।**
**ఆగచ్ఛంతు పునర్ద్యూతం ఇదం కుర్వంత ఇదం కుర్వంతు పాండవాః (సభా 74 అ. 24శ్లో)**

**తా॥** "కుమారా! పాండవులు ఎంత దూరం వెళ్ళినా సరే, నీ కోరిక ప్రకారమే వెంటనే వారిని పిలిపిస్తాను. పాండవులు ఇక్కడకు వచ్చి ఈ క్రొత్తపణంతో జూదం ఆడుతారు" అన్నాడు

-ఇదీ ధృతరాష్ట్రుని కుటిలత్వం.

ఈ ధృతరాష్ట్రుని నిర్ణయాన్ని విన్న ద్రోణాచార్యుడు, సోమదత్తుడు, బాహ్లీకుడు, కృపాచార్యుడు, విదురుడు, అశ్వత్థామ, యుయుత్సుడు, భూరిశ్రవుడు, భీష్ముడు, మహారథి వికర్ణుడు-అందరూ ఒకే మాటగా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించి, 'ఇది శాంతికి విఘాతం కలిగించేది కనుక జూదమాడ తగదు' అని చెప్పారు. (సభా 74అ.1-26శ్లో)

-ఇంతవరకు జరిగిన విషయంలో దుర్యోధన ధృతరాష్ట్రు లిరువురూ అర్జునపరాక్రమాన్ని గుర్తించిన వారేనని తెలుస్తున్నది. అలాగే జూదంలో పాండవులను మోసం చేసినట్లు, ద్రౌపది విషయంలో అమానుషంగా ప్రవర్తించినట్లు, అనేక దుర్భాషలాడినట్లు స్వయంగా తెలియజేసి అంగీకరిస్తున్నాడు దుర్యోధనుడు. దీనినిబట్టి పాండవులు ధర్మాత్ములని, కౌరవులే అధర్మపరులని, అన్యాయాలకు, మోసాలకు పాల్పడిన వారని స్పష్టమవుతున్నది. ఇది గమనించి కౌరవాభిమానులు తమ బుద్ధిని సరిదిద్దుకొందురు గాక. ఇక ధృతరాష్ట్రుని క్రూరమనస్తత్వం ఏమిటో పై 24వ శ్లోకం ద్వారా వెల్లడౌతున్నది.

ఇంకా ముందు కూడా స్పష్టం కాబోతున్న విషయాన్ని గమనించగలరు.

ధృతరాష్ట్రుని ఈ నిశ్చయాన్ని తెలుసుకున్న గాంధారి అనేక అనర్థాలకు దారితీసే ఈ పునర్ద్యూతం క్షేమకరం కాదని గ్రహించి, పరుగున ధృతరాష్ట్రుని వద్దకు వచ్చి, "మహారాజా! దుర్యోధనుడు పుట్టగానే బుద్ధిమంతుడైన విదురుడు 'వీడు వంశనాశకుడౌతాడని, కనుక వీణ్ణి విడిచిపెట్టమని' చెప్పాడు. వీడు పుట్టగానే నక్కలాగా ఏడ్చాడు. దుర్యోధనాదుల మాటకు విలువ ఇచ్చి ఈ కురుసామ్రాజ్య వినాశనానికి మీరు కారణం కావద్దు. నీ పుత్రుని నీ అధీనంలో పెట్టుకో. లేదా కులనాశకారు డైన నీ పుత్రుని విడిచిపెట్టు" అన్నది.

ఈ మాటలు విని ధృతరాష్ట్రుడు-

**శ్లో॥అథబ్రవీన్ మహారాజో గాంధారీ ధర్మదర్శినీం।**
**అంతఃకామం కులస్యాస్తు నశక్నోమినివారితుం॥**
**(సభ 75అ.11శ్లో)**

**తా॥** అపుడు ధృతరాష్ట్రుడు ధర్మదృష్టి గలిగిన గాంధారితో ఇలా అన్నాడు. **దేవీ! ఈ కులం నాశనం అయితే కానీ, నేను మాత్రం దీనిని నివారించలేను.**

**శ్లో॥యధేచ్ఛంతి తథైవాస్తు ప్రత్యాగచ్ఛంతు పాండవాః**
**పునర్ద్యూతంచ కుర్వంతు మామకా పాండవై సః॥**
**(సభా 75అ.12శ్లో)**

**తా॥** వీరు ఏమి కోరుతున్నారో అదే జరుగుతుంది. పాండవులు తిరిగి రావలసిందే. నా పుత్రులు వారితో జూదం ఆడవలసిందే-అన్నాడు స్థిరనిశ్చయంతో ధృతరాష్ట్రుడు. (సభా 75అ.1-12శ్లో)

-సాధారణంగా ధృతరాష్ట్రుడు మేక తోలు కప్పుకొన్న పులి. ఎక్కడా తన దుర్మార్గం బయటపడకుండా జాగ్రత్త పడుతూ ఉంటాడు. పెద్దలైన భీష్మ, విదుర, ద్రోణ, కృపాచార్యుల వద్ద మంచి వాడుగా నటిస్తుంటాడు. కాని ఇక్కడ గాంధారి వద్ద మాత్రం కప్పుకున్న మేకతోలును తొలగించి తన దుర్మార్గానికి హద్దులేదని, ఎంతకైనా తెగిస్తానని స్పష్టం చేశాడు.

ధృతరాష్ట్రుడు ప్రాతికామిని పంపి పాండవులను మళ్ళీ ద్యూతానికి ఆహ్వానించాడు. ఇంకా ఇంద్రప్రస్థం చేరని

పాండవులను చేరి ప్రాతికామి, "ధర్మనందనా! మీ తండ్రి ధృతరాష్ట్ర మహారాజు మిమ్ములను తిరిగి రమ్మని, సదస్యులతో నిండి ఉన్న సభలో జూదమాడవలసినది అని ఆజ్ఞాపించాడు" అని తెలియజేశాడు. దానికి సమాధానంగా ధర్మరాజు, 'ప్రాతికామీ! విధియొక్క ప్రేరణచేతనే సమస్త ప్రాణులు శుభా శుభ ఫలాలను పొందుతూ ఉంటాయి. వాటినెవరూ తప్పించు కోలేరు. నేనింకా జూదం ఆడవలసే ఉన్నదనిపిస్తున్నది. జూదం ఆడటానికి ధృతరాష్ట్ర మహారాజు యొక్క పిలుపు మా కురుకుల నాశనానికి కారణమౌతుంది. ఇది తెలిసినప్పటికీ ఆయన ఆజ్ఞను ఉల్లంఘించలేక పోతున్నాను. బంగారు లేడి ఉండదని శ్రీరామునికి తెలియదా? తెలిసీ ఆ బంగారులేడి కోసం ఎందుకు వెళ్ళాడు? ఇదంతా విధి ఆడించే వింత నాటకం?" అంటూ ద్రైపదీ, సోదర సమేతుడై తిరిగి వచ్చాడు. శకుని మోసం తెలిసినప్పటికీ జూదానికి సిద్ధమయ్యాడు.

ఏమి జరుగబోతున్నదో అందరూ ఊహించారు. కొందరు కన్నులు తుడుచుకుంటున్నారు. శకుని ప్రవేశించాడు. "ధర్మ నందనా! ధృతరాష్ట్ర మహారాజు మీ రాజ్యాన్ని సంపదలను తిరిగి మీకు ఇచ్చి మాకు ఆనందాన్ని కలిగించాడు. ఇపుడు జరగబోయే జూదానికి రాజ్యంతోగాని, సంపదలతో గాని సంబంధం లేదు. ఈ జూదంలో మీరు మమ్ములను ఓడిస్తే మేము మృగచర్మాలను ధరించి 12 సంవత్సరాలు అరణ్య వాసాన్ని ఆపై ఒక్క సంవత్సరం జనపదాలలో అజ్ఞాతవాసాన్ని కొనసాగిస్తాం. ఒకవేళ అజ్ఞాతవాసకాలంలో ఎవరైనా మమ్ము గుర్తిస్తే తిరిగి 12 ఏళ్ళు అరణ్యవాసాన్ని, ఆపై ఒక ఏడు అజ్ఞాతవాసాన్ని చేస్తాం. ఇదీ నియమం. ఒకవేళ ఈ జూదంలో మీరు ఓడితే ఈ నియమమే మీకూ వర్తిస్తుంది. ద్రౌపదితో కలిసి అరణ్య, అజ్ఞాతవాసాలను కొనసాగించాలి. ఈ నియమం ప్రకారం 13 సంవత్సరాల తరువాత ఎవరి రాజ్యాన్ని వారు తీసుకొని పాలించుకోవచ్చు. ఇక నీ అనుమతి కోసం ఆట ఎదురు చూస్తున్నది" అన్నాడు శకుని.

శకుని మాటలకు సభాసధులంతా చలించిపోయారు. భీష్మ, విదుర, ద్రోణ, కృపాచార్య, సంజయులు వద్దువద్దన్నారు. గాంధారి వినాశకరం అన్నది. కాని ధృతరాష్ట్రుని మాటకు కట్టుబడి ధర్మరాజు జూదానికి సిద్ధమయ్యాడు.

ధర్మనందనా! నీవు సిద్ధమే కదా! అంటూ పాచికలు వేశాడు శకుని. "విజయం మాదే" అన్నాడు శకుని. ఈ కపట జూదంలో ఓడిన ధర్మరాజు సోదరులతోను, ద్రౌపదితోను కలిసి 12 సంవత్సరాలు అరణ్యవాసం చేయటానికి బయలు దేరాడు. (సభా 76అ. 1-24శ్లో)

ఇదీ అనుద్యూతం జరిగిన విధం. అయితే ఇందులో ఒక సందేహం అందరినీ పీడిస్తుంటుంది. అదేమిటంటే- జూదంలో ఓడిన తర్వాత, ద్రౌపదికి నిండు సభలో ఘోరాతి ఘోరమైన అవమానం జరిగిన తర్వాత, దుర్యోధన దుశ్శాసన కర్ణులచేత పరాభవాన్ని పొందిన తర్వాత ధృతరాష్ట్రుని వర ప్రదానంతో తిరిగివెళ్ళే ధర్మరాజు మళ్ళీ జూదానికెందుకు వచ్చినట్లు? గెలుస్తామనా? జూదవ్యవసనమా? తండ్రి మాటను మీరలేకనా? ఇంకేదైనా కారణమున్నదా?

జ: గెలుస్తామని అనుకునేంత మూర్ఖుడు కాదు ధర్మరాజు. జూదమంటే వ్యసనమూ కాదు. తండ్రిమాటపై గౌరవం అనేది ఒక కారణమే అయినా, జరిగిన ఘోర పరాభవం అంత త్వరగా మరిచిపోతగినది కాదు. మరెందుకు వచ్చినట్లు? ఓడి పోతామని తెలిసీ ఎందుకు సిద్ధమైనట్లు? అలా ధర్మరాజు సిద్ధపడుతుంటే సోదరులెందుకు వ్యతిరేకించలేదు?

–దీనికి కారణం ఏమిటో సంస్కృత మహాభారతం సభా పర్వంలో 33 శ్లోకాలు గల 46వ అధ్యాయం తెలియజేస్తుంది. అయితే ఈ అధ్యాయం మొత్తాన్ని ఆంధ్రభారతంలో తెనిగించ కుండా వదలివేయటం వల్ల తెలుగువారికి దీని విషయం తెలియకుండా పోయింది. అదేమిటో చూద్దాం.

**అనుద్యూతానికి ధర్మరాజు రావటానికి అసలైన కారణం**

రాజసూయ యాగం ముగిసిన తరువాత, వ్యాస భగవానుడు తిరిగి వెళ్ళేందుకు ధర్మజుని అనుమతి తీసుకొ నుటకు వచ్చాడు. ధర్మరాజు ఆయనను ఉచితాసనంపై కూర్చుండబెట్టి "మహాత్మా! నాకొక సందేహం ఉన్నది. దేవర్షి నారదుల వారు ఒకసారి ఉత్పాతాల గురించి తెలిపి, ఉపద్రవం జరగబోతున్నదని చెప్పారు. శిశుపాల వధతో ఉత్పాతాలు శాంతించినట్లేనా" అన్నాడు. దానికి వ్యాసుడు "ధర్మనందనా! ఉత్పాతాల ఫలం 13 సంవత్సరాల వరకు ఉంటుంది. దీని కారణంగా సమస్త క్షత్రియవినాశనం సంభవిస్తుంది.

**శ్లో॥ త్వమేకం కారణం కృత్వా కాలేన భరతర్షభ।**
**సమేతం పార్థివంక్షత్రం క్షయం యాస్యతి భారత।**
**దుర్యోధనాపరాధేన భీమార్జునబలేన చ॥ (సభా 46అ. 12 శ్లో)**

"భరతకులభూషణా! నీ నిమిత్తంగానే కాలమాసన్నమైన పుడు భూమండంలోని సకల రాజసమూహాలు పరస్పరం పోరాడి నశించిపోవటం జరుగుతుంది. దుర్యోధనుని అపరాధాల వల్ల, భీమార్జునుల పరాక్రమాలవల్ల ఈ నాశనం జరుగుతుంది. కాలం అతిక్రమించరానిది. నీకు శుభం జరుగుతుంది. నేనిక వెళ్ళివస్తాను" అని చెప్పి వెళ్ళాడు

వ్యాసుడు.

వ్యాసుడు వెళ్ళిపోయిన తర్వాత ధర్మరాజు చింతాక్రాంతు డయ్యాడు. ఆయన చెప్పిన మాటలు పదేపదే గుర్తుకు వస్తున్నాయి. రోజులు భారంగా గడుస్తున్నాయి. ఒకనాడు ధర్మరాజు సోదరులను పిలిచి, "వ్యాసభగవానుడు చెప్పిన మాటలు మీరూ విన్నారు గదా! సమస్త క్షత్రియనాశనానికి నేను నిమిత్తం కావాలని విధాత నిర్ణయిస్తే, ఇక నేను జీవించటం వ్యర్థం. కనుక నేను మరణించుటకు నిశ్చయించు కున్నాను" అన్నాడు. అది విని అర్జునుడు "అగ్రజా! మీరీ విధంగా భయంకర మోహంలో పడవద్దు. ఇది బుద్ధిని నాశనం చేస్తుంది. బాగా ఆలోచించి మీరు ఏది మంగళప్రదమను కుంటారో దానిని చేయండి" అన్నాడు.

అపుడు ధర్మరాజు "నాయనా! నేను జీవించియే ఉండాలంటే నా ప్రతిజ్ఞ వినండి. నేను నా సోదరులతో గాని, ఇతర రాజులతో గాని ఎప్పుడూ పరుషంగా మాట్లాడను. బంధువులు, జ్ఞాతులు మొదలైనవారు ఏమి కోరితే దానిని ఇచ్చేందుకే ప్రయత్నిస్తాను. ఈ విధంగా అందరి కోరికలను నెరవేరుస్తూ ఉంటే సోదరుల మధ్య గాని, పుత్రులతో గాని, బంధువులతో గాని భేదభావం కలుగదు గదా! జగత్తులో యుద్ధాలకు, పోరాటాలకు ఈ భేదభావమే గదా కారణం. శతృత్వానికి, పోరాటాలకు దూరంగా ఉండి అందరికి ప్రియం కలిగిస్తూ, నిందాపాత్రుణ్ణి కాకుండా ఉంటాను. ఇదే నా వ్రతం" అని ప్రతిన చేశాడు ధర్మరాజు.

అగ్రజుని ప్రతిజ్ఞను విని నలుగురు సోదరులు "ఎట్టి విపరత్కర పరిస్థితులలోను తాము అన్నగారి అభిప్రాయానికి అనుగుణంగానే మసలుకుంటామని" ప్రతిన చేశారు. ధర్మరాజు, నలుగురు సోదరులు నిండుసభలో ఈ ప్రతినలు చేసి దేవతలకు, పితరులకు విధి పూర్వకంగా తర్పణలు వదిలారు. (సభా. 46 అ.1-33శ్లో)

ఈ ప్రతినల కారణంగానే ధర్మరాజు ఇంత జరిగిన తర్వాత కూడా జూదానికి రావటం జరిగింది. సోదరులు మారు మాటాడకుండా అన్నగారిని అనుసరించటం జరిగింది. ఇక మరొకఅంశం రాయబారానంతరం శ్రీకృష్ణుడు ఏకాంతంలో కర్ణునితో మాట్లాడుతూ "నీవు పాండవ పక్షంవైపు వస్తే నీకు రాజ్యం ఇస్తారు. ద్రౌపది నిన్ను ఆరవకాలంలో సేవిస్తుంది" అని చెప్పిన విషయంలోని రహస్యాలేమిటో, ధర్మా ధర్మాలేమిటో, ఆంతర్యం ఏమిటో, ఎవరెవరి వ్యక్తిత్వా లెలాంటివో తెలుసుకుందాం. (వచ్చే సంచికలో)

# నీ నామం, నీ రూపం నా మనసున పదిలం

"సృష్టిలో లోపం లేదు అంతా నీ దృష్టిలోనే ఉంది"

పూజ్య గురూజీ అన్న ఈ మాట నాలో ఎంతో మార్పు తెచ్చింది. ఆ మాటద్వారానే నాలో ప్రకృతిపై ఆసక్తిని సృష్టించారు. కాబట్టి గురూజీయే సృష్టికర్త. జ్ఞానమును పంచుతున్న ఆధ్యాత్మిక శాస్త్రవేత్త.

అయ్యా భిక్షమయ్యా!
అహంకారపు మనుషులమయ్యా!!
అపరజ్ఞానివి నీవయ్యా!
అజ్ఞానులము మేమయ్యా!!
నీలో జ్ఞానాన్ని మాకు పంచావయ్యా!
మేమంతా నీకు బిడ్డలమయ్యా!!
దైవస్వరూపివి నీవయ్యా!
దైవం నాలో ఉందని చెప్పావయ్యా!!
పరబ్రహ్మవు నీవయ్యా!
పవిత్రబ్రహ్మోపదేశం చేశావయ్యా!!
సమాధియోగం నేర్పావయ్యా!
సమస్యలను నేను తొలగించుకున్నానయ్యా!!
సోహంధ్యానం నేర్పావయ్యా!
శోకమంతా దూరమయ్యేనయ్యా!!
పరమపవిత్రము నీ నామం!
పరమపవిత్రం నీ రూపం!!
నీ నామం, నీ రూపం
నా మనసున పదిలం!!


వి.పవన్‌కుమార్, కాకినాడ

 బాధ్యతలను బరువుగా భావిస్తే త్వరగా అలిసిపోతావు

# మహాభారతం

## ద్రౌపది 29

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716



(గత సంచిక తరువాయి)

### 14) శ్రీకృష్ణుడు కర్ణుని వద్దతెచ్చిన ద్రైపదీ ప్రసక్తి-విశ్లేషణ

**సంఘటన:** రాయబారం విఫలమై హస్తినాపురం నుండి తిరిగి వెళ్ళిపోతున్న శ్రీకృష్ణుడు నగరపొలిమేరలలో ఏకాంతంగా కర్ణునితో మాట్లాడుతూ, "నీవు కుంతికి కన్యావస్థలో సూర్య ప్రసాదాన జన్మించినవాడవు. కనుక కానీనుడవు. ధర్మశాస్త్ర రీత్యా నీవు పాండురాజు ప్రథమపుత్రుడవు. కనుక నీవు పాండవ పక్షంవైపుకు రా! అలా వస్తే నీవే ఈ సకల భూమండలానికి చక్రవర్తి వౌతావు. అంతేకాదు. **పాండవులైదుగురను ఐదు కాలాలలో సేవించినట్లు ద్రౌపది నిన్ను ఆరవ కాలంలో సేవిస్తుంది"** అన్నాడు. ఐతే కర్ణుడు మాత్రం ఈ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించాడు.

**విమర్శలు:** ఈ సంఘటనను దృష్టిలో పెట్టుకొని, మహాభారత గ్రంథంపై విశ్వాసం గల సున్నిత మనస్కులైన వారు "ఇదేమిటి? శ్రీకృష్ణుడు ద్రౌపది గురించి ఇలా నీచంగా మాట్లాడాడు?" అని లోలోపల బాధపడుతూ ఉంటారు. కొందరు ఏదోవిధంగా సమర్థించటానికి విఫలయత్నం చేస్తుంటారు. కొందరు "ద్రౌపదికి ఐదుగురు భర్తలుండగా లేనిది ఆరవవాడుంటే తప్పేముందిలే?" అని వ్యంగ్యంగా మాట్లాడతారు. మరికొందరు "ద్రౌపదికి కర్ణునిపై కోరిక ఉన్నది, అందుకే శ్రీకృష్ణుడు అలా మాట్లాడి ఉంటాడు" అని రంధ్రాన్వేషణ చేస్తుంటారు. మరికొందరు కర్ణుని పాండవ పక్షం వైపుకు రప్పించటానికి శ్రీకృష్ణుడు ఎంత నీచానికైనా దిగజారుతున్నాడు" అని విమర్శిస్తుంటారు. ఇక కర్ణాభిమానులైన కొందరు "శ్రీకృష్ణుడు ఎన్ని ఆశలు చూపినా చలించని ధీరుడు కర్ణుడు" అని అంతా తమకు తెలిసిపోయినట్లు కర్ణుని ప్రశంసిస్తారు. గ్రంథంలో ఏమి ఉన్నదో పట్టించుకోకుండా ఆయా వ్యక్తుల స్వభావాలు ఎలాంటివో తెలుసుకోకుండా, శాస్త్రహృదయాన్ని గ్రహించకుండా, నాటకాలు-సినిమాలు-హరికథలు-బుర్రకథలు-తోలుబొమ్మలాటలు మొదలైవాటి జ్ఞానంతో, తమతమ మనోబుద్ధుల కనుగుణంగా ఇలా అనేక మంది అనేకరకాలుగా వ్యాఖ్యానిస్తూ ఉండటం వల్ల అసలు విషయం మరుగున పడిపోయింది.

అసలు గ్రంథంలో ఏమి ఉన్నది? వ్యాస భారతం ఏమి చెబుతున్నది? ఆంధ్రభారతంలో ఎలా ఉన్నది? **అసలు శ్రీకృష్ణుడు ఎందుకలా ద్రౌపదీ ప్రసక్తిని తెచ్చాడు?** ద్రౌపదీదేవి యొక్క వ్యక్తిత్వం-పాతివ్రత్యం ఎలాంటివి? అలా పలికిన శ్రీకృష్ణునితో కర్ణుడేమన్నాడు? శ్రీకృష్ణుడు తనతో ద్రౌపదీ ప్రసక్తిని తేవటాన్ని కర్ణుడెలా అర్థం చేసుకున్నాడు?" మనం ఎలా అర్థం చేసుకుంటున్నాం? అనే ప్రశ్నలకు గ్రంథాన్ని కూలంకషంగా పరిశీలనచేసి విశ్లేషణ చేస్తే గాని సరైన సమాధానం దొరకదు; ఆనాటి మహాభారతంలోని వ్యక్తుల వ్యక్తిత్వం సరిగా అవగాహన కాదు. కనుక ముందుగా ఆ పని చేద్దాం.

**విశ్లేషణ:** ప్రస్తుతం భారతదేశంలో సంస్కృత మహాభారత వ్రాతప్రతులు ఐదుమాత్రమే ఉన్నాయి. అందులో నాలుగు ఔత్తరాహిక (ఉత్తరాదిలోని) ప్రతులు కాగా, ఒక్కటి మాత్రం దాక్షిణాత్య (కుంభకోణం) ప్రతి. ఈ ఐదింటిని పరిశోధించి గీతాప్రెస్ వారు ప్రచురించిన మహాభారతంలో, శ్రీకృష్ణుడు కర్ణునికి రాజ్యమిస్తారని చెప్పటమే ఉన్నది గాని ద్రౌపదీ ప్రసక్తి లేనే లేదు. కాని కుంభకోణ ప్రతిలో మాత్రం **"షష్ఠేత్వాం చతథాకాలే ద్రౌపద్యుపగమిష్యతి"** అని ద్రౌపదీ ప్రసక్తి తెచ్చినట్లు ఉన్నది.


మీలో ఆత్మవిశ్వాసం ఉన్నట్లయితే మీ సంకల్పం, మాట, కర్మలలో నిజాయితీ ఉంటుంది

ఇక ఆంధ్రమహాభారతం కూడా ఈ కుంభకోణ ప్రతిని అనుసరించే తెనిగించబడినట్లు స్పష్టం. ఆంధ్ర మహాభారతం ఏం చెబుతున్నది?-

**కం.పాంచాల రాజపుత్రియు సంచితమున నిన్ను బొంతు నాఱవ వరుసన్ సంచిత పుణ్యుడవీవొక యించుకయును వేఱుసేయకే తెమ్మిలన్॥**

తా॥ ద్రౌపది నిన్ను ఆరవవరుసలో సేవిస్తుంది గనుక ఇక ఏమీ ఆలోచించకుండా పాండవ పక్షానికి వచ్చేసెయ్-అని.

ఆంధ్రమహాభారతంలోని ఈ పద్యాన్ని బట్టే తిరుపతి వేంకట కవులు తమ "పాండవోద్యోగ విజయాలు" అనే నాటకంలో **"నిన్నాసతి పెండ్లియాడగలదాఱవ భర్తగ సూత నందనా"** అని శ్రీకృష్ణుడు ద్రౌపదిని కర్ణునికిచ్చి పెండ్లి చేయటానికి సిద్ధంగా ఉన్నట్లు వ్రాయటంతో ఆంధ్రదేశంలో ఇది బహుళ ప్రచారంలో ఉన్నది. ఇక సినిమాలు, టి.వి. సీరియల్స్ సరేసరి. ఎవరి బుద్ధికి తోచినట్లు వారు తీస్తున్నారు.

సంస్కృత (మూల) భారతం కుంభకోణ ప్రతిలో ఉన్న ఈ ద్రౌపదీ ప్రసక్తిని అంగీకరిస్తూ దీని వెనుక గల అంతర్యాన్ని పరిశీలిద్దాం, విశ్లేషణ చేద్దాం.

I) "ద్రౌపదికి కర్ణునిపై కోరిక ఉన్నది, అందుకే శ్రీకృష్ణుడు అలా మాట్లాడి ఉంటాడు" అనేవారికి ద్రౌపది వ్యక్తిత్వం ఎట్టిదో, పాతివ్రత్యం ఎట్టిదో, భావాలెట్టివో తెలుపుదాం.

1. స్వయంవర సమయంలో మత్స్యయంత్రాన్ని ఛేదించటానికి ప్రయత్నించబోయిన కర్ణుని చూచి, "నేను సూతపుత్రుని వరించను" అన్న ద్రౌపదికి కర్ణునిపై కోరికా?

2. అరణ్యవాసం చేస్తున్న తమను పలకరించటానికి వచ్చిన శ్రీకృష్ణునితో ద్రౌపది, ద్యూతసభలో తాను పొందిన పరాభవాన్ని గురించి చెబుతూ,

ఆ. కర్ణునగవు లోక గర్హితుండగు దుస్స
సేను చెయిదికంటె శిఖియపోలె
నదరి నా మనంబు నతి దారుణక్రియ
నేర్చుచున్నయది మహీధరుండ.

**"లోకం చేత గర్హించబడుతున్న దురాత్ముడైన దుశ్శాసనుడు చేసిన దానికన్నా కర్ణుడు నవ్విన నవ్వు అగ్ని శిఖలాగా అతి దారుణంగా నా మనస్సును దహించివేస్తున్నది"** అన్న ద్రౌపదికి కర్ణునిపై కోరిక ఉన్నదా?

3. దుశ్శాసనుడు తనను జుట్టుపట్టి సభకు ఈడ్చుకొని వస్తుంటే పకపక నవ్వినవాడు; ద్రౌపదిని 'బంధకి' (వేశ్య) అని దూషించినవాడు; వివస్త్రను చేయమని దుశ్శాసనుని ఆదేశించినవాడు; "ద్రౌపదీ! నీవు కౌరవులదాసివి, అందువల్ల దుర్యోధన మందిరంలో ప్రవేశించి దుర్యోధనుని భార్య పాదాలొత్తుమ"ని ఎగతాళి చేసినవాడు; "ద్రౌపదీ! నీకు ఐదుగురు భర్తలున్నా ఎందుకూ కొరగారు, జూదంలో ఆలినొడ్డి ఓటుపడని ఆరవవానిని భర్తగా ఎందుకో" అని వ్యంగ్యబాణాలు వదలిన కర్ణునిపై ద్రౌపదికి కోరికా?

4. అజ్ఞాతవాస కాలంలో విరాట మహారాజు భార్య సుధేష్ణ కోరికపై మధిరకోసం కీచకుని గృహానికి పోవలసి వచ్చినప్పుడు, సూర్యభగవానునివైపు చూస్తూ **"నేను నా పతులను దప్ప అన్యుని నా మనస్సునందు తలచని దానినైతే నా పాతివ్రత్య ధర్మమే నన్ను ఈ కీచకుని బారినుండి రక్షించుగాక!"** అని ప్రతినగొనిపోగా; సూర్యునిచే నియమింపబడిన ఒక అజ్ఞాత రాక్షసుడు ద్రౌపదిని కీచకుని బారినుండి రక్షించాడు. అట్టి పతివ్రతాశిరోమణికి కర్ణునిపై కోరిక ఉన్నదా?

II) ఇట్టి ద్రౌపదిని గురించి కర్ణునితో మాట్లాడిన శ్రీకృష్ణుడు ఎట్టి భావాలు గలవాడు?

1. అరణ్యవాసకాలంలో ద్రౌపది తన పరాభవాన్ని గురించి చెప్పగా, ఆమెను ఓదారుస్తూ-

**శ్లో॥దుర్యోధనస్య కర్ణస్య శకునేశ్చ దురాత్మనః॥**
**దుశ్శాసన చతుర్థానాం భూమి: పాస్యతిశోణితం॥**
**(వన ప.12అ.5శ్లో)**

తా॥ "దురాత్ములైన దుర్యోధన, కర్ణ, శకుని, దుశ్శాసన దుష్టచతుష్టయం యొక్క రక్తంతో ఈ భూమి త్వరలోనే తడిసిపోతుంది" అని పలికి, "ద్రౌపదీ! దుఃఖించకు, ఆకాశం బ్రద్దలైనా, భూమి కంపించినా, సముద్రాలు ఇంకిపోయినా నా మాటలు వ్యర్థం కావు" అని శపథం చేసిన శ్రీకృష్ణుడు ద్రౌపదికి కర్ణునిపై కోరిక ఉన్నదని గ్రహించినవాడా?

2. సంజయరాయబారం ముగిసి, "కృష్ణా! నేనిక వెళుతున్నాను, నీ సందేశం ఏమిటో చెప్పు" అని సంజయుడనగా, సంజయా! ఆనాడు ద్యూత సభలో దుష్టదుశ్శాసనుడు వస్త్రాపహరణం చేయబోగా, "కృష్ణా! గోవిందా! వాసుదేవా! నన్ను రక్షించు" అని ద్రౌపది నన్ను తలచుకొని ఆక్రోశించింది. నేను అందుకు ఆమెకు ఋణపడి పోయాను. ఆనాటి అక్షయ వస్త్ర ప్రదానంతో ఆ ఋణం తీరిపోలేదు. కౌరవ సర్వసంహారంతో గాని ఆ ఋణం తీరదు-అని తన హృదయంలోని ఆక్రోశాన్ని వెల్లడించిన శ్రీకృష్ణుడు ద్రౌపదిని నీచంగా భావిస్తాడా? దిగజారి మాట్లాడుతాడా?

3. రాయబార సమయంలో తన మాటలు పెడచెవిన బెట్టి, తనను బంధించవచ్చిన దుష్టచతుష్టయం నిస్తేజస్సులై,

నిశ్చేష్టులై, తబ్బిబ్బై, తమ దుర్మార్గపు యత్నాలేవీ నెరవేరవని గ్రహించటానికి, తన సర్వేశ్వరత్వాన్ని చాటటానికి విశ్వ రూపాన్ని ప్రదర్శించి సభను ఆశ్చర్యచకితులను గావించిన శ్రీకృష్ణుడు దిగజారిపోయి మాట్లాడేవాడా?

4. అదే సందర్భంలో పుట్టు గ్రుడ్డియైన ధృతరాష్ట్రునికి దివ్యదృష్టిని ప్రసాదించిన భగవానుడు ద్రౌపదిని గురించి కర్ణుని వద్ద దిగజారి మాట్లాడేవాడా?

III) ఇట్టి శ్రీకృష్ణుడు అట్టి ద్రౌపదిని గురించి ఏ కర్ణునితో అన్నాడో- ఆ కర్ణుడెట్టివాడు?

1. నాడు ద్రౌపదిని జుట్టు పట్టుకొని సభకు ఈడ్చుకొని వచ్చి, 'దాసి-దాసి'యని పరిహసించిన దుశ్శాసనుని ఘోర కృత్యానికి, పకపకనవ్వి తన లేకితనాన్ని చాటుకున్నవాడు కర్ణుడు.

2. స్త్రీకి దైవవిహితుడైన భర్త ఒక్కడే ఉండాలి. ఈమెకు ఐదుగురు భర్తలు. కనుక బంధకి అని ఒక సామ్రాజ్య పట్ట మహిషి, కులకాంత ఐన ద్రౌపదిని నోటికి వచ్చినట్లు ప్రేలిన వాడు.

3. ద్రౌపది రజస్వల, ఏకవస్త్ర. అట్టి ఈమెను సభకు తెచ్చుట అన్యాయమని చెప్పిన దుర్యోధన సోదరుడు వికర్ణుని దూషించి, "ఈమె ఏకవస్త్రయే గాదు, వివస్త్రను చేసినా తప్పులేదని త్రాగుబోతు మాటలు మాట్లాడినవాడు కర్ణుడు.

4. పాండవులను ద్రౌపదిని శకుని ధర్మబద్ధంగా గెల్చుకున్నాడు. కనుక దుశ్శాసనా! నీవు ఈ పాండవుల యొక్క ద్రౌపది యొక్క వస్త్రాలను హరించు" అని ద్రౌపదీ వస్త్రాపహరణ మనే ఘోరమైన పైశాచిక కృత్యానికి మూలకారణమైన వాడు కర్ణుడు.

5. దుశ్శాసనుడు ద్రౌపది కట్టిన వస్త్రాన్ని లాగుతుండగా, అనంత వస్త్రావిర్భావంతో సదస్యులంతా ఆశ్చర్యంలో మునిగిపోయి ద్రౌపదీ పాతివ్రత్య మహాత్మ్యాన్ని వేనోళ్ళ ప్రశంసిస్తుండగా, ఈ కర్ణుడు "దుశ్శాసనా! ఈ ద్రౌపది మీ దాసి. కనుక ఈమెను మీ ఇంటికి తీసుకుపో!" అని వదరిన అసందర్భ ప్రలాపి. ఎవరేమనుకుంటే నాకేం? అని త్రాదుబారి కూర్చున్న వదరుబోతు.

6. 'నేను దాసినా? చెప్పండి' అని ద్రౌపది సభాసదులను ప్రశ్నించగా, "అన్యం వృణీష్వపతి మాశుభావిని యస్మాత్ దాస్యం న లభసిదేవనేన" ద్రౌపదీ! జూదంలో ఆలినొడ్డి ఓటు పడని అరవవానిని వివాహం చేసుకో" అని ఎకసక్కెములాడుతూ దుర్యోధనుని మెప్పుకు చూచి కన్నుగీటిన పరమనీచుడు-దుష్టుడు కర్ణుడు.

ఇట్టి కర్ణునితో సర్వేశ్వరుడు, మహామహిమాన్వితుడు ఐన శ్రీకృష్ణుడు పరమ పతివ్రతాశిరోమణియైన ద్రౌపదిని గూర్చి ఈ మాట ఎందుకు అనవలసి వచ్చిందో, దానికి కర్ణుడు ఏమని సమాధానం ఇచ్చాడో, వారిరువురి మధ్య ఏకాంతంలో జరిగిన సంభాషణ ఏమిటో ముందుగా తెలుసుకొని ఆ పైన విశ్లేషణ చేద్దాం.

**శ్రీకృష్ణ-కర్ణ సంభాషణ:** (ఉద్యోగపర్వం 140-141అ)

హస్తినాపుర పొలిమేరలో శ్రీకృష్ణుడు కర్ణుని తన రథంపైకి ఎక్కించుకొని-

**శ్లో॥ కానీనశ్చ సహోఢశ్చ కన్యాయాం యశ్చజాయతే।**
**వోఢారం పితరం తస్యప్రాహుః శాస్త్రవిదోజనాః॥**
**(ఉద్యో ప.140 అ. 8శ్లో)**

**తా॥** కర్ణా కన్యాగర్భంలో జన్మించిన పుత్రుడు కానీనుడని, సహోఢుడని రెండు విధాలుగా పిలువబడతాడు. (వివాహానికి పూర్వమే పుడితే కానీనుడని, వివాహానంతరం పుడితే సహోఢుడని) ఆమె ఆ తరువాత ఎవరిని వివాహమాడితే అతడే ఆ బిడ్డకు తండ్రి అని శాస్త్రవిదులు చెబుతారు.

నీవు కుంతీదేవికి కన్యావస్థలో కానీనుడుగా జన్మించావు. కనుక ధర్మశాస్త్రరీత్యా నీవు పాండురాజు ప్రథమపుత్రుడవు. కనుక నీవు వచ్చి ధర్మశాస్త్రానుసారం రాజువికా! నీవు వస్తే పితృపక్షంలో పాండవులు, మాతృపక్షంలో వృష్ణివంశీయులు నీతో ఉంటారు. పాండవులు, ఉపపాండవులు, అభిమన్యుడు నీ పాదాలపై వ్రాలుతారు. వైభవోపేతంగా నీకు సామ్రాజ్య పట్టాభిషేకం జరుగుతుంది. అంతేకాదు-

"షష్ఠేత్వాంచ తథాకాలే ద్రౌపద్యుపగమిష్యతి"-పాండవులైదుగురను ఐదుకాలాలలో సేవించినట్లు ద్రౌపది నిన్ను ఆరవ కాలంలో సేవిస్తుంది. (కుంభకోణప్రతి)- అని.

శ్రీకృష్ణుడు కర్ణునితో చెప్పిన విషయాలు రెండు.

1. నీవు అటువస్తే పాండవులు నీకు రాజ్యమిస్తారు.
2. పాండవులను సేవించినట్లే ద్రౌపది ఆరవకాలంలో నిన్ను సేవిస్తుంది-అని దీనిపై కర్ణుడేమని సమాధానం ఇచ్చాడో చూద్దాం!

కేశవా! సౌహార్దంతో, మైత్రీ భావంతో నా మేలుకోరి నీవు చెప్పిన విషయం నిస్సందేహంగా సత్యమే. నేను ధర్మశాస్త్ర రీత్యా పాండురాజుపుత్రుడనే ఈ విషయం నాకు తెలుసు. కుంతీదేవి కన్యావస్థలో సూర్యుని వల్ల నన్ను కని, ఆ సూర్యుని ఆదేశంతోనే నన్ను నదిలో విడిచిపెట్టింది. నేను సూతకులాన్ని

చేరి రాధ, అతిరథులచేత పోషింపబడి వారినే నా తల్లిదండ్రులుగా భావిస్తున్నాను. సూతకులంలోని కన్యలను వివాహమాడి వారివల్ల అనేకమంది పుత్రులను కన్నాను. వారివల్ల అనేక మంది పౌత్రులున్నారు. దుర్యోధనుని ఆశ్రయించి 13 సంవత్సరములు రాజ్యభోగాలనుభవించాను. నన్ను చూసుకొనే దుర్యోధనుడు పాండవులపై కత్తి గట్టాడు. నన్ను అర్జునునికి ప్రతియోధునిగా భావించుకుంటున్నాడు. నేను అర్జునునితో యుద్ధం చేయకపోతే మా ఇరువురికీ అపకీర్తియే కృష్ణా! నీవు నా మేలు కోరి చెప్పిన దానిలో ఏ సందేహమూ లేదు. పాండవులు నీ అధీనులు. నీవు చెప్పిన దానిని తప్పక చేస్తారు. ఐతే నా విన్నపం ఒక్కటే మన ఇద్దరి మధ్య జరిగిన ఈ సంభాషణను రహస్యంగానే ఉంచు. ఎందుకంటే నేను కుంతీపుత్రుడనని తెలిస్తే ధర్మాత్ముడైన ధర్మరాజు రాజ్యాన్ని స్వీకరించడు. నాకే ఇస్తాడు. (ఉద్యో. 141 అ.1-11శ్లో)

**శ్లో॥ ప్రాప్యచాపి మహత్ రాజ్యం తదహం మధుసూదన।**
**స్ఫీతం దుర్యోధనాయైవ సంప్రదద్యాం అరిందమ॥**
**(141 అ. 12శ్లో)**

**శ్లో॥ సయేవరాజా ధర్మాత్మా శాశ్వతోఽస్తు యుధిష్ఠిరః**
**నేతాయస్యహృషీకేశో యోద్ధాయస్య ధనంజయః॥**
**(141 అ. 13శ్లో)**

**తా॥ మధుసూదనా! సమృద్ధమైన ఈ రాజ్యం నాకు ప్రాప్తిస్తే నేను దీనిని దుర్యోధనునికి ఇవ్వాల్సిందే. దుర్యోధనునకు రాజ్యప్రాప్తి లోకానర్థకరం.** (అధర్మిష్టస్య దుర్యోధన స్వరాజ్యం లోక నాశకరమితి భావః - నీలకంఠాచార్యటీక) **ఎవరికి హృషీకేశుడు నాయకుడో, యోధుడు అర్జునుడో అట్టి ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడే శాశ్వతముగా రాజ్యపాలకుడై యుండుగాక! కృష్ణా! ఈ సమస్తభూమండలం, అలాగే కౌరవరాజ్యం ధర్మరాజు పాలనలోనే ఉండాలి అన్నాడు.**

- ఇంతవరకు చెప్పినదంతా "నీవు పాండవపక్షం వైపు వస్తే నీకే రాజ్యపట్టాభిషేకం జరుగుతుంది" అని శ్రీకృష్ణుడు చెప్పిన మొదటి అంశంపైనే. ఇలా 'నేనటురాలేను' అని చెప్పిన కర్ణుడు వెంటనే ఇలా అంటున్నాడు, ఏమని?

**శ్లో॥ యదబ్రువ మహంకృష్ణ! కటుకానిస్మ పాండవాన్।**
**ప్రియార్థం ధార్తరాష్ట్రస్య తేనవప్యేహ్యా కర్మణా॥**
**(ఉద్యో 141 అ. 45శ్లో)**

**శ్లో॥ యదాద్రక్ష్యసి మాంకృష్ణ! నిహితం సవ్యసాచినా।**
**పునశ్చితి స్తదా చాస్య యజ్ఞస్యాథ భవిష్యతి॥**
**(ఉద్యో 1411 అ46శ్లో)**

తా॥**కృష్ణా!** నేను ధార్తరాష్ట్రుల ప్రీతికోసం పాండవులను **గూర్చి ఏ దుర్భాషలాడితినో వాటికి నేను ఎంతగానో పశ్చాత్తాపం చెందుతున్నాను (45) అర్జునుని చేతిలో వధించబడిన నన్ను నీవు ఎప్పుడు చూస్తావో అప్పుడు ఈ రణయజ్ఞంలో 'పునిశ్చితి' కర్మ** (యజ్ఞ పరిసమాప్తిలో జరిగే చయనం) పూర్తయినట్లు (46) - అన్నాడు కర్ణుడు. ఇదీ శ్రీకృష్ణకర్ణ సంభాషణ.

వీరిద్దరి సంభాషణను విశ్లేషణ చేద్దాం.

'నీవటువస్తే పాండవులు నీకు రాజ్యమిస్తార'ని చెప్పిన శ్రీకృష్ణునికి పెంచిన తల్లిదండ్రులను, తననే నమ్ముకున్న దుర్యోధనుని వదలి రాలేనని చెప్పాడు కర్ణుడు.

మరి 'ద్రౌపది నిన్ను ఆరవకాలంలో సేవిస్తుంది' అని చెప్పిన శ్రీకృష్ణునికి కర్ణుడే మీ సమాధానం చెప్పలేదేమి? ఇది ఒకటి-

"నేను దుర్యోధనాదుల ప్రీతికొరకు ఆనాడు పాండవులను అనేక దుర్భాషలాడినందుకు పరితపిస్తున్నాను. అర్జునుని చేతిలో నేను హతుడనైనప్పుడు ఈ రణయజ్ఞం సమాప్తమైనట్లు" అన్నాడు కర్ణుడు. "పాండవులను, ముఖ్యంగా ద్రౌపదిని ఆనాడు అలా నోటికి వచ్చినట్లు దుర్భాషలాడితివే. ఇది నీకు న్యాయంగా ఉందా? అని శ్రీకృష్ణుడేమైనా అడిగాడా కర్ణుడిని? అడగలేదు. ఇది రెండు అంటే అడిగినదానికి సమాధానం లేదు. అడగని విషయాన్నెత్తుకుని సమాధానం చెప్పాడు కర్ణుడు. ఇది అసందర్భంగా ఉన్నట్లు కనిపిస్తున్నది గదా! ఈ మాత్రం తెలియని వాడా వ్యాసుడు? కాదు, కానేకాదు. మరి ఏమిటీ మెలిక? అసలు విషయం ఏమంటే-

*"ద్రౌపది నిన్ను ఆరవకాలంలో సేవిస్తుంది" అని చెప్పిన **శ్రీకృష్ణుని మాటకు సమాధానంగానే" ఆనాడు ధార్తరాష్ట్రుల ప్రీతికై పాండవులను ఎంతగానో దుర్భాషలాడినందుకు పరితపిస్తున్నాను" అని కర్ణుడు సమాధానం చెప్పటం జరిగింది.*** అదేమిటి? ఈ రెండు విషయాలకు పొంతన ఎక్కడుంది? అంటారా! ఒక్కసారి కర్ణునిలోనికి పరకాయప్రవేశం చేద్దాం.

ఎప్పుడైతే శ్రీకృష్ణుడు 'ద్రౌపది నిన్ను ఆరవవానిగా భావిస్తుంది' అని అన్నాడో, వెంటనే కర్ణునికి ఆనాటి ద్యూత సభలో తాను చేసిన పైశాచిక తాండవం గుర్తుకొచ్చింది. ఆనాడు ద్రౌపదిని 'బంధకి' అన్నాడు. వివస్త్రను చేయమన్నాడు. మాకు దాసులైన పాండవులు నిన్ను సంతోషపెట్టలేరు గనుక, జూదంలో ఆలినొడ్డి ఓటుపడని ఆరవవానిని వివాహమాడమని ఎకసక్కెములాడాడు. ఇప్పుడు శ్రీకృష్ణుని మాటతో అవన్నీ గుర్తుకు వచ్చినవి. 'ఆరవవానిని వివాహమాడమని' అసభ్యంగా తాను మాట్లాడినందుకే, దుర్మార్గంగా రెచ్చి పోయినందుకే

తనను ఎత్తి పొడవటానికి, తన తప్పును తెలియజేసి బుద్ధి చెప్పటానికే ఇలా ద్రౌపది నిన్ను ఆరవవానిగా భావిస్తుందని శ్రీకృష్ణుడు ఎంతో తెలివిగా ఈ ప్రసక్తిని తెచ్చాడని గ్రహించిన కర్ణుడు, ఆనాటి తన చర్యలకు, తాను పలికిన దుర్భాషలకు పశ్చాత్తాపాన్ని ప్రకటించాడు. అంతేకాదు ఆనాటి తన దుష్టత్వానికి, దుర్మార్గానికి క్రుద్ధుడై తనను వధించటానికి ప్రతిజ్ఞ చేసిన అర్జునునిచే కలగబోయే తన చావును కూడా తెలియజేశాడు.

అలా కానిచో కౌరవపక్షాన్ని విడిచిరావటం తనకు అధర్మమని, అపకీర్తియని చెప్పిన కర్ణుడు, "ద్రౌపది గురించి నీవిలా అనటం నీకు తగునా కృష్ణా! ఇది ఎంతటి అధర్మం? ఎంతటి అపకీర్తి? నీవంటి మహాత్ముడు ఇలా మాట్లాడవచ్చునా?" అని అనాలి గదా! అన్నాడా? లేదే. అలా అనలేదు. అంటే శ్రీకృష్ణుడు తన దోషాలను ఎత్తి చూపటానికి తన దుర్భాషలకు తనను సిగ్గుపడేటట్లు చేయటానికి, తద్వారా ద్రౌపదీదేవి యొక్క పాతివ్రత్య మహాత్మ్యాన్ని తన నోటిమీదుగానే ప్రపంచానికి వెల్లడి చేయించటానికి, తాను ఆనాడు నోటికి వచ్చినట్లు వదరిన ప్రేలాపనలకు మందలించటానికే ఈ విధంగా ద్రౌపదీ ప్రసక్తిని తెచ్చినట్లు గ్రహించాడు కర్ణుడు. అందుకే ద్రౌపదీదేవి పేరు ఎత్తటానికి కూడా తనకు అర్హత లేదని గ్రహించి, ద్రౌపదిని అన్న మాటలన్నీ పాండవులకు మర్మభేదకములు గనుక, పాండవులను అలా దుర్భాషలాడినందుకు పశ్చాత్తాపం చెందుతున్నానని, దానికి ఫలితంగా అర్జునుడు చేసిన ప్రతిజ్ఞ ప్రకారం అతడి చేతిలో వధింపబడతానని తెలియజేశాడు. కర్ణుడు ఇంతగా పశ్చాత్తాపం చెందటానికి, తన దోషాలను అంగీకరించటానికి కారణం శ్రీకృష్ణుడు తెచ్చిన ద్రౌపదీ ప్రసక్తియేననుట స్పష్టం.

ద్యూతసభలో ద్రౌపదీదేవిని బంధకియని, దాసియని, నీవు ఆరవ భర్తను చేపట్టమని కర్ణుడు పలికిన పలుకులు శ్రీకృష్ణుని హృదయంలో ములుకులై గ్రుచ్చుకొని బాధిస్తున్నాయి. ఆ బాధ తీరటానికి, కర్ణుని తాట తీయటానికి, కొర్రు కాల్చి వాత పెట్టడానికి సమయం ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తున్నాడు శ్రీకృష్ణుడు. అతడి నోటిమీదుగానే అతడి తప్పును ఎత్తి చూపటానికి ఇక ఇంతకంటే మంచి సమయం దొరకదని నిశ్చయించుకున్న భగవానుడు, అతడు సభలో ద్రౌపదిని అన్నమాట ఎత్తిపొడవాలని 'ద్రౌపది నిన్ను ఆరవవానిగా భావిస్తుంది' అని అన్నాడే గాని ద్రౌపది యొక్క పాతివ్రత్య మహిమ తెలియని వాడు కాదు; కర్ణుని యొక్క ద్వంద్వ మనస్తత్వం (దుష్టులతో కూడియున్నప్పుడు పరమదుష్టుడుగా వ్యవహరించటం; పెద్దలు, మహాత్ములతో ఏకాంతంలో ఉన్నప్పుడు మంచివాడుగా వ్యవహరించటం) తెలియనివాడూ కాదు; కర్ణుని ఏదో విధంగా తమ వైపుకు రప్పించకపోతే పాండవులకు విజయం లభించదేమోననే సందేహం ఏ కోశానా ఉన్నవాడూ కాదు. దీనిని అర్థం చేసుకోలేనివారే పై సందేహాలను వ్యక్తం చేస్తుంటారు, విమర్శిస్తూ ఉంటారు.

మహాభారత యుద్ధం జరిగే నాటికి శ్రీకృష్ణుని వయస్సు 88 సంవత్సరములు. కర్ణుని వయస్సు సుమారు 100 సంవత్సరాలు. ద్రౌపది వయస్సు సుమారు 70 సంవత్సరాలు. "ఆ 100 సంవత్సరాల కర్ణునికి 70 సంవత్సరాల ద్రౌపదినిచ్చి 6వ పెళ్ళి చేయాలనే నికృష్టపు ఆలోచన శ్రీకృష్ణునికి ఉన్నదనుకొనే దౌర్భాగ్యం మనకొద్దు" అని నిశ్చయించుకొని, మహాత్ముల దూషణ, పతివ్రతామ తల్లుల దూషణ వల్ల కర్ణునికి పట్టిన గతే పడుతుందని గ్రహించి సదాలోచనలతో, సత్కర్మలతో, సద్భావనలతో జీవితాలను ధన్యము చేసుకొందుము గాక!

-ఐతే మరెందుకు శ్రీకృష్ణుడు కర్ణుని పాండవపక్షం వైపుకు రప్పించటానికి ఇంతగా ప్రయత్నం చేశాడు? ఎందుకు కర్ణునికింత ప్రాధాన్యత నిచ్చి మాట్లాడాడు. 'పందుపాట'గాథ సత్యమా? కల్పితమా?

(వచ్చే సంచికలో....)

## చికిత్సమాలిక




### కీళ్ళనొప్పులు బాగా తగ్గినవి

పూజ్యశ్రీ గురుదేవుల పాదపద్మములకు,

నేను చాలాకాలం నుండి కీళ్ళనొప్పులతో బాధపడుతున్నాను. నేను యోగ క్లాసులకు వెళ్ళిన తరువాత నా యొక్క ఆరోగ్యం బాగుంది. ఇపుడు క్రమంతప్పకుండా యోగ-ధ్యానం చేస్తున్నాను. నాకు మీరిచ్చిన మందులు బాగా పనిచేసినవి. కీళ్ళనొప్పులు బాగా తగ్గినవి. దయచేసి నాకు అవే మందులు తిరిగి పంపగలరని కోరుతున్నాను.

**ఎమ్.సూర్యారావు,** రణస్థలం

 ఒక వ్యక్తికి కనులు లేనంతమాత్రాన అతడు అంధకారములో ఉన్నట్లు కాదు



# మహాభారతం

## ద్రౌపది 30

రచన
మహాభారత పరిశోధకులు,
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag.)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్:08647-254716

(గత సంచిక తరువాయి)

### 15) కర్ణుని పాండవపక్షానికి రప్పించుటకు శ్రీకృష్ణుడెందుకు ప్రయత్నించాడు?

సందేహ: కర్ణుని పాండవపక్షంవైపు రప్పించటానికి శ్రీకృష్ణుడు రాజ్యం ఆశచూపి, ద్రౌపదిని ఆశచూపి ఇంతగా ప్రయత్నం చేయటం ఎందుకు? కర్ణుని జయించటం అసాధ్యమనా? కర్ణుడు దుర్యోధన పక్షంలో ఉన్నంతవరకు పాండవులకు విజయం లభించదనా? భీష్మద్రోణాదులకివ్వని ఇంతటి ప్రాధాన్యత కర్ణునికి ఎందుకిచ్చినట్లు?

సమాధానం: కర్ణుని పరాక్రమం ఏపాటిదో, అర్జునుని పరాక్రమం ఎట్టిదో తెలియనివాడు కాదు శ్రీకృష్ణుడు.

1) ద్రౌపదీ స్వయంవర సమయంలో అర్జునునితో పోరాడిన కర్ణుడు అతడి ధాటికి నిలువలేక 'బ్రాహ్మణతేజంబ జేయంబ'ని పల్కి వెనుదిరిగిపోయాడు. 2) విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత గురుదక్షిణగా ద్రుపదుని బంధించి తెచ్చి ద్రోణాచార్యునికి సమర్పించాలని దుర్యోధనాదులతో కలిసి పాంచాలంపై దండెత్తిన కర్ణుడు, ద్రుపదునితో తీవ్రంగా పోరాటం చేశాడు. అయితే ద్రుపదుడు తీవ్రమైన బాణాలతో కర్ణుని అంగసంధులతో తాడనం చేయగా ఆ బాధకు ఓర్వలేక రణభూమి విడిచి పారిపోయాడు. ఇదిగో ఆ శ్లోకం

**శ్లో॥ పాంచాలశరభిన్నాంగో భయమాసాద్యవైవృషః।**
**కర్ణోంరధాదవప్లుత్య పలాయన పరోఽభవత్॥**
**(అది 137 అ.24 శ్లో)**

**తా॥** పాంచాలరాజు ద్రుపదుని బాణాలవల్ల కర్ణుని అంగాంగములు శిధిలం గావటంతో భయంతో రథం నుండి దూకి పారిపోయాడు.

అలా కర్ణుని పారద్రోలి, దుర్యోధనాదులను జయించిన ద్రుపదుని అర్జునుడు జయించి, బంధించి తెచ్చి ద్రోణాచార్యుని పాదాలపై పడవేశాడు.

3) ఘోషయాత్ర పేరుతో పాండవులను పరాభవించాలని వెళ్ళిన దుర్యోధనకర్ణులు, అక్కడ గంధర్వులతో యుద్ధం తటస్థించగా, సకల సైన్యాలతో గంధర్వులనెదిర్చి పోరాడారు. అయితే గంధర్వుల పరాక్రమానికి తాళలేక విరథుడైన కర్ణుడు, వికర్ణుని రథమెక్కి పారిపోయాడు. ఆ తరువాత గంధర్వులు దుర్యోధనాదులను, స్త్రీలతో సహా బంధించి తీసుకొని పోతుండగా, భీమార్జునులిద్దరే వచ్చి గంధర్వులను జయించి, దుర్యోధనాదులను విడిపించటం జరిగింది.

4) నిన్న మొన్న జరిగిన ఉత్తరగోగ్రహణంలో అర్జును డొక్కడే భీమాదుల సాయం లేకుండా, సైన్యం లేకుండా, ఒకే ఒక్కరథంతో వచ్చి, ఉత్తరుడు సారథిగా, భీష్మద్రోణ కృపాశ్వత్థామలు, దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులతో గూడిన చతురంగబలాలను చీల్చి చెండాడి, అందరినీ జయించి, గోవులను మరలించుకుపోయాడు.

కనుక అర్జున పరాక్రమం ఎట్టిదో కర్ణుని పరాక్రమం ఎట్టిదో తెలియకపోలేదు శ్రీకృష్ణునకు. మరెందుకు కర్ణుని భేదించ ప్రయత్నించాడు?

కురుపాండవసమరం జరిగితే సమస్త క్షత్రియ నాశనం సంభవిస్తుంది. అన్నదమ్ముల మధ్య పోరు జరుగుతుంటే శ్రీకృష్ణుడు చూస్తూ ఊరుకున్నాడనే అపవాదు రాకూడదు తనకు. అందుకే పాండవరాయబారిగా కురుసభకు విచ్చేశాడు. ఏ కార్యాన్నైనా సాధించాలంటే సామ, దాన, భేద, దండోపాయా

లను చతుర్విధ ఉపాయాలున్నాయి. ఈ నాలుగు ఉపాయాలను క్రమంగా ప్రయోగించి కార్యసాఫల్యత పొందాలి. అట్టివాడే విజ్ఞత గలవాడు. అందుకే శ్రీకృష్ణుడు వరుసగా ఈ ఉపాయాలను ప్రయోగించాడు.

**1) సామం:** కురుపాండవులు కలిసిమెలిసి ఉంటే ఎవ్వరూ మీ వైపు కన్నెత్తి చూడలేరు. కనుక అనుద్యూత సమయంలోని నియమం ప్రకారం వారి రాజ్యభాగం వారికిచ్చి అందరూ సుఖసంతోషాలతో ఉండేట్లు చూడమని ధృతరాష్ట్రునికి తెలియజేశాడు శ్రీకృష్ణుడు.

**2) దానం:** సంధికి ససేమిరా అంటున్న దుర్యోధనుడు, అతడిని కాదని నిర్ణయం తీసుకోలేనన్న ధృతరాష్ట్రుడు సంతృప్తి చెందుటకు రాజ్యంమొత్తం మీరే ఉంచుకోండి. పాండవుల పోషణభారం మీదే గనుక, ఐదుగురకు ఐదు ఊళ్ళిమ్మని కోరాడు శ్రీకృష్ణుడు.

**3) భేదం:** దానికీ అంగీకరించక, సూదిమొనమోపినంత భూమిని కూడా ఇచ్చేదిలేదు, చేతనైతే యుద్ధం చేసి తీసుకోమని దుర్యోధనుడు కుండ బ్రద్దలు కొట్టటంతో చేసేది లేక తిరిగి వెళ్తూ శ్రీకృష్ణుడు-కర్ణుని చూచుకొని దుర్యోధనుడు ఇంతగా రెచ్చిపోతున్నాడో ఆ కర్ణుని భేదించటం కోసం, ఏకాంతంగా రాజ్యం ఆశజూపి రమ్మన్నాడు. ఇదే సమయంలోనే ద్యూత సభలో దుర్భాషలాడిన కర్ణునికి బుద్ధి చెప్పటానికి ద్రౌపదీ ప్రసక్తిని తెచ్చాడు. అయితే ఈ భేదోపాయం కూడా విఫలం కావటంతో యుద్ధప్రకటన చేశాడు. మూడు ఉపాయాలు విఫలం కావటంతో దండోపాయమే (యుద్ధమే) శరణ్యమైనది.

కనుక ఎలాగైనా యుద్ధాన్ని నివారించటానికి చేసే ప్రయత్నాలలో భాగంగానే కర్ణుని పాండవపక్షం వైపుకు ఆహ్వానించాడే గాని, కర్ణునికి భయపడీకాదు, పాండవులకు విజయం లభించదనీ కాదు.

-ఇక చివరిగా మహాభారతంలో లేని గాధలతో-శ్లోకాలతో ద్రౌపదిపై దుష్ప్రచారం జరిగిన విషయ వివరణతో ఈ ద్రౌపదీ ప్రకరణాన్ని ముగిద్దాం.

## 16) ద్రౌపది తనకు కర్ణునిపై అభిరుచి గలదని చెప్పినదా?

నేను ఐదవతరగతి చదువుకొనేటప్పుడు తెలుగు నాన్‌డీటైల్ క్రింద 'నీతిశాస్త్రం' అనే ఒక చిన్న పాకెట్ సైజ్ పుస్తకం ఉన్నది. దానిలో అన్నీ శ్లోకాలే. ఆ శ్లోకాలన్నీ నేను కంఠతా నేర్చుకున్నాను. నేను పన్నెండవ తరగతికి వచ్చినపుడు ఆ శ్లోకాల్లో ఒక శ్లోకం తప్పుగా తోచి దానిపై కొంత పరిశోధన చేశాను. ఆ శ్లోకం ఇది-

**ద్రౌపద్యువాచ:**
**పంచమే పతయస్సంతి మహ్యాం షష్ఠోపిరోచతే,**
**పురుషాణామభావేన సర్వానార్య పతివ్రతాః ॥**

**తా॥** నాకు ఐదుగురు భర్తలున్నప్పటికీ ఆరవవానిపై కోరిక గలదు. పురుషులు దొరకకనే స్త్రీలందరూ పతివ్రతలుగా ఉంటున్నారు-అని దీని భావం.

నేను సంస్కృత మహాభారతాన్ని పరిశోధించే సమయంలో ఈ శ్లోకం కొరకు చూస్తే లక్షశ్లోకాల గ్రంథంలో ఎక్కడా ఈ శ్లోకం లేదు. ఈ శ్లోక భావం గలిగిన శ్లోకం కూడా లేదు. తెలుగుభారతంలో కూడా ఇలాంటి భావం గల పద్యం గాని, వచనం గాని లేదు.

ఆ నీతిశాస్త్రంలో యుధిష్ఠిర ఉవాచ, భీమ ఉవాచ, అర్జున ఉవాచ, నకుల ఉవాచ, సహదేవ ఉవాచ అని ఉన్న శ్లోకాలు గ్రంథంలో ఉన్నాయి గాని ఇది మాత్రం లేదు.

మహాభారతంలో ద్రౌపదీదేవి ఎలాంటిదో, ఎంతటి ధర్మ తత్త్వజ్ఞురాలో, ఎంతటి పతివ్రతో, ఎట్టి గుణశాలియో ఇంత వరకు చూశాం. అట్టి ద్రౌపదీదేవి నాకు ఐదుగురు పతులున్నను ఆరవవాని మీద కోరిక అంటుందా? ఆ ఆరవవాడు కర్ణుడా?

మత్స్యయంత్రాన్ని కొట్టటానికి వచ్చిన కర్ణుని చూచి 'నాహం వరయామి సూతం' నేను సూతపుత్రుని వరించను అని చెప్పిన ద్రౌపది ఆరవవానిపై కోరిక అని చెప్పిందా?

సత్యభామతో పాతివ్రత్యధర్మాలను గురించి చెబుతూ ద్రౌపది "దేవతలలో, మనుష్యులలో, గంధర్వులలో, ఎవ్వరిలోనైనా, ఎంతటి రూపవంతుడైనా పర పురుషుని నేను మనస్సులో తలచి ఎఱుగను" అని చెప్పిన ద్రౌపది నాకు ఆరవ వాని యందు అభిలాష ఉన్నదని అంటుందా?

సుధేష్ణ ఆజ్ఞతో కీచకుని గృహానికి వెళుతూ, ప్రమాదాన్ని ఊహించిన ద్రౌపది సూర్యభగవానుని చూస్తూ, "నా పతుల కన్న అన్యుని నేను ఎప్పుడూ భావించని దానినైతే ఆ 'సత్యమే' నన్ను ఈ కీచకుని బారినుండి కాపాడుగాక!" అని ప్రార్థించగా, ద్రౌపదీదేవి ప్రార్థన మేరకు ఒక అజ్ఞాత రక్షస్సును సూర్యుడు నియోగించి ద్రౌపదిని కాపాడటం జరిగింది. అట్టి ద్రౌపదికి ఆరవవానిపై అభిలాషయా?

ద్యూతసభలో తాను పొందిన పరాభవాన్ని శ్రీకృష్ణునితో

చెబుతూ ద్రౌపది, "ఆ కష్టసమయంలో ఉన్న నన్ను చూచి కర్ణుడు నవ్విన నవ్వుకు నాలో క్రోధాగ్ని రగులుతున్నది. దుశ్శాసనుని చర్యకన్న కర్ణుని నవ్వు నా మనస్సును శూలాలతో గ్రుచ్చినట్లున్నది" అన్న ద్రౌపదికి కర్ణునిపై అభిలాషయా? పాపం శమించుగాక!

"నాకైదుగురు భర్తలున్నప్పటికీ ఆరవవాని యందు అభిరుచి గలదు" అని అనటమే గాక లోకంలోని స్త్రీలందరు పురుషులు దొరకకనే పతివ్రతలుగా ఉంటున్నారు అని ద్రౌపది లాంటి మహాసాధ్వి అంటుందా? ఇంతకన్నా ఘోర మింకొకటి ఉంటుందా?

కనుక ఇది ద్రౌపదీ వాక్యం అనటం అత్యంత విరుద్ధమైనది. ద్రౌపదీదేవి వ్యక్తిత్వానికి, ఈ మాటకు పూర్తి వైరుధ్యం ఉంది. కాకపోతే ఐదుగురు పతులున్న ఎవరో జారిణి అన్నమాటైనా కావాలి. లేదా స్త్రీలపై తప్పుడు భావం గల ఏ కవియైనా 'ఎంతమంది పురుషులతో సంబంధం ఉన్నా స్త్రీలకు తృప్తి ఉండదు' అనే దురభిప్రాయంతో వ్రాసిన శ్లోకమైనా అయి ఉండాలి లేదా శ్లోకంలో ఐదుగురు భర్తలు-అని ఉండటం వల్ల ఐదుగురు భర్తలు గలది ద్రౌపదియే గనుక 'ద్రౌపద్యువాచ' అని ద్రౌపదీవాక్యంగా రచయిత భ్రాంతి చెంది ఉండాలి. అంతే తప్ప ఇది ద్రౌపదీ వాక్యము కాదు. ఇది మహాభారతంలో లేదు. సంస్కృతంలోనూ లేదు, తెలుగు భారతంలోనూ లేదు. ఉన్నదని ఎవ్వరూ చెప్పలేదు, చెప్పలేరు;

మహాభారతంలో లేని ఎన్నో కథలను ఎవరెవరో వారి బుద్ధికి తోచినట్లు కల్పించటం జరిగింది. ఇక సినిమా కవులు ఎన్నో గాథలను సృష్టించటం జరిగింది. అలా వచ్చిన కథలే- 1) ఒక బ్రాహ్మణునికి ఇచ్చిన మాట ప్రకారం వర్షాకాలంలో భవనం పడగొట్టించి కర్ణుడు కట్టెలను ఇచ్చాడట. 2) అభ్యంగన స్నానం చేస్తున్న కర్ణుణ్ణి ఎవరో యాచిస్తే కళ్ళు తెరవకుండానే కుంకుడుకాయ రసం వేసిన బంగారుగిన్నె దానమిచ్చాడట. 3) యుద్ధంలో పడిపోయిన తరువాత మారువేషంలో వచ్చిన శ్రీకృష్ణునికి బంగారు పన్ను ఇచ్చాడట. ఇలా కర్ణుణ్ణి గొప్ప దాతగా చూపించటానికి ఎన్నో కథలు కల్పించారు. ఇంకా కల్పిస్తూనే ఉంటారు. ఇంకా 4) శకునికి దుర్యోధనాదులపై కోపమట; తండ్రితోపాటు తామందరినీ చెరసాలలో బంధించాడట. ఇలా ఇంకా ఎన్నో వీటితోపాటుగా మరొక కల్పిత గాథ 'పందుపాట' – దీని విషయం ఏమిటో ఇపుడు చూద్దాం.

## 17) 'పందుపాట' వల్లనే ద్రౌపదికి కర్ణునిపై కోరియకని శ్రీకృష్ణుడు తెలుసుకున్నాడు. అందుకే కర్ణునితో ద్రౌపదీ ప్రసక్తిని తెచ్చాడు-విమర్శ

మహాభారతంలో (తెలుగులో గాని -సంస్కృతంలో గాని) లేని గాథ ఒకటి బహుళ ప్రచారంలో ఉన్నది. దీనికి కారణం కొద్ది మార్పులతో సినిమాలో చూపటం కూడా. ఆ కల్పిత కథ, దానిపై గల విమర్శ ఇదీ-

ద్రౌపదీ పాండవులు శ్రీకృష్ణునితో కలిసి వనవిహారం చేస్తున్నారు. అక్కడ ఒక చెట్టుకు ఒకే పండు కాసి ఉంటుంది. ఆరుయోజనముల దూరంలో వ్రేలాడుతున్న ఆ పండును అర్జునుడు గురిచూసి కొట్టాడు. అది చూచి శ్రీకృష్ణుడు, "అయ్యో అర్జునా! ఎంత పనిచేశావు? ఈ చెట్టున ప్రతిరోజూ ఒక పండు కాస్తుంది. అది ఒక ఋషికి ఆహారం. తెలియక నీవు దానిని బాణంతో కొట్టి క్రిందపడవేశావు. ఆ మహర్షి వచ్చి నిన్ను శపిస్తాడు" అన్నాడు. మరేం చేయాలి? అని అర్జునుడడుగగా, "మీరు ఆరుగురు మీ మనస్సులలో ఉన్న సత్యమైన ఉద్దేశాన్ని నాకు చెప్పండి. అపుడు ఈ పండు ఎప్పటిలాగా చెట్టుకు అంటుకుంటుంది-అన్నాడు. అపుడు పాండవులంతా తమ మనస్సులలో ఉన్న ఉద్దేశాలను చెప్పారట. పండు చెట్టుకు అతుక్కోలేదు. అప్పుడు ద్రౌపది ఇలా చెప్పిందట.

**శ్లో॥ పంచమే పతయస్సంతి మహ్యాం షష్ఠోపిరోచతే।**
**పురుషాణామభావేన సర్వానార్య పతివ్రతాః ॥**

**తా॥** నాకు ఐదుగురు భర్తలున్నప్పటికీ ఆరవవానిపై కోరిక గలదు. పురుషులు దొరకకనే స్త్రీలందరూ పతివ్రతలుగా ఉంటున్నారు-అని. అపుడు పండు చెట్టుకు అంటుకున్నది.

శ్రీకృష్ణునితో ద్రౌపది తనకు ఆరవవానిపై కోరిక గలదని చెప్పినందున ఆ ఆరవవాడు కర్ణుడేనని తెలుసుకొని శ్రీకృష్ణుడు కర్ణునితో, "ద్రౌపది నిన్ను ఆరవ వరుసలో సేవిస్తుంది" అని చెప్పాడట-ఇది విమర్శకుల కల్పనాచాతుర్యం.

**విమర్శకు సమాధానం:** అసలు ఈ శ్లోకం గాని, ఈ కథ గాని సంస్కృత మహాభారతంలో గాని, ఆంధ్రమహాభారతంలో గాని లేదు. ఉన్నట్లుగా ఆ విమర్శకులూ చెప్పలేదు.

1) పండును కొట్టినవాడు అర్జునుడు. అందువల్ల ఆ ఋషికి కోపం వచ్చి శపిస్తే, ఆ పండు మళ్ళీ చెట్టుకు అతుక్కోవాలంటే మిగిలిన పాండవులు ద్రౌపది ఎందుకు వారి ఉద్దేశాలు చెప్పాలి? చెప్పాల్సివస్తే అర్జునుడు చెప్పాలి.

కాని అందరూ చెప్పాలట.

2) పాండవులు ఏమి చెప్పారో తెలియదు. కాని పండు అతుక్కోలేదు. అంటే ధర్మరాజుతో సహా పాండవులంతా అబద్ధం చెప్పారన్నమాట. ధర్మరాజు సత్యవాది అని మహాభారతం అంతటా ఉన్నది. అట్టివాడు ఇలాంటి పరిస్థితిలో అబద్ధం చెప్పాల్సిన అవసరమేమిటి? ఒకవేళ అతడు సత్యమే చెబితే పండు అప్పుడే అతుక్కొని ఉండేది గదా! ఇక భీమార్జునులు గాని, ద్రౌపది గాని ఏమీ చెప్పవలసిన అవసరమే రాదు గదా!

3) పాండవులైదుగురూ అబద్ధం చెప్పారు. అందుకే పండు అతుక్కోలేదు. ద్రౌపది మాత్రం సత్యాన్ని పలికింది. అందుకే పండు చెట్టుకు అంటుకున్నది. ద్రౌపది పలికిన ఆ సత్యం ఈ పై శ్లోకం. నాకు ఆరవవానిపై కోరిక గలదు అని చెప్పి, పురుషుల అభావంలోనే స్త్రీలందరు పతివ్రతలుగా ఉంటున్నారు–అని అందరి స్త్రీల విషయం చెప్పవలసిన అవసరమేమిటి? అందరి స్త్రీల విషయాన్ని అడుగలేదు గదా శ్రీకృష్ణుడు? అడగని విషయాన్ని ఎందుకు చెప్పినట్లు?

4) నాకు ఆరవవానిపై అభిలాషయని గదా చెప్పినది ద్రౌపది. మరి ఆ ఆరవవాడెవరో ద్రౌపదికి తెలియదా? తెలిసి నప్పటికీ దాచినదా?

ఒకవేళ తెలియదు అనుకుందాం. మరి ఆమెకే తెలియక పోతే "ద్రౌపది నిన్ను ఆరవ వరుసలో సేవిస్తుంద"ని శ్రీకృష్ణుడు కర్ణునితో ఎలా అనగలుగుతాడు?

తెలిసినప్పటికీ దాచిందనుకుందాం. అలా దాచి ఉంటే తన మనస్సులోని నిజమైన ఉద్దేశాన్ని చెప్పకుంటే ఆ రాలిన పండు చెట్టును ఎలా అంటుకుంటుంది?

దీనిని బట్టి ఈ కల్పించిన పండుపాట కథ ఎంత అస్తవ్యస్త మైనదో, మహాభారత గ్రంథంలోని పాత్రల స్వభావాలకు ఎంత విరుద్ధమైనదో, ఎంత అహేతుకమైనదో, ఎంత అసభ్యకరమైనదో, ఎంతటి అల్పబుద్ధులైన వారు కల్పించినదో, వారికి అర్ధ గ్రంథాలపై ఎంత అక్కస్సో, సత్పురుషులపై ఎంతటి క్రోధమో, దుర్మార్గులంటే ఎంతట్టి ఇష్టమో తెలుస్తుంది. ఇలాంటి కథలను కల్పించినవారు, ఈ కథలను ఆధారం చేసుకొని మరికొన్ని తల్లులయొక్క సచ్చరిత్రములకు కళంకం ఆపాదించుటకు ప్రయత్నించినవారు, ప్రయత్నించేవారు ఎన్నటికీ క్షమార్హులు కారు. పరమపావన చరితులపై, పవిత్రమైన గ్రంథాలపై అజ్ఞానంతోనో, అవివేకంతోనో, పేరు ప్రతిష్ఠలు పొందాలనో, అవార్డులు రివార్డులు పొందాలనో బురద చల్లేందుకు సాహసించే వారు ఎంతటి వారైనా సరే పాపాన్ని మూటగట్టు కొని, దాని ఫలితాన్ని తప్పక అనుభవించవలసినవారే నని గ్రహించుకోవాలి.

అలాగే ప్రవచనములు చేసేవారుగాని, గ్రంథాలు వ్రాసే వారు గాని, సినిమాలు తీసేవారు గాని, బుల్లితెర సీరియల్స్ తీసేవారు గాని భారతీయ సంస్కృతీ సభ్యతా సాంప్రదాయముల గొప్పతనాన్ని భగ్నం చేయకుండా, పరమపావనమైన ద్రౌపదీదేవి చరిత్రను కళంకితం చేయకుండా, సాక్షాత్తూ పరమాత్మయైన శ్రీకృష్ణుని పలుకులను అపహాస్యం చేయకుండా, రామాయణ, మహాభారతముల వంటి పవిత్ర గ్రంథాలను కించ పరచకుండా సామాన్యమానవులు కూడా వారి వారి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకొనేందుకు చేతనైనంతగా సాయపడవలసినదని వినమ్రతతో ప్రార్థిస్తున్నాను.

## (18) ద్రౌపదీదేవి పాతివ్రత్య విశేషాలు

ద్రౌపదీదేవి సత్యభామకోరగా తాను ఎలా పతులకు సేవ చేసేదో, ఎలా వారి అభిమానాన్ని ప్రేమను చూరగొన్నదో తెలియజేసిన విషయాలను తెలుసుకుందాం.'

"సత్యభామా! నా భర్తలు తమ ఇతర భార్యలతో కలిసి యున్నప్పటికీ నేను ఏమాత్రం అలుక సహించను, సోమరితనం గాని, అహంకారం గాని, మదంగాని లేకుండా వారియొక్క చిత్తవృత్తులనుసరించి ప్రవర్తిస్తూ ఉంటాను. దేవతలు, గంధర్వులు, యక్షులు మొదలైన వారెవ్వరైనను అన్య పురుషుని నా మనస్సులో కూడా తలచను. స్నానం, భోజనం, శయనం మొదలైన విషయాలన్నింటిలోను నేను నా భర్తల కన్న ముందుగ ఉండను. నా భర్తలు వచ్చినపుడు పాద్యం, ఆసనం మొదలైన సేవలను నేనే స్వయంగా చేస్తానే గాని పరిచారికలకు అప్ప గించను. నియమితమైన వేళలలో వారికి భోజనాదికాలు సమకూర్చి స్వయంగా దగ్గరుండి వడ్డిస్తాను. ధనధాన్యములను అనవసరంగా వ్యర్థం చేయను. గృహానికి సంబంధించిన లెక్కలన్నీ నేనే చూసుకుంటాను.

నేనెప్పుడూ తలవాకిట నిలబడను; అసభ్యంగా మాట్లాడను. సిగ్గువిడిచి అందరివైపు కళ్ళప్పగించి చూడను. నా పతుల భావాలను వారి ముఖకవళికలను బట్టి గ్రహిస్తాను. వారి అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకుంటాను. భర్తలు, సేవకులు తినకుండా నేను తినను. నా భర్తలు నిద్రించిన తర్వాత నిద్రిస్తాను. వారికంటే ముందే మేల్కొంటాను. వారు

నిలబడి ఉంటే నేను కూర్చోను. దుష్టులతో మాట్లాడను. అతిగా నవ్వను.

సత్యభామా! ఇంటిలోని పనులన్నీ నేనే చేస్తాను. ఎట్టి పరిస్థితులలోను అబద్ధాలు మాట్లాడను. నా భర్తలకు ఇష్టం లేని పనులు చేయను. వారికి ఇష్టంలేని వస్తువులను విడిచి పెడతాను. అత్తగారి మనసు తెలుసుకొని ప్రవర్తిస్తాను. ఆమె చెప్పినట్లు నడుచుకుంటాను. ఆమెయొక్క స్నానపానాదికాలు, భోజనం అన్నీ స్వయంగా నేనే చూసుకుంటాను.

ధర్మరాజు పంక్తిన నిత్యము ఎనిమిదివేల మంది బ్రాహ్మణోత్తములు బంగారు పళ్ళెములతో భుజించేవారు. ఆ సువర్ణపాత్రల రక్షణ నేనే చూచేదాన్ని. వేలాదిమంది పరిచారికలున్నారు. వారు ఏమి చేశారు? ఏమి చేయలేదు? అనే విషయాలను నేనే గమనిస్తూ, వారి బాగోగుల్ని నేనే చూస్తాను. కుటుంబ భారతమంతా నేనే నా మీద వేసుకుని అన్నీ సక్రమంగా నిర్వర్తిస్తూ ఉండేదాన్ని.

సత్యా! ఒక్కమాట. భర్తలు నిద్రించిన తరువాతనే నిద్రించటం, వారికన్నా ముందుగా మేలుకోవటం నా నిత్య కృత్యం. వారి సేవలో నాకు రాత్రింబవళ్ళు తెలిసేవి కావు. ఇదే నా వశీకరణమంత్రం. ఈ విధమైన ప్రవర్తన కారణంగానే నా భర్తలు నాకు ప్రసన్నులై ఉంటున్నారు. నా మాటల్లో ఏ విధమైన కపటం లేదు. నేను చెప్పినట్లు నడుచుకుంటే నీ భర్త నీ కొంగు పట్టుకొనే ఉంటాడు.

సత్యా! పతికి మించిన దైవం లేదు. భర్తయొక్క అనుగ్రహం ఉంటే అన్ని కోరికలు నెరవేరుతాయి. పతికి కోపం వస్తే సతి యొక్క ఆశలన్నీ అడుగంటిపోతాయి. సేవలద్వారానే భర్తను వశపరచుకోవాలి. సహృదయంతో, సౌహార్దంతో భర్తను సేవించటం భార్యకు పవిత్రమైన పూజ అవుతుంది. సుఖం వల్ల సుఖం రాదు. కష్టపడటం వల్లనే సుఖం కలుగుతుంది.

ద్వారం వద్ద భర్త కంఠస్వరం వినిపించగానే నవ్వుతూ ఎదురు వెళ్ళి కనిపించు. ఆయన పనివాళ్ళకు ఏదైనా పని చెబితే నీవే చేస్తూ ఉండు. భర్త నీతో చెప్పిన విషయాలను రహస్యంగా ఉంచు. భర్తకు మిత్రులైనవారికి ఆతిథ్యం ఇవ్వటం మరిచిపోకు. భర్తకు శత్రువులెవరో తెలుసుకొని వారికి దూరంగా ఉండు. దానితో శ్రీకృష్ణుడు ఒక్క్షణం కూడా నిన్ను విడిచి ఉండడు" అన్నది ద్రౌపది.

**ఇవి అన్నీ విన్న సత్యభామ 'ద్రౌపదీ! నీ చరిత్ర జగత్పూజ్యం' అన్నది.**

**ఇట్టి జగత్పూజ్యమైన చరిత్ర గలిగిన సాధ్వీ శిరోమణి ద్రౌపది-యని మహాభారతం మనకు తెలియజేస్తున్నది.**

ఇంతటితో ఈ 'ద్రౌపదీ' అంశాన్ని ముగించి మరొక అంశాన్ని అందుకుందాం. 12 ఏళ్ళు అరణ్యవాసము, ఒక ఏడు అజ్ఞాతవాసము పణముగా బెట్టి, జూదమాడి ఒకరి ఆస్తి పరాధీనమై వారి అనుభవంలో ఉంటే ఆ ఆస్థిపై హక్కు పోతుంది గదా! అందుకే దుర్యోధనుడు సూదిమొన మోపినంత నేలను కూడా ఇవ్వనన్నాడు. నిజమా?

(వచ్చే సంచికలో..)

**పూజ్య గురుదేవులకు నమస్కారములతో..**



నా పేరు లింగమ్మ, వయస్సు 58 సం॥లు. పూజ్యశ్రీ భిక్షమయ్యగురూజీ మాటలు ఒక్కో వాక్యము తూటాలాంటిది. అంతరంగము ప్రతి అణువణువు స్పృశించింది. ఆ సద్గురు దర్శనము పరమాత్మదర్శనము నా తలంతా విద్యుత్ ప్రకంపనలు బయలుదేరి శరీరమంతటా వ్యాపించాయి. నాకు తలవణుకు, చేతులవణుకు భయం, ఆందోళన ఉండేది. అవి కొంతవరకు తగ్గాయి. మాతాజీ ప్రేమపుష్పాంజలి ఉపదేశించిన మంత్రము సమాధి స్థితి నా మనసంతా, శరీరమంతా అచేతనంగా ఉండి, ఎంతమాత్రము కదలికలేదు. తర్వాత కొద్దిసేపటికి ఉచ్ఛ్వాస, నిశ్వాస కదలిక వచ్చింది. నిజంగా అంతటి అనుభూతి కలిగింది. వీరిరువురు దైవస్వరూపాలు. ఆ తల్లిపాడిన పాట ఒక్కో చరణము హృదయస్పందన కలిగి మనసు ఎంతో పునీతమయి అలాగే ఆ పాటను అన్వయించుకొని దానిని అనుభవిస్తున్నట్టు అయింది. మీరిరువురు దైవస్వరూపాలు.

**లింగమ్మ, వాయల్పాడు**



**స్వార్థం పోయినప్పుడే మనలో పరమార్థం జాగృతం అవుతుంది**